# సుమతి

అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

01-02-2025 సంపుటి -2 మహా శివరాత్రి (ఫిబ్రవరి) సంచిక-12 రూ.25/-





# సుమతి

## (సమగ్ర సకుటుంబ మాసపత్రిక)

## తెలుగు సాహితీ జగత్తులో

## అనతి కాలంలోనే ధ్రువతారగా సుమతి ని నిలిపినందుకు

## ధన్యవాదాలు తెలుపుతూ

- ఎడిటోరియల్ బోర్డ్


## సుమతిలో ప్రకటనలు ఇవ్వండి

అనతి కాలంలోనే అశేష పాఠకలోకానికి చేరువైన

సుమతి సకుటంబ మాసపత్రికలో ప్రకటనలు ఇవ్వండి

కవర్ పేజి కలర్ :రూ.5000/-

కవర్ పేజి బ్లాక్ అండ్ వైట్ :రూ. 3000/-

లోపలి పేజీల్లో కలర్ :రూ2000 /-

లోపలి పేజీల్లో బ్లాక్ అండ్ వైట్ :రూ.1000 /-


ఆరోగ్యకరమైన సాహిత్యాన్ని కుటుంబం మొత్తానికి అందించాలని తెలుగు భాషకు మరింత ఉన్నత స్థానాన్ని కల్పించాలని మీ ముందుకు ప్రతి నెల ఒకటవ తారికునే వస్తుంది.



# సుమతి

మాసపత్రిక

సంపుటి :2 సంచిక:12

ఫిబ్రవరి 2025

సంపాదకురాలు
అవుతు శ్రీవిద్య

సహ సంపాదకురాలు
జి .జ్ఞానిక

ముఖచిత్రం
మోక్ష

గ్రాఫిక్స్
జ్ఞానిక

చందా వివరాలు

సంవత్సర చందా రూ 250

ఐదేళ్ళ చందా రూ 1200

ప్రకటనలు , చందాలకు మరియు

రచనలు ,అభిప్రాయాలు

పంపవలసిన చిరునామా

SUMATHI.POTILU@GMAIL.COM

ప్రచురణ
సుమతి పబ్లికేషన్స్
(RC NO.:538/2006 )

హౌస్ నం :26 -46 -79

వేణుగోపాల నగర్ ,గుంటూరు

ఆంధ్రప్రదేశ్


## సంపాదకీయం

సుమతి సాహితీ సామ్రాట్ విజేతలను ఉగాది రోజున సన్మానించటం జరుగుతుంది .

కేవలం పది మంది విజేతలే కాకుండా , పోటీలలో పాల్గొని బహుమతులు పొందిన అందరిని సన్మానించ దలిచాము .కావున అందరు తప్పకుండా పాల్గొనాలి అని ప్రార్థిస్తున్నాము

వేదిక: బలోత్సవ భవన్ ,విజయవాడ

సమయం: సా .5.గం .ల నుండి

తేది 30-03-2025

ఇట్లు

సుమతి

## సుమతి – సుభాషితాలు

నీకు నువ్వుగా మిగలటమేవ్యక్తిత్వం

పదిమందికి ఉపయోగ పడటమే మానవత్వం

## లోపలి పేజీలలో....

# ఈ నెల సాహితి సుమాలు...


### 36 ఫీచర్స్ అందరి కోసం

5 ముఖచిత్ర కథ
8 ఈ నెల కవిత
10 నడుస్తున్న చరిత్ర
13 అంతర్నేత్రం
59 జీవన చిత్రాలు
61 వైరల్
66 నాలుగో కోతి
70 సెటైర్
74 కార్టూన్స్ పేజి
75 యాత్ర
88 కార్టూన్స్ పేజి
10 నమ్మకాలూ –నిజాలు
111 కరెంట్ అఫైర్స్
113 అవగాహన
115 ఫోటోగ్రఫి పాఠాలు
118 యువతా తెలుసుకో
121 భేతాళ భారతం
124 మన కథానాయకులు
127 కార్టూన్స్ పేజి
128 వార్తల్లో వ్యక్తి
135 చదవాల్సిన పుస్తకం
137 చూడాల్సిన సినిమా
140 వినాల్సిన పాట
142 క్రాస్ రోడ్స్ కబుర్లు
167 మన పురాణాలు
171 సప్తపది
184 ధర్మసందేహాలు
185 తాతయ్య కథలు
186 సృజన
187 పిల్లలు పిడుగులు
188 రాశి ఫలాలు
190 వలల్ పోస్టర్
192 వెబ్ పోస్టర్

### సీరియల్స్

16 పంచవటి( కామెడి సీరియల్ )
41 ధారావాహిక
45 యమపాశం
48 బాబా బాబా బ్లాక్ షీప్ ( సీరియల్ )
51 యూనివర్సిటీ
53 రాణ ప్రతాప్ (చరిత్రాత్మక సీరియల్ )
62 గర్భ శ్లోకం (క్రైం సీరియల్)
130 ఆమె ఎవరు (క్రైం సీరియల్ )
17 నయన ( సీరియల్ )

### కథలు

21 జీవితం ఒక ప్రయోగం
28 దేశమును ప్రేమించు మన్న
77 స్వర్ణ కంకణం
80 చీర మడతల్లో
82 మనుష్య ఋణం
89 పట్టి నవ్వింది
91 సబ్ కో సన్మతి
96 కీడెంచి మేలెంచి
102 ఫ్రం భరత్ విత్ లవ్
145 వలస పక్షి
148 అపర్ణ
153 బ్లాక్ బట్టర్ ఫ్లై
157 బిక్షుకి
161 నైతిక విలువలు
179 అవని

### కవితలు

20 పర్సనాలిటీ
58 దేహ దేవాలయం
71 పొడిచే పొద్దు


★★★

# శివరాత్రి



ప్రతీ చాంద్రమాన మాసం లోని 14వ రోజు లేదా అమావాస్యకు ముందు రోజుని శివరాత్రి అంటారు. పంచాంగ సంవత్సరంలో వచ్చే పన్నెండు శివరాత్రులలో ఫిబ్రవరి – మార్చ్ లలో వచ్చేదానికి ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. ఈ రాత్రి, భూమి ఉత్తర అర్ధగోళం ఎటువంటి స్థితిలో ఉంటుందంటే, మనిషిలోనీ శక్తి సహజంగానే ఉప్పొంగుతుంది. ఈ రోజున ప్రకృతి మిమల్ని ఆధ్యాత్మిక శిఖరానికి నెడుతుంది. దీనిని ఉపయోగించుకోవడానికే, ఈ సంస్కృతిలో రాత్రంతా జరిపే ఈ పండుగను నెలకొల్పారు. మనం తెల్లవార్లూ జాగారం చేసి మన వెన్నెముకను నిటారుగా ఉంచడం ద్వారా ఇలా శక్తులు సహజంగా పైకి ఎగసి పడడానికి సహకరించవచ్చు.

పండుగ ప్రధానంగా బిల్వ ఆకులు శివుడికి, సమర్పణల ద్వారా జరుపుకుంటారు. ఒక రోజంతా ఉపవాసం, రాత్రి అంతా జాగరణ చేసారు. ఇది శివ భక్తులకు అత్యంత పర్వదినం. ఈనాడు శివభక్తులు తెల్లవారుజామున లేచి, స్నానం చేసి, పూజలు చేసి, ఉపవాసం ఉండి రాత్రి అంతా జాగరణము చేసి మరునాడు భోజనం చేస్తారు . రాత్రంతా శివ పూజలు, అభిషేకములు, అర్చనలు, శివలీలా కథాపారాయణలు జరుపుతారు. అన్ని శివక్షేత్రాలలో ఈ ఉత్సవము గొప్పగా జరుగుతుంది . పూర్వం శ్రీశైలం క్షేత్రంలో జరిగే ఉత్సవమును పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రములో విపులంగా వర్ణించాడు. శైవులు ధరించే భస్మము / విభూతి తయారుచేయటానికి ఈనాడు పవిత్రమైనదని భావిస్తారు. రోజు అంతా భక్తులు "ఓం నమః శివాయ", శివ యొక్క పవిత్ర మంత్రం పఠిస్తారు.

మహా శివరాత్రి గురించి స్కాంద పురాణం, లింగ పురాణం, పద్మ పురాణాలతో సహా అనేక పురాణాలలో ప్రస్తావించబడింది. ఈ మధ్యయుగపు శైవ గ్రంథాలు ఈ పండుగను వివిధ రకాలుగా వర్ణించాయి. వీటిలో ఉపవాసం, శివుని చిహ్నంగా భావించే శివలింగానికి పూజలు చేయడం వంటివి ఉన్నాయి.వివిధ పురాణాలు మహా శివరాత్రి యొక్క ప్రాముఖ్యతను వివరిస్తాయి. శైవ సంప్రదాయంలో ఒక పురాణం ప్రకారం, సృష్టి, స్థితి, లయ కారకుడైన శివుడు తాండవం చేసే రాత్రి ఇది. స్తోత్రాలు, శైవ గ్రంథాల పఠనం, భక్తుల హోరు ఈ విశ్వ నృత్యంలో చేరి, ప్రతిచోటా శివుని ఉనికిని గుర్తు చేస్తుంది. మరొక పురాణం ప్రకారం, ఇది శివుడు మరియు పార్వతి వివాహం చేసుకున్న రాత్రి. వేరొక పురాణం ప్రకారం శివరాత్రి అనేది సంవత్సరానికొకసారి శివలింగాన్ని పూజించడం, గతంలో చేసిన పాపాలను ప్రక్షాళన చేసుకోవడానికి, పుణ్యమార్గంలో జీవించి కైలాసాన్ని చేరుకోవడం. క్షీరసాగర మథన సమయంలో ఉద్భవించిన హాలాహలాన్నుంచి ప్రపంచాన్ని కాపాడటం కోసం శివుడు దాన్ని సేవించి కంఠంలో దాచుకుని నీలకంఠుడనే పేరు పొందిన రాత్రి ఇది.మహాశివ రాత్రి మహాత్మ్య వృత్తాంతం శివ పురాణములోని విద్యేశ్వర సంహితలో చెప్పబడింది. గంగా యమునా సంగమ స్థానమైన ప్రయాగలో (నేటి అలహాబాదు ) ఋషులు సత్రయాగం చేస్తున్నసమయంలో రోమర్షణమహర్షి అని

పేరు గాంచిన సూతమహర్షి అక్కడకు వస్తాడు. ఆలా వచ్చిన సూతమహర్షికి అ ఋషులు నమస్కరించి సర్వోత్తమమైన ఇతిహాస వృత్తాంతాన్ని చెప్పమనగా అతను తన గురువైన వేదవ్యాసుడు తనకు చెప్పిన గాథను వివరించడం ప్రారంభిస్తాడు. ఒకసారి పరాశర కుమారుడైన వ్యాస మహర్షి సరస్వతి నదీ తీరమున ధ్యానం చేస్తుంటాడు. ఆ సమయంలో సూర్యుని వలె ప్రకాశించే విమానంలో



సనత్కుమారుడు వెళ్ళుతుంటాడు. దానిని గమనించిన వ్యాసుడు బ్రహ్మ కుమారుడైన సనత్కుమారునకు నమస్కరించి ముక్తిని ప్రసాదించే గాథను తెలుపుమంటాడు.అప్పుడు మందర పర్వతం మీద బ్రహ్మ కుమారుడైన సనత్ కుమారుడు తనకు, నందికేశ్వరునికి మధ్య జరిగిన సంవాదాన్ని వ్యాసునికి చెప్పగా, వ్యాసుడు సూతునికి చెప్పిన వృత్తాంతాన్ని సత్రయాగంలో ఋషులకు చెబుతాడు. సనత్కుమారుడు నందికేశ్వరుడిని శివుని సాకారమైన మూర్తిగా, నిరాకారుడైన లింగంగా పూజించడానికి సంబంధించిన వృత్తాంతాన్ని చెప్పమంటాడు. దానికి సమాధానంగా నందికేశ్వరుడు ఈ వృత్తాంతాన్ని చెబుతాడు.

భూమి యొక్క సృష్టి పూర్తి అయిన తరువాత, భక్తులు, ఆచారాలు పాటించేవారు, పార్వతి దేవి కృతజ్ఞతలుతో ఆయన సంతోష పెట్టేందుకు శివుడును కోరారు. అందుకు శివుడు జవాబుగా, అమావాస్య 14 రాత్రి, ఫాల్గున నెలలో కృష్ణ పక్షంలో, తన అభిమాన రోజు అని బదులిచ్చాడు. పార్వతి, ఆమె స్నేహితులకు ఈ పదాలు పునరావృతం చేసింది. వీరిలో నుండి ఆ పదం సృష్టి అంతా వ్యాపించింది.

ఈ పండుగరోజు జరిగే నృత్య సంప్రదాయానికి చారిత్రక మూలాలు ఉన్నాయి. కోణార్క్, ఖజురహో, పట్టడకల్, మోధేరా, చిదంబరం వంటి ప్రధాన హిందూ దేవాలయాలలో వార్షిక నృత్య ఉత్సవాలకు మహా శివరాత్రి చారిత్రాత్మకమైన సమ్మేళనంగా పనిచేసింది. ప్రదర్శిత కళల గురించి నాట్యశాస్త్రం అనే పురాతన గ్రంథంలో పేర్కొన్న అనేక ముద్రలు శిల్పాల రూపంలో చెక్కబడిన చిదంబరం ఆలయంలో ఈ కార్యక్రమాన్ని నాట్యాంజలి అని పిలుస్తారు.

ఖజురహో శివాలయాలలో, మహా శివరాత్రి నాడు జరిగే ఒక ప్రధాన నృత్యోత్సవం, ఆలయ సముదాయం చుట్టూ మైళ్ల దూరం విడిది చేసిన శైవ యాత్రికులు, 1864లో అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్ గ్రంథస్తం చేశాడు.

★★★

## సాహితి భోజులకు... మహారాజ పోషకులకు ఇదే మా ఆహ్వానం . మీరు తెలుగు భాషా ప్రేమికులా..?సాహితీ ప్రియులా ..? తెలుగు సాహిత్యాన్ని బతికించుకోవాలని మీలో బలమైన కోరిక ఉందా ..?ఐతే సుమతికి అండగా నిలవండి

మహామహులు సాహితీ పత్రికలు నడపడం మావల్ల కాదు అని చేతులెత్తేసిన నేపథ్యంలో పురుడు పోసుకున్న సుమతి సకుటుంబ మాస పత్రికకు మీరు అందించే తోడ్పాటు కొండంత బలాన్ని ఇస్తుంది. మానసిక ఉల్లాసంతో పాటు, ఆలోచన రేకెత్తించే కథలు, కవితలు సీరియల్స్ అదే విధంగా నాలుగో కోతి , సెటైర్ ,కబుర్లు , భేతాళ భారతం,కార్టూన్లు ,అంతర్నేత్రం వంటి ఎన్నో ఫీచర్స్ తో పాఠక లోకాన్ని అలరిస్తున్న విషయం మీకు విదితమే. కేవలం చందాల తో పత్రిక నడపడం అంటే సాధ్యమయ్యే పని కాదు .తెలుగు భాషను బ్రతికిన్చుకోవాలి అనే ఒకే ఒక్క మహా సంకల్పంతో సుమతి పత్రికను సుమతి ఫౌండేషన్ ద్వారా ప్రారంబించటం జరిగింది .

ఈ సంకల్పానికి మీ సహకారం తోడైతే నిర్విఘ్నంగా ఈ మహా ప్రస్థానం సాగుతుంది. ఇందుకు గాను సుమతి అకౌంట్ కు గానీ మేము ఇచ్చే ఫోన్ పే / గూగుల్ పే నంబరు 10/– రూ నుండి మీ అవకాశాన్ని. బట్టి ఎంతైనా డోనేషన్ ఇవ్వవచ్చు. మీ చందా / డొనేషన్ ఆన అయిన అదే రోజు వాట్సాప్ లేదా పోస్ట్ ద్వారా రసీదు అందుతుంది. మన తెలుగు భాష పరివ్యాప్తి చెందడానికి సాహిత్య సంపద సృష్టించడం తప్ప మరొక మార్గం లేదు. ఇప్పటికే వివిధ పోటిల ద్వారా రచయతలను ప్రోత్సహిస్తూ వస్తున్నాము . ప్రతి నెల రచయతలకు ఎంతో కొంత బహుమతి మనస్సు పెట్టి రూపం లో సహాయం చేస్తూ వస్తున్నాము . ఈ ఏడాది ఉగాది రోజున 50 మంది కరచయతల్ను సన్మానించాము . సుమతి ఫౌండేషన్ ఇప్పటికే అనేక సేవ కార్యక్రామాలలో సమాజానికి ఇతోధిక సేవలందిస్తోంది .మనవ సేవే మాధవ సేవ అని నమ్మి ఎన్నో అనాథ , వృద్ధ ఆశ్రమాలకు సహాయం చేస్తూ వస్తోంది .భవిష్యత్తులో ఫౌండేషన్ ద్వారా దిగువ కార్యక్రమాలు చెయ్యాలనే సంకల్పం తో ఉన్నాము

1. ప్రతి పాఠశాలలో తెలుగ భాష పై పోటీలు నిర్వహించి చిన్నారులలో సాహిత్యం పట్ల అభిమానం పెంపొందించేటట్లు చూడటం
2.సాహిత్య రంగంలో కృషి చేసే వారికి ఆరోగ్య భీమా /అవసరమయ్యే మందులకైన ఇతోధిక సహాయం
3.ఔత్సాహిక పేద రచయితల పుస్తకాలు ముద్రించటం
4. పేద వృద్ధ రచయతలకు ఎంతోకొంత ఆర్ధిక సహాయం

దీనికి మీ తోడ్పాటు అనివార్యం.
ఎంత చిన్న సహాయం చేసినా , మీ పేర్లు ఫోటో తో సహా సుమతి పత్రికలో ప్రచురింప బడును . పోషకులకు పత్రిక ఉచితంగా పంపబడును. సుమతి నిర్వహించే అన్ని కార్యక్రమాలలో మీకు ఉచిత ప్రవేశం కల్పించబడును
వివరాలకు సంప్రదించాల్సిన నంబర్: 7893111985
సుమతి అకౌంట్ నంబర్ :150810100022726
IFS CODE :UBIN0815080
Phone Pay No;7893111985



## కరుణశ్రీగా ప్రసిద్ధులైన జంధ్యాల పాపయ్య శాస్త్రి
## " పుష్ప విలాపం "

చేతులారంగ నిన్ను పూజించుకొరకు
కోడి కూయంగనే మేలుకొంటి నేను;
గంగలో మున్గి ధౌత వల్కలము గట్టి
పూలు కొనితేర నరిగితి పుష్పవనికి

నే నొక పూలమొక్క కడ నిల్చి చివాలున కొమ్మవంచి గో
రానెడు నంతలోన విరు లన్నియు జాలిగ నోళ్ళు విప్పి "మా
ప్రాణము తీతువా" యనుచు బావురు మన్నవి; క్రుంగిపోతి; నా
మానసమం దెదో తళుకు మన్నది పుష్పవిలాప కావ్యమై.

తల్లి యొడిలోన తలిరాకు తల్ప మందు
ఆడుకొను మమ్ములను బుట్టలందు చిదిమి
అమ్ముకొందువె మోక్ష విత్తమ్ము కొరకు!
హృదయమే లేని నీ పూజ లెందుకోయి?

జడమతుల మేము; జ్ఞానవంతుడవు నీవు;
బుద్ధి యున్నది; భావ సమృద్ధి గలదు;
బండబారె నటోయి నీ గుండెకాయ!
శివునకై పూయదే నాల్గు చిన్ని పూలు?

ఆయువు గల్గు నాల్గు గడియల్ కని పెంచిన తీవతల్లి జా
తీయత దిద్ది తీర్తు ము; తదీయ కరమ్ములలోన స్వేచ్ఛమై
నూయల లూగుచున్ మురియుచుందుము; ఆయువు దీరినంతనే
హాయిగ కన్ను మూసెదము ఆయమ చల్లని కాలి వ్రేళ్ళపై.

గాలిని గౌరవింతుము సుగంధము పూసి; సమాశ్రయించు భృం
గాలకు విందు చేసెదము కమ్మని తేనెలు; మిమ్ము బోంట్ల నే
త్రాలకు హాయిగూర్తుము; స్వతంత్రుల మమ్ముల స్వార్థ బుద్ధితో
తాళుము త్రుంప బోవకుము; తల్లికి బిడ్డకు వేరు సేతువే!

ఆత్మ సుఖమ్ము కోసమయి అన్యుల గొంతులు కోసి తెచ్చు పు
ణ్యాత్ముడ! నీకు మోక్ష మెటు లబ్బును? నెత్తురు చేతి పూజ వి
శ్వాత్ముడు స్వీకరించునె? చరాచర వర్తి ప్రభుండు మా పవి
త్రాత్మల నందుకోడె! నడమంత్రపు నీ తగులాట మేటికిన్?

ఊలు దారాలతో గొంతు కురి బిగించి
గుండెలో నుండి సూదులు గ్రుచ్చి కూర్చి
ముడుచు  కొందురు ముచ్చట ముడుల మమ్ము
అకట! దయలేని వారు మీ యాడువారు

గుండె తడి లేక నూనెలో వండి పిండి
అత్తరులు చేసి మా పేద నెత్తురులను
కంపు దేహాలపై గుమాయింపు కొరకు
పులుముకొందురు హంత! మీ కొలము వారు.

అక్కట! హాయి మేము మహిషాసురు లెందరొ నాల్గు ప్రక్కలన్
ప్రక్కల మీద చల్లుకొని మా పసిమేనులు పాడు కాళ్ళతో
ద్రొక్కుచు దొర్లి – దొర్లి – మరు రోజుదయాననె వాడి వత్తలై
రెక్కలు జారిపోఁ పరిహరింతురు మమ్ముల పెంటదిబ్బ పై.

మా వెలలేని ముగ్ధ సుకుమార సుగంధ మరంద మాధురీ
జీవిత మెల్ల మీకయి త్యజించి కృశించి నశించిపోయె; మా
యౌవన మెల్ల కొల్లగొని ఆ పయి చీపురుతోడ చిమ్మి మ
మ్మావల పారబోతురు గదా! నరజాతికి నీతి యున్నదా !

బుద్ధ దేవుని భూమిలో పుట్టినావు
సహజ మగు ప్రేమ నీలోన చచ్చెనేమి?
అందమును హత్య చేసే హంతకుండ!
మైలపడిపోయె నోయి! నీ మనుజ జన్మ.

పూజ లేకున్న బాబు నీ పున్నె మాయె!
కోయ బోకుము మా పేద కుత్తుకలను
అకట! చేసేత మమ్ముల హత్య చేసి
బాపుకొన బోవు ఆ మహా భాగ్య మేమి?

ఇట్లు పుష్పాలు నన్ను చీవాట్లు పెట్టి
నట్లుగాన్ – పూలు కోయ చేయాడలేదు;
ఏమి తోచక దేవర కెరుక సేయ
వట్టి చేతులతో ఇటు వచ్చినాను

# ట్రంప్ ప్రమాణ స్వీకారానికి భారత ప్రధాని మోదీని ఎందుకు పిలవలేదు ?



అమెరికా 47వ అధ్యక్షుడిగా డోనల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసి రెండోసారి ఆ పదవి చేపట్టారు.2017 జనవరి 20న ఆయన తొలిసారి అధ్యక్షుడయ్యారు. తరువాత ఎన్నికల్లో ఓటమి పాలైన ఆయన నాలుగేళ్ల విరామం తరువాత ఇప్పుడు 2025లో మరోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు.అమెరికాలో ఇలా, నాలుగేళ్లు అధికారానికి దూరమై తిరిగి అధ్యక్షుడైన రికార్డ్ గతంలో గ్రోవర్ క్లీవ్‌ల్యాండ్ పేరిట ఉండేది.ఆయన 1885లో తొలిసారి అమెరికా అధ్యక్షుడయ్యారు. ఆ తర్వాత 1889 ఎన్నికల్లో ఓడిపోయి, తిరిగి 1893లో మళ్లీ గెలిచారు. ట్రంప్ కూడా ఇప్పుడాయన సరసన చేరారు.

ట్రంప్ స్వభావానికి తగ్గట్టుగానే ప్రమాణ స్వీకారాన్ని ''రాజు పునరాగమనం''లా అట్టహాసంగా జరిపేందుకు,

కార్యక్రమానికి మరిన్ని రంగులద్దేందుకు టెక్ కంపెనీలు లక్షల డాలర్ల విరాళాలిచ్చాయి. జాయింట్ కాంగ్రెసనల్ కమిటీ(జేసీసీఐసీ) నిర్వహించే ఈ ప్రమాణస్వీకార వేడుకల సంప్రదాయం 200 ఏళ్ల నాటిది. 1789లో న్యూయార్క్ నగరంలో జార్జ్ వాషింగ్టన్ పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇది కొనసాగుతోంది.

ట్రంప్ వేడుకకు హాజరైన వారి జాబితాలో ప్రపంచంలోని అతిపెద్ద నాయకులు, మిత్రులతో పాటు శత్రువులు – స్నేహితులు – బద్దవిరోధులుగా పేర్కొనే మిశ్రమ సమూహం ఉంది.

అధ్యక్ష కార్యాలయం అధికారికంగా అతిథుల జాబితాను విడుదల చేయకపోయినా, జాబితా గురించి చాలా ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. ట్రంప్ గత పాలనలో బద్ధ విరోధి అయిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ను ఆహ్వానించడం చాలా మందిని ఆశ్చర్యానికి గురిచేసింది.

''మిత్రదేశాలైనా, ప్రత్యర్థులైనా, అన్ని దేశాలతో మంచి సంబంధాలు కలిగి ఉండాలనే అధ్యక్షుడి ఆకాంక్షను ఇది ప్రతిబింబిస్తుంది'' అని ట్రంప్ ప్రతినిధి కరోలిన్ లెవిట్ పేర్కొన్నారు.

అయితే, దానికి విరుద్ధంగా ట్రంప్ గతంలో 'క్లోజ్ ఫ్రెండ్' అని సంబోధించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ వేడుకలో కనిపించలేదు.

దీంతో ట్రంప్ తన 'శత్రువు'ను పిలిచి, 'స్నేహితుడి'ని ఎందుకు విస్మరించారు? అనే ప్రశ్న వినిపిస్తోంది.

దీనిపై ఇండియానా విశ్వవిద్యాలయానికి చెందిన పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ సుమిత్ గంగూలీ తన అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తూ.. ''ప్రత్యర్థులతో వ్యక్తిగత దౌత్యంపై ట్రంప్ విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తుంది'' అన్నారు. జిన్‌పింగ్‌కు ఆహ్వానంపై మిషిగన్ స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ప్రొఫెసర్ జోయోజిత్ పాల్ మాట్లాడుతూ, ''భాగస్వామ్యపరంగా అమెరికాకు జిన్‌పింగ్ చాలా కీలకమైన నేత'' అన్నారు.

''ఎందుకంటే, చైనాతో వాణిజ్య సంబంధాలు పూర్తిగా వదులుకోవడం అమెరికాకు తీవ్రనష్టం కలిగిస్తుంది. అదే భారత్‌తో పూర్తిగా సంబంధాలు వదులుకోవాల్సి వస్తే, ప్రధానంగా జనరిక్ మందులు, వజ్రాల రంగంలో వాణిజ్య సంబంధాలు దెబ్బతింటాయి''

''ఈ రెండు రంగాల్లోనూ భారత్ తన విదేశీ మారక నిల్వల కోసం అమెరికా నుంచి వచ్చే ఆదాయంపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది'' అని ఆయన వివరించారు.

అయితే, ట్రంప్ రెండోసారి పాలనలో ప్రధానంగా అంతర్జాతీయ సమస్యలపైనే ఫోకస్ ఉంటుందని చాలామంది విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంటే, ఇజ్రాయెల్ – హమాస్ వివాదం, యుక్రెయిన్ – రష్యా యుద్ధం, పెరుగుతున్న చైనా ప్రాభవాన్ని నిలువరించడం వంటివి.

రానున్న నాలుగేళ్లలో ఇజ్రాయెల్ – హమాస్ వివాదం, యుక్రెయిన్ – రష్యా యుద్ధం, చైనాను నిలువరించడం వంటివాటిపైనే ట్రంప్ ఎక్కువ శ్రద్ధ పెడతారని ప్రొఫెసర్ పాల్ భావిస్తున్నారు.

రాబోయే రోజుల్లో అమెరికా – చైనా సంబంధాలే ట్రంప్‌కి అతిపెద్ద సవాల్‌గా మారొచ్చని చాలామంది అమెరికన్ విశ్లేషకులు విశ్వసిస్తున్నారు.

జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీలో ఏషియన్ స్టడీస్ ప్రొఫెసర్ దేవేశ్ కపూర్ మాట్లాడుతూ, ''జిన్‌పింగ్‌ను ఆహ్వానించడానికి గల ప్రధాన కారణం చర్చలకు అవకాశముందన్న సంకేతాలు పంపడమే. చైనాతో ద్వైపాక్షిక సంబంధాలు చాలా సున్నితమైన అంశం. అదే సమయంలో భారత్‌తో పోలిస్తే, సంబంధాలు మెరుగ్గానే ఉన్నాయి. అందువల్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం లేదు, ఇప్పటికైతే లేదు'' అన్నారు

. ఈ విషయాన్ని అతిగా విశ్లేషించాల్సిన అవసరం లేదని దక్షిణాసియా వ్యవహారాల నిపుణులు మైకేల్ కుగల్‌మన్ అన్నారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న క్వాడ్ సమ్మిట్ సందర్భంగా మోదీ, ట్రంప్ భేటీ అయ్యే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

''మోదీని ఆహ్వానించకపోవడాన్ని అంత పెద్దది చేసి చూడకూడదు. జిన్‌పింగ్ మినహా మరెవరినీ ప్రత్యేకంగా ఆహ్వానించలేదు. త్వరలోనే మోదీ, ట్రంప్ కలిసే అవకాశం ఉండొచ్చు. బహుశా, అది ఈ ఏడాది చివర్లో భారత్‌లో జరిగే క్వాడ్ సమ్మిట్ కావొచ్చు. కాబట్టి, ఆ కోణంలో చూస్తే మోదీని పిలవలేదనడం ఎలాంటి కారణం లేని హంగామా మాత్రమే.''

అయితే, తన మొదటి టర్మ్‌లో భారత్‌తో వాణిజ్య వివాదాలపై ట్రంప్ చిరాకుకు ఈ నిర్ణయం నిదర్శనమని కొందరు అనలిస్టులు అంచనా వేస్తున్నారు.

హౌడీ మోడీ, నమస్తే ట్రంప్ వంటివి ఉన్నప్పటికీ, చైనా ప్రాభవాన్ని నిలువరించడంలో భారత్ వెనుకబడి ఉందని ట్రంప్ భావించవచ్చు.

అయితే, మోదీ కనిపించకపోవడంపై కొద్దిగా ఆశ్చర్యం వ్యక్తం చేశారు ప్రొఫెసర్ సుమిత్ గంగూలీ.

''ఇది ట్రంప్, మోదీ మధ్య సంబంధాలు అంత బాగులేవని సూచిస్తుంది'' అని ఆయన అంటున్నారు.

కానీ, ప్రొఫెసర్ జోయోజిత్ పాల్ మాత్రం, ''మొత్తమ్మీద చూస్తే, భారత్‌తో మంచి సంబంధాలే ఉన్నాయి, కాబట్టి ట్రంప్‌కు భారత్‌తో ఇప్పటికిప్పుడు పరిష్కారించాల్సిన సమస్యలు కానీ, గట్టిగా చర్చలు జరపాల్సిన అవసరం కానీ లేవు'' అని అంటున్నారు.

అయితే, గత సెప్టెంబర్‌లో అమెరికా పర్యటన సందర్భంగా భారత ప్రధాని మోదీ, డోనల్డ్ ట్రంప్‌ను కలిసేందుకు ప్రాధాన్యం ఇవ్వలేదని, వాళ్లిద్దరూ కలవలేదన్న చర్చ కూడా జరుగుతోంది. ట్రంప్ ఏ విషయం మర్చిపోరు, అది నిజమే. మోదీ క్వాడ్ సమ్మిట్ కోసం అమెరికాకు వచ్చినప్పుడు తనను విస్మరించారని ట్రంప్ భావించి ఉండొచ్చు, దానిని కాదనలేం. లోపల కక్ష పెంచుకుని ఉండొచ్చు'' అని కుగల్‌మన్ అన్నారు.

''కానీ, ఇది కేవలం ఊహాగానం మాత్రమే అని నేను భావిస్తున్నా. ప్రమాణ స్వీకారం విషయం మాత్రం భారత్ సహా ఇతర దేశాల కంటే, చైనాకి మాత్రమే సంబంధించిన అంశంగా కనిపిస్తోంది.''

''దీనిని మోదీ, ఇతర నాయకుల కోణంలో కాకుండా, చైనాకు మాత్రమే పంపిన సంకేతంగా చూడాలి.'' అయితే, భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్, చైనా ఉపాధ్యక్షులు హాన్ జెంగ్, ఇంకా చాలా దేశాల రాయబారులు ఈ వేడుకకు హాజరయ్యారు.

ఈ కోణంలో చూస్తే, జిన్‌పింగ్ కూడా ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించారు.

అలాగే, ఈ ఏడాది చివర్లో జరగనున్న క్వాడ్ సమ్మిట్ సందర్భంగా ట్రంప్‌తో సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు మోదీకి తగినంత అవకాశం ఉంటుంది.

విదేశీ నేతలను, అందులోనూ ముఖ్యంగా రైట్ వింగ్ లీడర్స్‌గా ప్రజాదరణ పొందిన వారిని ఆహ్వానించడం ట్రంప్ దౌత్యవిధానంలో మార్పును సూచిస్తోందని నిపుణులందరిలో దాదాపుగా ఏకాభిప్రాయం ఉంది.

ట్రంప్‌కి దగ్గరి భావజాలమున్న నాయకులతో పొత్తుకి ఇది సంకేతం.

★★★



## అంతర్నేత్రం



# చైతన్యాన్ని అనుభూతి చెందండి

నిర్వచనాలు, నినాదాలు చాలా అందంగా ఉంటాయి. సిద్ధాంతాలు వినడానికి అద్భుతంగా ఉంటాయి. కాని ఇవేవి జీవితానుభవంలో ఉపయోగపడనినాడు ఎందుకూ కొరగావు. శాస్త్రీయ ఆలోచనను ఒక నమ్మకం తోసేస్తుందో, ఆధ్యాత్మిక నమ్మకాన్ని శాస్త్రీయ నిదర్శనం ఖండిస్తుందో తెలియని సందిగ్ధావస్థలో ఉన్నప్పుడు ప్రతి సత్యాన్ని అనుభూతి చెందడం ఒక్కటే మార్గం. అనుభూతి చెందాలంటే హృదయం తెరుచుకోవాలి. హృదయం తెరుచుకున్న ద్వారం దగ్గర మనసు దూరంగా నిలుచుని చోద్యం చూస్తుంది. మనసు మాట్లాడుతున్న గుమ్మం దగ్గర హృదయం సాక్షిగా ఉండిపోతుంది. అనుభూతి చెందడం అంటే రుజువు చేసుకోవడం. రుజువు చేసుకునేవాడు రుషి, అనుభూతిపొంది, ఆశ్చర్యంతో మాటరాక మౌనంగా ఉండేవాడు ముని.



# పరిణితి

జ్ఞానంతో విహరిస్తూ యోగం అనుభవించేవాడు యోగి. తనలో ఉన్న దివ్యత్వాన్ని గుర్తించి దానిలో తాదాత్మ్యం చెందుతు, దివ్యత్వపు వెలుగులను తనచుట్టూ ఉన్నవారివైపు ప్రసరింప చేయడమే చైతన్యం.

అయితే నిజం ఏదో, నిజం కానిదేదో తెలుసుకోలేక గందరగోళంలో పడుతున్నాడు. తాను చూసినదే ఒప్పు అని, చూడనిది తప్పు అని, భావిస్తున్నాడు. మనిషికున్న దేహం ఒక్కటే, అయినా సందేహాలెక్కువ. ఆ సందేహాలొక్కక్కటే తనకు తానే నివృత్తి మార్గం కనుగొంటూ ముందుకు సాగితే, తానేమి చేయదలచాడో అది చేయడానికి మార్గం సుగమం అవుతుంది.

మనిషి దృష్టిలో స్పష్టత ఉంటే, అద్దం మీద దుమ్ము దులిపితే బింబం స్పష్టంగా కనపడినట్లు, అంతః చక్షువులు పనిచేయడం మొదలుపెడతాయి. లోపలి నుంచి ఏదో కనిపిస్తుం, అదే చైతన్యం. సృజనాత్మకత, స్వేచ్ఛ, ఉద్వేగాల్లో సమస్థితి, మనస్థితి, మానవ సంబంధాల సాఫల్యం వంటివన్నీ అనుభవిస్తుంటే నీలో దివ్యత్వపు బీజం మొలకెత్తుతుంది. నిజానికి మనమంతా దివ్యత్వం వేసుకొన్న మారువేషాలు. మనలో చైతన్యం వెల్లివిరిసిననాడు, మనలోని దివ్యత్వం పూర్తిగా వ్యక్తమౌతుంది.

ప్రతి ఒక్కరిలో ఈ చైతన్యాన్ని గుర్తించి దాన్ని ప్రేరేపింప గలిగితే, ప్రతి ఒక్కరు దివ్య పురుషులౌతారు.

తనలో ఉన్న దివ్యత్వాన్ని గుర్తించి దానిలో తాదాత్మ్యం చెందుతు, దివ్యత్వపు వెలుగులను తనచుట్టూ ఉన్నవారివైపు ప్రసరింప చేయడమే చైతన్యం.

ఒక చంటి పాప నవ్వులో, ఒక పువ్వు అందంలో, పక్షి విహంగంలో ప్రతిదానిలో ఈ చైతన్యం కనిపిస్తుంది.

అనుభవాన్ని ఎంత పొందితే అంత పరిపక్వత చెందుతాం. సాధించేందుకు సమస్యలు, నేర్చుకునేందుకు పాఠాలు, అస్వాదించేందుకు ఎన్నో అనుభవాలతో నిండిన ప్రయాణమే ఈ జీవితం.

మనిషి మనుగడ సమస్తం చైతన్యంతోనే ముడిపడి వుంటుంది. చైతన్యం ఉత్సాహాన్నిస్తుంది. ఒక గోడపై సింహం బొమ్మ ఎన్ని రంగులతో చిత్రీకరించినా దానిలో చైతన్యం రాదు. ఏ విధమైన ప్రయత్నాలు చేయకుండా గోడ మీద బొమ్మలా మారిన మనిషి వల్ల ఈ సమాజానికి ఏ విధమైన ప్రయోజనం వుండదు.

★★★



# పాయింట్లు గెలుచుకొండి –బహుమతులు పొందండి

## ఎన్ని పాయింట్లు గెలుచుకుంటే అన్ని రూపాయలు

ఈ పోటిలో పాల్గొనటానికి సంవత్సర చందా కట్టిన వారు ఎవరైనా అర్హులే .అర్హులైన ప్రతి ఒక్కరికి , సుమతి ఒక కోడ్ నెంబరు తో ఖాతా తెరవబడుతుంది

1. మీరు పత్రిక చందా కట్టగానే 10 పాయింట్లు మీ ఖాతా లో జమ అవుతాయి
2. మీరు మీ స్నేహితులను , మిత్రులను చందా దారులుగా చేర్పించినట్లైతే , ప్రతి చందాకు 10 పాయింట్లు జమ చెయ్యబడుతుంది .
3. మీరు రాసి పంపిన కధ /కవిత /కార్టూన్ పత్రికలో ప్రచురించినట్లయితే 10 పాయింట్లు జమ చెయ్యబడతాయి .(ఉగాది , దసరా,దీపావళి తదితర పోటిలలో గెలుపొందినవి కాకుండా. ఎందుకంటే వాటికి ఎటు బహుమతులు ఉంటాయి కాబట్టి )
4. పాయింట్లను బట్టి మిమమల్ని

★డైమెండ్ (5000 పాయింట్లు )మెంబర్ /
★ప్లాటినం (1000 పాయింట్లు ) మెంబర్ /
★గోల్డ్ (500.. పాయింట్లు )మెంబర్ /
★సిల్వర్ (300.. పాయింట్లు )మెంబర్ /
★కాపర్ (100 ..పాయింట్లు )మెంబర్ గా గుర్తించ బడుతుంది .

5.ప్రతి నెల మీ పాయింట్లు తెలియచెయ్యటం జరుగుతుంది.
6. ఎన్ని పాయింట్లు సాధిస్తే అన్ని రూపాయలు గెలుచుకునే అవకాశము మీదే
7. పోటీలు 01-01-2025 నుండి 30 -12 -2025 వరకు
8. మీరు టార్గెట్ పాయింట్లు చేరుకోగానే ఎప్పుడు కోరుకుంటే అప్పుడు మీ బహుమతి మీకు అంద జేయ బడుతుంది.
9.జనవరి సంచికలో మీ ఖాతా నెంబరు ప్రచురిస్తాము .

కామెడి సీరియల్

# పంచవటి

## ఓ పదిళ్ళ లోగిలి



అలేఖ్య

"ఎవర్రా ఈ స్వామి జీ? మన కాలనీ లో పెద్ద ఎత్తున సమావేశాలు పెడుతున్నడు? కాలనీలో వెలసిన  పెద్దపెద్ద బానర్లు చూస్తూ అడిగాడు వర్మ గారు తాతారావుని

"శ్రీ రవిశంకర్ ప్రభుజీ అని . ఇప్పుడిప్పుడే  మన రాష్ట్రంలో కూడా తన ఆశ్ర మాలు నెలకొల్పు తున్నాడు. కర్ణాటకలో బాగా ఫేమస్. అక్కడ పెద్ద ఆశ్రమం ఒకటి నడుపుడుతున్నాడు? "తనకు తెలిసింది చెప్పాడు తాతారావు

"మరి అలాంటప్పుడు ఏ గుళ్ళోనో  లేక పోతే ఏ ఖాళీ గా ఉన్నా ప్లే గ్రౌండ్ లోనో  సమావేశాలు పెట్టుకోక మన కాలనీలో  ఎందుకు పెట్టినట్టు?"

# కామెడి సీరియల్

**జరిగిన కథ**

ఉమా ,శంకరం భార్య భర్తలు. ఉమా ఉళ్ళోని పోలీస్ స్టేషన్ లొ ఎస్ ఐ గా పనిచేస్తూ ఉంటె , శంకరం చెట్టు కింద ప్లీడరు గా పేరుపడి వాదించటానికి కేసులు లేక ఇంటిదగ్గరే ఉండి ఇంటిపనులు చుసు కుంటూ ఉంటాడు . వర్లుగారి స్నేహితుడు తాతారావు వంటపని ఇంటిపని చేస్తూ భార్య చాటు భర్తగా గడుపుతుంటాడు . కాలనీ చుట్టూ అపార్ట్మెంట్లు రావటం తో నీటి ఎద్దడి రావటంతో మినిష్టేర్ని కలవల్నుకుంటారు వర్లు గారు . మునిసిపల్ కమిషనర్ ణి కలిసిన ఫలితం ఉండదు .హెడ్ కానిస్టేబులు రంగనాథం శంకరం దగ్గరకు చిన్న చిన్న కేసులు తీసుకువస్తుంటాడు .తాతారావు కొడుకు పద్మనాభం అందరిని పార్టీకి పిలుస్తాడు.పార్టీలో రియల్ ఎస్టేట్ కింగ్ హరీష్ ని అందరికి పరిచయం చేస్తా డు పద్మనాభం . కొంత మంది రౌడీలు తమ ఇల్లు ఆక్రమించారని శంకరాన్ని సంప్రదిస్తాడు ఆ ఉరి పోస్టు మాస్టర్ .ఉమ శంకరం కలిసి వాళ్ళ ఆట కట్టిస్తారు .కోబ్రా పేరుతో కోసి నది పరివాహక ప్రాంతంలో కట్టిన ఇళ్ళను కులగాడతారు మాహనగర్ మునిసిపాలిటి వాళ్ళు .పేదవాళ్ళు శంకరం దగ్గరకోస్తారు కేసు వాదించమని . సి .ఎం స్వామిజి గురించి ఆరా తీస్తాడు

**ఇక చదవండి**

'అవును సుమా... మంచిప్రశ్నే –"

బహుశా సిటీ మొత్తం లో మన కాలనీలో మాత్రమే అతిపెద్ద పార్కు వుంది,అందుకనే అయివుంటుంది " తాతారవు తను కనుగొన్న విషయం చెప్పాడు

"అంతే కాదు మన కాలనీ చుట్టూరా అన్నీ పెద్ద పెద్ద అపార్టుమెంట్లే , వాటిలో అంతా పెద్ద వాళ్ళే మరి స్వామిజీకి గిట్టుబాటు కూడా బాగా నే అవుతుంది

"అంత పెద్ద వాళ్ళు స్వాముల దగ్గరకు వస్తారంటావా?" సందేహం వెలి బుచ్చాడు

"స్వామిజిల దగ్గరకు వెళ్ళేదే పెద్ద పెద్ద వాళ్ళురా, మనలాంటి మధ్యతరగతి వాళ్ళు రెక్కాడితే కాని డొక్కడని బీదవాళ్ళు వెళ్ళేది చాలా తక్కువ..! "

"ఎందుకలా?

" ఎందుకే ముందిరా, స్వమిజిలంటే మాఫియం డాన్ల కంటే పవేర్ ఫుల్ . వాళ్ళు తలచుకుంటే ముఖ్యమంత్రులనే మార్చగలరు. పెద్ద పెద్ద వ్యాపార వేత్తలు, రాజకీయనాయకుల మధ్య ఒప్పందాలు జరిగేనవి అక్కడే...

"అలాగే అయితే, మనం కాస్త జాగ్రత్తగా వుండాలనుకుంటా. అసలే మన చుట్టూ పెద్ద వాళ్ళ కళ్ళు , మన కాలనీ పైన వుంది' నవ్వుతూ అన్నాడు తాతరావు

" నువ్వు నవ్వుతూ అన్న నిజం మాత్రం అదే అని నాకు అనిపిస్తుంది. ఎందుకైనా మంచిది మనమూ

# గిలిగింతలు పెట్టె హాస్య వల్లరి కడుపుబ్బా నవ్వించే కామెడి సీరియల్

ఆసమావేశాలకు హాజరౌదాము
“ అసలు విషయం చెప్పారు వర్లు గారు

“ఎవరిని బడితే వాళ్ళను రానివ్వరనుకుంటా? దానికీ ఎంతో కొంత రేటు పెట్టె ఉంటారు ?

“ఆవిషయం మాకోడలు చూసుకుంటుంది లే , ఎటు బందోబస్తుకు వచ్చేవాళ్ళకు పాసలు ఇస్తారుగా.. “

“అలా అయితే ఇంకేమి, పద ఇంట్లో ఉంది మా ఆవిడా చేత మాటలు పడే బదులు ఆ స్వామిజీ సంగతి ఏమిటో తేల్చేద్దాము.”

‘ అయినఽఅ మీ ఆవిడా అంటే ఎందుకురా అంత భయం ..”

“ భయం కాదురా ప్రేమా …”

★★★★

”రవిశంకర్ ప్రభుజి గారి సమావేశాలకు బందో బస్తు డ్యూటి వేశారా? “లోపలికి వస్తున్న ఉమ వంక చూస్తూ అడిగాడు శంకరం.

“ఆ వేశారండి.సి .ఎమ్ గారు కూడా వస్తున్నారు, అందుకనే మొదటి రోజు , అందరినీ అక్కడే డ్యూటీ వేశారు ఈ కాపలా డ్యూటిలకు పెళ్ళాలంటి అందరికీ చిరాగ్గా ఉంటోంది . సమయానికి భోజనం వుండదు, తాగ టానికి నీళ్ళు ఉండవు మా గురించి పట్టించుకునే నాథుడే వుండడు” తిట్టుకుంటూ అన్నది ఉమ

“సి.ఎమ్ కూడా వస్తున్నారా ఆర్ యూ ష్యూర్” అనుమానంగా అడిగాడు శంకరం

“అవునండీ వస్తున్నారు.. ఆయన వస్తున్నారు కాబట్టి, మా అందరికీ డ్యూటీ వేశారు, లేక పోతే అక్కడికి ఎవరు వెళ్తారు బందోబస్తుకు” ఉమ జవాబు

శంకరం పెద్దగా నవ్వుతూ, “ ఆయన గురించి నువ్వు చాలా తక్కువ అంచనా వేశావు. ఆయన తలుచుకుంటే ముఖ మంత్రులేమి ఖర్మ ప్రధాన మంత్రులనే మార్చేయకల సమర్థుడు

“అవునా.
? “
“అవును ఇన్స్పెక్టర్. మీరు నాకు చెప్పాల్సింది పోయి, నేను మీకు చెప్పాల్సి వస్తోంది”.

‘ఏమోనండి ముళ్ళమంత్ని వస్తున్నారు అంటే మా ఆలోచన అంతా అటే వుంటుంది. అయితే ఓకన్ను స్వామీజీ మీద కూడా వేసి ఉంచు తాను “

“ అది సరే కాని, ఆ సమావేశాలు హాజరవ్వటానికి ఓ నాలుగు పాసులు కావాలి”

“అలాగే అదెంత పని మీరుకూడా వస్తారా?

‘నా కంత టైమ్ ఎక్కడుంది, నాన్నగారు వాళ్ళ ఫ్రెండ్స్ వెళతారట ..”

‘మామయ్య గారికి ఈ మధ్య కాస్త దైవ భక్తి వైపు మళ్ళుతున్నట్టున్నారు…”

“అదేమి కాదు , ఆయన దేవుళ్ళనే. పూర్తిగా నమ్మరు, ఇంక ఈ దొంగ స్వామి జీని నమ్ముతారా? !

“మరి నమ్మ నప్పుడు ఎందుకు వెళ్ళటం “

‘నువ్వు ఒక కన్నువేస్తే, ఆయన రెండో కన్ను వేస్తారట .. “

“ఏదో అర్థమైన దానిలా”, “అలాగే అంటు తల ఊపింది ఉమ.

# గిలిగింతలు పెట్టె హాస్య వల్లరి
# కడుపుబ్బా నవ్వించే
# కామెడి సీరియల్

***

ఏమయ్యా డి.జి .పి ఆస్వామి జీ సభలకు నేను ముఖ్య అతిధిగా వస్తున్నానని ప్రచారం చేస్తున్నారు, పైపెచ్చు పోస్టర్లు, బ్యానర్లు వేశారు, అసలు నన్ను అడగక్కర లేదా. అంతా నీఇష్టమేనా? అరిచి నంత పని చేసాడు ముఖ్య మంత్రి మహేంద్ర

"సార్, ఈ విషయంలో నా ప్రమేయం ఏమిలేదు, అంతా హోం మినిష్టరుగారే చూస్తున్నారు. ఆయన చెప్పినట్లు నడుచు కు ంటున్నాము. అయినా మీకు చెప్పానని చెప్పారు " సంజయిష్ ఇచ్చుకున్నాడు డి.జి పి

ఆ నువ్వు ఆ హో ము ఇద్దరూ కలసి నాటకాలాడు తున్నారు. చూస్తాను .. అందరి సంగతి "

"సారే అంత కోపం చేసుకోకండి, మీకు అంతకు ముందు కూడా చెప్పాను కూర్చుని మాట్లాడుకుంటే అన్నీ సెటిలవుతాయి. ఇదో మంచి అవకాశం అనుకోండి స్వామిజి తో మాట్లాడటానికి .. ?

'అంటే ప్రతి సన్నాసి వెధవకి కూడా ముఖ్యమంతి) భయపడాలా. ?"

"అలా ఎందుకనుకోవాలి సింహం ఒక అడుగు వెనక్కి వేసింది అనుకోవచ్చు కదా సార్.. "

"దీనికే మితక్కువలేదు .. అదీ చూస్థా " అంటు ఫోన్ పెట్టేసాడు మహేంద్ర)

"సార్. ఇదంతా చూస్తుంటే మిమ్మల్నికూడా వాళ్ళ ట్రాప్ లోకి లాగాలని చూస్తున్నారని,నాకు అనిపిస్తోంది" పి.ఏ చిన్నగా చెప్పాడు

'అవును నాకు అలాగే అనిపిస్తోంది, సభకు వెళ్ళకుండా ఎగ్గొట్టిదే సరి" ముక్త సరిగా అన్నాడు మహింద్ర

★★★

"మనం అనుకు న్నాట్టు అంతా జరిగితే ఏ ఇబ్బంది వుండదు. అసలు సి. ఎమ్ సభకు వస్తా డంటావా?" డిజి.పి వంక చూస్తూ

(ఇంకా ఉంది )

# పర్సనాలిటీ ...

ఈదర శ్రీనివాస రెడ్డి

గుర్రాలకు గాడిదలు పరుగులు నేర్పుతున్నాయి
వేగం గురుంచి నత్తలు ఉపన్యాసాలు ఇస్తున్నాయి
సింహాలకు నక్కలు ధైర్యాన్ని నూరిపోస్తున్నాయి
హంసలకు కాకులు తెలివితేటలు నేర్పిస్తున్నాయి
కళ్లకు రంగుల  కలలుగనటం లో శిక్షణనిస్తున్నారు
మనసుకు  ఊహల ఊయలలో ఊగటం బోధిస్తున్నారు
గుండెలకైనా గాయాలకు మందువుస్తామంటున్నారు
మెదళ్ళకు మొద్దు నిద్ర పోవటం అలవాటు చేస్తున్నారు
ఆకాశానికి నిచ్చెనలు వేస్తాము మాతోరండి
నక్షత్రాలను తుంచి చేతిలో పెడతామని నమ్మిస్తున్నారు
అవకాశాలను తలుపులు తెరుస్తాము బయటకురండి
అదృష్టాన్ని వాకిట్లో నిలబెడతామని నమ్మబలుకుతున్నారు
మూర్ఖుల కోసం తెలివితేటలు ఖర్చుపెట్టి
డబ్బు సంపాదించడమే కదా పర్సనాలిటీ అంటే
మందబుద్ధులకు లోకజ్ఞానం నేర్పించి
నాలుగు రాళ్లు వెనకేసుకోవడమే నేటి డెవలప్మెంట్
ఇతరుల అడుగుల్లో అడుగులు వేయటం  మూర్ఖత్వం
మనకు  మనంగా  మిగిలిపోవటమే మనిషితత్వం
వేరొకరి ముఖాల్లో మనల్ని చూసుకోవటం అమాయకత్వం
ఏ ముసుగులో లేని వ్యక్తిగా మిగిలిపోవటమే అసలైన వ్యక్తిత్వం

కథ

# జీవితమొక ప్రయోగం

కృష్ణమాచార్యులు

బెంగుళూరు గూగులు ఆఫీసులో మైక్రో కిచెన్ సమీపంలో మాధవి ఆమె సహోద్యోగులు టీ త్రాగుతూ కబుర్లాడుకుంటున్నారు. వారిలో మాధవికి నాయకత్వ లక్షణాలు యెక్కువ. ఆమె జీవితం గురించి స్నేహితులకిలా చిన్న వుపన్యాసమిచ్చింది.

"మన జీవితాలు బాగుండాలంటే మనం మూడు విషయాలలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఒకటి, మన భవిష్యత్తు. నా తండ్రి నాకోసం ఒక జీవిత భీమా పాలసీ, ఒక పిపిఎఫ్ అకౌంట్, ఒక మూచ్యువల్ ఫండ్, యేర్పాటు చేసారు. నేను గూగులులో చేరాక, మరిన్ని పెట్టుబడులు పెట్టాను. నా భవిష్యత్తు సేఫ్.

రెండవది, మనతో వుండే మనుష్యులు. వారితో సత్సంబంధాలు. అది కుటుంబ సభ్యులైనా, కంపెనీ వుద్యోగులైనా, బంధుమిత్రులైనా, మనకి వారికి మధ్య సత్సంబంధాలుండాలి. అందుకోసం మనం ప్రధానంగా భావోద్వేగ మేధస్సు (emotional intelligence) కలిగివుండాలి. అంటే అవతలి వారి భావోద్వేగాలను అర్థం చేసుకుని, మన భావోద్వేగాలని నియంత్రించుకునే పరిజ్ఞానము, నేర్పు కలిగి వుండాలి. ఇంకా సహనం, సంభాషణా చాతుర్యం, వినే ఓర్పు, వుండాలి. నాకు అవి వున్నాయి.

పైగా అందరినీ మెచ్చుకుంటూ మాట్లాడుతాను. అందుకే చాలామంది నాతో బాగుంటారు.

మూడవది, నేను, నా సుఖ సంతోషాలు. మనకంటూ ఒక ప్రపంచం వుండాలి. ఎంత మందితో తిరిగినా, మనకంటూ ఒక చోటు,ఒక సమయం వుండేలా చూసుకోవాలి. అక్కడ మనకి విశ్రాంతి తో పాటు మనల్ని మనం పునరుజ్జీవింపచేసుకునే శక్తి లభిస్తుంది. అందుకే నా గదిని చక్కగా అలంకరించి, శుభ్రంగా వుంచుకుంటాను."

ఆమె సహోద్యోగులు చప్పట్లు కొట్టి "భేష్" అని మెచ్చుకున్నారు. కానీ మాధవితో యెక్కువ చనువున్న బిందు, ఆమె మాటలను పాక్షికంగా ఖండిస్తూ యిలా అంది.

" ఉపన్యాసం చెప్పడం తేలికే. కానీ ఆచరించడం కష్టం. నువ్వు చెప్పిన వాటిలో రెండవది అంత తేలిక కాదు. ఉదాహరణకు, మన సీనియర్ హర్ష తెలుసుగా! అతనికి నువ్వంటే చాలా యిష్టం. కానీ ఆ విషయం చెప్పడట. ఎందుకో తెలుసా? పెళ్ళి చేసుకుంటే నువ్వు కష్ట పడతావని. అతని తల్లిదండ్రులు పేచీ మనుష్యులు. జీవితంలో బహుశా పెళ్ళే చేసుకోను అంటున్నాడు. నువ్వు అతడిని పెళ్ళి చేసుకుని సత్సంబంధాలు కాపాడుకోగలవా? అది మనం అనుకునేటంత తేలికా? "

" బిందూ! వద్దు అలా చాలెంజ్ చెయ్యకు. మధు యేదో సరదాగా, తనకు తెలిసిన విషయాలు మనతో పంచుకుంది" అంది ఆమె స్నేహితురాలు.

" సారీ! నా వుద్దేశ్యం అది కాదు. ఎంత సహనమున్నమాధవికైనా అది కష్టం అనే అంటున్నాను. మనం ఇతరులతో కలిసి మెలిసి వుండడం అంత తేలిక కాదు అన్నదే నా అభిప్రాయం"

" నాకర్ధమైందిలే బిందూ! అతడి ప్రేమ సంగతి యేమిటి?" కుతూహలంతో  అడిగింది మాధవి.

" అతడిది నిజమైన ప్రేమ. అందుకే నిన్నుఆ అగ్నిగుండంలోకి తీసుకుని వెళ్ళాలనుకోవడం లేదు. మనం అతని తల్లిదండ్రులు త్వరగా చనిపోవాలని కోరుకోలేము కదా" అని సమాధానమిచ్చింది బిందు. బిందు మాటలకు మాధవి ఆలోచనలో పడింది.  "నాకు నిజంగా సహనమెక్కువేనా? హర్ష  ప్రేమ  నిజమైనదైతే, అతనికి తోడుగా వుండలేనా? రేపు హర్షతో మాట్లాడాలి" అని తీర్మానించుకుంది.

@@@

మరునాడు మాధవి సంకోచంలేకుండా, హర్షని కలిసి అతని ప్రేమ గురించి అడిగింది. ఆమె చొరవకి, హర్ష మొదట ఒకింత ఆశ్చర్యపోయినా, ఈ సమసమాజంలో, ఇదేమంత వింత కాదని అనుకున్నాడు. చిరు దరహాసంతో, అతడిలా జవాబిచ్చాడు.

" మీ సత్యశోధనకు స్వాగతం. నా ప్రేమ నిజమైనది కాబట్టే, నేనుచెప్పకముందే మీకు తెలిసింది. నాది మీతో జీవితాంతం కలిసి జీవించాలనుకునే గాఢమైన ప్రేమ. అదే సమయంలో, వద్దు అనుకునేటంత స్వచ్ఛమైన ప్రేమ. నా తల్లిదండ్రులతో మీరు పడలేరు. పనిమనిషి, వంట మనిషి, మా యిల్లు మానెయ్యకుండా పనిచేయడానికి, రహస్యంగా రెట్టింపు జీతం యిస్తున్నాను".

"అలాగే మీరు రెట్టింపు ప్రేమ యిస్తే, మీ భార్య మీతో వుంటుంది గదా!"

"ఈ పోలిక తప్పు. పనివారిలా డబ్బు పై ఆపేక్షతోనో, నాపై జాలితోనో,  నా భార్య నాతో కాపురం చేయాలని ఆశించడం, ఒక నేరం."

"అలాగని మీ తల్లిదండ్రులు వున్నంత కాలం, పెళ్ళి లేకుండా వుండడం, మీకు మీరు అన్యాయం చేసుకోవడం కాదా!"

" త్యాగమూర్తులైన కొడుకులు, భీష్ముడు, రాముడు, శ్రావణుడు, తర్వాత హర్ష"

"నన్నుచేసుకోండి. చదువు, వుద్యోగం వున్న మనం, జీవితాన్ని ఒక ప్రయోగంగా తీసుకుని సహజీవన ఆనందాన్ని శోధిద్దాం."

" మాధవీ! మీ ఆడపిల్లలకు ప్రయోగాలంటే యిష్టమనుకుంటా. త్రాగుబోతునో, తిరుగుబోతునో, దొంగనో, పెళ్ళి చేసుకుని, వాడిని సజ్జనుడిగా మార్చలేక, బలయిపోయిన వారి దీనగాథ లెన్నో. వారిలా బలిపీఠం యెక్కవలసిన అవసరం మీకు లేదు."

" మీరు పొరబడుతున్నారు. గతిలేనప్పుడది బలిపీఠం. ఇష్టపడినప్పుడది ప్రయోగ వేదిక."

" ఎందుకు ఈ అభాగ్యుడి మీద ప్రేమ చూపిస్తారు? పబ్బులోడాన్సులు, విదేశీ విహారాలు, విందు భోజనాలు, విలాసాలతో జీవితం గడపకుండా, తిట్లు, శాపనార్థాలు వింటూ, అర్థం లేని చాకిరీ చేస్తూ, రోగాలు రొచ్చులతో దిగులు పుట్టించే ఇంట్లో, నా కోసం... వద్దు. మీ ప్రేమికుడిగా చెప్తున్నా! వేరే వ్యక్తిని వివాహం చేసుకోండి."

మాధవి అతని మాట వినలేదు. వారిద్దరూ వైభవోపేతంగా, బంధుమిత్రుల సమక్షంలో దంపతులయ్యారు.

@@@

క్రొత్త కాపురం మొదలైంది.

తొలిరాత్రి కౌగిలి సమావేశంలో,మాధవి కొన్ని నియమాలు ప్రతిపాదించింది.

నాది గుమాస్తా స్థాయి అని చెప్పండి. నేను వుదయం ఎనిమిదికి వెళ్ళి, రాత్రి ఎనిమిదికి వస్తాను.ఇది పలాయన వ్యూహం. మనం వూరు వెళ్ళాలనుకుంటే ఆఫీసు కాంప్ అని చెప్పండి. ఇది సందర్భోచిత అసత్య వ్యూహం. అప్పుడప్పుడు,నా మీద కోపం నటించండి. అలా చేస్తే, మీ అమ్మగారు, కొడుకు స్వతంత్రంగా వున్నాడని నమ్ముతారు. ఇది..''

మాధవి మాటను ఖండిస్తూ, హర్ష "ఏ వ్యూహమైనా ఈ కోపం నటించను. నా మధు, నాకు ముద్దు. నేను నీ బానిసనని అనుకున్నా పరవాలేదు'' అని చెప్పాడు. మాధవి సమావేశం ముగిసింది అంటూ అతనికి ముద్దు పెట్టింది. అది గమనించిన రతీమన్మధులు వారిని ఆశీర్వదిస్తూ పూల బాణాలు వేశారు.

@@@

కొడుకు పెళ్ళిచేసుకున్నాడన్న ఆనందం హర్ష తల్లిదండ్రులలో యెక్కువ కాలం కనబడలేదు. ఫోను సంభాషణలలో, ఇరుగుపొరుగు వారికి చెప్పే కబుర్లలో, వాళ్ళ అక్కసు బయట పెట్టసాగారు.

"కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది. కోడలు ఒక్క పనీ చేయదు, తెగ సుఖపడిపోతోంది. కొడుకు మాట వినడం మానేశాడు. పూర్వం అబ్బాయి మందులిచ్చి కబుర్లు చెప్పేవాడు. ఇప్పుడు పట్టించుకోవడం లేదు. భార్య సేవలో తరిస్తున్నాడు. అద్దాల నాడు బిడ్డలు కాని, గడ్డాల నాడా? ఇద్దరూ పక్షుల్లా ఎగిరిపోతున్నారు. ఇంట్లో ఒక గంట కూడా వుండడం లేదు. ఇద్దరూ బయటే తింటూ,పబ్బులకి పోయి డాన్సులు చేస్తున్నారు.''

ఒక్కొక్క మాటని తూటాలా పేలుస్తూంటే, హర్ష బాధ పడుతూ, "చూసావా! నేను చెప్పినట్లే జరుగుతోంది. వాళ్ళమాటల్లో నిజముందా? ఇంత ఘోరంగా ఎలా చెప్తారు? వినే ఇరుగుపొరుగుకి, బంధువులకి బుద్ధి వుండనక్కరలా?'' అని మాధవి దగ్గర వాపోయాడు. మాధవి అతనిని ఓదారుస్తూ,'' నన్ను రాక్షసిగా చిత్రీకరించి, వాళ్ళను బాధితులుగా చెప్పుకోవడమొక ఆనందం. దీనిని 'బాధితునిగా నటించే ఆట'' . అంటారు. వారికదే అరోగ్యాన్నిచ్చే టానిక్. మీరు ఆ ఆటను ఆపే ప్రయత్నం చెయ్యకండి. " అంది.

ఇంట్లో వున్న సమయంలో, మాధవి అత్తమామలతో సమయం గడిపేందుకు ప్రయత్నించేది. కానీ మాధవి అత్త వర్దని, కోడలు చేసే పనులకు వంకలు పెడుతూ, " నీకేం చదువుకున్నావు. పెద్ద కంపెనీలో వుద్యోగం, ఈ పనులు నీకెక్కడ వస్తాయి? నువ్వు చేసినా, చూసే వాళ్ళు నిన్ను నేను రాచి రంపాన పెడుతున్నానని అనుకోవాలనా? " అని విరసపు మాటల బాణాలు సంధించేది.

కోడలు తెచ్చిన బట్టలు, చూసి, " వూరికే డబ్బు తగలేసి ఇంతంత ఖరీదైనవి తేవడమెందుకు? ఇంట్లో పడుండే వాళ్ళకు సోకులెందుకు? తగుదునమ్మా, అని ఈ ముసలావిడ కోడలితో సమానంగా సింగారించుకుందని నలుగురు నవ్వాలనా? రేపు కలిగే పిల్లా జల్లా కోసం నాలుగు రాళ్ళు వెనకేసుకోవద్దా?అసలు అమ్మకావాలని వుందో, లేదో?'' అని పుల్ల విరుపు దీవెనలు వర్షించేది.

మాధవికి అత్తగారు మాటలనడం, దానికి మామగారు వంతపాడడం, నచ్చింది. హర్ష తో,'' మీరు వాళ్ళ మధ్య అన్యోన్యత గమనించారా? ఈ విషయంలో వారిని ఆదర్శంగా తీసుకోవచ్చు'' అంది.

" నవ్వులు పువ్వులు పూయని ఎడారిలాంటి యిల్లు. భగ భగ మండే సూర్యుడిలాంటి అత్త. సరసర కాలే యిసుకలాంటి మామ. నిలబడడమే కష్టమైన చోట పొగడ్తల చిరుజల్లులు. నువ్వు

విచిత్రమైన మనిషివి" అన్నాడు హర్ష.

" ఎడారిలో ఒంటెలు హాయిగా వుంటాయన్న విషయం మీరు మర్చిపోతున్నారు. అయినా, మీరున్న చోట నేనుండలేనా?సీత రాముడితో, దమయంతి నలుడితో, అరణ్యాలకు పోలేదా? నేనూ అంతే. ఒక చక్కని మాట చెప్తా వినండి. అరణ్యాలలో రాజభోగాలు, మనసు చెదిరిన వారినుండి మంగళ వాక్యాలు, . పొందలేము, వినలేము."

" వాహ్వా! విలువైన మాట! ఏం కావాలో చెప్పు?"

" నవ్వుతూ వుండండి. అదే చాలు. ఇంతకీ మీ అమ్మా,నాన్నా, ఎందుకిలా వుంటున్నారు? వాళ్ళ జీవితంలోవారు ఎదుర్కొన్నకష్టాలు,అవమానాలు యేమిటి? మీకు తెలుసా?"

"కష్టపడి పైకి వచ్చారని తెలుసు. నా ముందు ఒక ఆడపిల్ల పుట్టి చనిపోయిందని చెప్పారు. నేను వారి నలభయ్యో పడిలో పుట్టాను. అందుకే నన్ను అపురూపంగా పెంచారు."

"మానసిక శాస్త్రం ప్రకారం, చిన్ననాటి నుండి మనం విన్నకొన్నిమాటలు మన జీవిత పుస్తకం (life script) లో ముద్రింపబడతాయి. ఆ పుస్తకంలోని మాటలను సందర్భానుసారంగా మనం మాట్లాడడానికి ప్రయత్నిస్తాం. నా వుద్దేశ్యం, అత్తామామలు, వాళ్ళగుండెల్లో పేరుకుపోయిన బాధను, వారి జీవిత పుస్తకం లోని మాటలతో. పోగొట్టుకుంటున్నారు".

" నువ్వు చెప్పేది సత్యమేననిపిస్తోంది. వారి మాటలకు మూలం వారి జీవితమా, సినిమాలా, సీరియళ్ళా, తెలియడం లేదు. కానీ వినదగినవిగా లేవు"

"గమనించారా, మా అమ్మా, నాన్నలకు వారెంతో మర్యాద చేస్తారు. వాళ్ళు మీకు పిల్లనిచ్చారని ఆ మర్యాద. నా మీద అనిష్టం. ఎందుకు? నేను వాళ్ళ పిల్లాడిని లాక్కుపోతున్న మాయలాడిని. అర్థమవుతోందా శ్రీవారూ? అందుకే, నాకు అత్తా మామల మీద కోపం రాదు "

విజ్ఞత గల భార్యదొరికితే , జీవితమెంత అర్థవంతంగా వుంటుందో తెలిసివచ్చిన హర్ష, ఆ దేవునికి ధన్య వాదాలు తెలిపాడు.

@@@@

ఇలా పది నెలల కాలం గడిచిపోయింది. హర్ష తండ్రి, ఒక రోజు గుండెపోటుతో మరణించాడు. శోకతప్త హృదయంతో హర్ష, పద్ధతిగా కర్మకాండలు పూర్తిచేశాడు. ఒంటరిదైన వర్ధని, మరింత పైశాచికంగా ప్రవర్తించడం మొదలుపెట్టింది. హర్ష కర్మ కాండ సరిగా చేయలేదని, దానాలు కొన్ని, యివ్వకుండా ఒక పిసినారిలా ప్రవర్తించాడని, దీనికంతకూ కోడలే కారణమని చెప్పి కన్నీళ్ళు పెట్టుకోవడం మొదలు పెట్టింది. భారంగా మరో రెండు నెలలు గడిచాయి. వర్ధనిలో కోడలి పట్ల అకారణంగా అసహనం, ద్వేషం పెరగసాగాయి. ఆమె చూపుల్లో తీవ్రద్వేషభావం వ్యక్తమవుతుండడం గమనించిన మాధవి చిగురుటాకులా వణికిపోయింది. ఏదో ఒక హాని తనకో, తన కాపురానికో తప్పదని, ఆమెకు తోచింది. ఏ కష్టమొచ్చినా, హర్షకు అండగా నిలబడాలని నిశ్చయించుకుంది.

ఎదురు చూసిన చెడు దినం రానే వచ్చింది. మాధవి మామగారి తమ్ముడు, వదినగారిని చూడడానికి వచ్చాడు. అప్పుడు యింట్లోనే వున్న మాధవి ఆయనకు మంచినీళ్ళు యిచ్చి మర్యాదలు చేసింది. కాఫీ, టిఫిన్ తెస్తానని వంట యింట్లోకి వెళ్ళింది. అప్పుడు వర్ధని, మరిదికి ఫిర్యాదు చేస్తూ, కోడలిని అనరాని మాట అంది.

"ఎక్కడెక్కడకు పోతుందో, ఎవరితో తిరుగుతోందో తెలియదు. వాడు దాని మాయలో పడి, దాని తెరచాటు భాగవతం గమనించడం లేదు" .

ఆ మాటలు,తను వినాలనే ఆమె గట్టిగా అన్నదని మాధవికి అర్థమైంది. ఆమె

మౌనంగా ఆయనకు కాఫీ, టిఫిన్ యిచ్చితన గదిలోకి వెళ్ళిపోయింది. కసితీరలేదు కాబోలు, వర్ధని," చూసావా మరిదీ! ఒక్క మాట మాట్లాడకుండా వెళ్ళిపోయింది. అంటే నామాట నిజమే గదా! కాపురానికొచ్చిన నాటినుండి చూస్తున్నా, దేనికీ జవాబు చెప్పదు.అలా సాగుతోంది దానికి." అని బిగ్గరగా అంది.

మాధవి మౌనవ్రతం పాటించింది. వర్ధని తెగేదాకా లాగింది. ఆమె కోరిక కోడలిని వెళ్ళగొట్టడమని ఆమెకు అర్ధమైంది.

@@@

కంపెనీలో పనిచేసి, ట్రాఫిక్ లో గంటల తరబడి వేచి వుండి, యిల్లు చేరిన హర్షతో, మాధవి యేమీ జరగనట్లే ప్రవర్తించింది. ఇంటికన్న గుడిపదిలం అన్నట్లు, తమ చర్చలకు ఆఫీసే మేలని నిశ్చయించుకుంది. భోజనం చేసిన కొద్దిసేపటికే, హర్ష నిద్రపోయాడు. మాధవికి నిద్ర రావడం లేదు.

లేచి కిటికీ నుండి బయటకు చూసింది. చుట్టూరా అలముకొన్న చీకటికి భయపడకుండా అక్కడక్కడా వెలుగుతున్నదీపాలు. అర్ధరాత్రి నిశ్శబ్దాన్ని భగ్నపరుస్తూ, ఆగి ఆగి మొరుగుతున్నవీధి కుక్కలు. ఇంతలో ఒక కుక్క అతి దీనంగా మొరగసాగింది. ఆ మొరుగుడు హృదయవిదారకంగా వుంది. మాధవి చెవులు మూసుకుంది. ఎప్పుడు కార్పొరేషన్ వారు ఈ కుక్కలను పట్టుకు పోతారో? అని అనుకుంది.

నిదురపోతున్న హర్షను చూసింది. అమాయకమైన ముఖం. ఏ ఒక్కరిని పల్లెత్తు మాట అనని సహృదయుడు, నా ప్రియమైన భర్త అని మురిసిపోయింది. "మనం కొంచెం దూరంగా వుండే సమయం వచ్చింది. రేపు ఈ మాట చెప్తే నువ్వెంత తల్లడిల్లిపోతావో అని భయంగా వుంది. కానీ తప్పదు" అని అతని చెవి దగ్గర గుసగుసలాడింది. ఆమె హృదయభారం మెల్లగా తగ్గింది. దైవ ప్రార్ధన చేస్తూ ఆమె నిదురపోయింది.

@@@@

గూగులు ఆఫీసు ఆరో అంతస్తులో, ఒకప్రక్కగా వున్న సోఫా మీద కూర్చున్నారు మాధవి, హర్ష. ఆ కంపెనీలో వుద్యోగుల పైన ఆంక్షలు బహు తక్కువ. అందుకే మాధవి తన నిర్ణయాన్ని హర్షతో చర్చించడానికి ఆఫీసునే యెంచుకుంది. మాధవి వదనం ప్రసన్నంగా వున్నా, ఆమె యేం చెప్తుందోనని హర్ష గుండెల్లో గుబులు ప్రారంభమైంది. మాధవి హర్ష చేతిని తన చేతిలోనికి తీసుకుని, మంద్ర స్వరంతో యిలా చెప్పింది.

" ఇప్పుడు మనం తాత్కాలిక యెడబాటు వ్యూహం అమలు పర్చాలి. ఎందుకంటే, అత్తయ్య మానసిక స్థితి కాస్త ఆందోళనగా వుంది. భర్త పోయిన బాధ ఆమె భరించలేకున్నారు. వారిది నాలుగు దశాబ్దాల అనుబంధం. పరస్పర సాన్నిహిత్యం వారికి అలవాటుగా మారింది. ఈ రోజు ఆయన తనకన్నా ముందే పోయి, మోసం చేసాడన్న కోపంతో, పసుపూ కుంకుమలు దూరమయ్యాయన్న ఆక్రోశంతో, ఆవిడ కుమిలి పోతున్నారు. సుమంగళిగా వున్న వారిని చూసినప్పుడు ఆమె బాధమరింత యెక్కువవుతోంది. ఈ పరిస్థితిలో నువ్వు మాత్రమే ఆవిడ బాధ తగ్గించగలవు. నేను నీకు దూరమైతే, ఆవిడకు నువ్వు దగ్గరవుతావన్న ఆనందంతో ఆవిడ ఆయుర్దాయం పెరగవచ్చు. అందుకని నేను బిందూ దగ్గర వుంటాను. నీవు వచ్చిపోవడానికి యెటువంటి అభ్యంతరం వుండదు."

" నా తోనే వుంటానని చెప్పి, యిప్పుడెందుకిలా పారిపోతున్నావు?"

" హర్షా! నేను పారిపోవడం లేదు. అత్తయ్య క్షేమం కోరి బయటకు వస్తున్నా. ఈ రోజు సాయంత్రం ఆవిడకు, నీ కోడలు పూనేకి బదిలీ మీద వెడుతోంది అని చెప్పు. ఆవిడ ముఖంలో కోటి వెలుగులు చూస్తావు. అలా ఆనందంగా వుంచాలి ఆవిడను. అలా వుంచినా, ఆవిడ ఎంతోకాలం బ్రతకదు.

ఆవిడ  తిండి తగ్గించేసారు, బరువు తగ్గుతున్నారు. ఇవి చెడ్డ సంకేతాలు. నా మాట విను. కొడుకుగా నీ ఋణం తీర్చుకో." ఆమె మాటలు విన్న హర్షకి ఆమె ఒక దేవతలా కనబడింది." నీ ఆజ్ఞ పాటిస్తాను" అన్నాడు.

@@@

సాయంత్రం ఆఫీసునుంచి వస్తూనే తల్లి దగ్గరకు వెళ్ళాడు. మాధవి చెప్పినట్లే ఆమె బలహీనంగా వుంది. ఆమె ప్రక్కన కూర్చుని, " అమ్మా! మాధవిని పూనేకి బదిలీ చేసారు. ఈ రోజు సాయంత్ర వెళ్ళిపోతుంది" అని చెప్పాడు.

" అదేమిటి? మరి నువ్వు?" అని ఆమె అనుమానంగా అడిగింది.

" నే నిక్కడే నీ దగ్గరే వుంటా"

తల్లి ముఖంలో కనబడుతున్న ఆనందం అతనికి కన్నీరు తెప్పించింది. మాధవి మాటల్లో సత్యం బోధపడింది. ఇంతలో మాధవి వచ్చి, అత్తగారి కాళ్ళకు నమస్కరించి, " వెళ్లడం తప్పనిసరి. క్షమించండత్తయ్యా" అంది.

" పర్వాలేదు. హర్ష వున్నాడుగా! నీ గురించే నా బెంగ. నోట్లో వేలు పెడితే కొరకలేని అమాయకురాలివి. ఒక్కదానివి ఎలా బ్రతుకుతావో" అంటూ వర్ధని తన వణుకుతున్న చేతులతో మాధవి బుగ్గలు నిమిరింది. మాధవి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

" మీ ఆశీర్వాదం నాకు రక్షగా వుంటుంది. వేళకు మందులు వేసుకోండి.ఈ మధ్య ఆహారం తగ్గిస్తున్నారు. అలా చేస్తే మీ అబ్బాయి బెంగ పెట్టుకుంటాడు.  సరేనా! వెళ్లి వస్తాను"  అంటూ మాధవి బయటకి నడిచింది.

" హర్షా! అమ్మాయిని దించి రా" అని కొడుకుతొ చెప్పి ఆమె నీరసంగా పడుకుంది.

మరునాడు, మాధవి సలహాపై హర్ష ఇంటి వద్ద నుండి పని చేసేందుకు అనుమతి తీసుకున్నాడు. రోజూ తల్లి దగ్గరే ఎక్కువ సేపు వుంటూ, ఆమెకు కబుర్లు చెప్తూ,ఆమెకు ఆనందాన్ని కలిగిస్తున్నాడు. అయినా ఆమె ఆరోగ్యం క్షీణించ సాగింది.

ఒక రోజు డాక్టరు చెప్పేసాడు,"ఆమెది మనోవ్యాధి.ఎప్పుడు చనిపోతారో చెప్పలేను. బంధుమిత్రులని రమ్మని చెప్పండి." దగ్గర చుట్టాలు, స్నేహితులు వచ్చి ఆవిడను పలకరించే ప్రయత్నం చేసారు. ఆవిడకు వారితో మాట్లాడే ఓపిక లేక పోయింది. ఎలాగో శక్తి తెచ్చుకుని," ఆయన పిలుస్తున్నాడు. ఇక వెడతాను" అని అందరికి చెప్పసాగింది. ఒక రోజు సాయంత్రం హర్షని పిల్చి"మాధవిని పిలు" అంది. హర్ష ఆ మాట చెప్పగానే, మాధవి వెంటనే వచ్చి అత్తగారి ప్రక్కన కూర్చుంది.

వర్ధనికి మాట్లాడే శక్తి లేక, "మాధవి చేతిలో హర్ష చేతినుంచి, నీదే బాధ్యత అన్నట్లు చేతితో సైగ చేసింది. మాధవి ఆమె నుదుటిపై ముద్దు పెట్టింది. " మీరు మాతోనే వుండాలి" అంది. వర్ధని చిరునవ్వుతూ, పైకి వెళ్ళాలి అని చేతి సైగలతో చెప్పింది. ఆ తరువాత నీరసం ఆవహించడంతో కనులు మూసి నిద్రలోకి జారుకుంది. ఆమె ఇక లేవలేదు. జీవించి వున్నప్పుడు చికాకుగా వుండే ఆమె వదనం మరణం తర్వాత ప్రశాంతంగా వుంది. భోరున విలపిస్తున్న హర్షను ఓదారుస్తూ,

" జీవిత పోరాటం ముగించి, ప్రశాంతంగా మీ అమ్మ నిదురిస్తున్నారంటే,  అది నీ సేవా ఫలితమే"  అని నచ్చచెప్పింది మాధవి. బంధుమిత్రుల సహకారంతో హర్ష తల్లి అంత్యక్రియలు ఘనంగా జరిగిపోయాయి. హర్ష, మాధవిల జీవితంలో ఒక అంకం ముగిసింది.

@@@

అందమైన వెన్నెల రాత్రి. ప్రశాంత వాతావరణం. బాల్కనీలో నిలబడి, నిండు చందమామను చూస్తున్న హర్ష చెంతకు చేరింది

మాధవి. " ఒక ప్రయోగం ముగిసింది. కోడలిగా విజయం సాధించావు. ఇంకా నీ ప్రయోగాలేమైనా వున్నాయా?" అని అనుమానంగా అడిగాడు హర్ష.

"జీవిత నాటక రంగంలో, ప్రయోగమంటే ఎప్పుడూ చేయని పాత్రను ఒప్పుకోవడం. కొడుకు ,కోడలు పాత్రలు వదిలి, ప్రేమికుల పాత్రలు ధరిద్దాం. మన తర్వాత ప్రయోగం హనీమూన్. వాతావరణం అనుకూలించక వాయిదా పడ్డ ప్రయాణాలు, విహారాలు ఈ సంవత్సరం చేసేద్దాం. దాని ఫలితం అద్భుతమైన తీపి జ్ఞాపకాలు. కొసమెరుపుగా సంతానం. పునర్జన్మ సిద్ధాంతం నిజమైతే, మీ అమ్మో, నాన్నో మనకు పుట్టవచ్చు. వారికా అవకాశమిచ్చి చూద్దాం." అంది మాధవి. మాధవి మాటలతో, ఒక సుందర భవిష్యత్తును దర్శించిన హర్ష, ఆమెను ప్రేమగా గుండెలకు హత్తుకున్నాడు.

@@@@

# సినిమా సంగతులు



కుంభమేళాలో మోనాలిసాకు సంబంధించిన పలు వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. దాదాపు అన్నీ మీడియా సంస్థలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లు ఆమె ఇంటర్వ్యూల కోసం పరిగెత్తారు. దీంతో ఆ తేనెకళ్ల అమ్మాయి సోషల్ మీడియా సెన్సేషన్‌గా మారింది. తన అందానికి యూతే కాదు సినీ దర్శకులు సైతం ఫిదాయ్యారు. ఈ క్రమంలోనే బాలీవుడ్ డైరెక్టర్ సనోజ్ మిశ్రా (Sanoj Mishra)కు మోనాలిసా బాగా నచ్చేసింది. దీంతో ఆమెకు తన సినిమాలో ఛాన్స్ ఇస్తానని చెప్పారు. తాజాగా తన మాట నిలబొట్టుకున్నారు. తన సినిమాలో ఛాన్స్ ఇచ్చారు.

డైరెక్టర్ సనోజ్ మిశ్రా తెరకెక్కిస్తోన్న 'ది డైరీ ఆఫ్ మణిపూర్'లో (The Diary Of Manipur) హీరోయిన్‌గా మోనాలిసాను ఎంపిక చేశారు. ఈ మేరకు సనోజ్ మిశ్రా.. ఖర్గోన్ జిల్లా మహేశ్వర్‌లోని మోనాలిసా ఇంటికి వెళ్లి ఆమె కుటుంబాన్ని కలిశారు. ఆమె తండ్రికి చిత్ర పరిశ్రమపై ఉన్న సందేహాలను క్లియర్ చేశారు. ఈ క్రమంలో వీరి మధ్య అగ్రిమెంట్ జరిగిందట. పలు మీడియా కథనాల ప్రకారం.. ది డైరీ ఆఫ్ మణిపూర్ లో మోనాలిసా నటించడానికి రూ.21 లక్షల రెమ్యునరేషన్ అందిస్తున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా లోకల్ బ్రాండింగ్ కోసం మరో రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ అందుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రస్తుతం మోనాలిసా ముంబయిలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ నెల కథ

# "దేశమును ప్రేమించుమన్నా!"

మధుపత్ర శైలజ

"అమ్మా! మా డిగ్రీ రిజల్ట్స్ వచ్చేశాయ్! కాలేజీ ఫస్ట్ నేనేనమ్మా!" అంటూ ఆనందోత్సాహాలతో తల్లి దగ్గఱకి పరుగుపరుగున వచ్చింది అనుపమ.

"నీకుగాక ఇంకెవరికొస్తుందే నా బంగారుతల్లీ! నాన్నగారికి చెప్పావా ఈవిషయం?" కూతురి తలను ప్రేమతో నిమురుతూ అంది తల్లి పార్వతి.

"అమ్మా! ముందుగా ఏ విషయమైనా నాన్నగారికి చెప్పాకే నీకు చెప్తానని నీకింకా తెలియటంలేదేమిటో?" ఆశ్చర్యకరమైన మోముతో అంది అనుపమ.

"పార్వతీ! కిచెన్‌లో స్వీట్ బాక్స్ ఉంది. తీసుకురా! అమ్మాయి నోరు తీపి చేయాలి మనం" అంటూ హాల్లో నుంచే పిలుస్తున్నాడు భర్త చక్రధర్.

"నాకు తెలియకుండా స్వీట్లు ఎప్పుడు తెచ్చిపెట్టారు మీరు?" అంది పార్వతి.

"పార్వతీ! యూనివర్సిటీలో పనిచేసే నా స్నేహితుడు నిన్ననే నాకు ఫోనులో అమ్మాయి విషయం చెప్పాడు. అందుకే నిన్న కాలేజీ నుంచి వచ్చేటప్పుడే స్వీట్స్ కొనితెచ్చి కిచెన్‌లో పెట్టాను. పదిమంది ముందు ప్రిన్సిపాల్‌గారు చెప్పి అభినందిస్తూంటే అనుపమకు ఆ ఆనందమే వేరుగా ఉంటుందని నిన్న తనకు చెప్పలేదు నేను" అన్నాడు చక్రధర్.

"అమ్మా! డిగ్రీ చదవటం అయిపోయింది కదా! మరి పైచదువులకు వెళ్ళటంలో నీ ఉద్దేశ్యమేమిటి?" అంటూ కూతురిని అడిగాడు చక్రధర్. నాన్నగారి ప్రశ్నకు జవాబిచ్చేంతలో అనుపమ మదిలోని జ్ఞాపకాల దొంతరలో కదలిక వచ్చి ఆమెను మాట్లాడనీయలేదు.

తన తాతగారు భారత సైన్యంలో పనిచేస్తూ కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందారు. వారి పార్థివదేహాన్ని బోర్డర్స్ నుండి విమానంలో త్రివర్ణపతాకాన్ని కప్పిన పెట్టెలో తీసుకువచ్చిన సైనికాధికారులు, మిగిలిన ప్రభుత్వాధికారులు ఆయనకు సెల్యూట్ చేస్తున్న దృశ్యం చూస్తున్న 10ఏళ్ళ అనుపమకి గొప్ప అనుభూతి కలిగించింది.

ఆ వచ్చిన సైనికాధికారులు "కార్గిల్ యుద్ధం జరుగుతున్నవేళ తాతగారు చేసిన యుద్ధ వ్యూహాలు,

అభేద్యమైన శత్రు శిబిరాలను విచ్ఛిన్నంచేసి వారిని ఏవిధంగా తుదముట్టించింది. చివరకి ఆ ప్రయత్నాలలోనే నేలకొరిగిపోయిన సన్నివేశాలను" కళ్ళకు కట్టినట్టుగా నాన్నగారికి చెపుతూంటే వింటున్న చిన్నారి అనుపమకి సైనికులంటే గొప్ప భావాలు మదిలో ఏర్పడ్డాయి.

తాతగారికి మనదేశంపట్ల ఉన్న ప్రేమకు, భక్తికి ఆమె తనువు పులకించిపోయింది. కార్గిల్ యుద్ధంలో పాల్గొనే ముందు తమ దగ్గరకు వచ్చిన తాతగారు, తనను ఒళ్ళో కూర్చోబెట్టుకుని మన సైనికుల పోరాటపటిమను కథలుకథలుగా చెప్పుకొచ్చిన రోజులు గుర్తుకువచ్చాయి.

"అబ్బా! జీవితమంటే అదేకదా! దేశం కోసం ఏమైనా చేయాలి, దేశమాత రక్షణకొరకు ఎంత సాహసమైనా చేయాలి" అన్న పట్టుదల ఆ చిరుప్రాయంలోనే అనుపమకు కలిగింది. వయస్సుతోపాటు అనుపమ కోరికకూడా పెరిగి పెద్దదయ్యింది.

చక్రధర్ "అనూ! తాతగారికి పట్టుదల, తెగువ, ధైర్యం అనే లక్షణాలు పుట్టుకతోనే వచ్చాయి. వారి చిన్నతనం నుండి కసరత్తులు, వ్యాయామం, రన్నింగ్ పోటీలలో పాల్గొని అనేక బహుమతులను పొందారు. ఊళ్ళో దొంగతనాలు జరగకుండా వారి స్నేహితులతో కలసి జట్లుజట్లుగా ఏర్పడి రాత్రంతా పహరా కాసేవారు. ఇద్దరుముగ్గురు దొంగలను పట్టుకొని దేహశుద్ధి చేసి వారిని పోలీసులకు అప్పగించిన సంఘటనలు కూడా వున్నాయి. వారికున్న ఈ అలవాట్లు సైన్యంలో చేరేందుకు వారికి అదనపు అర్హతలుగా ఉపయోగపడ్డాయి. అందుకే తాతగారు సైన్యంలో అంత గొప్పగా రాణించారు.

వారికొడుకునైన నాకు కూడా నీ మాదిరిగానే సైన్యంలో చేరాలనే కోరిక బాగా ఉండేది. అయితే అమ్మ "ఒక్కగానొక్క కొడుకువి. నిన్ను సైన్యంలోకి పంపనంటే పంపను" అని గొడవచేసింది. అయినా ఆమెను కాదంటూ నేను పట్టుదలగా చదివి పరీక్షలు రాసి సైన్యంలోకి సెలక్ట్ అయ్యాను. నేను ఉద్యోగంలో చేరటానికి వెళ్ళే రోజు అమ్మ కళ్ళలో కనిపించిన బాధ, భయం నా మనసుని మార్చుకునేటట్లు చేసాయి.

నేను లెక్చరర్‌గా పనిచేస్తూ, కష్టపడే తత్వం, నీతి, నిజాయతి, ధర్మచింతన కలిగిన మంచి పౌరులను దేశానికి అందిస్తూ దేశసేవలో భాగమవుతున్నాను" అన్నాడు.

"నాన్నగారూ! ఇంతకీ దేశభక్తికి సరయిన అర్థం చెప్పండి" అని అడిగింది అనుపమ.

"అనూ! సైన్యంలో చేరి దేశమాత రక్షణలో జీవితాన్ని పణంగా పెట్టడం దేశభక్తిలో ప్రధాన భాగం. అంతేగాక సమాజంలో నీ చుట్టూ జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి బాధితుల తరుపున పోరాడటం, జాతి వనరులను, సంపదలను దోచుకునే అరాచక శక్తులను చీల్చిచెండాటం, అవినీతిపరులను శిక్షించటం, ఆపదలో ఉన్నవారికి చేయగలిగినంత సాయమందించటం, పెద్దలను, స్త్రీలను గౌరవించటం ఇవన్నీ కూడా మనలోని దేశభక్తిని ప్రకటించే సోపానాలేనమ్మా! మన కన్నతల్లిదండ్రులనెంతగా ప్రేమిస్తామో, దేశమాతను కూడా అంతగా ఆరాధించాలి. అదే నిజమైన దేశభక్తి" అన్నాడు చక్రధర్.

ఇలా మనసులోని పాత స్మృతులనుండి స్ఫూర్తిని పొందిన అనుపమ "నాన్నగారూ! నేను చిన్నతనం నుండి కన్న కలలను సాకారం చేసుకోవటానికి IPS పరీక్షలకు సిద్ధమై పోలీసుశాఖలో చేరి దేశానికి నాకు చేతనైన సాయం చేయాలనుకుంటున్నాను. ఇదే ఆశయంతో నేను ఇకనుండి కృషిచేస్తాను. అమ్మా! వింటున్నావా! నీ కూతురు త్వరలో అనుపమ IPS అనే పేరు తెచ్చుకుంటుంది. నన్ను మీరు ఆశీర్వదించండి" అంటూ తల్లిదండ్రులకు నమస్కారం చేసింది అనుపమ.

భారతమాతను స్వచ్ఛమైన,

నిర్మలమైన, మనోసుమాలతో కొలుస్తున్న దృశ్యం ఎప్పుడూ కనులముందు కదలాడుతూ తన జీవితాశయం వైపు తనను నడుపుతున్న అనుభూతిని పొందుతూండేది అనుపమ. అలా అనుపమ ఒకవైపు మాష్టర్స్ డిగ్రీకి చదువుతూనే, మరో వైపు IPSకు కఠిన శ్రమకోర్చి తయారయ్యి, పోలీసు శాఖలో ప్రవేశించింది.

ఉద్యోగంలో చేరిన కొద్ది కాలంలోనే మంచి అధికారిణిగా పేరుతెచ్చుకుంది అనుపమ. షీటీమ్స్‌కు సపోర్టివ్ అధికారిణిగా కూడా గుర్తింపు పొందింది. ఎన్నెన్నో ర్యాగింగ్ కేసులను పరిష్కరించింది. ఆడపిల్లలను వేధించే వారిపట్ల అపరకాళికామాత అయ్యింది. తాతగారి రక్తమే కదా ఆమెలో ప్రవహిస్తున్నది. అందుకే అంత తెగువ ఆమెకు. సిటీలోని మహిళాకళాశాలలో చదువుకుంటున్న విద్యార్థినులంతా ఆమెకు ఫాన్స్ అయిపోయారు.

ఏ కాలేజీలో ఫంక్షన్స్ అయినా అనుపమను ముఖ్య అతిధిగా పిలుస్తున్నారు. ఆ సభలలో మాట్లాడేటప్పుడు అనుపమ “డియర్ సిస్టర్స్, మీలాగానే నేను కూడా ఎన్నో ఆశలతో, ఆశయాలతో కాలేజీలో ప్రవేశించాను. మా సీనియర్స్ చేసే ర్యాగింగ్ ఇబ్బందులను ఎదుర్కొన్నాను. మీ అందరికి పోరాడే ధైర్యాన్ని అందించటానికే నేను ఈ పోలీసు శాఖలోకి వచ్చాను. మీరంతా గౌరవప్రదమైన వస్త్రధారణలో, సత్ప్రవర్తనతో ఎదుటివారిలో మార్పు తీసుకురావచ్చును” అంటూ విద్యార్థులకు కొన్ని సలహాలను, సూచనలను చెప్పేది.

ఒక రోజు అనుపమ స్టేషన్‌కి వచ్చేసరికి అక్కడి వాతావరణమంతా కలకలంగా వుంది. ఆమె కింది అధికారులు ఆమెకోసం ఆదుర్దాగా ఎదురుచూస్తున్నారు. వాళ్ళ ముఖాలలోని కంగారును, కళ్ళల్లోని భయాన్నీ కనిపెట్టిన అనుపమ “ఏమయ్యింది? మీరంతా ఎందుకలా వున్నారు?” అని అడిగింది.

“మేడం! ఈ రోజు వచ్చిన కేసు.. కేసు..” అంటూ చెప్పలేక నీళ్ళునములుతున్నారు సిబ్బంది.

“అసలు విషయమేమిటో చెప్పకుండా అలా ఉంటే నాకెలా తెలుస్తుంది? మీకొచ్చిన భయమేమీ లేదు. చెప్పండి” అంది అనుపమ.

“ఈ రోజు ఉదయమే మన రాష్ట్ర మాజీమంత్రిగారి అనుచరులు రెండు ప్రభుత్వ వాహనాలను తగులబెట్టారండి. అక్కడకు జేరిన మన సిబ్బంది అల్లరిమూకలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మేమా సంఘటనలన్నింటినీ వీడియోలు కూడా తీశాం. ఆ దోషులను అరెస్ట్ చేద్దామంటే మంత్రిగారినుండి బెదిరింపులు వస్తున్నాయి. ఏంచేయాలా అని మేము తర్జనభర్జన పడుతున్నాం” అని చెప్పారు.

“అసలు మంత్రిగారి అనుచరులు వాహనాలను ఎందుకు తగులబెట్టాల్సి వచ్చింది?” అంటూ వివరాలను అడిగింది అనుపమ.

“ప్రస్తుతం ప్రభుత్వంలో వున్న మంత్రిగారు పాతబస్తీలో పార్టీ మీటింగ్ పెట్టారు. ఆ సభలో మాజీమంత్రిగారికి వ్యతిరేకంగా రెచ్చగొట్టే విధంగా మాట్లాడారు. ఆ మాటలను విన్న మాజీమంత్రిగారి అనుచరులు ఆందోళనకు దిగి, విచక్షణకోల్పోయి అటుగా వస్తున్న ప్రభుత్వ వాహనాలకు నిప్పుపెట్టారు. అలా మొదలయ్యింది గొడవ” అంటూ అనుపమకు చెప్పారు సిబ్బంది.

“వీడియో తీశామంటున్నారుగా, నేను కూడా వాటిని పరిశీలిస్తాను. తెప్పించండి” అంటూ వాళ్ళకు చేయవలసిన పనులను చెప్పి తాను చేయవలసిన దాని గురించి ఆలోచిస్తోంది అనుపమ.

ఓ గంటలోపునే సిబ్బంది తెచ్చిన మంత్రిగారి సభ తాలూకు వీడియోలను, ఆడియోలను

పరిశీలించింది అనుపమ. పాతబస్తీ పరిధిలోని SPగారికి ఫోన్ చేసి “సార్! ఈరోజు జరిగిన మంత్రిగారి మీటింగ్ తాలూకు వీడియోను నేను ఇప్పుడే చూశాను. అందులో కనిపించిన ఆధారాల ప్రకారాం మీరు అనుమానితులను వెంటనే అరెస్ట్ చేయండి. వారి ద్వారా అసలు నిందితులను మనం పట్టుకోవచ్చు” అంది అనుపమ.

“నేను కూడా ప్రొద్దుటినుండి ఈ కేసు విషయమే ఆలోచిస్తున్నాను మేడం. మీరు చెప్పినట్లుగానే అనుమానితులను అరెస్ట్ చేసి మీకు తెలియజేస్తాను” అన్నాడా అధికారి.

ఆ పోలీసు అధికారి మాజీమంత్రిగారికి ఫోనుచేసి “సార్! ఆ అనుపమ మేడం మనవాళ్ళను అరెస్ట్ చేయమని చెపుతున్నారండీ. మీరేమీ భయపడవద్దు. మీకు నేనున్నాను. ఆడది ఏంచేయగలదు” అంటూ హేళనగా మాట్లాడాడు.

అనుపమే ఆ మాజీమంత్రిగారికి ఫోను చేసి “మీ అనుచరులు అనవసరంగా చేసిన గొడవలలో వారి పాత్ర వీడియో ద్వారా తెలుస్తోంది. వారిని వెంటనే పోలీసులకు లొంగిపోవలసిందిగా చెప్పండి. లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి” అని హెచ్చరికగా చెప్పింది.

“తన మాటలలోని తీవ్రతను అర్థంచేసుకున్న మాజీమంత్రిగారు ఎలాగైనా తన అనుచరులను పోలీసులకు లొంగిపొమ్మని చెపుతారు” అని అనుకుంది అనుపమ. రాత్రి తొమ్మిది గంటలయ్యింది.

కానిస్టేబుల్ వచ్చి “అమ్మా! వాళ్ళు పెద్దోళ్ళు. మీరు చెప్పినంతమాత్రానే ఎలా లొంగిపోతారమ్మా? తప్పించుకోవటానికి సవాలక్ష కారణాలను వెతుక్కుంటారు. పొద్దుపోయింది. పొద్దుటేళ ఏంతినివచ్చారో? ఏమో? మీరు ఇంటికెళ్ళండమ్మా” అంటూ బ్రతిమలాడాడు.

“చూడు! నా మీద నాకు చాలా నమ్మకం వుంది. అతను తప్పు చేశాడు. రేపు కోర్టులోనైనా తప్పించుకోలేడు. అందుకే వచ్చితీరతాడు. ఇలోగా ఈ డబ్బులు పట్టుకెళ్ళి నీవు టిఫెన్ చేసి నాకు కూడా తీసుకురా” అని కానిస్టేబుల్‌ను పంపించింది అనుపమ.

ఆమె అనుకున్నట్లుగానే రాత్రి 11గంటలకు మాజీమంత్రిగారి అనుచరులు లొంగిపోయినట్లుగా పాతబస్తీ SP ఫోను చేశాడు. తెల్లవారిన తరువాత అరెస్టయిన వారిని కోర్టుకు తీసుకెళ్ళి అన్ని విషయాలను వారికి వివరించి చెప్పింది. కోర్టు దోషులను విచారించి వారికి తగిన శిక్షలను విధించింది. అంత చిన్నవయస్సులోనే రాజకీయంగా పలుకుబడివున్న వ్యక్తితో తలపడి విజయంసాధించటంతో అనుపమ పేరు ఒక్కసారిగా రాష్ట్రమంతా మారుమోగి పోయింది.

ఆరోజు అనుపమ డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చేటప్పటికి, ఓ యువకుడు తన తల్లిదండ్రులతో మాట్లాడుతూ కనిపించాడు. తనకొరకు అమ్మానాన్నలు వివాహప్రయత్నాలు చేస్తున్నట్లుగా అనుపమకు తెలుసును. “అలా వచ్చిన పెళ్ళి సంబంధం వాళ్ళయ్యుంటారు” అనుకుంది అనుపమ.

“త్వరగా డ్రస్ మార్చుకుని రా అమ్మా” అంటున్న నాన్నగారికి “ఇదిగో అయిదునిముషాలలో మీ ముందుంటాను” అని చెప్పి లోపలికి వెళ్ళింది అనుపమ. ఈలోపుగా అందరికి టీ కలిపి తీసుకొచ్చింది పార్వతి.

టీ తీసుకుంటూ, ఆ వచ్చిన యువకుణ్ణి అనుపమకు పరిచయం చేస్తూ “ఇతను గౌతం. నీమాదిరిగానే మాతృభూమికి ఏమయినా చేయాలనే మంచి ఆశయంతో మీ డిపార్ట్‌మెంట్‌లోచేరి ‘ఆక్టోపస్’ విభాగంలో పనిచేస్తున్నాడు” అంటూ చెప్పాడు చక్రధర్.

“మేడం! నేనెవరో మీకు తెలియదు కానీ, మీరు మాత్రం నాకే కాదు టివీ చూసే లేదా పేపర్ చదివే వాళ్ళందరికి బాగా

తెలుసు. ఆ మాజీమంత్రిగారి కేసులో అంతలా పేరువచ్చింది మీకు తెలుసునా?” అంటూ మాట కలిపాడు గౌతం.

“నమస్కారమండీ! మిమ్మల్ని ఓసారి చూసినట్లుగానే ఉంది. కానీ గుర్తు రావటంలేదు. ఇంతకీ మీరు...” అంటూ ఆగిపోయింది అనుపమ.

“మేడం! మీరు ఆ మాజీమంత్రిగారి కేసు విషయంలో మా విచారణా కమిటీ ముందుకు వచ్చారు. ఆ సమయంలో నేను అక్కడే వున్నాను. మీరా కేసు విషయంలో చూపిన ధైర్యం, సాహసం నన్ను మీ ఇంటిదాకా తీసుకువచ్చాయి” అంటూ ఆమెని పొగడ్తలతో ముంచెత్తాడు గౌతం.

అతని మాటలకు అడ్డువస్తూ “ఇంతకీ ఆ పాతబస్తీ SP ఎందుకు సస్పెండ్ అయ్యాడు?” అని అడిగింది అనుపమ.

“ఎందుకంటే మీరు సేకరించిన ఆ గొప్ప కేసు విషయాలు ముందుగానే ఆ మాజీమంత్రిగారికి చేరిపోతున్నాయి. అందుకు ఆ SP సహాయపడుతున్నాడని పై అధికారులకు అనుమానమొచ్చింది. అతనిపై వచ్చిన ఆరోపణలను విచారించమని నాకు బాధ్యతను అప్పగించింది డిపార్ట్‌మెంట్. దానిలో భాగంగానే నేను మిమ్మల్ని కూడా ఫాలో అయ్యాను. ఓ పోలీసు అధికారిగా దోషులను పట్టుకోవాలేగాని వారికి చేదోడువాదోడుగా ఉండటమేమిటి? అతను ఎంత సెల్ఫిష్‌గా ప్రవర్తించాడో తలచుకుంటూంటే కోపం తన్నుకొస్తోంది నాకు” అన్నాడు గౌతం.

“గొప్ప కేసంటున్నారేమిటి? కేసుల్లో గొప్ప కేసు, చిన్న కేసు అంటూ ఉంటాయా? ఏదయినా కేసు కేసేగా?” అంది కోపంగా అనుపమ.

“అదికాదు అనుపమగారు! అవతల దోషిగా మనం నిలబెడుతున్నది మాజీమంత్రిగా పేరున్న వ్యక్తిని కదా. అందుకే గొప్ప కేసన్నాను” అన్నాడు గౌతం.

“సారీ! మీరు ఎంతో ఉన్నతభావాలున్న వ్యక్తి అనుకున్నాను. ఆ మాజీమంత్రిగారిని గొప్పగా చూపి మాట్లాడుతున్న మీ మాటలను బట్టిచూస్తే మీరు...” అంటూ ఆగిపోయింది అనుపమ.

“అదేమిటి? అలా అంటున్నారు?” అన్నాడు గౌతం కంగారుగా.

“ఔనండీ! మీరు మాజీమంత్రిగారిని గొప్పగా చూపుతున్నారు కదా! అందుకే అలా అనక తప్పలేదు” అంది అనుపమ.

“అదికాదు. I mean..” అంటూ నసుగుతున్నాడు గౌతం.

“చూడండి గౌతం! నేనేమి ఇదో గొప్ప కేసని ఫీలవ్వటం లేదు. ప్రభుత్వ ఆస్తులనేవి ప్రజలు కట్టిన పన్నులతో ఏర్పాటు చేసుకున్నవే! కాబట్టి అవి ముమ్మాటికి ప్రజల ఆస్తులే. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అటు ప్రభుత్వంపైన, ఇటు ప్రభుత్వాధికారులపైన ఉంటుంది. ఆ ఆస్తులను ఎవరు ధ్వంసం చేసినా దండన తప్పదు. ఇక్కడ పేదా, గొప్ప అనే తేడాలుండకూడదని నా భావన” అంటూ ఖచ్చితంగా చెప్పింది అనుపమ.

“సారీ మేడం!” మీరింత డీప్‌గా ఆలోచిస్తారని అనుకోలేదు. ఏమైనా ఓ ఆడపిల్ల ఇంత ధైర్యంగా పోరాడి ఈ కేసులో నిందితులకు శిక్షపడేలా చేయటం నాకు సంతోషం కలిగించింది. అందుకే మిమ్మల్ని అభినందించాలని ఇక్కడికొచ్చాను” అన్నాడు గౌతం.

“మీరు కూడా ఏ ప్రలోభాలకు లొంగకుండా విచారణచేసి స్వార్ధపరుడు, అవినీతిపరుడు అయిన ఆ SPకి శిక్షపడేలా చేసినందులకు మీకు కూడా నా అభినందనలు” అంది

అనుపమ. ఆమె మాటలను విన్న గౌతం ముఖం వినీలాకాశంలోని పౌర్ణమి వెలుగుల చందమామలా వెలిగిపోయింది.

"సరేనండి. మరోసారి కలుద్దాం. ఇక నేను వెడతాను" అంటూ అందరికి టా..టా.. చెప్పి వెళ్ళిపోయాడు గౌతం.

"అనూ! నీ ప్రశ్నలతో అతణ్ణి హడలుకొట్టి పంపేశావా ఏమిటి?" అని టీ కప్పులను వంటింట్లో పెట్టి వస్తున్న పార్వతి నవ్వుతూ అడిగింది.

"లేదమ్మా! ఇద్దరం ఒకే డిపార్ట్‌మెంట్ వాళ్ళం కదా! ఒకరి విజయాలను ఒకరం మెచ్చుకుని అభినందించుకున్నాం అంతే" అంది అనుపమ.

"మాకయితే మీ జంట నచ్చింది. అతను నీకు నచ్చాడా? లేక ఇంకోసారి ఇద్దరూ కలసి మాట్లాడుకుంటారా? నీ అభిప్రాయం చెప్పమ్మా" అంది పార్వతి.

"అమ్మా! మీ ఉద్దేశ్యం నా కర్థమయ్యింది. అతనికి ఇష్టమైతే నాకు కూడా అభ్యంతరమేమీ లేదు" అంటూ గౌతంతో పెళ్ళికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది అనుపమ.

అలా ఒక కేసుతో మొదలయిన గౌతం, అనుపమల పరిచయం పెద్దల ఆశీస్సులతో పెళ్ళి పీటలవరకు నడిచింది. ఒకరికొకరైన వారికి రెండేళ్ళకు 'చంద్రిక' ఉదయించింది.

వారి కలలపంటను చూసుకోవటానికి అటు నానమ్మ, తాతయ్య, ఇటు అమ్మమ్మ తాతలు పోటీపడుతున్నారు.

కాలమంతా ఒకేలా సాగిపోతే మనిషి దేవుడిని మరిచిపోతాడనేమో, అప్పుడప్పుడు ఆనంద తరంగాలకు బ్రేక్ వేస్తూంటాడు ఆ విధాత. చేస్తున్న మంచి పనులకు మెచ్చుకోవటం, అవార్డులనివ్వటం, పదోన్నతులను కల్పించటం వంటి ప్రోత్సాహకరమైన పనులు చేయవలసిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా అనుపమను వేరే రాష్ట్రానికి బదిలి చేసింది. "ఆమె చేతిలో ఇబ్బందులుపడిన రాజకీయనాయకుల ప్రమేయం కూడా ఈ బదిలీలో లేకపోలేదు" అనుకున్నారు డిపార్ట్‌మెంట్ వాళ్ళు.

పెళ్ళయిన ఇన్నేళ్ళకు భర్తకు దూరం కావల్సివచ్చినా అనుపమ బాధపడలేదు. కానీ నిండా మూడేళ్ళు కూడా లేని చంద్రిక గురించే భార్యాభర్తల చింత. "ఏం ఫర్వాలేదమ్మా! ఒక ఆరునెలలు మాజంట, మరో ఆరునెలలు గౌతం తల్లిదండ్రులు, కొత్త వూరిలో నీకు తోడుగా ఉంటాం. నీ ఆత్మస్థైర్యాన్ని మాత్రం కోల్పోవద్దు" అన్నాడు చక్రధర్. వారి ప్రోద్బలంతో కొత్త ఊరిలో జాయిన్ అయ్యింది అనుపమ.

ఒక రోజు గౌతంతో మాట్లాడేటప్పుడు ఓ కేసులో ఇన్వెస్టిగేషన్ గురించిన వివరాల కొరకు అడిగింది అనుపమ. "మీరు ఇదివరకు ఈ వూళ్ళో పనిచేసానని చెప్పారు. కళావతి అనే ఆమెకి రాజకీయాలలోగానీ, ప్రభుత్వంలోగానీ బాగా పరిచయాలున్నాయా?" అని అడిగింది.

"ఔను. అప్పట్లో ఆమె ఓ మంత్రిగారికి పర్సనల్ సెక్రటరీగా ఉంటూ కుడిభుజంలా పనిచేసింది. ఏ ఫైల్ అయినా ఆమె చూడనిదే మంత్రిగారు సంతకం చేసేవారుకాదు. ఆమె అనుమతిలేని ఫైల్‌పై "not approved" అనే రిమార్క్‌తో తిరస్కరించేవారు. సంబంధిత వ్యక్తో, సంస్థో ఆమెను కలుసుకుని తృణమోపణమో అర్పించుకున్న తరువాత ఆ రిమార్క్"note approved"గా మారేది.

ఆమె ప్రభుత్వ ఖజానాలో పెద్ద పందికొక్కులా చేరి, విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తోందని అందరూ చెప్పుకునే వారు. మరిప్పుడు ఆ ప్రభుత్వం లేదు. ఆమె ఏంచేస్తోందో పెద్దగా తెలియదు" అని చెప్పాడు గౌతం.

"ఆమె ప్రస్తుతం జైల్ జీవితం అనుభవిస్తోంది. అయితే సంపాదించినదానిలో కొంత ఖర్చు చేస్తూ ఇక్కడ కూడా ఆమె

విలాసాలకు అడ్డులేకుండా చేసుకుంది. ఆమె ఉన్న గదికి ACతో సహా అన్ని హంగులను అమర్చారు. స్టార్‌హోటల్‌లోని రూం కూడా ఆమె ఉన్న సెల్‌కు సరిరాదు. జైళ్ళశాఖలోని ఉన్నతాధికారులు కూడా ఆమె నుండి లాభపడినవారే కావటంతో చూసిచూడనట్లుగా వదిలేస్తున్నారు. దానితో జైళ్ళ ఉన్నత అధికారిపై ఫిర్యాదులొచ్చాయి" అంటూ చెప్పింది అనుపమ.

"ఉద్యోగంలో చేరేటప్పుడు తీసుకున్న ప్రమాణాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న వారే ఇలా లంచాలకు అలవాటు పడుతున్నారు. "కంచే చేను మేసిన విధంగా" అవినీతిని అరికట్టవలసిన అధికారులే పెద్ద అవినీతి తిమింగలాలౌతున్నారు. అలాంటి లంచగొండి అధికారులను మనం ఉపేక్షించకూడదు. నీ వెనుకనే నేను ఉంటాను. నిర్భయంగా ఈ కేసులో దోషులను పట్టుకో అనుపమా" అంటూ భార్యను ప్రోత్సహించాడు గౌతం.

గౌతం ఇచ్చిన స్ఫూర్తితో అనుపమ ఆ జైలులోని ఖైదీలను విచారించింది. వారిలో ఒక ఖైదీ, "ఆ అధికారి లంచం ఇచ్చినవారిని ఓ రకంగాను, మిగిలిన వారిని మరో రకంగాను చూస్తున్నారని చెప్పాడు. డబ్బులిచ్చినవారికి మంచి భోజనాలు అందించటం, రాచమర్యాదలు చేయటం, 'మేము భోజనం సరిగా లేదండి' అంటే, 'చేయి చాపి మీరూ డబ్బులివ్వండి. విందు భోజనమే పెడతాం' అంటూ వెకిలిగా నవ్వటం చేస్తున్నారా అధికారి" అని చెప్పాడు.

"'ములాఖాత్' సమయంలో కూడా ఇదేవరసండి. ఆయనకు సహకరించని వారికి సమయం తక్కువిచ్చి, కుటుంబ సభ్యులతో సరిగా మాట్లాడనివ్వరు" అని మరో ఖైదీ చెప్పాడు. ఇలా ఖైదీల మాటలను విన్న అనుపమకు చాలా బాధ కలిగింది.

"ఓ పక్క ధనవంతులై కూడా సమాజాన్ని దోచుకుతినే ఘరానా దొంగలు, సంపాదించే వీలులేక, చదివిన చదువులకు సరయిన ఉద్యోగాలురాక, తిండికి గుడ్డకి లేక దొంగతనాలు చేసే సామాన్య ప్రజలు మరోపక్క. ఎటు పోతోంది ఈ సమాజం?" అనుకొంది అనుపమ. ఆ అధికారిపై విచారణ పూర్తిచేసి, ఆయనను సస్పెండ్ చేసేవరకు విశ్రమించలేదు అనుపమ.

కేసు పూర్తయ్యాక గౌతంకి ఫోనులో విషయాలన్నింటిని చెప్పింది. "అనుపమా! నీవు సక్సెస్‌ఫుల్ అధికారిగా మరోసారి ప్రూవ్ చేసుకున్నావు. కంగ్రాట్స్!" అన్నాడు గౌతం.

ఓరోజు ఉదయమే అనుకోకుండా వచ్చిన గౌతంను చూసి ఆశ్చర్యపోయింది అనుపమ. "ఏమిటి మండుటెండలో మలయమారుతంలా ఇలా హఠాత్తు దర్శనం దొరికింది శ్రీవారిది" అంటూ గౌతం చేతిలోని సూట్‌కేస్‌ను అందుకుంది అనుపమ.

"అవునులే! నీకు కేసులు! శిక్షలు తప్ప నీ జీవితమేమిటో గుర్తుంటేగా? అందుకే దేవిగారిని ప్రసన్నంచేసుకోవటానికి ఈ దాసుడే రావల్సి వచ్చింది. ఈరోజు ప్రత్యేకతేమిటో ఇంకా చెప్పాలా నీకు" అన్నాడు గౌతం.

అతని మాటలకు ఎరుపెక్కిన బుగ్గలతో "అరే! మీకు పెళ్ళిరోజు శుభాకాంక్షలు చెప్పిన తరువాతే ఈ రోజు ఆఫీసుకెళ్ళాలని నిన్న రాత్రికూడా అనుకున్నాను. కానీ స్టేషన్లో ఏదో అర్జంట్ కేసు వచ్చిందని ఫోను రావటంతో ఇదిగో ఇలా తయారయ్యి, 8గంటలకే ఆఫీసుకు బయలుదేరాలని పనులతో కుస్తీపడుతూ ఆ విషయమే మరిచిపోయాను" అని చెప్పింది అనుపమ.

"ఈ రోజు లంచ్ కలసి చేద్దాం. త్వరగా వచ్చేసెయ్యి అనుపమా" అన్నాడు గౌతం.

"ఓ! షూరుగా డియర్! ఈలోగా చంద్రికతో ఆడుకుంటూండండి"

అంటూ జీప్‌లో వెళ్ళిపోయింది అనుపమ.

సిటిలో మామూలుగానే ట్రాఫిక్ జామ్స్. "రోజూ ఇంటిదగ్గర బయలుదేరిన గంటలోపుగా స్టేషన్‌కు చేరుకునేవాళ్ళం. ఈ రోజు ఏమయ్యింది?. అరగంటనుండి ఇక్కడే ఉండిపోయాం. ఓ సారి దిగి చూసిరా ఏమయ్యిందో?" అని డ్రైవర్‌ను అడిగింది అనుపమ.

డ్రైవర్ వెళ్ళి వచ్చి, "మేడం! MLAగారు ఒక షాపును ప్రారంభిస్తున్నారు. వారి కాన్వాయ్, కార్యకర్తల కార్లతో రోడ్ బ్లాక్ అయ్యింది. ఆ కార్యక్రమం పూర్తికావచ్చిందట. 'MLAగారు వెళ్ళాకగానీ ట్రాఫిక్ క్లియర్ కాదు' అని చెప్పారు అక్కడి పోలీసులు" అని చెప్పాడు.

"పిల్లల స్కూలుబస్‌లు, పల్లెవెలుగు బస్‌లు, హాస్పిటల్‌కి వెళ్ళవలసిన రోగులు, ఆఫీసులకెళ్ళాల్సిన ఉద్యోగస్తులు అందరూ ఇబ్బందిపడుతున్నారు. ఇలా రహదారులపై అనుమతులు లేకుండా ఈ ప్రారంభోత్సవాలేమిటో?" అనుకుంటూ ప్రజలబాధలను తన భావాలతో కలిపి ముఖ్యమంత్రిగారికి మెసేజ్ చేసి తగిన చర్య తీసుకోవలసిందిగా అడిగింది అనుపమ.

తాను ఆఫీసుకు చేరేటప్పటికే ముఖ్యమంత్రిగారి కార్యాలయం నుండి వెంటనే రావలసిందిగా కబురొచ్చింది. "ఏమ్మా! మీరు ప్రభుత్వ అధికారులై వుండి, ప్రజాప్రతినిధులపై అభియోగాలు మోపడం, విచారించమని చెప్పడం ఏమిటి?" అని ముఖ్యమంత్రిగారే అడిగారు.

"నిజమే సార్! మనమంతా ప్రజలకోసమే పనిచేస్తున్నాం. కానీ ఆప్రజలు ఎన్నుకున్న నాయకులే ఇలా ప్రవర్తిస్తే ఎలాగ? నాకైతే ఈ VIP సంస్కృతిని రద్దుచేస్తేగానీ ఈ బాధలు తగ్గవనిపిస్తోంది. ఉదయమే రహదారులను బ్లాక్ చేస్తే ఎంతమంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారు? ప్రజా సంరక్షణకోసం ఎన్నికైన వారికి ఆ ప్రజల ప్రేమే రక్షణ కావాలిగానీ ఇంతమంది గన్‌మెన్‌లు, ఇంత కాన్వాయ్ అవసరముందా? ప్రయివేట్ పనులకు వెళ్తూ కూడా ఇంత ప్రజా సొమ్మును వృధాచేస్తూ, తిరిగి ఆ ప్రజలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నేనూ సామాన్యమైన ప్రజలలో భాగంగా భావించి మీకు రిపోర్ట్ చేశాను. ఆలోచించి మీరు మంచి నిర్ణయం తీసుకోండి" అంటూ వచ్చేసింది అనుపమ.

ముఖ్యమంత్రిగారికి అనుపమ వాదనలో నిజమున్నదనిపించింది. వెంటనే తన పర్సనల్ కార్యదర్శిని పిలిచి విషయం వివరించి దానిలోని సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవలసిందిగా చెప్పారు.

అదే సమయంలో ఆ MLA ఒత్తిడికి తలొగ్గి అనుపమను రాష్ట్రంలోని మారుమూల పట్టణానికి బదిలీ చేశారు.

కూతురి బదిలీ విషయం తెలుసుకున్న చక్రధర్ "అనూ! ప్రజలకోసం నిరంతరం తపిస్తూ పనిచేస్తున్న నిన్ను అంత మారుమూల ప్రాంతానికి బదిలీ చేయటమేమిటి? అన్యాయం కాకపోతే? కష్టించి నిజాయితీగా పనిచేసే అధికారులకు ఇదేం శిక్ష?" అంటూ తన మనసులోని ఆవేదనను వ్యక్తపరిచాడు.

"అలా ఎందుకు బాధపడతారు నాన్నా! నేను ఉద్యోగంలో చేరేటప్పుడు భారత దేశంలో ఎక్కడైనా పనిచేస్తానని ప్రమాణం చేయలేదా? మరి ప్రస్తుతం నన్ను బదిలీ చేసిన ఊరు భారతదేశంలోనే కదా ఉన్నది. ఆ ప్రాంతం వాళ్ళు మాత్రం భారతీయులుకాదా? నేను కాకపోతే మరొకరైనా అక్కడ సేవలనందించవలసిందేగా! అన్నీ ఉన్న చోట రాణించటం కాదు, ప్రతికూల పరిస్థితులలో కూడా మన సేవతో ప్రజల మన్ననలను పొందగలగాలి. భగవంతుడు నాకా అవకాశం ఈ బదిలీ ద్వారా ఇచ్చాడనుకుంటాను" అంది అనుపమ సడలని సంకల్పంతో.

"కొత్త ఊరు బాగా వెనుకబడిన ప్రాంతమంటున్నారు. చంద్రిక చదువుకోవటానికి సరయిన స్కూలు కూడా ఉండక పోవచ్చు. నీకు ఇచ్చే క్వార్టర్స్‌లో కూడా అన్ని వసతులూ ఉన్నాయనుకోను. అందుకే చంద్రికను మాతో తీసుకెళ్ళి, గౌతం దగ్గరుంచి చదివిస్తాం. దీనికైనా నువ్వు ఒప్పుకోవాలి" అని అడిగాడు చక్రధర్.

"నాన్నా! వెనుకబడిన ప్రాంతంలో చదువుకుని పేరెన్నికగన్న నాయకులు మనకెందరు లేరు. నేను నా కూతురికి కష్టం, సుఖం అన్నీ తెలిసేలా చేస్తాను. మేం జాగ్రత్తగానే ఉంటాం. మా గురించి బెంగ పడకండి" అంది అనుపమ.

"ఏమోయ్! నీవు వెళ్ళే చోట సిటీలో ఉన్న కేసులుండవు. కోళ్ళెత్తుకుపోయారు, మేకలు తప్పిపోయాయి., లాంటి చిన్నచిన్న తగాదాలే ఉంటాయి. మరి నీ శక్తిసామర్ధ్యాలు అక్కడ అవసరమా?" అని అనుపమను ఉడికిస్తూ అన్నాడు గౌతం.

"అక్కడి ప్రజలను సంస్కారం దిశగా నడిపిస్తూ, జీవితాన్ని ఎలా మలచుకోవాలో నేర్పిస్తూ, దొంగతనాలు, నేరాలు, మధ్యపానం లేని ప్రాంతంగా ఆ ఊరిని మారుస్తాను. మరి గురజాడ వారు అన్న"దేశమును ప్రేమించుమన్నా.." గీతానికి అర్థం ఇదేకదా. ఆ ప్రయత్నంలో విజయం సాధిస్తాను" అంది అనుపమ ఆత్మ విశ్వాసంతో.

అనుపమ గొంతులో ప్రకటితమైన దేశభక్తికి అచ్చెరువొందాడు గౌతం.

★★★★★

# “కొత్త సీరియల్..”



## “నైటింగేల్”

**జీవితాన్ని జీవించనివ్వండి**

తన వాళ్ళ కోసం , తన చుట్టూ ఉన్న వాళ్ళ కోసం జీవితాన్నే త్యాగం చేసిన ఓ త్యాగమూర్తి వాస్తవ కధ



“త్వరలో...”

# “కొత్త సీరియల్..”

## “చరమాంకం ”



“త్వరలో...”

# ఆంజనేయులు -అమెరికా రిటర్న్

ధారావాహిక



## ఎపిసోడ్ –1 కోడి పందాలు–కాసినోరాయలు

మా అమలాపురం నుంచి అంజనేయులు అమెరికా వెళ్లి పదేళ్ళు పైగానే అవుతోంది. ప్రతి ఏడాది చలికాలంలో మాఊరికి వస్తూవుంటాడు వాళ్ళ నాయన్ని చూడటానికి.వాళ్ళ నాయన మీద ప్రేమకన్నా అమెరికాలో చలి ఎక్కువగా వుండ టం వల్ల ఈ నెల రోజులు ఇక్కడికి వస్తుంటాడని ఊళ్ళో వాళ్ళు గుస గుస లాడుతుంటారు. ఏదో ఒకటి అట్టగన్న వస్తున్నాడులే అని వాడి అమ్మ నాయన సంతోష పడుతుంటారు .

వచ్చిన వాడు కాస్త కదురుగా ఇంటి పట్టున వుండేవాడా అంటే అదిలేదు. పేరుకు తగ్గట్టు ఒక చోట ఉండేవాడు కాదు , తింగరి వేషాలన్నీ వేసేవాడు . అన్నట్టు పేరంటే గుర్తుకు వచ్చింది , ఆంజనేయులు అమెరికా వెళ్ళినతరువాత తన పేరు మరీ మోటుగా ఉందని మార్చుకున్నాడట. ఇప్పుడ వాడి పేరు "మిస్టర్ లులూ "

అట . అదేమి పేరు అని అనుకుంటున్నారా, వాడు "హనుమాన్లు" అని పేరు మార్చుకుంటే నోరు తిరగక "మిస్టర్ లులూ " అని పిలవటం మొదలేట్టారు అక్కడి వాళ్ళు .ఇంతకి ఆంజనేయులికి , హనుమాన్లుకి తేడా ఏముంది అనుకుంటున్నారా ?అక్కడికే వస్తున్నా . మన వాడ్ని చిన్నప్పటి నుంచి స్కూల్లో ఆంజనేయులు కి బదులు ఇంజనాయులు అని పిలిచేవాళ్ళు .దానికి ఓ కారణం ఉంది .తలకి నిండుగా ఆముదం పట్టించి సరిగా దువ్వుకోకుండా ,ఎప్పుడూ జిడ్డు కారే మొఖం వేసుకు స్కూల్ కి వచ్చేవాడు , అందుకనే స్నేహితులు వీడిని ఇంజనాయులు అని పిలిచే వాళ్ళు .అందుకనే ఆ పేరంటే మనోడికి చాల కోపం .మొదట అంజనేయులు పేరుకి బదులు ఏ శ్రీధర్ అనో, శ్రీకర్ అనో పెట్టుకుందాం అనుకున్నాడు , కాని ఆంజనేయులు పేరు మార్చుకుంటే దేవుడికి కోపం వస్తుందని,శాపం పెడతాడని ఎవరో భయపెడితే ఇక తప్పక మనోడు 'హనుమాన్లు' అని మార్చుకున్నాడు. అందరు "జి .హెచ్ .మాన్లు" అని పిలుస్తారు, చాల మాన్లి గా ఉంటుంది అనుకున్నాడు('జి 'వాడి ఇంటి పేరు లెండి , దాని గురించి ఇంకో సారి ముచ్చ టించు కుందాం ) ,కాని అందరు చైనా వాడిని పిలిచినట్టు ,మిస్టర్ లులూ అని పిలవటం మొదలుపెట్టారు . మనోడు ఇంచు మించు చైనా వాడిలానే ఉంటాడనుకోండి అది వేరే సంగతి .

ఉళ్ళో బలాదూరుగా తిరిగే కుర్రాళ్ళందరినీ ఆమెరికా తీసుకెళతానని ఆశలు కల్పించి తన చుట్టూ తిప్పుకునేవాడు .వాడి మాట విని చదువు సంధ్యలు ,ఉద్యోగం సద్యోగాలు మానేసి కొందరు వాడినో లీడరుగా భావించి వాడు చెప్పిన పనల్లా చేసేవాళ్ళు . వాడు అమెరికా అలా వెళ్ళాడో ఇప్పటి కుర్రాళ్ళకి తెలియక పోయినా మాతరనికి తెలుసు. వాదిని అమెరికా పంపటానికి వాళ్ళ నాయన పదెకరాలు అమ్మాల్సి వచ్చింది. మిగిలిన రెండెకరాలలో గుట్టుగా బండి లాగిస్తున్నాడు వాళ్ళ నాయన.





చుట్టూ పది మంది కురాళ్లు పోగవ్వంగానే తన్నో పెద్ద నాయకుడి నని అనుకోవటం మనవాళ్ళకు అలవాటే. ఆంజనేయులు కూడా ఇప్పుడు మా ఊరికి ఓ చోటా నాయుకుడిగా మారాడు. జనం కుడా ఏ సమస్య వచ్చినా సర్పంచికి చెప్పటం మానేసి ఆంజనేయులికి ఏకరువు పెట్టటం మొదలెట్టారు.
దాంతో  అప్పటి నుంచి  మా ఊరి ఎంఎల్యే  కూడా ఏదన్నా అవసరం పడితే సర్పంచిని పిలవటం మానేసి ఆంజనేయులు తో మంతనాలు చెయ్యటం మొదలుపెట్టాడు. ఎంతైనా రాజాకీయ నాయకుడు కదా  సర్పంచి దగ్గర చిల్లర నాణాలు దొరికితే  అంజనేయులు దగ్గర పచ్చ నోట్లు దొరుకుతాయని ఆ మాత్రం తెలియదా.

మన పల్లెటూళ్ళ లో ప్రతి సంక్రాంతికి కోడి పందాలు, గుండాటలు ఎదో ఓకే మూల జరుగుతూనే ఉంటాయి . పోలీసులు కాదన్నా,ఎంత వద్దనుకున్నా మన సంస్కృతి సాంప్రదాయం అని  నిర్వహిస్తూనే వున్నారు. అదే అంజనేయులికి కలిసొచ్చింది.ఎంఎల్యే  ప్రోద్బలం , ప్రోత్సాహం  ఉండటంతో ,ఈ సారి సంక్రాంతికి కోడిపందాల బరులు , గుండాట టేబుళ్లు అన్నీ గంపగుత్తగా వేలం పాట పాడేసాడు.వాటిని తన ఆధీనం లోకి తీసుకోవటమే కాక ,అక్కడ  '"కాసినో' నిర్వ హించటానికి ఆంజనేయులు  ఏర్పాట్లు చేసాడు.అంటే ఎవరన్నా కోడిపందాలు ఆడాలన్న , గుండాట నిర్వహించాలన్న మనోడికి కప్పం కట్టాల్సిందే నన్న మాట.కొంత మంది కుర్రాలు ఇందుకు ఒప్పుకోకుండా తిరగబడాలని చూసారుగాని ,వాళ్ళవరకు ఒఅ రెండు మూడు బరులు వదిలేసాడు .ఆడుకొమ్మని. దానితో వాళ్ళ నోళ్ళు మూతపడ్డాయి .
'

కాసినో నిర్వహించటానికి థాయ్ లాండు నుంచి ఓ పెద్ద ముఠానే దిగాబడింది.ఆ ముఠా

నాయకుడు రామకోటి తెలుగోడే . కాకపోతే , గోవా, కొచ్చిన్ , చెన్నై లాంటి చాల చోట్ల కాసినోలు , రేవ్ పార్టీలు , కాబరే డాన్సులు నిర్వహిస్తున్నాడని పోలీసులు పట్టుకో పోతే , పారిపో యి థాయ్ లాండు లో తేలాడు .ఈ విషయం మన లులూ గారికి తెలియదు .మరి వాడితో పరిచేయం ఎక్కడ అంటారా?మనోడు తక్కువేమీ కాదు .ప్రతి ఏడాది థాయ్ లాండు వెళుతుంటాడు మసాజ్ కోసం. అక్కడి ఆడవాళ్ళు చేసే థాయ్ మసాజ్ కోసం అందరు ఎగబడుతుంటారు.ఒకానొక మసాజ్ సెంటర్లో మనోడు చేసిన వేద పనికి తనని తగలేస్తే , రామకోటి కాపాడాడు . అది మనోడికి రామకోటి తో పరిచేయం . అప్పటినుండి ఇద్దరు జిగర్ దోస్తులయ్యారు .అసలు మా ఉళ్ళో కాసినో పెట్టాలనే ఆలోచన మన లులూ గారిది కాదు , ఆ దురాలోచన రామ్ కోటిదే .

పండక్కి నాలుగు రోజులు ముందే ఉరి బయట పెద్ద డేరా హాలు వెలిసింది .పైకి అందులో కొత్త సినిమాలు ఆడిస్తున్నాం అని చెప్పుకొచ్చారు కాని , అక్కడ సినిమా టిక్కెట్టు కొంటె ,లోపల కాసినో ఆడటానికి అనుమతిన్చేవాళ్ళు .కాసినో తో పాటు , మందు ,విందు ,పొందు అన్నీ అక్కడ ఏర్పాటు చేసారు .డేరా హాలు బయట మా ఊరి కుర్రాళ్ళు కోడి పందాలు, రికార్డింగ్ డాన్సుల జోరులో మునిగిపోతే, బయటనుంచి వచ్చిన బడా బాబులు మాత్రం లోపల బొంబాయి నుంచి వచ్చిన అమ్మాయిల పొత్తులో ,గోవా నుంచి తెచ్చిన మాదకద్రవ్యాల మత్తు లో, మద్రాసు నుంచిదిగిన మందు బాటిళ్ళ ఛిత్తులో మునిగి పోయారు .ప్రతి రోజు సాయంత్రానికి ఎంఎల్యే అనుచరులు వచ్చి,వాళ్ళ వాటా వాళ్ళు పట్టుకు పోయే వాళ్ళు ,రామకోటి తన వాటా తను తీసుకునే వాడు , మిగిలింది మన లులూ జేబులో వేసుకునేవాడు కాని , చుట్టూ ఉన్న కుర్రాళ్ళకు మాత్రం పైసా ఇచ్చేవాడు కాదు .అదేమంటే ప్రతి రోజు మీరు తిని తాగుతోంది నా డబ్బుతోనే కాదా అని వాళ్ళను బెదిరించేవాడు .

నిజానికి మన లులూ అనుకున్నట్టు పండగ పది రోజులు కదా సాఫీగా జరిగి పోతే మనోడికి పది పదిహేను కోట్ల దాక మిగిలేది .కాని ఎంఎల్యే అంటే పడనిప్రతి పక్షాల వాళ్ళ పేపర్లో మా ఉళ్ళో రేవ్ పార్టీలు జరుగుతున్న ప్రభుత్వం మొద్దు నిద్దర పోతోందని తాటికాయంత అక్షరాలతో ఫ్రంట్ పేజిలో ప్రచురించే సరికి , ప్రభుత్వం లోని పెద్ద తలకాయలు ఉలిక్కి పడ్డాయి . పై పెచ్చు అదే రోజు సోషల్ మీడియాలో మన కాసినో లో జరుగుతున్న బాగోతం అంతా వీడియొ రికార్డు చేసి పోస్టు చేసారు ఎవరో .అది కాస్త వైరల్ అయి పోయి , పోలీసులకు పని చెప్పింది .ఆ వీడియో రికార్డు చేసింది మన లులూ గారి కుర్రాళ్ళే అని తరువాత తెలిసింది . వాళ్ళ వాటా వాళ్లకు ఇవ్వనందుకు
రేవెంజి తీసుకున్నరన్న మాట.

ఒక సుముహూర్తాన పోలిసులు మంది మార్బలం తో పెద్ద ఎత్తున రైడింగ్ చేసారు కాసినో మీద. ఎంఎల్యే తనకేమి స్మబంధం లేదని తప్పించుకోగా, రామకోటి ఈ ఉపద్రవాన్ని ముందే పసికట్టి థాయ్ లాండు కు గుట్టు చప్పుడు కాకుండా చెక్కేసాడు .ఇక మిగిలింది మన లులూ గారు వారి అనుచరగణం .డ్రగ్స్ కేసులో పట్టుబడటం తో కేసు కనుక కోర్టు దాక వెళితే మనోడు తిరిగి అమెరికా వెళ్ళటం సాధ్యం కాదని తేల్చి చెప్పారు లాయర్లు .చేసేదేమీ లేక , లాయర్ల కు , పోలీసులకు కింద నుంచి పై దాక చేతులు తడపటం తో తెలివిగా పోలీసులు మిస్సింగ్ కేసు కింద ఆంజనేయులు పేరుమీద కేసు బుక్ చేసి, మన లులూ గారిని వదిలేసారు . చివరకు మనోడి చేతిలో చిల్లి గవ్వ మిగల్లేదు .చావు తప్పి కన్ను లొట్ట పోయినట్టయ్యింది మనోడి పరిస్థితి .చేసేదేమీ లేక మిస్టర్ లులూ ఉరఫ్ ఆంజనేయులు అమెరికాకు తిరుగు ప్రయాణం కట్టాడు .

(మరో ఎపిసోడుతో మళ్ళి కలుద్దాం )

సీరియల్






జి .నరసింహ మూర్తి;

ఆ మర్నాడు మళ్ళీ కోర్టులో వాదనలు మొదలయ్యాయి... భరద్వాజ మళ్ళీ వాదనలు మొదలు పెట్టాడు.

"యువరానర్! ఈ కేసు విషయంలో ఇంకొక ముఖ్యమైన సాక్షిని ప్రవేశ పెట్టాలనుకుంటున్నాను. కోర్టు వారు దీనికి అనుమతివ్వాలనీ కోరుతున్నాను" అన్నాడు భరద్వాజ.

"అనుమతివ్వబడింది" జడ్జిగారు చెప్పేవారు.

"ఈ కేసు విషయంలో మురళి అనే సాక్షిని ప్రవేశ పెట్టాలను కుంటున్నాను" అన్నాడు భరద్వాజ.

ఐదు నిముషాల తరువాత మురళి అనే వ్యక్తిని బోనులోకి ప్రవేశపెట్టారు. ముప్పై ఏళ్ళ యువకుడు. పొడవుగా, సన్నగా ఉన్నాడు.

"మీ పేరు?"

"మురళి"

"మీరు ఏం చేస్తుంటారు?"

"నేను ఇదే పట్నంలోని అమిత్ పెట్రోల్ బంక్ లో పని చేస్తుంటాను..."

"మే 10న మీరు డ్యూటీలో ఉన్నారా?"

"మే 10వ తారీఖున సాయంత్రం 6 నుంచి మర్నాడు ఉదయం 6 వరకు ఉన్నాను."

"ఇది మీ బిల్లు బుక్ కాపీ... మే 10 తారీఖు అర్ధరాత్రి 3:10 నిముషాలకు మీ బంక్ కి ఏపి 3535 కారుకి 35 లీటర్ల పెట్రోల్ కొట్టినట్లు ఈ రశీదులో ఉంది... సాధారణంగా అర్ధరాత్రి 10 తరువాత పెట్రోలు అమ్మరు. పెట్రోల్ బంక్ ని మూసివేస్తారు. వారి ఆరోజు 3535 కారుకి ఎలా ఇచ్చారు"

"నేను సెకెండ్ షిఫ్టుకి డ్యూటీకి వచ్చినపుడు అర్ధరాత్రి 10 గంటలకు పెట్రోలు అమ్మడం అయిపోతుంది; అప్పుడు నేను అక్కడే పడుకుంటాను. ఆరోజు అంటే మే 10న నేను డ్యూటీ దిగిపోయిన తరువాత అక్కడే షెడ్ కింద పడుకున్నాను... అర్ధరాత్రి 2.30 ప్రాంతంలో ఒక వ్యక్తి వచ్చి తన కారు పెట్రోల్ లేక ఆగిపోయిందనీ, పెట్రోలు కావాలనీ అడిగాడు. నేను 10 గంటల తరువాత పెట్రోలు అమ్మకూడదు... ఓనర్ గారు తిడతారు, అంతకీ అవసరం అయితే ఇక్కడికి దగ్గర్లోని ఇంకో బంక్ లో దొరుకుతుంది అనీ చెబితే అతను మా ఓనరు గారికి ఫోన్ చేసి అతని ద్వారా నాకు పెట్రోల్ ఇవ్వమనీ చెప్పించాడు. మా ఓనరు గారు చెప్పగానే నేను పెట్రోలు కేనులో పోసి అతనితో వెళ్ళి కొద్ది దూరంలో ఆగి ఉన్న కారులో పెట్రోలు పోసి రశీదిచ్చాను..." అనీ చెప్పాడు...

"మురళీ... ఆరోజు పెట్రోలు కోసం వచ్చిన వ్యక్తి ఇక్కడ కూర్చున్న వాళ్ళలో ఉన్నారో లేదో చూసి చెప్పండి" అనీ అడిగాడు భరద్వాజ...
మురళి వెంటనే హాల్లోవైపు చూసాడు...

"సార్... అక్కడ కూర్చున్న వరుణ్ ప్రసాద్ ని చూపించి 'అతనే' ఆరోజు పెట్రోలికి వచ్చాడు" అన్నాడు...

"యువరానర్! ప్లీజ్ నోట్ దిస్ పాయింట్" అన్నాడు.

ఆ వెంటనే మురళి వెళ్ళిపోయాడు. ఆ తరువాత భరద్వాజ జడ్జిగారు వైపు తిరిగి తన వాదనలు మొదలు పెట్టాడు.
"యువరానర్! నేను మొన్ననే చెప్పాను... ఈ కేసుని రెండు భాగాలుగా చూడాలనీ...
మొదటిది నిందితుడు వరుణ్ ప్రసాద్ మామగారు గోపాలరావు హత్య... అతనిది అందరూ సాధారణ మరణం అనుకున్నారు. కానీ అతన్ని పఠాన్, దిలావర్ అనే గేంగ్స్టర్స్ అంటే నేరస్తుల చేత చాలా తెలివిగా వ్యూహం పన్ని ఓ కేసులో వాళ్ళిద్దర్నీ అరెస్ట్ చేయించి లాకప్పులో పెట్టించి మళ్ళీ పోలీసుల సాయంతో వాళ్ళను బయటకు పంపించి గోపాలరావు గారి కారు మీద కాల్పులు జరిపించి చంపించాడు... ఆ రోజు పూర్తి సాక్ష్యాధారాలతో గోపాలరావుని నిందితుడు వరుణ్ ప్రసాద్ ఎలా చంపించిందీ మీకు వినిపించాను. అందులోపల్లవి అనే అమ్మాయి, పోలీసు ఇనార్ఫర్మర్ల సాక్ష్యాలు చాలా ముఖ్యం...
ఆ కేసులో వరుణ్ ప్రసాద్ గోపాలరావుని చంపించాడనీ రుజువులతో సహా కోర్టు వారికి సమర్పించాను. మామగార్ని చంపిన తరువాత వరుణ్ ప్రసాద్ భార్యకి ఇంటెలిజెన్స్ డిపార్ట్మెంట్ నుంచి ఒక నివేదిక ఇచ్చింది. అందులో వరుణ్ ప్రసాద్ యొక్క దురాగతాలు, విచ్చలవిడిగా డబ్బుని ఖర్చుపెడుతున్న వైనాన్ని ఆమెకు రిపోర్ట్ ద్వారా తెలియపర్చారు. ఆ రిపోర్ట్ ని చదివిన తరువాత అనుష్కకి వరుణ్ ప్రసాద్ యొక్క దుర్బుద్ధి అర్థం అయింది. వెంటనే ఆర్థిక శాఖకి చెప్పి అతని ఖర్చుల్ని కట్టడి చేసింది. అతన్ని డైరెక్టర్ పదవి నుంచి తప్పించింది.
దాంతో ఖంగుతున్న వరుణ్ ప్రసాద్ భార్య అనుష్క మీద కక్ష కట్టాడు. ఆమెను చంపాలనుకున్నాడు. వెంటనే దాన్ని అమలు జరపాలనీ నిర్ణయించుకున్నాడు. తనకు తెలిసిన మురళీధర్, శివరాం అనే పోలీసుల సహాయం తీసుకున్నాడు.
మే 10వ తారీఖున ఉదయాన్నే తన కారు ఏపి 3535 లో బయలుదేరి జిల్లా పట్నం వెళ్ళి అక్కడ షెరాటన్ హెూటల్లో రూమ్ తీసుకొని సెమినార్లో పాల్గొన్నాడు. కేవలం తాను ఇంట్లో లేడు అనే ఎలిబీని సృష్టించుకోవడానికే హెూటల్లో దిగాడు. అర్ధరాత్రి 12 గంటలకి మళ్ళీ కారు పార్కింగ్ దగ్గరికి వచ్చి తన కారుని బయటకు తీసి అందులో మళ్ళీ 50 కిలోమీటర్లు ప్రయాణించి తన ఇంటికి చేరుకొని నల్లటి బట్టలు, ముసుగు వేసుకొనీ భార్య అనుష్కను

కర్రతో కొట్టి హత్య చేసి ఆ తరువాత ఆమెను ఫేనుకి వేలాడదీసి బయటకు వచ్చేసాడు. ఆ సమయంలో అతను డ్యూటీలో ఉన్న గూర్ఖా థాపాని గుద్దేసాడు. ఆ తరువాత కార్లో తిరిగి జిల్లా పట్నంలోని షెరటాన్ హెూటల్కి వెళ్ళిపోదామనీ కారు స్టార్ట్ చేయగానే అది కొద్ది దూరం వెళ్ళగానే ట్యాంక్ లో పెట్రోలు ఖాళీ అవడంతో కారు ఆగిపోయింది. అక్కడికి అమిత్ పెట్రోల్ బంక్ అర కిలోమీటరు దూరంలో ఉంది. వెంటనే కారు దిగి నడుచుకుంటూ బంక్ దగ్గరికి వెళ్ళి అక్కడ డ్యూటీలో ఉన్న మురళి అనే కుర్రవాడిని లేపి పెట్రోల్ కేసులో పోయించుకొని కారు దగ్గరికి వచ్చి అతని చేత కార్లో పెట్రోలు పోయించుకొనీ మళ్ళీ కారులో జిల్లా పట్నం వెళ్ళి, షెరటాన్ హెూటల్ పార్కింగ్ లో కారుని పెట్టి మళ్ళీ హెూటల్లోకి వెళ్ళిపోయాడు..."

"ఆ విధంగా ఆ హత్యతో తనకే విధమైన సంబంధం లేదనీ నమ్మించే ఎలిబీని సృష్టించుకుని తెలివిగా పోలీసులను బురిడీ కొట్టించే ప్రయత్నం చేసాడు. కానీ నిజం అంకురం లాంటిది... అందులో మొక్క ఎలా అయితే సూర్యుని వెలుగు చూసి బయటకు వస్తుందో నిజం కూడా అంతే... ఎన్ని ఎత్తులు వేసి ఎన్ని ప్రయత్నాలు చేసినా నిజాన్ని ఎవ్వరూ ఆపలేరు... ఈ కేసులో అదే జరిగింది. ఈ కేసులో సాక్షులందర్నీ ప్రవేశపెట్టి నిజాలను కోర్టు వారికి చెప్పించడం జరిగింది. ఈ కేసులో కీలకమైన సాక్షులు గూర్ఖా థాపా, కారు పార్కింగ్ పరమశివన్, పెట్రోల్ బంక్ మురళీ... వీళ్ళ ముగ్గుర్ని సాక్ష్యులుగా ప్రవేశపెట్టి నిజాన్ని వెలికి తీయడం జరిగింది. ఇందులో ముద్దాయి వరుణ్ ప్రసాద్ చాలా తెలివిగా గోపాలరావు, అనుష్కల హత్యలకు పథకాలు రచించాడు. పోలీసులనే ఏమార్చడానికి ప్రయత్నించాడు. కానీ నిజాన్ని దాచటం ఎవ్వరి తరం కాదు. తన స్త్రీ లోలత్వం, ధనవ్యామోహం... ఈ రెండు అలవాట్లకు బానిసై అమాయకులైన గోపాలరావు గారినీ, కూతుర్ని పొట్టన పెట్టుకున్నాడు. బంగారు బాతు గుడ్ల కోసం బాతునే చంపిన విధంగా అతను ఆ ఇద్దర్నీ చంపేసి బంగారు బాతుగుడ్లకు శాశ్వతంగా దూరమయ్యాడు.

కాబట్టి పయోముఖ వ్యాఘ్రం లాంటి వరుణ్ ప్రసాద్ ని ఈ కేసులో దోషిగా నిర్ధారించి తగు శిక్ష వెయ్యవలసిందిగా కోర్టు వారిని సవినయంగా కోరడమైనది. ఈ కేసుకి సంబంధించిన సాక్ష్యాలన్నీ కోర్టు వారికి అందజేయడమైనది." అంటూ జడ్జిగారికి నమస్కరించి కూర్చున్నాడు భరద్వాజ; జడ్జిగారు లాయర్ అమరేంద్ర జైన్ వైపు తిరిగి "డిఫెన్స్ వారు తమ వాదనలు ఇంకా వినిపించవలసినవి ఉన్నాయా, పూర్తయ్యాయా అనీ అడిగాడు.

"ఉన్నాయి... చాలా వరకు వినిపించవలసినవి ఉన్నాయి. నా స్నేహితుడు భరద్వాజ చాలా తెలివిగా ఒక వ్యూహం ప్రకారం తన కనుకూలమైన సాక్షుల ద్వారా తన వాదనలను వినిపించాడు. అసలు ఈ కేసు ప్రధానంగా అనుష్క అనే స్త్రీమూర్తి హత్య కేసు. పోలీసులు ఆమె భర్తే చేసి ఉంటాడనీ, చేసి ఉండే అవకాశం ఉందనీ భావించి అతన్నే నేరస్తుడిగా భావించి అరెస్ట్ చేసారు. అందుకు అనుగుణంగా ఒక కట్టు కతని వండి వర్చేరు. ఆ కట్టుకథకి అనుకూలంగా కొందరి సాక్షులను మభ్యపెట్టి, భయపెట్టి సాక్ష్యాలు చెప్పించారు. సాక్షులు వచ్చి వ్యక్తిగతంగా కోర్టులో సాక్ష్యాలు చెప్పినంత మాత్రాన జరగనివి జరిగిపోయినట్టు కాదు... ఆ చెప్పిన సాక్షుల నైతికత ఎంత? వాళ్ళు ఎందుకు అలా చెప్పేరు? ఇవాలోచించాలి... సాధారణంగా ఇటువంటి కేసుల్లో పోలీసులు సాక్షులను బెదిరించి తమ కనుగుణంగా సాక్ష్యం చెప్పేటట్లు చేస్తారు. పోలీసులు మాట వినకుండా ఉంటే భవిష్యత్తులో వాళ్ళ బాధలు పడలేక సాక్షులు వాళ్ళు చెప్పమన్నట్లు చెబుతారు. ఈ కేసులో కూడా అలాగే జరిగింది. పల్లవి దగ్గర నుంచి గూర్ఖా థాపా దాకా అందరూ తమ కనుకూలమైన వాళ్ళే... కేవలం వాళ్ళు చెప్పారనీ ఈ కేసులో నా క్లైంట్ వరుణ్ ప్రసాద్ నేరస్తుడు కాజాలడు. సాక్ష్యమంటే శాస్త్రీయంగా ఉండాలి. అప్పుడే వాటికి విశ్వసనీయత, విలువ ఉంటాయి... కానీ ఈ కేసులో నా స్నేహితుడు భరద్వాజ వాటన్నింటికీ తిలోదకాలు ఇచ్చేసినట్లు కనిపిస్తోంది...

ఈ కేసులో అతి ముఖ్యమైనది ఒక ముసుగు వ్యక్తి వచ్చి అనుష్కని

హత్య చేసి వెళ్ళిపోయాడు. ఆ రోజు పోలీసులు నేరస్తుడిగా పేర్కొన్న వరుణ్ ప్రసాద్ ఈ ఊళ్ళో లేడు సరి కదా ఇక్కడికి వంద కిలోమీటర్ల దూరంలోని ఊళ్ళో ఓ పెద్ద పేరున్న హొటల్లో ఉన్నట్లు రుజువులున్నాయి. సాక్ష్యాలున్నాయి. పోలీసులు అతను ముసుగు తీసి లోపల ప్రవేశిస్తున్నట్లుగాని, బయటకు వస్తున్నట్లుగాని ఎక్కడైనా సాక్ష్యాలను చూపించారా? లేదు... ఒక్క సాక్ష్యం, ఒక్క సాక్ష్యం కూడా చూపించలేకపోయారు. కేవలం వ్యక్తుల ద్వారా కథలను వినిపించారు. పోలీసులు ఒప్పించిన సాక్ష్యాలను, వాటి వెనక ఉన్న బలమైన కారణాలను కోర్టువారు పరిశీలించాలి. వ్యక్తులు నిజాలు చెప్పకపోతే భవిష్యత్తులో వాళ్ళకి జరిగే చిత్రవధ ఇంతా అంతా కాదు... దీనివల్ల వాళ్ళ కనుగుణంగా ఏది చెప్పమంటే అది చెబుతారు. కాబట్టి నా విన్నపం ఏమిటంటే పోలీసులు చెప్పించే ఏ సాక్ష్యానికీ సెంటీటీ అంటే పవిత్రత ఉండదు . కేవలం భయం కారణంగానే వ్యక్తులు చెప్పే సాక్షాలను పరిగణలోకి తీసుకొనీ కేసులో ఒక నిర్ణయానికి రాకూడదనీ నా విజ్ఞప్తి. లేకపోతే ఒక నిర్దోషి దోషిగా మారిపోతాడు. శిక్షకు గురౌతాడు... వందమంది దోషులు తప్పించుకోవచ్చు గాని ఒక్క నిర్దోషి కూడా శిక్షకు గురి కాకూడదని న్యాయశాస్త్రం చెబుతోంది; దానికి తప్పుడు సాక్ష్యాలు గండి కొడతాయి. కాబట్టి కోర్టువారు ఆ సాక్ష్యాలను ఎంత వరకు తీసుకోవాలో అంతవరకే తీసుకొనీ తీర్పు చెప్పాలనీ నా విన్నపం... ఇంకో ముఖ్య విషయం... ఈ కేసులో ఒక ముఖ్యమైన సాక్షిని ప్రవేశ పెట్టాలనుకుంటున్నాను. ఈ విషయంలో కోర్టువారు అనుమతివ్వ వలసిందిగా కోరుచున్నాను" అనీ జడ్జిగారి వైపు తిరిగాడు.

"ఓకే... అనుమతివ్వబడింది. ప్రవేశ పెట్టండి" అన్నారు జడ్జిగారు.

పది నిముషాల తరువాత ఒక వ్యక్తిని బోనులోకి ప్రవేశ పెట్టాడు. సుమారు 30 సంవత్సరాలున్న తెల్లటి ఓ యువకుడు. జుట్టు వత్తుగా ఉన్న యువకుడు.
"మీ పేరు?" అని అడిగాడు జైన్.
"నా పేరు రోహిత్'
"ఈ కేసులో మీకేమిటి సంబంధం? ఏం చెప్పాలనుకుంటున్నారు?" జైన్ ప్రశ్నించాడు.

"సార్ ఈ కేసుతో నాకు ముఖ్యమైన సంబంధమే ఉంది. నాకు అర్ధరాత్రి పూట నడిచే అలవాటుంది. దాన్ని డాక్టర్లే నిర్ధారించారు. నాలో స్కిజోఫ్రెనియా లక్షణాలున్నట్లు డాక్టర్లు తేల్చేరు... నాకు తెలియ కుండానే నాలో ఆవేశం కలుగుతుంటుంది. నా తండ్రిని నా తల్లి మోసం చేసి ఇంకో వ్యక్తితో వెళ్ళిపోయింది. దాంతో నా తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. అలా మా కుటుంబం నాశనం అయింది. దీనికి కారణం మా అమ్మ అంటే ఒక స్త్రీ. అప్పట్నుంచీ నాకు స్త్రీలంటే ద్వేషం మొదలైంది. స్త్రీలను నాశనం చెయ్యాలనీ పూనుకున్నాను. అందుకే వాళ్ళని హత్యలు చెయ్యడానికి సిద్ధపడ్డాను. 6 నెలల క్రితం మధూలిక అనే స్త్రీని నేనే హత్య చేయబోయాను . నల్లటి ముసుగు వేసుకొని ఆమెను తాడుతో హత్య చేయబోతే అదృష్టవశాత్తు తప్పించుకుంది.
పోలీసులకు అనుమానం వస్తుందనీ ఆరు నెలలు ఆగి మళ్ళీ హత్యకు పూనుకున్నాను. ఈసారి అనుష్క అనే ఆమె ఇంట్లో ఎవరూ లేరనీ నిర్ధారించుకొన్న తరువాత పాత హత్య లాగే నల్లటి బట్టలు ,ముసుగూ వేసుకొనీ ఆమెను హత్యచేసాను. డబ్బున్న స్త్రీని ఎందుకు హత్యకు ఎన్నుకున్నాను అంటే డబ్బున్న స్త్రీని హత్య చేస్తే ప్రజలందరికీ తెలుస్తుందనీ నా ఆలోచన. అందుకే ఆమెను హత్య చేసాను.

కానీ ఈమధ్యన పేపర్లలో పోలీసులు ఆమె భర్త వరుణ్ ప్రసాద్ ని దోషిగా నిర్ధారించి అరెస్ట్ చేసినట్లు తెలిసింది. అందుకే నేను ఈ రోజు కోర్టుకొచ్చాను. నేను ఈరోజు ఎందుకు వచ్చానంటే ఈ హత్యతో అతనికే సంబంధం లేదనీ చెప్పడానికి వచ్చాను... నావల్ల ఒక నిర్దోషికి శిక్ష పడకూడదు కాబట్టి కోర్టువారు నన్ను శిక్షించవలసిందిగా కోరుచున్నాను" అన్నాడు ఆ వ్యక్తి.
"దట్సాల్ యువరానర్... ఈ కేసులో అసలు ముద్దాయి రోహిత్. అతనే ఈ ఇద్దరి స్త్రీలనూ హత్య చెయ్యడానికి

# క్రైం సీరియల్

ప్రయత్నించాడు. దానికి కారణం కూడా అతను చెప్పాడు. కాబట్టి కోర్టువారు ఇతని సాక్ష్యాన్ని పరిగణించి ఇతన్ని ముద్దాయిగా నిర్ధారించి శిక్షించవలసిందిగా కోరుతున్నాను;.అంతేకాక నా క్లయింట్ వరుణ్ ప్రసాదునీ నిర్దోషిగా భావించి విడుదల చేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను; " అనీ కూర్చున్నాడు జైన్.

"మిస్టర్ భరద్వాజా.. ఈ విషయంలో మీరు చెప్పడానికి ఏమైనా ఉందా?" అని అడిగాడు జడ్జి.

భరద్వాజ లేచి నిలబడి "యువరానర్... మేము ప్రవేశపెట్టిన సాక్షులకు విలువ లేదనీ, కేవలం భయపెట్టి చెప్పించామనీ చెప్పిన నా స్నేహితుడు జైన్ మరి తను ప్రవేశపెట్టిన ఈ సాక్షి చెప్పిన వాఙ్మూలం ఏ విధంగా నిజం అవుతుందో అతనే చెప్పాలి... ఒక వ్యక్తిని తెచ్చి అతన్ని డబ్బుతో ప్రలోభపరిచి తమ కనుకూలంగా చెప్పించే సాక్ష్యాన్ని కోర్టువారు ఎట్టి పరిస్తుతుల్లోనూ పరిగణలోకి తీసుకోవద్దనీ కోరుచున్నాను. కేవలం తన క్లైంట్ ని ఈ కేసు నుంచి తప్పించడానికే ఒక వ్యక్తిని సాక్షిగా తీసుకువచ్చాడు. ఇది కోర్టువారిని తప్పు తోవ పట్టించే ప్రయత్నం; దీన్ని కోర్టువారు గమనించవలసీ తీర్పివ్వ వలసిందిగా ప్రార్థిస్తున్నాను" అనీ కూర్చున్నాడు భరద్వాజ. కోర్టువారు కేసుని మర్నాటికి వాయిదా వేసారు...

మర్నాడు 10 గంటలకి తీర్పు వెలువరించారు జడ్జిగారు...
"ఈ కేసులో ఇరువర్గాల వాదనలు విన్నాము... వాళ్ళు ప్రవేశ పెట్టిన సాక్షుల వాఙ్మూలాలు, డాక్యుమెంటరీ ఎవిడెన్సెస్ అన్నీ కూలంకషంగా పరిశీలించిన పిదప కోర్టువారు ఈ అనుష్క అనే స్త్రీని, గోపాలరావు అనే వ్యక్తిని ముద్దాయి వరుణ్ ప్రసాదే హత్య చేసాడనీ నిర్ధారణకు వచ్చారు; పోలీసుల తరపున వాదనలు వినిపించిన లాయర్ భరద్వాజ ప్రవేశపెట్టిన సాక్ష్యాలు కేసులో చాలా ప్రధాన పాత్ర వహించడమే కాకుండా హత్యలో అతని పాత్రని ఋజువు చేస్తున్నాయి. ఈ విషయంలో అతన్ని కోర్టువారు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు."
కాబట్టి ముద్దాయికి సెక్షన్ 433(బి) ఆఫ్ సీఆర్పీసి మరియు ఐపీసీ సెక్షన్ 55 ప్రకారం వరుణ్ ప్రసాద్ ని నేరస్థుడిగా పరిగణించి ఏవజ్జీవ కారాగార శిక్ష విధిస్తున్నాము. నేరస్తుడికి సహకరించిన పోలీసులను వెంటనే అరెస్ట్ చెయ్యవలసిందిగా కోరుచున్నాము;ఈ కేసులో మిగతా నిందితులను కూడా అరెస్టు చేయవలసిందిగా పోలీసులను కోరుచున్నాము;" అనీ తన తీర్పుని చదివి లోపలికి వెళ్ళిపోయారు జడ్జిగారు.

"కంగ్రాచులేషన్స్ భరద్వాజా! ఈ కేసులో సరియైన ఆధారాలు ప్రవేశపెట్టి ముద్దాయికి శిక్షపడేటట్లు చేసిన మీకు శుభాకాంక్షలు" అన్నాడు రఘువీర్ పూల బొకేని చేతికి అందిస్తూ...

"థాంక్స్" అన్నాడు భరద్వాజ...

ఆ తరువాత అనంతరావు , రమణతో సహా చాలామంది పోలీసులొచ్చి అతన్ని అభినందించడం మొదలు పెట్టారు.
"భరద్వాజా! ఈ కేసులో మా పోలీసులు చెయ్యవలసిన పనిని మీరు చేసారు. అందుకే ఈ కేసుని గెలవగలిగాము; ఈ కేసులో వాదించడానికి లాయరుగా మిమ్మల్ని నియమించడం మా శాఖ తీసుకున్న మంచి నిర్ణయం;తప్పు చేసిన వాడిని యమపాశం వెంటాడుతుందనీ ,దాన్నుంచి వాడు తప్పించుకోలేడనీ,తప్పించుకున్నా న్యాయదేవత వాడిని వెంటాడి మరీ పట్టుకుంటుందనీ న్యాయవాది అయిన మీద్వారా రుజువైంది ;ఈ కేసులో విజయం ద్వారా సత్యమే ఎప్పుడూ గెలుస్తుందనీ మరొక్కసారి ఋజువైంది" అన్నాడు అనంతరావు;

"రఘువీర్... ఎన్ని ప్రయత్నాలు చేసినా దోషులు శిక్ష నుంచి తప్పించు కోలేరనీ ఈ కేసు ద్వారా మరోసారి ఋజువైంది. మధ్యలోనే కేసు నుంచి విరమించుకొనీ పోలీసులవైపు వాదించడం అనేది నేను తీసుకున్న సరైన నిర్ణయం అనీ తేలింది... ఏదైనా చివరకు విజయం సత్యానిదే... అందుకే 'సత్యమేవ జయతే' అన్నారు" అన్నాడు భరద్వాజ.

(సమాప్తం)





సీరియల్

# బాబా ..బాబా ...బ్లాక్ షీప్

గాండివి

## జరిగిన కథ:

సుఖ్ భోగ బాబా అసలు పేరు చంద్ర చంద్ర మోహన్ . చినతనం లోనే తల్లి తండ్రులను కొల్పొవర్తఅమ్ తో , అనాధ ఆశ్రమం లో పెరుగుతాడు . చిన్నతనం నుండే ధ్యానం యోగా వంటివి నేర్చుకుని తనదైనా దారిలో బతకటం నేర్చుకున్నాడు . బాబా తన కూతుళ్ళను కిడ్నాప్ చేసాడని ప్రొ గంగాధర్ ప్రెస్ మీట్ పెడతాడు

ఇక చదవండి

ధ్యాన ముద్రలో ఉన్న బాబా మెల్లగా కళ్ళు తెరిచాడు
ఎదురుగా తన అంతరింగిక శిష్యుడు ఆశ్రమ నిర్వాహకుడు శరత్ మహా పాత్ర నిలబడి ఉన్నాడు
ఏమిటన్నట్లు బాబా కళ్ళతోనే సైగ చేసాడు
"నిన్న ప్రొ గంగాధరం , మనం ఆయన ఇద్దరు కూతుళ్ళను కిడ్నాప్ చేసామని పొలిసు కంప్లెంటు ఇచ్చాడట . ఆయన కంప్లెంట్ ఆధారంగా ఆశ్రమం లో వాళ్ళను వెతకటానికి పోలీసులు వచ్చారు "అంటూ వినయంగా సెలవిచ్చాడు శరత్

" దానికి పోలీసులు ఆశ్రమం అంతా వెతకటం ఎందుకు , ఆశ్రమం లోని ఇతర భక్తుల ఏకంతతను ,ప్రశాంతతను పాడుచేసిన వాళ్లము అవుతాము "

" అదే విషయం చెప్పాను స్వామీ , వాళ్ళు వినటం లేదు , పైనుంచి వత్తిడి అట .."

" సరే రమ్మను .." అంటూ మళ్ళీ కళ్ళు మూసుక్కున్నాడు " బాబా

ఓ అయిదు నిమిషాల తరువాత నలుగురు కనిస్టాబుళ్ళు,ఓ ఎస్ ఐ , ఓ డి ఎస్ పి వచ్చి బాబా ఎదురుగా నిలబడ్డారు

" బాబా దయానం లో ఉన్నారు కూర్చోండి" అంటూ వాళ్లకు అక్కడున్నా సోఫా లు చూపించాడు శరత్

" వాటి వంక చూసి వాళ్ళందరూ ఆశ్చర్య పోయారు . అవన్నీ బంగారపు తాపడం చేసి ఉన్నాయి . స్వామిజి కూర్చున్న సింహాసనం అయితే మొత్తం బంగారం తో చేసినట్టే అనిపిచ్చ్చింది వాళ్లకు

" వాళ్ళ అనుమానం అర్థమయిన శరత్ , స్వామిజి దగ్గర అంతా బంగారమే . బాబా ను నమ్మిన వాళ్ళ జీవితాలు కుడా బంగారమే " నర్మ గర్భంగా అన్నాడు

వాళ్లకు ఏమి అర్థం అయ్యిందో కాని మౌనంగా వాటిలో ముడుచుకుని కూర్చున్నారు

ఈ లోపు వాళ్లకు వేడి వేడి బాదాం పాలు తెప్పించి ఇచ్చాడు శరత్ . వాటిని తాగంగానే ఏదో అయినట్టు అనిపించింది అందరికి .కాని ఏమయ్యిందో మాత్రం అర్థం కాలేదు

ఓ పది నిమిషాల తరువాత బాబా కళ్ళు తెరిచి ," చెప్పండి అన్నారు

పోలీసులకు ఏమి మాట్లాడాలో నోళ్ళు రాలేదు .
శరత్ ముందుకు వచ్చి " అదే స్వామీ ఆ ఇద్దరు అమ్మాయిల గురించి ..' అనిగతు గుర్తు చేసాడు .

" వాళ్ళిద్దరిని వీరి ముందుకు తీసుకు రండి . వాళ్ళు వీళ్ళతో వెళ్లి పోతాము అంటే పంపండి .లేకపోతే వీల్ల ను పంపించి వెయ్యండి " అంటూ మళ్ళీ కళ్ళు మ్సుకున్నాడు బాబా

" అలాగే బాబా " అంటూ అక్కడనుంచి కదిలాడు శరత్ , ఇద్దరు అమ్మాయిలను తీసుకురావతానికి
జరుగుతున్నది ఏమిటో అక్కడున్న పోలీసులకు ఏమి అర్థం కావట్లేదు . అసలు అక్కడకు తాము ఎందుకు వచ్చామో కుడా వాళ్లకు గుర్తుకు రావట్లేదు

ఓ పది నిమిషాల తరువాత , ఇద్దరు అమ్మాయిలతో అక్కడికి వచ్చాడు శరత్

" ఇదిగోండి వీళ్ళే ఆ అమ్మాయిలు , మీరు కావలిసింది అడగండి " అన్నాడు
డిఎస్పి వాళ్ళ వంకా అయోమయంగా చూస్తూ " మీరు ...'
అంటూ గొణిగాడు

" అదే మీ అంతట మీరు వచ్చారా ఆశ్రమానికి , లేదా ఎవరన్నా మిమ్మల్ని కిడ్నాప్ చేసారా అనియా దుగుతున్నారు " అన్నాడు శరత్

" ఆ అవును అవును " గుర్తుకు వచ్చిన వాడిలా అన్నాడు డిఎస్ పి

" లేదు సార్, మమ్మల్ని ఎవ్వరు కిడ్నాప్ చెయ్యలేదు , మేమే జీవితం మీద విరక్తి చెంది బాబా ఆశ్రమానికి వచ్చాము " అంటూ ఒకేసారి బదులిచ్చారు మర బొమ్మల్లా

అక్కడున్న పోలిసుల పరిస్థితి , ఆ అమ్మాయిల పరిస్థితి ఒక్కటిగానే ఉంది

ఎవరికీ వాళ్ళు ఏమి మాట్లాడుతున్నారో , ఏమి వింటున్నారో ఏమి అర్థం కాకుండా ఉంది

"వాళ్ళ అమాధానం విన్నారుగా ఇక .."
అంటూ గుమ్మం వయపు చూపించాడు శరత్
చేసేదేమీ లేక పిచ్చి చూపులు చూస్తూ లేచి నిలబడ్డారు తిరిగి వెళ్ళటానికి (ఇంకా ఉంది )

# జైలుకెళ్లొచ్చిన ఓ కానిస్టేబుల్.. 'భోలే బాబా'



ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్ జిల్లా సికంద్రారావు పట్టణానికి సమీపంలో నిర్వహించిన సత్సంగ్ (ఆధ్యాత్మిక కార్యక్రమం)లో మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న తొక్కిసలాటలో మృతుల సంఖ్య 120 దాటింది. మహిళలు, పిల్లలతో సహా వందలాది మంది ప్రాణాలు క్షణాల్లో గాల్లోకలిసిపోయాయి. ఎటు చూసినా చెల్లా చెదురుగా పడిపోయిన మృతదేహాలతో భయానక వాతావరణం తలపించింది ఘటన అనంతరం భోలేబాబా పరారవడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఈ క్రమంలో అసలెవరీ భోలేబాబా అని ప్రతి ఒక్కరూ ఆరా తీస్తున్నారు. సినిమా స్టోరీని తలపించేలా ఉన్న బోలే బాబా యవ్వారం విన్న ప్రతి ఒక్కరూ ముక్కున వేలేసుకుంటున్నారు. సరిగ్గా 28 ఏళ్ల క్రితం వేధింపుల కేసులో యూపీ పోలీసు శాఖలో లోకల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎల్ఐయూ)లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సూరజ్‌పాల్ జాతవ్ సస్పెండ్ అయ్యాడు. వేధింపుల కేసులో ఆరోపణలు రావడంతో 28 ఏళ్ల కిందట ఆయన సస్పెండ్ అయ్యాడు. తర్వాత సర్వీస్ నుంచి డిస్మిస్ కూడా చేశారు. ఈ కేసులో అతడు జైలు శిక్ష కూడా అనుభవించాడు. అతని స్వస్థలం కసంజ్ జిల్లాలోని పాటియాలీ ప్రాంతంలోని బహదూర్ నగరి అనే గ్రామం. జైలు నుంచి విడుదలైన సూరజ్‌పాల్.. పోలీసు సేవల నుంచి డిస్మిస్ కావడంతో కోర్టును ఆశ్రయించగా మళ్లీ ఉద్యోగం వచ్చింది. కానీ 2002లో స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకున్నాడు. ఉద్యోగం వదిలేసి ఆధ్యాత్మిక చింతనలో కాలం గడిపాడు. పదవీ విరమణ తర్వాత స్వగ్రామం నాగ్లా బహదూర్‌పూర్ చేరుకుని అక్కడే తన డ్రామాకు తెర లేపాడు. తాను భగవంతుడితో మాట్లాడతానని తన గ్రామ ప్రజలకు చెప్పడం మొదలు పెట్టారు. తనకు తాను భోలే బాబాగా ప్రచారం చేసుకోవడం ప్రారంభించారు. అతడి మాయమాటలు నమ్మిన ప్రజలు తండోపతండాలుగా కదలివచ్చేవారు. ప్రతి మంగళవారం వివిధ ప్రాంతాల్లో 'సత్సంగ్' పేరటి పెద్దపెద్ద మతపర సభావేశాలు నిర్వహించేవాడు. ఇటీవల హత్రాస్లో జరిగిన సంఘటనకు సరిగ్గా వారం ముందు మెయిన్‌పురి జిల్లాలో కూడా ఇలాంటి కార్యక్రమాన్నే నిర్వహించాడు. కరోనా మహమ్మరి టైంలో 2022లో భోలే బాబా సమావేశాలకు కేవలం 50 మందిని మాత్రమే హాజరయ్యేలా ప్రభుత్వం అనుమతి ఇస్తే.. ఏకంగా 50 వేల మంది హాజరుకావడంతో అప్పట్లోనే పెద్ద వివాదానికి దారి తీసింది. సూరజ్‌పాల్ అలియాస్ భోలే బాబాకు ముగ్గురు సోదరులలో ఒకరని, అందరిలో పెద్దవాడు. సూరజ్ పాల్ రెండో సోదరుడు మరణించగా, మూడో సోదరుడు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పని చేస్తున్నాడు. భోలే బాబా చాలా అరుదుగా తన ఊరు వెళ్తుంటాడు. సర్కార్ కొలువు వదిలేసి తాను ఇక్కడి దాకా ఎలా ఎదిగాడో తనకే తెలియదని సత్సంగ్‌లలో అనేకమార్లు చెప్పుకునేవాడు. చూస్తుండగానే అతడికి లక్షలాది భక్తులు పుట్టుకొచ్చారు. అలా అనూహ్యంగా కొంతకాలానికే భోలే బాబా నారాయణ్ సాకార్ హరిగా అవతరించాడు. ఇతగాడి ప్రవచనాలకు రాజస్థాన్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర రాష్ట్రాలలో కూడా పిచ్చ ఫాలోయింగ్ ఉంది. కొద్దికాలంలోనే ఆయనకు పెద్ద సంఖ్యలో అనుచరులు పుట్టుకొచ్చారు. ఎక్కడ సమావేశం నిర్వహించినా వేలసంఖ్యలో ప్రజలు వచ్చేవారు.

కొత్త సీరియల్



సీరియల్

# యూనివర్సిటీ

పాంచజన్య

### జరిగిన కధ:

విశ్వ విద్యాలయంలో మెస్ ఫీజు బకాయిలు పేరుకు పోవటం తో , హాస్టళ్ళలో ఫీజు లు కట్టని వాళ్ళను ఖాళీ చేయించాలని తలపోస్తాడు కులపతి . అదే అదనుగా చేసుకుని గొడవలకు పూరి కోల్పుతాదు స్టూడెంట్ లీడర్ రాజేంద్ర

### ఇక చదవండి

" చెప్పు అన్నా ..."వినయంగా అడిగాడు రాజేంద్ర

" అవతలి వైపు నుంచి , ఏమిటిరా మీ కులపతి ఎదో హాస్టళ్ళు ఖాళీ చేయిస్తున్నాడట . మన కుర్రాళ్ళందరూ అక్కడే ఉన్నారు , వాళ్ళకు ఇబ్బంది అవుతుందేమో ?"

" ఆదేమి లేదన్నా అవి రోజు ఉండేయే , మేము ఎంత మందిని చూసాము . మన కుర్రాళ్ళను ఖాళీ చేయిస్తే నేను ఉరుకుంటానా?"

" నోటిసులు ఇచ్చారట కదా ?"

" అవునన్నా

"మరింకెందుకు ఆలస్యం ..."

" ఏమి చెయ్యమంటావ్ అన్నా ?"

" అది కుడా నేనే చెపితే నువ్వెందుకురా అక్కడ" విసుక్కున్నాడు

అవతల వ్యక్తి

" అర్ధమయ్యింది అన్న రేపుచుస్తావు గా ..అన్నట్టు మరి కుర్రాళ్ళకు ఖర్చులకు ..అలాగే సరుకు " అంటూ నసిగాడు

" అన్ని వస్తాయి ... ప్రెస్ వాళ్ళు కుడా వస్తారు ..కాస్త గట్టిగా చెయ్యండి , పోలీసులు వచ్చినా వెనక్కి తగ్గద్దు , తరువాత సంగతి నేను చూసుకుంటా " అంటూ పెట్టెసాడు

ఫోన్ జేబులో పెట్టుకుంటూ ," రేపు రాత్రి మీ అందరికి మందు పార్టీ ఉందిరా " అన్నాడు రాజేంద్రా అక్కడున్న కుర్రాళ్ళ వంక చూస్తూ

" పార్టీ నా ..ఇంత సడన్ గా పార్టి ఏమిటి అన్నా ..ఏమయ్యింది ..ఎవరు నీతో మాట్లాడింది " అంటూ అక్కడున్న వాళ్ళలో కొంత మండియా రధం కాక అడిగారు

" అవన్నీ మీకెందుకు రా ..పార్టి కావాలా వద్దా ?" అన్నాడు రాజేంద్రా

" కావాలి..ఉచితంగా మందు పోస్తాం అంటే ఎవరన్నా వద్దు అనేది " అన్నారు ఇంకొంత మంది

" ఆ మందు పార్టీ ఎవరికీ కావాలి అన్నా .."ఇంకొంతమంది పెదవి విరిచారు

"మీ సంగతి తెలుసులేరా ...సరుకు కుజ్హా వస్తోంది ..తాగానిడ్ ఉగండి " అంటూ అరిచాడు రాజేంద్ర

వాళ్ళ వీక్నెస్సు తెలుసు కాబట్టే రాజేంద్ర వాళ్ళను గొర్రెల్లా తన వెంట తిప్పుకుంటున్నాడు . వీళ్ళే కాదు నేటి సమాజం లో యువత ఎవరో కవి చెప్పినట్లు

కొంత మంది కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్ధులు
, నడిమి తరగతికి చెందినఅవగుణాల కుప్పలు,
ఉత్తమెద్దు రాచ్చిప్పలునూతిలోని కప్పలు, ని
న్నటి లీడరు మోసంనేడు చూడజాలరు,
కన్నులున్న జాత్యంధులు కాకినైన పోలరు

మందుకు , మత్తుకు బానిసలై తం విలువైనా జీవితాల్ని క్షణిక సుఖాల కోసం రాజేంద్ర లాంటి నాయకులకు తాకట్టు పెడుతున్నారు

(ఇంకా ఉంది )

సీరియల్

# రాణాప్రతాప్





డా. పులిచెర్ల సాంబశివరావు

"నాన్నగారు! మనం కోటలు పేటలు అన్నీ వదిలి అరణ్యాలకు వచ్చినా ఆ దుర్మార్గులు మనల్ని వెంటాడి వేధిస్తూనే ఉన్నారు!"

"అది శత్రువుల లక్ష్యం!"

"మన రాజపుత్ర స్త్రీలు కంటబడితే చాలు వారి ఆగడాలకు అంతుండదు!"

"అది తురుష్క సైనికుల లక్షణం!"

"దానికి ప్రతీకారం తీర్చుకోవడానికే వారి స్త్రీలను పట్టుకొచ్చాను! మళ్ళా మనవైపు కన్నెత్తి చూడాలంటే ఒళ్ళు దగ్గరపెట్టుకోవాలని వారికి హెచ్చరికగా ఉండాలని ఈ పని చేశాను!"

"అమరసింహా! ఘోరనేరం చేశావ్!"

"నాన్నగారూ!"

"అవును! ఇది హిందూధర్మ వ్యతిరేకం! మనం కత్తి పట్టుకున్నది ధర్మరక్షణకే గాని, ధర్మభక్షణకు కాదు!"

"మరి... వారు మన స్త్రీలను ఎత్తుకువెళ్ళడం ధర్మమా?"

"కాదు! వాళ్ళు విదేశీయులు! విధర్మీయులు! మనదేశాన్ని దోచుకొని, సర్వస్వాన్నీ నాశనంచేసి, చివరకు మన హిందూధర్మాన్ని కాలరాయడమే వారి లక్ష్యం! ఏ ధర్మాన్నయితే నాశనం చేయాలని వాళ్ళు ప్రయత్నిస్తున్నారో, దాన్ని మనమే ఈవిధంగా మన చేతులతో నాశనం చేయవచ్చా? పరస్త్రీలను కన్నతల్లులవలె చూడటం మన ధర్మం! కన్నతల్లిని ఇలా కట్టి తెస్తావా?"

అమరసింహునికి తానుచేసిన తప్పు ఏమిటో అర్థమైంది.

"నాన్నగారూ! క్షణికావేశంలో తప్పు చేశాను! విజయోత్సాహంతో హిందూధర్మాన్ని విస్మరించాను!"

తండ్రీ కొడుకుల సంభాషణ వింటున్న ఖాన్ జనానా తమ ఏడుపును విడిచిపెట్టి ఆశ్చర్యంతో నోళ్ళు తెరిచారు.

"తల్లుల్లారా! నా కుమారుడు తెలిసీ తెలియనివాడు. అజ్ఞానంతో పొరపాటు చేశాడు. వాడిని మీ కన్నకుమారునిగా భావించి క్షమించండి!" రాణాప్రతాప్ వారికి చేతులు జోడించి నమస్కరించాడు.

"అమరసింహా! మన ఆడపడుచులను అత్తవారింటికి ఏవిధంగా పంపుతామో ఆ విధంగానే వీరిని షేర్పూర్కి పంపించు!"

అమరసింహుడు చీరెలు సారెలతో వారినందరినీ పల్లకీ లెక్కించి, భిల్లులను తోడుగా ఇచ్చి షేర్పూర చేర్చాడు. అంతఃపుర కాంతలందరూ భద్రంగా ఇలా తిరిగిరావటం గాంచి మీర్జా తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు.

"మహారాణాప్రతాపుడు మమ్మల్ని సొంత ఆడపడుచుల్లాగా భావించి సకల మర్యాదలూ చేశాడు. మమ్మల్ని ఇలా తెచ్చినందుకు కన్న కుమారుణ్ణి మందలించాడు. మమ్మల్ని క్షమాపణ వేడాడు! ఇవిగో...! ఈ ఆడపడుచులకిచ్చిన కానుకలు...!"

"... మీరు ఇకపై ఆ అన్నగారిపై దాడికిపోతే మేం సహించం! ఆయన మనుషుల్లో దేవుడు! నిజంగా ఆ మహానుభావుని వంటి సోదరుడే మాకుంటే..." ఖాన్ భార్యలు కన్నులు తుడుచుకున్నారు.

ఖాన్ బిచాణా ఎత్తివేశాడు. సరాసరి ఢిల్లీ చేరాడు. సర్వస్వం అక్బర్ చక్రవర్తికి చెప్పాడు. ప్రతాపునివంటి వ్యక్తి ప్రపంచంలో ఎక్కడా ఉండడని మరీమరీ చెప్పాడు. అంతా 'ఉదారుడు' అని తనని ప్రశంసిస్తుంటే, తన బంధువూ, సేనాపతీ, కత్రీ అయిన మీర్జా తన శత్రువైన మహారాణాని మహోదారుడని పొగుడుతున్నాడు! అతడు చెప్పినది. వింటుంటే, నిజమే అనిపిస్తుంది. తనకు సంపద ఉండవచ్చు, సైన్యం ఉండవచ్చు! కానీ తాను చేసిన పని ఏమిటి? చిత్తోడ్లో వృద్ధులూ, బాలురూ అని చూడకుండా మొత్తాన్ని తెగనరికిన తాను ఉదారుడా? చేతికి చిక్కినవారిని సగౌరవంగా తిరిగి పంపిన ప్రతాపుడు ఉదారుడా? ఎవరు నిజమైన ఉదారుడు?

"ప్రతాప్! నీవు నిజంగా ధన్యుడవయ్యా! శత్రువులచేత ప్రశంసలు పొందిన జీవితమే ధన్యం!!" అక్బర్ ప్రతాప్ ఔదార్యాన్ని లోలోన ప్రశంసించాడు.

మీర్జా ఒక కవిత వ్రాసి ప్రతాప్కి పంపాడు. ప్రతిని అక్బర్ చక్రవర్తికిచ్చాడు.

సైన్యముండదు సంపదుండదు
నాదియన్నది ఏదియుండదు
నాశనమ్మగు లోకమంతా
ఇంద్రజాలమ్మైన వింతా!

లోకమందున ఏమి మిగులును
శాశ్వతమ్ముగ ఏది యుండును
గుర్తులేవియు మిగిలియుండవు
గౌరవమ్మే నిలిచి యుండును!

భోగభాగ్యములెల్ల నొల్లక
అడవులందున ఇడుములంబడి
కొండలందున కోనలందున
భిల్లవీరులె తోడురాగా

జాతిగౌరవ రక్షణమ్మే
జీవితధ్యేయమ్ము కాగా
త్యాగమార్గమె బ్రతుకు బాటగ
వన్నెకెక్కెను ప్రతాపసింహుడు.



## చరిత్రాత్మక సీరియల్

**జరిగిన కథ** అక్బర్ చక్రవర్తి! అశేష సైన్యసమూహాలతో, విశేషాయుధ సంపత్తితో చిత్తోడ్ను కైవసం చేసుకోవడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు! ఈ ఆలోచనలతో సతమతమవుతూ, మనశ్శాంతి కోసం ఉదయసింహుడు రాజధానిని విడిచి అరణ్యమార్గాన అనుచరవర్గంతో ఏకలింగనాథస్వామి సన్నిధికి చేరాడు.అక్కడ 'ఓం నమశ్శివాయ!' అంటూ వినపడింది. ఆ శబ్దం వచ్చిన దిశగా వెతుక్కుంటూ వెళితే ఓ సాధువు కనిపించాడు . 'ఉదయా చిత్తోడ్ వదిలి నేను చుపించాచోట కోట నిర్మంచమని చెపుతాడు . దానికి ఉదయసింహుడి మంత్రులు అది పిచ్చి ఆలోచన అంటారు .కాని ఉదయ సింహుడి కొడుకు మాత్రం తండ్రి ఆజ్ఞ పాటించలంటాడు. అక్బర్ అనుమతితో బైరాంఖాన్ తన కరకు కరవాలంతో హేమూ శిరమును ఒక దెబ్బతో తెగనరికాడు .చిత్తోడ్ అక్బర్ వశంఅయ్యింది . అగ్ర కోటకి ఇరు వైపులా జయమల్, పత్తా విగ్రహాలను నిలిపాడు అక్బర్ .చిత్తోడ్ మొత్తం శ్మశానంలా మారిపోయింది.దానితో దిగులుతో మంచం ఎక్కాడు ఉదయ సింహుడు .చిన్నరాణి తనకొడుకు జగమ్మల్లుడికి పట్టాభిషేకం చెయ్యమంటుంది .మాట ఇచ్చి మరణిస్తాడు ఉదయ సింహుడు. కాని అక్కడి సర్దారులు అందుకు ఒప్పుకోరు . రాణాప్రతపుడికే పట్టం కడతారు .దానితో జగమల్లుడు పగ బడతాడు .రాజ మాన్సింగ్ షోలాపూర్ జయిస్తాడు .మాన్సింగ్ను రాణాప్రత్జాప్ అవమానిస్తాడు . తగిన గుణ పాఠం చెప్పాలని అక్బర్ అనుకుంటాడు .మాన్ సింగ్ ను సర్వ సైన్యా ద్యక్షుడిగా నియమించి రణ ప్రతాప్ మీదకు యుద్దానికి పంపుతాడు అక్బర్ .రాజా రాం తన కొడుకు శాలివాహన్ తో యూద్దనికి వస్తాడు .రాజా జగన్నాధ్ వెన్నుపోటుతో దాందాస్ మరణిస్తాడు రాణాప్రతాప్ రామ్ప్రసాద్ అనే ఏనుగు ను మొఘలుల మీదకు పంపిస్తాడు. దాన్ని వాళ్ళు స్వాధీనం చేసుకుంటారు . ప్రతాప్ మాన్సిన్హ తో తల పడతాడు . మొఘలుల సైన్యం ఎక్కువగా ఉండటం వల్ల ప్రతాప్ కు గాయాలవుతాయి.ఝులా ప్రతాప్ సూర్యద్వాజం తీసుకుని పారిపోతాడు .ప్రతాప్ పరిపోతున్నాడని అతని వెంటపడి అతన్ని హతమారుస్తారు మొఘలులు.గాయపడ్డ ప్రతాప్ ణి అతన్ని గుర్రం చేతక్ దూరంగా రహస్య ప్రదేశానికి తీసుకు వెళుతుంది

**ఇక చదవండి**

ఉత్తరాన్ని పఠించినంతనే ప్రతాపునిలో ఉత్తేజం ఉరుకులెత్తింది. "జై ఏకలింగేశ్వరా!" అని ప్రతాపుని కంఠం పర్వతకందరాల్లో ప్రతిధ్వనించింది.

మేఘగర్జన బోలిన రాణా కంఠధ్వని విని, అరణ్యంలోని నెమళ్ళు ఆనందంతో నాట్యం చేశాయి.

★★★

దేవియర్ యుద్ధంలో రాణాప్రతాపుడు అలవోకగా షాబాజాఖాన్ను వధించి, కోటను స్వాధీనం గావించుకున్నాడు! సూర్యమహల్ దగ్గర మహబత్ఖాన్ను కూలవేశాడు! అచలగఢ్ ఫరీద్ఖాన్ను ఓడించాడు! కుంభల్మియర్కోటలో అబ్దుల్లాను అల్లల్లాడించి వెళ్ళగొట్టాడు! ఓడిపోయి పారిపోయాడనుకున్న ఈ చిచ్చరపిడుగు మళ్ళా ఊడిపడ్డాడు!

ఇప్పటికి ముప్ఫయికోటలు స్వాధీనం గావించుకున్నాడు!

నిండుసభలో అక్బర్ చక్రవర్తి వేదనతో పలికాడు.

"ఆ ముసలిపీనుగు భామాషాహీ దీనికంతటికీ మూలకారణం! చచ్చిన పాముకి ప్రాణంపోశాడు!" కసితో అన్నాడు మాన్సింగ్.

"భామాషాహీ త్యాగం నిరుపమానం!" అబుల్ఫజల్ అబ్బురపడుతూ ప్రశంసించాడు.

అబుల్ఫజల్వైపు కొరకొర చూశాడు.

"భూమిమీద భామాషాహీ కీర్తి కలకాలం నిలుస్తుంది" జైన గురువు హరివిజయ సూరి ఆర్ద్రనేత్రాలతో అన్నాడు.

అక్బర్ ముఖంలో దీనత్వం తాండవమాడింది.

"భామాషాహీ కీర్తిని గూర్చి మనకెందుకు? ఆ ప్రతాప్ను యుద్ధంలో ఓడించాలనే నా చిరకాల వాంఛితం ఈడేరలేదు. అతనిచేత సలాం చేయించుకోవాలనే నా కోరిక తీరనేలేదు! పది హేనులక్షల అశ్వికులమూ, యాభైలక్షల పదాతిబలమూ, పదివేల మత్తేభాలూ, పదివేల ఫిరంగులు కలిగి కూడా ఆ చిన్న మేవాడ్ వీరుణ్ణి ఓడించలేక పోయానక రాజాధిరాజులను గెలిచి అఖండ భరతఖండాన్ని పాలించే పాదుషాను నేను తినటానికి పిడికెడు మెతుకులు గూడా దొరకని నిరుపేద అతడు? ఛీ అతడి చేతిలో మనం ఓడిపోయాం! రాజ్యంలేక, సైన్యంలేక, ధనంలేక అడవులలో ఇడుములు పడుతూ కూడా మనలను నానాయాతనలు పెట్టిన ఆ రాజా నేడు కొంత సొమ్మును సంపాదించి.. కొందరు సైనికులను తోడుతీసుకొని నాపై మరలాయుద్ధం ప్రకటించాడు. మన సైనికులను గొజ్జెలను కోసినట్లుగా కోసివేసి కోటలను తిరిగి స్వాధీనం గావించుకుంటున్నాడు. అసలే అతడు అగ్నికి ఇప్పుడు గాలి తోడయింది. ఇంక ఈ జ్వాలను కార్చడం ఎవరితరం?"

అక్బర్ బాధతో కాసేపు మౌనం వహించాడు.

"... లోకంలో నలుగురూ నన్ను చూచి నవ్వుతారు. నామీద నాకే అసహ్యం కలుగుతోంది!"

మానసింహుడు అక్బర్ స్థితి చూచి కలతచెందాడు.

"షాహిన్షావారు చింతపడవలసి పనిలేదు! ఈ మానసింహుని బొందిలో ప్రాణం.

ఉండగా ప్రతాప్ తప్పించుకుపోలేదు!

గర్వంతో మాన్సింగ్ మీసం మెలివేస్తూ చెప్పాడు.

ఆజ్ఞ ఇవ్వగానే వెళ్ళి రాశ్మీర్ను మీ సామ్రాజ్యంలో కలిపివేశాను. గాంధారాన్నీ, కాబూలును గెలుచుకు వచ్చాను. వంగదేశాన్ని కుంగగొట్టాను! అటువంటి నిర్దిర శౌర్యపరాక్రమాలుగల నాకు ఈ ప్రతాపుడొక లెక్కా?"

సభలో అందరూ మాన్ సింగ్ శౌర్యపరాక్రమాలను గుర్తుకు తెచ్చుకొని తలలూపారు. అక్బర్ మాత్రం చలించలేదు.

"మీరు కోరితే ఆసియాఖండాన్నే మీ పాదాలచెంత నిలపగలను! అటువంటి నాకు ఈ మేవాడ్ ఎంత? ఆ ప్రతాపుడెంత? ఇన్నాళ్ళూ ఏదో పోనిమ్మని వదిలేశాను గాని, నేను వన్నెరచేసి చూస్తే ఈ క్షణంలో రాణా మాడి మసైపోడా?"

మాన్ సింగ్ అహంకారంతో పలికే పలుకులకు సభంతా నివ్వెరపోయింది! అక్బర్ ముఖంలో రంగులు మారాయి.

'కండకావరంతో కన్నుమిన్ను గానక ఎగిరిపడుతున్న ఆ రాణాప్రతాపుని శిరసు బందించి ఢిల్లీ కోటగుమ్మానికి వ్రేలాడదీయకపోతే నా పేరు మానసింహుడే కాదు!""

సభంతా మాన్సింగ్ ప్రతిజ్ఞ విని మాన్పడిపోయింది. అక్బర్ అందరి వదనాలు పరిశీలించి చూశాడు.

"చాలు మాన్ సింగ్ అయింది చాలు ఇన్నాళ్ళూ నీ మాటలు నమ్మి లక్షల సైన్యాన్ని ప్రతాపునికి బలిపెట్టాను. కోటానుకోట్ల ధనాన్ని వ్యర్థంచేశాను. గొప్ప గొప్ప సేవాపకులెందరో ప్రతాపుని బంధించే ప్రయత్నంలో ప్రాణాలు పోగొట్టుకున్నారు! ఇరవై సంవత్సరాల నుంచీ ప్రతాపుని స్మరణతో నాకు కంటినిండా నిద్రకూడా కరువైంది. ఆ ప్రతాపున్ని ఓడించాలనే పట్టుదలతో అడవిలోని పండ్లచెట్లు గూడా కొట్టించి పాపం మూటగట్టుకున్నాను. ఇక !"

మానసింగ్ తలకొట్టేసినంత పనయింది. అవమానభారంతో ఇక అక్కడ ఉండలేక విసవిసా అక్కడినుండి బయటకు వెళ్ళిపోయాడు.

ఇందాకటినుండీ అందరి సంభాషణలూ శ్రద్ధగా వింటున్న మహామంత్రి అబ్దుల్ రహమాన్ గళం విప్పాడు.

"షాహినాప్దారు వెయ్యేండ్లు చల్లగా వర్ధిల్లాలి! నా మాటలకు మీరు కోపింపవలదని ముందుగా ప్రార్థిస్తున్నాను!"

అర్బర్ అంగీకారసూచకంగా తల ఊపాడు.

"ఆ మహారాణా ప్రతాప్ మాతృదేశ
స్వాతంత్ర్యంకోసం సర్వస్వాన్నీ
సమర్పించిన దేశభక్తాగగణ్యుడు!
అట్టి మహావీరుడు
మన మతస్తులలోగానీ,
మిమ్మాశ్రయించుకొన్న
హిందువులలోగానీ ఒక్కడైనా లేడు!
మీకు ధర్మమూర్తులని పేరు! మీవలె
రాణా ప్రతాపుడూ మేవాడ రాజ్యాన్ని
ధర్మయుతంగా పరిపాలిస్తున్నాడు!
అతడు స్వతంత్రంగా ఉంటే
అందులో నేరమేమిటో నాకు
అవగతం కావడంలేదు!"

మహామంత్రి మాటలకు
సభ్యులందరికీ గుండెల్లో
దడపుట్టింది. ఢిల్లీ చక్రవర్తి
ఎట్టఎదుట అతని శత్రువును
ప్రశంసిస్తున్నాడు..

అక్బర్ ముఖంలో వీసమంతయినా
మార్పు కనబడలేదు.

"రాణాప్రతాప్ నిరంతరం
యుద్ధాల్లో మునిగివుండి కూడా
ఏనాడూ స్వధర్మాన్ని వీడలేదు.
తిండిలేకపోతే పస్తులున్నాడేగానీ
స్వాతంత్ర్య కాంక్షను పక్కకు
నెట్టలేదు. అట్టి మహాపురుషుని
సమకాలికులం కావటం మన
పుణ్యవిశేషం! పరమేశ్వరుని
దృష్టిలో అన్ని మతాలు సమానమే!
ఈ సత్యాన్ని తెలుసుకొనలేక
మన పూర్వులు హిందువులపై
ఎన్నో పన్నులు విధించి పీడించి
పాపం మూటగట్టుకున్నారు.
దేవాలయాలను కూల్చి
సర్వాంతర్యామియైన భగవంతుని
ఉనికినే ప్రశ్నించారు! ప్రతాప్
అన్యమతస్థుడని భావించి
కించపరచవద్దు! గుక్కెడు
పాలకోసం పొదుగు కోయవద్దు!"

సభలో కొందరికి ఊపిరి
ఆగిపోయినంత పనైంది.

అక్బర్ ముఖంలో పశ్చాత్తాపం
తొంగిచూసింది.

(ఇంకా ఉంది )



# దేహ దేవాలయం★

కోరాడ అప్పలరాజు

గత కాలపు
నిశీధి నీడలు నిన్ను
తరుముతూనే ఉంటాయ్.!
అలా యోచిస్తూ..కూర్చుంటే
చింత చెద పురుగులా మారి
నిన్ను తొలిచెయ్యక  మానదు...!

రేపటి గురించి దిగులు
నీలో గుబులు పుట్టిస్తుంది.
కాలం కొమ్మపై..
ఎప్పుడు ఏ పిట్ట
వాలుతుందో ఎవరికెరుక..!?

జారిన కాలాన్ని చూసి అదరడం
రాబోయేసమయాన్ని తలచి
బెదరడం అవివేకమే కదా..!

వర్తమానాన్ని ఆస్వాదిస్తూ..
క్షణ క్షణం.. అనుక్షణం
బ్రతుకు నందనవనంలో
ఆనందపు పారిజాతాలని
ఆఘ్రాణించడం ఎలాగో
తెలుసుకో..!

అప్పుడే కదా..
చిత్తం చింతనొదిలి
దేహ దేవాలయం
తళుకులీనుతుంది..!



## సంతోషి దేవి

జీవితం ప్రతి దశలోనూ ఒక అడ్డంకిని సృష్టిస్తుంది. ఆ అడ్డంకిని ఎదుర్కొనే విధానంలోనే విజయమో, అపజయమో ప్రాప్తిస్తుంది. విజయాన్ని సాధించి, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది మూడు పదుల వయసున్న సంతోషి దేవ్ జీవన పోరాటం. హర్యానా వాసి సంతోషి దేవ్ ఒడిశాలోని కొయిడా మైనింగ్ గనుల నుండి ఇనుప ఖనిజాన్ని రవాణా చేసే వోల్వో ట్రక్కు నడుపుతోంది. ఈ రంగంలో పురుషులదే ప్రధాన పాత్ర. మరి సంతోషి మైనింగ్లో ట్రక్కు డ్రైవర్గా ఎలా నియమితురాలైంది?! ముందు ఆమె జీవనం ఎక్కడ మొదలైందో తెలుసుకోవాలి.

పదహారేళ్ల వయసులో సంతోషి దేవ్ని ఒడిశాలోని హడిబంగా పంచాయతీ, బాదముని గ్రామంలోని ఒక వ్యక్తితో వివాహం జరిగింది. ఆ వివాహం ఆమె జీవితాన్ని భయంకరమైన మలుపు తిప్పింది. నిత్యం వరకట్న వేధింపులు, గృహహింసతో బాధాకరంగా రోజులు గడిచేవి. కన్నీటితోనే తన పరిస్థితులను

తట్టుకుంటూ కొన్నాళ్లు గడిపింది. అందుకు కారణం తల్లిదండ్రులకు తొమ్మిదిమంది సంతానంలో తను ఆరవ బిడ్డ.

ఎంతటి కష్టాన్నైనా సహనంతో సర్దుకుపొమ్మని పుట్టింటి నుంచి సలహాలు. కొన్నాళ్లు భరించినా, కఠినమైన ఆ పరిస్థితులకు తల వంచడానికి నిరాకరించి, పోరాడాలనే నిర్ణయించుకుంది. తిరిగి పుట్టింటికి వచ్చింది. కానీ, అక్కున చేర్చుకోవాల్సిన కన్నవారి నుంచి అవమానాల్ని ఎదుర్కొంది. అధైర్యపడకుండా, తన సొంత మార్గాన్ని ఎంచుకోవాలనుకుంది. స్కూల్ వయసులోనే డ్రాపౌట్ స్టూడెంట్. తెలిసినవారి ద్వారా స్పిన్నింగ్ మిల్లులో పని చేయడానికి జీవనోపాధి కోసం తమిళనాడుకు వలస వచ్చింది.

భారీ వాహనాలు నడపడంలో శిక్షణ పొందింది. 2021లో క్యాపిటల్ రీజియన్ అర్బన్ ట్రాన్స్ పోర్ట్ (సీఆరుటి) నిర్వహిస్తున్న సిటీ బస్ సర్వీస్ అయిన 'మో' బస్సు డ్రైవర్గా నియమితురాలైంది. ఒడిశాలో ఒంటరి మహిళా బస్సు డ్రైవర్గా మహిళా సాధికారతని చాటింది. అయితే ఆశ్చర్యకరంగా, ఆమె విజయగాథ అక్కడి నుంచి తొలగింపుతో ఒక్కసారిగా కుదుపుకు లోనైంది. 'తొలి మహిళా బస్సు డ్రైవర్ కావడంతో స్థానిక మీడియా నన్ను హైలైట్ చేసింది.
ఒక నెల తరువాత, అధికారులు నన్ను ఉద్యోగంలో నుంచి తీసేశారు. నా తప్పు ఏమిటో అర్థం కాలేదు. కానీ, మళ్ళీ జీవితం నన్ను పరీక్షించిందని అర్థమైంది. దీంతో బతకడానికి మళ్లీ ఆటో రిక్షా డ్రైవింగ్కు వచ్చేశాను' అని తన జీవిత ప్రస్థానాన్ని వివరించింది సంతోషి. ఆరు నెలల క్రితం ఓ మైనింగ్ కంపెనీ సంతోషి పట్టుదల, ధైర్యాన్ని గుర్తించింది. వోల్వో ట్రక్కును నడపడానికి ఆఫర్ చేసింది. 'ఏ కల కూడా సాధించలేనంత పెద్దది కాదు. ఆరు నెలల నుంచి నెలకు రూ.22,000 జీతం పొందుతున్నాను' అని గర్వంగా చెబుతోంది.

★★★★




Statue of Liberty is deported because of its undocumented status . ఈ జోక్యులర్ కార్టూన్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది . దీని కథా కమామీషు ఏమిటంటే ఈ 305 అడుగుల విగ్రహం అమెరికాలో తయారు చేయబడలేదు . ఫ్రాన్సులో 1875–1884 మధ్యలో ఫ్రాన్సులో తయారుచేయబడింది . అక్కడ నుంచి న్యూయార్కుకు తరలించబడింది . 1886 లో ప్రతిష్టించబడింది .ట్రంప్ రెండవసారి అమెరికా అధ్యక్షుడు అయ్యిన తరువాతా అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండా అమెరికా లో ప్రవేశించిన వారిని నేరస్తులుగా పరిగణించి తిప్పిపంపుతానని వాగ్దానం చేసాడు . అందుకు సంబంధించిన దస్త్రం పై సంతకాలు కుడా చేస్సాడు .ఈ విగ్రహం ప్రతిష్టించి నప్పుడు కుడా  ఎలాంటి డాక్యుమెంట్లు లేవు . ఇప్పుడుఈ విగ్రహం కుడా అక్రం వలసదారుల కోవలోకే వస్తుంది ి కాబట్టి తట్టాబుట్టా సర్దించారన్న మాట . బాగుంది కదా ! జార్జి వాషింగ్టన్ దేశాధినేతలకు  దయ ఉండాలని చెప్పారు .  వాటికన్ బిషప్ కూడా అదే చెప్పారు  . దేశాధినేతలకు దయ లేకపోతే , అధికారం తలకెక్కితే చరిత్ర ఆ తలకు ఎక్కిన మదాన్ని దించుతుంది , అహాన్ని అణచివేస్తుంది . చరిత్ర ఎంత మందిని చూడలేదు ? సాగినంత కాలం తమ అంతటి వారు లేరందరు . సాగకపోతే , ఆ టైం వస్తే చతికిల పడిపోవుదురు . దేశాలను వదిలి పారిపోతారు . నాగుపాముల చేత కాటేపించుకుని సినిమాను క్లోజ్ చేసుకుంటారు . ఇదీ చరిత్ర . ఇదే చరిత్ర .

సీరియల్



# గర్భ శ్లోకం

**ఈదర శ్రీనివాస రెడ్డి**

ఉష కారు కొంత దూరం వెళ్లిన తరువాత, ఉష కారును దారి మళ్ళించింది. తన ఇంటికి కాకుండా, తను చెప్పినట్లు పోనివ్వమని డ్రైవరకు చెప్పింది.

ఇవేవి తెలియని ఎస్.ఇ వివేక్ మాత్రం ఉష కారును వెంబడిస్తూనే వున్నాడు.

కారు మార్కెట వంటి ఓరద్దీ ప్రదేశానికి చేరుకుంది. అక్కడ ఒక షాపు ముందు ఆగింది.

వివేక్ కూడా కొద్ది దూరంలో తన బైక్ను ఆపి, ఏమి జరుగుతుందా అవి చూడ సాగాడు.

కారులో నుంచి ఓ నడివయస్కుడు కిందకి దిగి షాపు లికి వెళ్ళాడు. అతను దిగగానే కారు ముందుకు కదిలింది.

వివేక్ నిశితంగా చుట్టూ చూస్తూ తనూ కారు వెనుకే బయలు దేరాడు.

## జరిగిన కథ

ఓ గుర్తు తెలియని మహిళ , పోలీసులు వెంబడిస్తుంటే తన బిడ్డతో సహా కృష్ణా నదిలోకి దూకుతుంది .ప్రముఖ హీరోయిన్ సుస్మిత హత్యకు గురవుతుంది .డి సి పి శ్రీనివాస రావు కేసు టేక్ అప్ చేస్తాడు .సుస్మితను పెళ్లి చేసుకోమని హీరో నవీన్ బ్లాక్మెయిల్ చేస్తుంటాడు .జూనియర్ ఆర్టిస్ట్ కాంతం తన కూతురు సుస్మితని ఇండస్ట్రిలోపెద్ద స్టార్ని చెయ్యాలని ప్రయత్నిస్తుంది.డి . సి పి మళ్ళి ఒకసారి హత్యా జరిగిన ఇంట్లో వాళ్ళఅందిరిని ప్రశ్నిస్తాడు . ఊరి శివార్లలో ఎవరిదో శవం ఉన్నాడని తెలిసి అక్కడకు వెళతాడు డి .సి .పి.అక్కడ శవం పక్కన పోలీసులు పెట్టుకునే స్టార్ పడి ఉంటుంది. సుస్మితను పెళ్లి చేసుకోవటానికి నవీన్ ఇష్టపడకపోతే సి .ఐ. అంబుజం ఒప్పిస్తాడు. ఎంత ప్రయత్నించినా ఒక్క సాక్ష్యం కుడా సేకరించలేక పోవటంతో సుస్మిత నటించిన సినిమాల్లో పనిచేసిన వాళ్ళను ఇంటరాగేట్చెయ్యాలని నిర్ణయించుకుంటారు. తీరా వాహిని స్టూడియో కి వివేక్ వెళ్లేసరికి డైరెక్టర్ అనిల్ కుమార్ తన కారవాన్ లో చచ్చిపడి ఉంటాడు . డి.సి. పి తన బృందం తో అక్కడి కెళ్ళి దర్యాప్తు చేస్తే అనిల్ ని చంపింది కుడా ఒక ఆడదే అని తెలుస్తుంది.ఉష మీద అనుమానం తో ఆమె ఫోటో తో పోల్చి చూస్తాడు వివేక్ .సుస్మిత వేణు అవుట్ డోర్ షూటింగ్ కి వెళతారు .వాళ్ళతో పాటు రౌడి శంకర్ కుడా వాళ్ళను అనుసరిస్తాడు .సుస్మిత వేణు గుడిలో ఎవ్వరికి తెలియకుండ పెళ్లి చేసుకుంటారు . సరగోసి ద్వారా బిడ్డని కనాలని నిర్ణయించుకుంటారు. సుస్మిత వేణు దగ్గరవుతున్నాడని అతనికి వేరే పెళ్లి చెయ్యాలని ఆలోచిస్తాడు అనిల్ . విషయం తెలిసిన వేణు వేరొక అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు . రౌడి షీటర్ శంకర్ కుడా హత్యకు గురౌతాడు .దానితో భయపడిన సి ఐ అంబుజం నిజాన్ని పోలిసులముందు ఒప్పుకుంటూ జరిగింది చెబుతాడు హంతకురాలు పట్టుబిడిందని పోలీసులు ప్రకటన ఇస్తారు . భార్గవి కో కోసం వల పన్నుతాడు వివేక్ .భార్గవి తప్పించు కోవటం తో ,ఉష కోసం వెంటపడతాడు వివేక్ **ఇక చదవండి**

అసలు ఉష కారు ఎందుకు ఇటు వచ్చింది అనే అనుమానం వచ్చినా, కారులో వున్న ఉష అసిస్టెంట్లును దింపటానికి వచ్చి వుంటుందని సరిపెట్టుకున్నాడు.

ఉష కారు చాలా చోట్ల తిరిగి మళ్ళీ స్టూడియో దగ్గరకే వచ్చిఆగింది .

మధ్యలో ఇద్దరు దిగిపోయారు కాని ఎక్కడా ఉష దిగినట్లు కనపడ లేదు. స్టూడియో దగ్గరకు తిరిగి రావటం తో తాను మోస్ పోయానణి గ్రహించాడు వివేక్.

బైక్ దిగి వెంటనే ఉష కారు దగ్గరకు పరుగు లాంటి నడకతో వెళ్ళాడు.

కారులో ‘ఎవ్వరూ లేకపోవటంతో వివేక్ కోపం కట్టలు తెంచుకుంది . ఆ కోపంలో ఉగిపోతూ ‘కారులోవున్న డ్రైవర్ ణి చొక్కా పట్టకుని బయటకు లాగాడు వివేక్.

వాడు వివేక్ ఉగ్ర రూపం చూసి భయ పడి పోతూ కాళ్ళ మీద పడ్డంత పని చేశాడు

దారిలో ఉష తన అసిస్టెంట్ సహాయంతో తన డ్రెస్ మార్చుకుని జుట్టు ముడి వేసుకుని, మగవాడిలా వేషం వేసుకుని, రద్దీగావున్న చోట అంతగా ఎవరూ గమనించరని మార్కెట్ దగ్గర దిగిపోయింది. ఉష, ఊహించినట్లే వివేక్, ఆమెను కారులో నుంచి దిగటం చూసినా, ఆ రద్దీలో, జన సమూహంలో మగవాడి వేషంలోవున్న ఉషను గుర్తు పట్టు లేక పోయాడు

డ్రైవరు చెప్పిన దంతా విన్న

తరువాత వివేక తాను ఎంత పొరపాటు చేసాడో అర్ధమయ్యిం ది. చేతి దగ్గరకు వచ్చిన చిలుక అంధకుండా పోయిందని ఒక్షణం బాధ పడ్డాడు.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఉష ఇంటి వైపు తన బైకు వేగంగా ముందుకు పోనిచ్చాడు

★★★



మార్కెట్ దగ్గర దిగిన ఉష, వివేక్ వెళ్లి పోయాడని నిర్ధారించుకుని, అక్కడి నుంచి నేరుగా ఆటోలో తన ఇంటికి చేరుకుంది. ఆటో అతన్ని అక్కడే వుండనుని ఇంట్లోకి వెళ్ళింది బట్టలు సర్దుకుని రావటానికి

అప్పటికె భార్గవీ లైట్ బాయ్ సహాయం తో ఉష ఇంటికి చేరుకుని , అక్కడే కొద్ది దూరం లో ఉష రాకకోసం ఎదురు చూస్తోంది.

ఉష ఇంట్లోకి వెళ్ళిందని నిర్ధారణ చేసుకుని.. ఉష ఇంటి వైపు అడుగులు వెయ్యటం ప్రారంభించింది. ఇంతలో ఉష గబగబా బట్టలు తన నగలు, ఇంట్లో వున్నా డబ్బును ఓ బ్యాగులో సర్దుకుని బయట పడింది.

భార్గవి ఉష ను చేరుకునేలోపు, ఉష తను ఇంటికి వచ్చిన ఆటోలో ఎక్కి రైల్వే స్టేషనుకు పోనివ్వమని చెప్పింది.

భార్గవి చూస్తుండగానే ఉష ఎక్కినా అటో వేగంగా వెళ్ళటంతో, భార్గవి కూడా పరుగు లాంటి నడక తో అక్కడికి దగ్గరలో వున్న మరో ఆటి ఎక్కి, ఉష్ ఆటోను అనుసరించ మని చెప్పింది..

ఉష రైల్వేస్టేషన్ దగ్గర ఆటో దిగి నేరుగా స్టేషనులోపలికి వెళ్ళింది.

అప్పటికే ఫ్లాట్ ఫారం మీద అగి ఉంది ఓ రైలు, మరికొద్ది నిమిషాల్లో బయలు చేరుతుందని ఎనౌన్స్ మెంట్ వినపడగానే వెంటన్ ఆ రైలు ఎక్కే సింది ఉష ,ఆరైలు ఎక్కడికి వెళ్తుందో అనే ఆలోచన కూడా చేయకుండా

ఉష ను అనుసరిస్తూ రైల్వే స్టేషనుకు వచ్చిన భార్గవి కూడా, ఉష వెనకాలే స్టేషన్ లోకి వచ్చింది.

అప్పుడే ఉష రైలు ఎక్కటం, రైలు కదలటం భార్గవి కంట బడింది

భార్గవి కూడా ఆలస్యం చేయకుండా తను కదలుతున్న రైలులోకి ఎక్కేసింది

★★★

వివేక్ ఉష ఇంటికి చేఉకునే సరికి బయట తలుపులకు

వేలాడుతున్న తాళం వెక్కిరిస్తూ
కనపడింది .

ఉష బచాన ఎత్తివేసిందని వివేక్
కి అర్ధం అయ్యింది .

చుట్టూ పక్కల వాళ్ళను
విచారించాగా , ఎవరో ఇద్దరు
ఆడవాళ్ళు మాత్రం ఆటోలో
వెళ్ళినట్లు చెప్పారు .

ఇద్దరు ఆడవాళ్ళ , ఎవరై
ఉంటారు ? ఎక్కడికి వెళ్ళారు
?ఆలోచనలో పడ్డాడు .


ఎంత ఆలోచించినా వివేక్ కి తట్ట
లేదు .సిగేరేట్ తీసి వెలిగించాడు
ఆలోచిస్తూ


ఇంతలో ఫోన్ మోగటం తో , తీసి
చూసాడు ,అవతల డి సి పి ..

ఇప్పుడు ఏమి చెప్పాలి ?జరిగింది
చెపితే బండ బూతులు తిడతాడు
అనుకుంటూ ఫోన్ ఎత్తాడు

( ఇన్కా ఉంది )

# డిజిటల్ బానిసత్వం






డా. మణికంఠ M.D

మనిషి గుప్పెట్లో ఇమిడిపోయే చిన్న ఫోన్.. నేడు మనిషిని, ఏకంగా మొత్తం మానవ సమాజాన్నే తన గుప్పెట్లోకి తీసుకుంది. మనిషికి మనిషికి మధ్య సంబంధాలను, అనుబంధాలను తుంచేస్తోంది. చుట్టూ అందరూ ఉన్నా.. తనదైన మైకంతో ఒంటిరిని చేసేస్తోంది. ఆధునిక ప్రపంచపు అద్భుత ఆవిష్కరణగా ముందుకు వచ్చిన మొబైల్, ఇప్పుడు మహమ్మారిలా మనిషిని వెంటాడుతోంది. తాను చెప్పినట్లల్లా ఆడేలా బానిసను చేసుకుంటోం. ఈ రోజుల్లో చాలామంది నిద్ర లేవగానే పడుకునే ముందు స్మార్ట్‌ఫోన్ చూడటం వ్యసనంగా మారింది. మాట్లాడటానికి, డబ్బు లావాదేవీలకు, ప్రయాణాలకు, వినోదానికి, కాలక్షేపానికి ఇలా ప్రతిదానికి సెల్‌ఫోన్‌పై ఆధారపడి ఉంటున్నారు. వృద్ధుల దగ్గర నుంచి పసిపిల్లల వరకు అందరి వేళ్లు ఫోన్‌పైనే ఉంటున్నాయి. ఈ పరికరం సాంకేతికతను దగ్గర చేస్తూనే సైబర్ నేరాలను పెంచేస్తోంది. ముఖ్యంగా చిన్నారులను ప్రమాదంలోకి నెట్టేస్తోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు సర్వేలు సైతం ఇదే అంశాన్ని ఉటంకిస్తున్నాయి.



# నాలుగో కోతి





యువత భవిష్యత్తును నీలి నీడ నాశనం చేస్తోంది. స్మార్ట్ఫోన్ల నుంచి వచ్చే నీటి కాంతులు ఒకవైపు.. అసభ్యకర వీడియోలు మరోవైపు వారి ఆలోచనలను మానసికంగా, శారీరకంగా భ్రష్టు పట్టిస్తున్నాయి. 17–24 ఏళ్ళ మధ్య ఉన్న వారు 40 శాతం మంది. 25–34 మధ్య ఉన్న వారు 1 శాతం మంది అశ్లీల వీడియోలు చూస్తున్నట్లు ఓ సర్వే రిపోర్టు వెల్లడించింది. పరిస్థితిని అవగతం చేసుకోవడానికి ఈ గణాంకాలు సరిపోతాయి. గతంలో మార్కులు, ర్యాంకులు సాధించలేమని ఒత్తిడికి గురయ్యే యువత ఇప్పుడు క్షణకాలం ఫోన్లు ఆగినా, పెద్దలు ఆపేసినా గందరగోళానికి గురవుతున్నట్లు మానసిక నిపుణులు చెబుతున్నారు. సెల్ఫోన్ వాడొద్దని షరతులు విధిస్తే ఆత్మహత్య చేసుకోవడానికి కూడా వెనకాడటం లేదని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు, పిల్లల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉంటేనే పిల్లల్లో మార్పు తీసుకురాగలమని సైకాలజిస్టులు సూచించారు. చిన్నారులు, యువకులే కాకుండా పెద్దవారిని సైతం మొబైల్ ఫోన్ వీడడం లేదు. ఆధ్యాత్మిక కార్యక్రమాలో, భక్తి పాటలో ఏవో ఒకటి. మొబైల్లో చూసుకుంటూ వారూ కాలక్షేపం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోందని చెబుతున్నారు.



మొబైల్ మేనియా నుంచి బయటపడాలంటే స్వీయ నియంత్రణ అనేది చాలా ముఖ్యం. ఎవరైనా అశ్లీల వీడియోలకు అడిక్ట్ అయి ఉంటే వారు మొదటగా ఆ విషయాన్ని తమలో తాము ఒప్పుకోవాలి తమలో వచ్చిన మార్పులను గ్రహించాలి. రోజులో వారు ఎంత సమయం ఎటువంటి యాక్టివిటీస్కు వినియోగిస్తున్నామో పేపరై " రాసుకోవాలి మనం చేయాల్సిన పనిని రద్దు చేసుకుని మరీ సెల్ఫోన్లోనే గడిపేస్తున్నామా? అనేది ఆలోచించాలి. ఇటువంటి ప్రవర్తనతో వచ్చే ప్రతికూల పరిస్థితులను బేరీజు వేసుకోవాలి. ఈ సమయంలో అడిక్షన్ నుంచి బయటపడడానికి మార్గాలు వెతుక్కోవాలి. చాలా వరకు ఒత్తిడితో ఉండే వాళ్ళు, ఖాళీ సమయం ఎక్కువగా ఉన్నవాళ్లు సమయంలో ఇటువంటి విషయాల బారినపడుతుంటారు. ఎందుకంటే అన్నింటిలో కన్నా సెక్స్ అనేది చాలా సంతోషకరమైన ప్రక్రియ ఇలాంటి పరిస్థితుల్లో మొబైల్ డేటా తగ్గించుకోవడం, అశ్లీల యాక్టివిటీ సదుపాయాలను రద్దు చేసుకోవడం చేయాలి. ఇది నెమ్మదిగా జరిగే ప్రక్రియ. ఖాళీ సమయాల్లో తమకు నచ్చిన ఇతర అభిరుచులు సంగీతం, డ్యాన్స్, ఇతరాత్ర పనులపై ఆలోచనలు సాగేలా దృష్టి కేంద్రీకరించాలి. ఇంకా కుదరని పక్షంలో సైకాలజిస్టును సంప్రదిస్తే మంచి ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

సైబర్ బానిసత్వం కారణంగా

# నాలుగో కోతి

పిల్లలకు కలిగే అనర్థాలను బహిరంగపరచాలన్న ఉద్దేశంతో ఓ స్మార్ట్ పేరెంట్ సొల్యూషన్ కంపెనీ ఇటీవల మెట్రో నగరాల్లో వెయ్యి మంది తల్లిదండ్రులను సర్వే చేసింది. ముఖ్యంగా సరిపడా నిద్ర లేకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, సామాజిక అంతరాలు ఏర్పడటం, సరిగ్గా చదవకపోవడం లాంటి అనర్థాలు కలుగుతున్నట్లు గుర్తించింది.

5-16 ఏళ్ల వయసున్న వెయ్యి మంది పిల్లల్లో 60% మంది సైబర్ బానిస మనస్తత్వం అంటే ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బులు పెట్టడం, డిజిటల్ ఎడిక్షన్‌తో బాధపడుతున్నారు. ఆన్‌లైన్ కంటెంట్ వినియోగం నుంచి తమ పిల్లలను ఎలా మాన్పించాలనే అంశంలో 85% మంది తల్లిదండ్రులకు సరైన అవగాహన లేదు. ఈ విషయంలో వారంతా తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు.
70-80% మంది పిల్లల్లో స్క్రీన్ టైం చూడాల్సిన దానికంటే ఎక్కువగా చూస్తున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లు ఆడటంతోపాటు సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ సమయం వృథా చేస్తున్నారు
స్మార్ట్‌ఫోన్లలో 'పేరెంటల్ కంట్రోల్ ఫీచర్' ద్వారా పిల్లల స్క్రీన్‌టైంను నియంత్రించే అవకాశమున్నా 10% మంది తల్లిదండ్రులే దీన్ని ఉపయోగిస్తున్నారు.

డి జిటల్ పరికరాలు, ఆన్‌లైన్ కార్యకలాపాల వినియోగం పెరగడాన్ని సైబర్ వ్యసనంగా అంటారు. దానికి ఇవే సంకేతాలు

ఇది ఆన్‌లైన్ ప్రవర్తనపై నియంత్రణ కోల్పోయేలా చేస్తుంది
జీవితంలోని పలు అంశాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది
ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడుపుతూ వ్యక్తిగత బాధ్యతలను విస్మరించడం
స్మార్ట్‌ఫోన్, ఇంటర్‌నెట్‌లను దూరం చేస్తే చిరాకు పడటం, మొండిగా వ్యవహరించడం
ఇంట్లో వారితో కంటే ఆన్‌లైన్ స్నేహితులతో మాట్లాడటానికి ప్రాధాన్యం ఇవ్వటం
శారీరక ఆరోగ్యంపైనా దీని ప్రభావం
బరువు పెరగడం
శారీరక దృఢత్వాన్ని కోల్పోవడం
నిశ్చల జీవనశైలికి అలవాటయ్యే ప్రమాదముంది.

: పిల్లలు క్రీడలు, వ్యాయామ కార్యకలాపాల్లో పాల్గొనేలా చెయాలి. సామాజిక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యేలా ప్రోత్సహించాలి. చిత్రలేఖనం, పుస్తక పఠనం లాంటి ఆసక్తులను పెంపొందించేందుకు కృషి చేయాలి.

డిజిటల్ పరికరాల నుంచి ఒకేసారి దూరం చేయకుండా క్రమంగా వాటిని వాడకం తగ్గించే విధంగా ప్లాన్ చేయాలి.

కుటుంబసభ్యులతో, స్నేహితులతో తరచూ బయట కలిసి సమయం గడిపేలా చేయాలి. రోజుకు ఎంతసేపు ఫోన్ వాడాలి ప్లాన్ చేసేలా వ్యూహాలను రూపొందించాలి.

★★★★

# పొడిచే పొద్దు

బొప్పెన వెంకటేష్

ఉన్నదాన్ని పంచుకు తిని
పరాకతు పరమయిన (కు)పాలకులు
రాజ్యం పులిమిన కాకి బంగారం ఛాయలో ఒట్టిపోతున్న ప్రజ

ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో
కనీసం ఒక్కడుంటే ఒక్కడైనా ఉంటాడు
వాడే..
పశ్చిమాన్ని పొడిచే పొద్దు..!!

మేము చేతులు జోడించాం
వాడు పిడికిలి బిగించాడు

మేం కాళ్లకు చెప్పులేసుకున్నం
వాడు గజ్జె కట్టుకున్నాడు

మేం గంజి తాగి చల్లబడ్డాం
వాడు గింజను మర్లించిన వాడి పై ఉడుకెత్తాడు

మేం అడుక్కున్నాం
వాడు ప్రశ్నించాడు

మేం చూస్తూ చూస్తూ ఊరుకుండి పోయాం
వాడు ఏదో చేయాలని ఏరు దాటాడు

మేం చిల్లుకానికి చివికిన డప్పు కొట్టాం
వాడు నడి ఒడ్డున దండోరా వేశాడు
ఈ రాజ్యం కూలాలని..!!

జాతినిండా జవసత్వాలు పొరలి
చైతన్య గొంతుక కదం తొక్కింది
మడుగు కట్టిన ప్రభుత్వం మీద

## నెట్టింటి రామాయణం

# "మందుపురాణం "



ఈ. సాయి అలేఖ్య

తాగుతా నీయబ్బ తాగుతా
తాగుబోతు నాయాళ్ళ తల్లో దూరెల్లుతా
తాగని నా కొడుకెందుకు లోకంలో ?
స్వర్గ లోకమగుపడతది మైకంలో

దేవేంద్రుడు తాగాడు రంభతోటి ఆడాడు
బలరాముడు చుక్కేసి బజార్లెంట పడ్డాడు
కాళిదాసు తాగి తాగి కధలెన్నో పాడాడు
తాగినోడికున్నతెలివి చెప్పటాని కెవడికలివి

ఈ పాట ఎవరు రాసారో(కొసరాజు ) కాని , చాల నిజాలు రాసారు . తాగుబోతులను తాగుబోతులంటే ససేమీరా ఒప్పుకోరు . పైపెచ్చు వి ఆర్ ది టాక్స్పేయర్స్ అంటారు . మావల్లే ప్రభుత్వాలు మన గలుగు తున్నాయి అని ఎదురు తిరుగుతారు .

తాగుబోతులకు క్రియేటివిటీ ఎక్కువ. మందు కొడితే బుర్ర పాదరసంలా పని చేస్తుంది.అందుకేనేమో చాలామంది కవులు (పేర్లు ఎందుకు లెండి మళ్ళి వాళ్ళతో గొడవ ) తాగి చాలా గొప్ప కావ్యాలు రాసారు అన్నది నిజం .నాకు తెలిసి ఓ నిర్మాత గారు ఓ మహా కవిని కథ రాయమని అద్వాన్సు , హోటల్ లో రూము , అందులో సరంజామా అంత ఏర్పాటు చేసాడు , నాలుగు రోజుల తరువాత చూద్దురు కదా , గదిలో సరంజామా అంతా అయిపోయింది కాని ఒక్క అక్షరం కుడా కాగితం మీద పెట్టలేదు .సరే తరువాత ఆ నిర్మాత కాళ్ళ వెల్ల పడితే రాసిచ్చారు అనుకోండి .యుద్ధం శాంతి అనే పెద్ద నవలని అనవసరంగా టాల్స్టాయ్ రాసాడు కానీ, ఏ మందు బాబుని అడిగినా నవల సారాంశాన్ని ఒక్క ముక్కలో చెప్పగలడు. వైఫ్ వల్ల యుద్ధం – వైన్స్ వల్ల శాంతి

# నెట్టింటి రామాయణం

నేను లేస్తే మనిషిని కాను , కాని లేవను అన్నట్టు . తాగుబోతులు తాగారో , వాళ్ళని పట్టుకోలేము. ఎంతగా అంటే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్లో బ్రీత్ ఎనలైజర్ ని పోలీసుల నుంచి లాక్కుని పారిపోయే ఐడియా అందుకే వచ్చింది. తాగితే డ్రైవ్ చేసేది మద్యమే తప్ప మనిషి కాదు.

తాగితే మరచిపోగలను
తాగనివ్వదు
మర్చిపోతే తాగగలను
మరువనివ్వదు

తాగితే మరిచిపోగలను అనే కవి హృదయం నిజం కాదు. విస్కీ నరాల్లో కరెంట్లా ప్రవహిస్తే పాతవన్నీ గుర్తుకొస్తాయి. పూలకుండి ఎందుకు తన్నావ్ చెప్పు అని తన్నుకుంటారు. గాయపడితే ఎనస్తీషియా కూడా అవసరం వుండదు.

చిల్లిగవ్వకైన కూడ చెల్లనివాళ్ళు
ఏసుకుంటే పెద్దమనుషులౌతారు
గవర్నమెంటు వాళ్ళు కూడా తాగమన్నారు
డబ్బులోస్తే అదే మాకు చాలునన్నారు
అందుకే తాగుతా నీ యబ్బా తాగుతా

తాగుబోతుల ఆదాయంతో ప్రభుత్వాలు నిలబడతాయని తెలుసు కానీ, వాళ్ల శాపాలతో కూలిపోతాయని మొన్ననే తెలిసింది.నాణ్యమైన మందు సరఫరా చెయ్యలేదని ప్రభుత్వాన్ని పడగొట్టారు . నాణ్యమైన మందు తక్కువ రేటుకు ఇస్తామన్న పార్టీని గెలిపించారు .సరే గెలిచినా తరువాత ఆ పార్టీ కుడా మందు బాబుల మోర ఆలకిన్చినట్లు లేదు , రేట్లు పెంచేసింది .ఇప్పుడు ప్రభుత్వం రేషను బియ్యం ఇంటి ఇంటికి సప్లై చేసినట్లు బెల్టు షాపుల వాళ్ళు ఇంటికే మందు అర్డర్లపై సప్లై చేస్తున్నారట . అయిన మజోన్ ఫ్లిప్ కార్ట్ ఉండగా వేళ్ళతో మనకెందుకు అంటారా మందు బాబులు .
బిహార్ లో కొన్నాళ్ళ పాటు మందును బాన్ చేసారు .మందును పక్క రాష్ట్రాల నుంచి మందు తీసుకొచ్చి దొంగ తనంగా అమ్ముతుంటే పోలీసులు కేసులు పెట్టారు . ఆ కేసులు ఎక్కువగా వస్తుండటం తో కోర్టులు వాటికే తమ సమయం అంతా సరిపోతోంది , మిగిలిన కేసులు చూడలేకపోతున్నాం అని వాపోయాయి.

అసలు మందు బాటిళ్ళ పేర్లు చూస్తే చాల గొప్పగా ఉంటాయి .టీచర్స్ ఛాయస్ , ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్,

డాక్టర్స్ స్పెషల్ ..ఇలా ఈ పేర్లు చూస్తే నిజంగాటీచర్లు ,డాక్టర్లు వంటి వాళ్ళు వాళ్లు తాగుతారు కాబట్టి ఆ పేర్లు పెట్టారేమో అనిపిస్తుంది . మందుతో లాంగ్వేజీ, బాడీ లాంగ్వేజీ రెండూ మారిపోతాయి. కప్పలా గెంతడం, పాములా పాకడం, కుక్కలా మొరగడం అన్నీ ఏకకాలంలో సాధ్యం. ఏబీసీడీలని ఎప్పుడూ చూడకపోయినా అనర్ఘళమైన ఇంగ్లీష్ ప్రవహిస్తుంది. ఆ వాక్యాల్లో వ్యాకరణాన్ని పసిగట్టడం పండితుల వల్ల కూడా కాదు. పురాణాల్లో మందు పురాణం తీరే వేరు .మందు వేసిన మాహానుభావుడు అనర్గళంగా చేసే ఉపన్యాసమే మందు పురాణం .నిజానికి గరుడ పురాణం , స్కాంద పురాణం వంటి పురాణాలు చెప్పే అయ్యవార్లు కుడా అల్లా ఉపన్యసించలేరు . తాగుడు దైవ దత్తం. దేవతలు కూడా సోమరసం సేవించినట్టు పురాణాల్లో వుంది. తాగిన వాళ్లు ఉద్దేశపూర్వకంగానే ఇల్లు మరిచిపోతారు. ఇంట్లో గరుడ పురాణం వేచి వుంటుందని తెలుసు.అందుకనే ఏ అర్ధరాత్రో ఇంటికి చేరతారు మందు బాబులు. విచిత్రం ఏమిటంటే , వందలకు వందలు తగలేసి మందు తాగి , ఓ పది రూపాయల పకోడీ ప్యాకెట్ లేదా హల్వా ప్యాకెట్ ఇంటికి పట్టుకు పోతారు భార్యా పిల్లల మీద ప్రేమ ఉన్నట్టు . పాపం పచ్చి పెళ్ళాం అదే పదివేలు అనుకుని సరిపెట్టుకుంటుంది .

అయ్యవారు అంటే గుర్తుకు వచ్చింది రాజధాని ఢిల్లీ నగరం పాత కోట దగ్గర 'ప్రగతి మైదాన్'కి సమీపంలో ప్రాచీన భైరాన్ బాబా మందిర్ అని ఒక పెద్ద ఆలయం వుంది. ఈ దేవుడికి సారా, బ్రాందీ, విస్కీ విదేశీ స్వదేశీ ఏది అయినా సరే, కేవలం మద్యమే నైవేద్యంగా పెట్టాలి, అదే మొక్కుబడిగా చెల్లించాలి. టెంకాయ కొడితే సగం ఇచ్చి – మిగతాది ఉంచేసుకున్నట్లు సగం వుంచేసుకుని (బాటిల్స్) పూజార్లు మిగతాది కొంత భక్తులకి




ముష్టివాళ్లకి పోస్తారు. శని ఆదివారాల్లో చిన్న చిన్న పిల్లలతో సహా ముష్టివాళ్లు ఎక్కువగా స్త్రీలు బెగ్గర్స్ వేషంలో మందుభారూలు వందల సంఖ్యలో కాగితం గ్లాసులు, చిప్పలు చేత పట్టుకుని ఇంచుమించు క్రిక్కిరిసిపోయి గుడి పరిసరాలను ఆక్రమించుకుంటారు.

అన్ని షాపులకి వైన్స్ అని పేరు వుంటుంది కానీ, నూటికి 99 షాపుల్లో వైన్ దొరకదు. కొంత మంది భక్త వ్యాపారులు దేవుడి పేర్లు పెట్టుకుంటారు. తిరుమల వైన్స్, శివ వైన్స్ ఇలా ఎవరి దేవుడి పేరు వాళ్లు. హైదరాబాద్ మణికొండలో "తాగేసిపో" అనే బార్ వుంది.
కొంత మంది మర్యాదస్తులు( అంటే వీళ్ళు మందు కొట్టి ఏ గొడవ చెయ్యరు , కాంగా వచ్చి పడుకుండి పోతారు ) బారుకు వెళ్లి మందు కొట్ట టానికి సిగ్గుపడుతుంటారు .పోనే మందు బాటిళ్ళు ఇంటికి తీసుకు వెళ్దామా అంటే భార్యామణులు ఉరుకోరు కదా . అందుకని అటువంటి వాళ్ళ కోసం ఈ మధ్యన గ్లుకోజ్ పౌడర్ లా మందు పౌడర్ ను అమ్ముతోంది ఓ మందు ఉత్పత్తి దిగ్గజం .

మందులో వున్నంత పొదుపు, స్పృహ ఇంకెక్కడా వుండదు. ఒక్క చుక్క కూడా వృథా చేయరు. చివరి బిందువుల్ని లక్కీ డ్రాప్స్ అంటారు. బార్లో స్నేహం కూడా బలీయంగా వుంటుంది. ఎప్పుడూ చూడని వాళ్లు మిత్రులవుతారు. విస్కీ సోడాల్లా కష్టసుఖాలు కలబోసుకుంటారు. విడిపోతున్నప్పుడు ఫోన్ నంబర్ల తీసుకుంటారు. తెల్లారి ఆ నంబర్ ఎవరిదో గుర్తు వుండదు. ఒక దర్శకుడు మందు తాగి అనేక మంది కొత్త నటులకి అవకాశం ఇస్తుంటాడు. తెల్లారి ఒక్కరి ఫోన్ కూడా లిఫ్ట్ చేయడు. మందుకి ఆహ్వానించే వాళ్లలో కొందరు కొంగ బావలుంటారు. మనం ఒక పెగ్గు తాగేలోపు సీసా ఖాళీ చేస్తారు. బిర్యానీ తినేస్తారు. మందు తాగని వాన్ని పార్టీకి




పిలిస్తే డేంజర్. కన్ను మూసి తెరిచే లోగా జీడిపప్పు, కబాబులు మాయమై పోతాయి.

మందు వల్ల వేదాంత దృష్టి కూడా అలవడుతుంది. ఈ ప్రపంచం తలకిందులుగా ఎందుకు వుందో అర్థమవుతుంది. జీవితం క్షణికమని సోడా మీద వచ్చే బుడగలు చెబుతాయి. మత్తు వల్ల కళ్లు సగమే కనిపిస్తాయి. దృష్టి కోణం సవరించుకోవచ్చు. గట్టిగా నవ్వడం, లేదా ఏడ్వడం వల్ల సుఖదుఃఖాలు సమానమని గ్రహించవచ్చు. రాత్రి ఓవర్ అయితే తెల్లారి హ్యాంగోవర్. అది తగ్గాలంటే మళ్లీ మందు తాగాలి..అలా రాత్రి పగలు మందు తాగుతూ ఇల్లు ,వాళ్ళు గుల్ల చేసుకుంటున్నారు మన మందు బాబులు .

ఇది ఇలా ఉంటె మద్యం మాన్పించే దేవుడు వెలిసాడు మన రాష్ట్రము లో .. అవును మీరు విన్నది నిజమే..!
ఆ గుడికి ఒక్కసారి వెళ్తే.. తాగుడు మానేస్తారట..! నెలలో రెండు రోజులు ఆ దేవాలయానికి వేల సంఖ్యలో ఎక్కడెక్కడ నుంచో మందుబాబులు క్యూ కడతున్నారట. నంతపురం జిల్లాలో ఆ దేవాలయానికి వెళ్లి మాల వేస్తే చాలు మద్యానికి దూరమవ్వాల్సిందేనట..! ఆంధ్ర పుండరీపురంగా పిలవబడే ఉంతకల్లు పాండురంగ స్వామి దేవాలయం మహత్యం గురించి తెలియని మందుబాబులు ఉండరంటే అతిశయోక్తి కాదు. తాగుడు మాన్పించే దేవుడిగా ఉంతకల్లులో కొలువుదీరిన రుక్మిణి సమేత పాండురంగ స్వామి తాగుబోతుల నుంచి పూజలు అందుకుంటున్నారు. వినడానికి విడ్డూరంగా ఉన్నా... నెలలో రెండు రోజులు పాండురంగ స్వామి దేవాలయం మందుబాబులతో కిటకిటలాడుతుంది. చాలా రాష్ట్రాల్లో మద్యం ద్వారానే రాష్ట్ర ప్రభుత్వాలకు అధిక ఆదాయం వస్తుంది. మరీ అలాంటి టాక్స్ పేయర్స్ అందరూ మద్యం మానేస్తే ప్రభుత్వాలు నడిచేదెట్ల అని చమత్కరిస్తున్నారు పాండురంగ స్వామి గుడి మహత్యం తెలుసుకున్న వారు..!
ఇంకమందు పురాణానికి సెలవ్ , చాల మాట్లాడుకున్నాం మందు గురించి ...


## గోపాల కృష్ణ కార్టూన్ లు

# నవ్వండి ప్లీజ్ !











## శునక దేవాలయం



భారతదేశాన్ని ఆధ్యాత్మికతకు పెట్టింది పేరు అంటారు. ఇక్కడ అనేక పూజా విధానాలు, విగ్రహాలు కనిపిస్తాయి. వాటిలో కొన్ని ఆశ్చర్యపరిచే అసాధారణ ఆలయాలు కూడా ఉన్నాయి. అటువంటి వింత ఆలయాల్లో కర్ణాటకలోని చన్నపట్న శునక దేవాలయం ఒకటి. కర్ణాటక రాష్ట్రంలో చన్నపట్న అనే నగరంలో అగ్రహార వలగెరెహల్లి అనే చిన్న గ్రామం ఉంటుంది. చెక్క బొమ్మలకు ఈ నగరం ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. దీనిని 'బొమ్మల పట్టణం' అని కూడా పిలుస్తారు. బెంగళూరు నగరం నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఈ పట్టణం ఉంటుంది. అయితే చాలా మందికి ఇక్కడ ఉన్న శునక దేవాలయం గురించి తెలియదు. కానీ ఆశ్చర్యకరంగా ఈ దేవాలయం ప్రతి ఏటా ఊహించని రీతిలో అనేక ప్రదేశాల నుంచి టూరిస్టులను ఆకర్షిస్తుంది.

చన్నపట్నలో ఉన్న శునక దేవాలయాన్ని ధనవంతుడైన వ్యాపారవేత్త రమేష్ 2010లో నిర్మించాడు. ఈ గ్రామం యొక్క ప్రధాన దేవత కెంపమ్మ ఆలయాన్ని కూడా ఈయనే నిర్మించాడు. గ్రామస్తుల కధనం ప్రకారం... ఈ గ్రామానికి చెందిన రెండు కుక్కలు రహస్యంగా అదృశ్యం అయ్యాయి. ఈ సంఘటన జరిగిన కొద్ది రోజుల తర్వాత గ్రామ దేవత ఒకరి స్వప్నంలోకి వచ్చింది. గ్రామస్తుల రక్షణ కోసం తన ఆలయానికి దగ్గరగా కనిపించకుండా పోయిన కుక్కల కోసం ఓ ఆలయాన్ని నిర్మించమని కోరింది.

స్వప్నం ఆధారంగా నిర్మించబడిన ఈ ఆలయంలో అదృశ్యమైన రెండు కుక్కలను ప్రతి రోజూ పూజిస్తారు. ఆలయంలో ఆ రెండు శునకాల విగ్రహాలను మీరు చూడవచ్చు. ఇవి నిరంతరం గ్రామస్తులను కాపాడుతూ ప్రతికూల శక్తులను దూరం చేస్తాయని గ్రామస్తులు నమ్ముతారు. ఈ నిరంతరం రక్షణగా నిలుస్తున్న ఈ శునక దేవతల గౌరవార్ధం ప్రతి ఏటా గ్రామంలో భారీ పండుగ కూడా నిర్వహిస్తారు.

మీరు ఆసక్తికర ప్రదేశాలను సందర్శించడం ఇష్టపడేవారైతే మీరు ఈ పట్టణాన్ని తప్పక సందర్శించాలి. చన్నపట్న రంగురంగుల లక్క, చెక్క బొమ్మల ఉత్పత్తికి బాగా ప్రాచుర్యం పొందింది. ఈ ప్రత్యేకతే చన్నపట్నకు 'బొమ్మల పట్టణం'గా ప్రాముఖ్యత తెచ్చిపెట్టింది. వీటిని సందర్శించేందుకు ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. ఈ బొమ్మలు ఖచ్చితంగా ఓ అద్భుతమైన అనుభూతిని మీకందిస్తాయి. ఈ పట్టణానికి సమీపంలో కన్వా సరస్సు, ఆంజనేయ ఆలయం వంటి ఇతర ఆకర్షణలు కూడా పర్యాటకులు సందర్శించవచ్చు.

చెన్నపట్న శునక దేవాలయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఏడాది పొడవునా పర్యాటకులు సందర్శిస్తుంటారు. ముఖ్యంగా సెప్టెంబర్, మార్చి నెలల మధ్య టూరిస్టులు తరచుగా ఇక్కడికి వస్తుంటారు. ఈ సమయంలో ఇక్కడి వాతావరణ పరిస్థితులు చుట్టుపక్కల ప్రాంతాల సందర్శనకు కూడా అనువుగా ఉంటాయి.

ఇక్కడికి సమీప విమానాశ్రయం బెంగళూరులో ఉంది. చెన్నపట్నం నుంచి ఇక్కడ సుమారు 100 కిలోమీటర్ల దూరం. బెంగళూరుకు చేరుకున్న తరువాత చన్నపట్నకు నేరుగా బస్సు లేదా క్యాబ్ రవాణా ద్వారా చేరుకోవచ్చు. చన్నపట్న పట్టణం నుంచి 15 కిలోమీటర్ల దూరంలో అగ్రహార వలెగెరెహల్లి



అనే చిన్న గ్రామంలో ఈ ఆలయం ఉంటుంది.

బెంగళూరు నుంచి చన్నపట్న రైలు మార్గం ద్వారా చక్కగా అనుసంధానించబడి ఉంది. బెంగళూరు రైల్వే స్టేషన్ నుంచి చన్నపట్నకు నేరుగా రైళ్లు ఉంటాయి. సుమారు 1 గంట సమయంలో మీరు చన్నపట్న సులభంగా చేరిపోవచ్చు. అక్కడి నుంచి శునక దేవాలయానికి ఆటో, ట్యాక్సీ రవాణా సదుపాయాలు ఉంటాయి.

★★★★

కథ

# "స్వర్ణకంకణం"

కోటమర్తి రాధా హిమబిందు

హైదరాబాద్ వెళ్లేందుకు అరగంట నుండి బస్సు కోసం ఎదురుచూస్తున్న నరేంద్ర మరోసారి టైం చూసుకున్నాడు. అనుకున్న సమయానికి హైదరాబాద్ చేరుకుంటానా లేదా అనే భయం పట్టుకోవడంతో బస్టాండ్ దాటి రోడ్డు మీదకి వచ్చాడు. కాసేపు అటు ఇటు చూస్తూ నిలబడ్డాడు. దూరంగా కారు వస్తుంటే ఆపమని సైగచేసాడు. కారు ఆగకుండా వెళ్ళిపోయింది. అలాగే చాలా సేపు ప్రయత్నించగా ఒక కారు ఆగింది. కిటికీ అద్దం క్రిందికి జరుపుతూ "ఎక్కడికి వెళ్లాలి?" అని అడుగుతున్న వ్యక్తికి "హైదరాబాద్.. నాంపల్లిలో దిగుతాను" చెప్పాడు నరేంద్ర. ఎక్కమన్నట్లు సైగ చేసాడు అతను. నరేంద్ర కారులో కూర్చుంటూ "థాంక్యూ వెరీ మచ్ సార్" అన్నాడు. కాసేపటికి "జాబ్ చేస్తున్నావా?" అడిగాడు అతను. "జాబ్ అంటూ ఏమీ లేదు సార్..ఏవో చిన్న చిన్న పనులు చేస్తుంటాను..నాన్నగారు అప్పట్లో హరికథలు చెప్పేవారు ఆ తర్వాత ప్రైవేట్ కంపెనీలో పనిచేసారు..ఇప్పుడు ఆరోగ్యం అంతగా బాగాలేదు. ఇంట్లోనే ఉంటున్నారు. అమ్మ గృహిణి అన్నయ్య పేరు సురేంద్ర.. నేనే చదివించాను" అతను అడిగిన ఒక్క ప్రశ్నకు ఇన్ని సమాధానం చెప్పాడు నరేంద్ర.

"అదేంటి? అన్న తమ్ముడిని చదివించాలి కదా.. తమ్ముడు అన్నను చదివించటం ఏంటి?"

"మా ఇంటి పరిస్థితులు అలా వున్నాయి.. సార్.. మీరు మరోలా అనుకోకపోతే మీ గురించి తెలుసుకోవచ్చా?" "వైనాట్..ష్యూర్..నా పేరు వేణుగోపాలచారి.. నేను బిజినెస్ చేస్తుంటాను.. మనం ఇంకో రెండుగంటలు కలిసి ప్రయాణం చేయాలి.. ఇలా మౌనంగా కూర్చోవడం ఎందుకని అడిగాను.. నీకు ఏ మాత్రం అభ్యంతరం ఉన్నా చెప్పకు" "అయ్యో.. ఇందులో అభ్యంతరం ఏముంటుంది సార్.. మీరు మీ కారులో ఎక్కమన్నారు. అప్పుడే తెలిసింది మీరు ఎంత మంచి వ్యక్తో.. మాది పేద కుటుంబం.. మా తాతగారు కూడా హరికథలు చెప్పేవారట. అప్పట్లో తాతగారిని ఎంతోమంది చాలా గౌరవించేవారట.. వాళ్ల వాళ్ల ఊర్లకు పిలిపించుకొని హరికథలు చెప్పించుకునేవారట. సన్మానాలు సత్కారాలు జరిపేవారట.. ఒకసారి ముఖ్యులంతా కలిసి పెద్ద వేడుక జరిపి చేతికి బంగారు కంకణం తొడిగారట. తాతగారు పోయిన తర్వాత వంశపారంపర్యంగా ఆస్తి వచ్చినట్లు ఆ కంకణం నాన్నగారి సొంతమైంది..నేను అతి కష్టం మీద పదవతరగతి గట్టెక్కాను. ఓ రాత్రి ఒక కొత్త ఆలోచన చేశాను. తెల్లవారి రోడ్డుమీద ఒక ప్రక్కగా సుద్దముక్కతో ఆంజనేయ స్వామి బొమ్మవేశాను. అటు ఇటు వెళ్లే వాళ్ళు నా బొమ్మను చూసి నన్నుపొగుడుతూ బొమ్మ మీద చిల్లర నాణాలు వేశారు. మొట్టమొదటి సంపాదనతో ఉక్కిరిబిక్కిరయ్యాను. ఇంటికి వెళ్లి మా వాళ్ళతో మాట్లాడాను. నాకు చదువుకోవాలని లేదు. మీరు అన్నయ్యను చదివించడానికే ఎంతో కష్టపడుతున్నారు. అన్నయ్యను చదివించడంలో మీకు తోడుగా నేను ఉంటాను. నాకు బొమ్మలు వేయడం వచ్చు.. మీకు తెలవకుండా రోడ్డుమీద బొమ్మవేసి ఈ డబ్బు సంపాదించాను" అంటూ నాన్నగారి దోసిట్లో డబ్బు పోసాను. ముగ్గురూ శిలావిగ్రహాల్లా అయిపోయారు. నాన్నగారు నన్ను అక్కున చేర్చుకొని ఏడ్చారు. "హరికథలు చెప్పి కంకణం తొడిగించుకున్నాం.. అలాంటిది ఈరోజున నువ్వు ఇలా..."

"అప్పట్లో తాతగారు.. మీరు మీ దగ్గర ఉన్న కళతో చాలా రాణించారు.. ఆ తర్వాత మీ పరిస్థితి మనకు తెలిసిందే.. ఇది నా దగ్గర ఉన్న కళ.. చూద్దాం.. నేను నెగ్గుతానేమో? పూలు అమ్మిన చోట కట్టెలు అమ్ముకోవటమా? అని అనుకోకండి కట్టెలు కూడా అవసరమే..ఉపయోగమే" అన్నాను నేను. కొన్ని నెలలు గడిచాయి. నేను ఇంకో కొత్త ఆలోచన చేశాను. ఆంజనేయస్వామి వేషం ధరించి మొదటిసారి ఏకపాత్రాభినయం స్టేజి ప్రదర్శన ఇచ్చాను. అంతా మెచ్చారు. మరోసారి వినాయకుడు ఇంకోసారి అమ్మవారి వేషంకట్టి మార్పులు చేస్తూ ప్రదర్శనలు ఇచ్చాను. చాలా కొద్ది కాలానికే మంచి గుర్తింపు వచ్చింది. వినాయక చవితి ఉత్సవాల్లో దసరా నవరాత్రుల ఉత్సవాల్లో నా ప్రోగ్రాం కంపల్సరీ అయింది. చుట్టుపక్కల ఊళ్లు కాకుండా వేరే ప్రాంతాలనుంచి కూడా ఇంటికి వచ్చి నన్ను కలిసి ప్రోగ్రాంని ఫిక్స్ చేసుకొని అడ్వాన్స్ ఇవ్వసాగారు. ప్రోగ్రాంకి అనుకున్నంత కాకుండా ఇంకా ఎక్కువ అమౌంట్ ఇస్తుంటే చాలా సంతోష పడిపోయాను. నా సంపాదనతో ఇంట్లో ఒకప్పటిలా ఆనందం నిలిచింది. నాకు చిరు సన్మానాలు సత్కారాలు చేశారు. అన్నయ్య చదువు అయిపోయింది. ఇప్పుడు అన్నయ్య మంచి కంపెనీలో ఉద్యోగం కూడా చేస్తున్నాడు"

★★★★★

"మీ ఇంటికథ బాగుంది నరేంద్ర.. మన మాటల్లో నీ గమ్యం నాంపల్లి వచ్చింది" అంటూ నవ్వాడు వేణుగోపాలచారి. "థాంక్యూ సార్.. థాంక్యూ వెరీ వెరీ మచ్" అంటూ అతనికి నమస్కరించి డ్రైవర్ కి థాంక్స్ చెప్పి కారు దిగి ముందుకు నడిచాడు. మొదటిసారి రవీంద్రభారతి రావటం. గేటులోనే సెల్ఫీ తీసుకొని మనసు మురిసిపోగా మెట్లు ఎక్కాడు. "ముందు రెండు వరుసలు అవార్డు తీసుకునే వారికి కేటాయించాం.. సీటు మీద అవార్డు గ్రహీతల పేరు కూడా ఉంది దయచేసి మిగతావారు వెనక్కువెళ్ళాలి ప్లీజ్" అంటూ మైక్ లో మాటలు వినిపిస్తుంటే కలలో నడిచినట్లు నడిచి తనకు కేటాయించిన సీటు చూసుకుని కూర్చున్నాడు నరేంద్ర. అతనిలో ఆనందం పొంగిపొర్లింది. "హలో"

నరేంద్ర వెనక్కు తిరిగాడు. వేణుగోపాలచారి..”సార్” నమ్మశక్యం కాలేదు నరేంద్రకు. ఒక్క ఉదుటున లేచి నిలబడ్డాడు. అతను లేచి వచ్చి నరేంద్రను కూర్చోబెట్టి ప్రక్కన కూర్చున్నాడు. అయోమయంగా చూశాడు నరేం ద్ర

“నా చిన్ననాటి స్నేహితుడు పేరయ్యశాస్త్రి గారికి లైఫ్ టైం ఎచ్యూమెంట్ అవార్డ్ ఇస్తున్నారు.. అందుకే వచ్చాను” “అవునాసార్.. హరికథా పితామహుడు” నరేంద్ర కళ్ళు మెరిసాయి. “అవును.. వారే..నువ్వు నాంపల్లి అన్నావు.. రవీంద్రభారతి అని చెప్పలేదేంటి? మీ నాన్నగారిని తీసుకొస్తే బాగుండేది. నువ్వు అవార్డ్ తీసుకోవటం చూసేవారు కదా మరేం ఫర్వాలేదులే..శాస్త్రి గారిని నీకు పరిచయం చేస్తాను. నీకు కుదిరినప్పుడు నాన్నగారిని వారికి పరిచయం చేయి” ఆప్యాయంగా నరేంద్ర భుజం తట్టి వెనక్కు వెళ్లాడు వేణుగోపాలచారి. మూడు గంటలసేపుi సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆ తర్వాత వివిధరంగాల్లో అవార్డులు తీసుకుంటున్న ఇరవైరెండుమందికి ప్రముఖుల చేత సన్మాన కార్యక్రమాలు అనే అనౌన్స్ మెంట్ వినపడింది. ఒక్కొక్కరిని పరిచయం చేస్తూ వేదిక మీదికి ఆహ్వానిస్తూ వాళ్ళకు శాలువాకప్పి అవార్డు ఇస్తూ క్యాష్ప్రైజ్.. సర్టిఫికెట్ ఇస్తుంటే నరేంద్ర కళ్ళనిండా కన్నీళ్లు వచ్చాయి అతనికి తల్లి తండ్రి అన్నయ్య గుర్తుకొచ్చారు. నరేంద్ర పేరు పిలిచారు. నరేంద్ర వెనక్కువెళ్ళి వేణుగోపాలచారి పాదాలకు నమస్కరించాడు వేణుగోపాలచారి విస్తుపోతూ నరేంద్రను ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు. నరేంద్ర కళ్ళు తుడుచుకొని మెట్లు ఎక్కి వేదిక మీదికి వెళ్లబోతుంటే అక్కడ తండ్రి నిలబడి ఉండటం చూసి నిర్ఘాంతపోయాడు. “నువ్వు వచ్చిన తర్వాత నాకు బాగా రావాలనిపించిందిరా.. బస్టాండుకు వచ్చి చూసాను.. నువ్వు కనపడలేదు. బస్సు వచ్చింది. ఎక్కి వచ్చాను. ఇది తెచ్చానురా” అంటూ గులాబీరంగుకాగితంలో చుట్టిన కంకణం చూపించాడు. “నాన్నగారూ” విస్తుపోయాడు నరేంద్ర. “ఇంతకన్నామంచి వేదిక దొరికే అదృష్టం ఎప్పుడు వస్తుందో ఏమో? ఇదో మంచి అవకాశం.. నీకు ఇస్తానురా” “నరేంద్రగారూ త్వరగా రావాలి” అంటూ మైకులో పిలిచారు. చకచక వెళ్లి సభ్యత కాదని తెలిసినా యాంకర్ చేతినుండి మైక్ తీసుకొని ఆమెకు సారీ చెప్పి తన గురించి తండ్రి గురించి చాలా క్లుప్తంగా వివరణ ఇచ్చి తండ్రి వచ్చిన విషయం చెప్పాడు. అంతే.. చప్పట్లు మారుమ్రోగాయి. వేదిక మీద ఉన్న ప్రముఖులు యాంకర్ తో ఏదో చెప్పారు. ఆమె సోమయాజులుగారిని తన మాటల చాతుర్యంతో ఆహ్వానించింది. అలాగే పేరయ్యశాస్త్రి గారిని కూడా ఆహ్వానించింది. అందరి కరతాళధ్వనుల మధ్య తండ్రి కొడుక్కి కంకణం తొడిగాడు. ప్రేక్షకులంతా లేచి మళ్ళీ చప్పట్లు కొట్టారు. కొడుకు తండ్రిని కౌగలించుకొని కన్నీళ్లు కార్చాడు. పేరయ్యశాస్త్రిగారి చేత శాలువా కప్పించి ప్రముఖుల చేత పూలదండ వేయించి అవార్డు సర్టిఫికేట్ క్యాష్ ప్రైజ్ ఇప్పించారు నిర్వాహకులు. క్రిందికి వచ్చిన నరేంద్రకు ఎదురెళ్లి ఆత్మీయంగా దగ్గరికి తీసుకున్నాడు వేణుగోపాలచారి. తండ్రిని వేణుగోపాలచారికి పరిచయం చేశాడు నరేంద్ర. పేరయ్యశాస్త్రి వచ్చాడు. “ఓకే..నిన్ను దింపి నేను వెళ్తాను” అంటూ పేరయ్యశాస్త్రికి చేయికలిపి “మీ ఇద్దరూ నా కారులోరండి.. మధ్యలోనే కదా నేను దింపుతాను.. నరేంద్రా.. నీ నంబర్ ఇవ్వు మా దగ్గరకూడా నీ ప్రోగ్రామ్స్ పెట్టిస్తాను” అన్నాడు. “థాంక్స్ సర్” చేతులు జోడిస్తూ నంబర్ ఇచ్చాడు నరేంద్ర. నలుగురూ ముందుకు నడిచారు. గేటు ముందు కారు సిద్ధంగా వుంది. వేణుగోపాలాచారి ముందు సీట్లో కూర్చున్నాడు. పేరయ్యశాస్త్రి గారి చేతుల్లో ఉన్నట్లు నరేంద్ర చేతుల్లో ఉన్న పూలదండ అవార్డు సర్టిఫికేట్ ను ఆశ్చర్యపోయి చూస్తూ “రండి సార్” అంటూ డోర్ తెరిచాడు డ్రైవర్.

★★★★★ సమాప్తం

కథ

# " చీర మడతల్లో

కర్లపాలెం హనుమంతరావు

. డెమాన్ స్ట్రేషన్ క్లాస్ జరుగుతుంది. బెస్ట్ గ్రేడ్ స్టూడెంట్స్ తో కలసి కూర్చుని ఆ అభ్యర్థి పాఠం చెప్పే తీరు పరీక్షిస్తున్నా.
మా 'విజేత బ్రిలియంట్ స్కూల్ ' మేథ్స్ టీచర్ రాగిణి, మేరేజ్ కారణంగా వెకేట్ చేసిన జాబ్ కోసం ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి.
అటెండయిన డజను మందిలో ప్రాథమిక అర్హతలు సాధించిన ఆరుగురులోని మూడో అభ్యర్థి ఇచ్చే డెమోన్ స్ట్రేషన్ క్లాస్ నడుస్తుండగా .. అటెండర్ పిచ్చయ్యొచ్చి డిస్టర్బ్ చేశాడు నాలుగోసారి.
వచ్చిన ప్రతిసారీ చేసే అభ్యర్థనే అది . ఆఖరి అభ్యర్థి ఎవరో ఆడమనిషట.. వెంటనే ఇంటర్వ్యూ చేసి పంపించెయ్యమని పిచ్చయ్య ద్వారా స్పెషల్ రిక్వెస్ట్ .
ఎప్పట్లానే 'నో' చెప్పా చిరాగ్గా. అవుటాఫ్ టర్న్ ఇంటర్వ్యూ చేసి 'పార్షియాలిటీ' ముద్ర వేయించుకోవడమెందుకని నా ఆలోచన.

ఈమూడో అభ్యర్థి ఇంటర్వ్యూ కూడా కానించి టీ బ్రేక్ కోసం పక్కకెళ్ళా .

ఎప్పుడొచ్చాడో వెనక నుంచి పిచ్చయ్య.. 'పాపం .. ఆడకూతురు సార్ ! ఎక్కడో కుషాయిగూడా నుంచి వచ్చిందంట! చివరి దాకా ఆగితే చాలా ఇబ్బంది అవుతుందని ఒహటే గోల' అంటూ ఎంట్రెన్స్ గేట్ వైపు చూపించాడు.

క్రీమ్ కలర్ బనారస్ చీరెలో శుభ్రంగా ఉన్న లేడీ కనిపించింది. పాపం.. అనిపించింది. కాని, 'కుదరదండీ!' అని చెప్పక తప్పింది కాదు .

ఏం చేయాలి మరి? రూల్సుకి విరుద్ధంగా పోతే ముందు నా జాబ్ కే ముప్పు.

ఒక డెమోన్ స్ట్రేషన్ క్లాసు .. ఆనక వివా వాయిస్ టెస్ట్ .. వెరసి గంట పడుతుంది ఒక్కో ఇంటర్వ్యూ పూర్తవటానికి . మూడు ఇంటర్వ్యూలు ముగిసే వేళకు సాయంత్రం ఐదు గంటలు దాటింది.

ఆఖరు కేండిడేట్ ఆ బెనారస్ చీరె అభ్యర్థే . లోపలికి రమ్మని కబురెట్టా.

పిచ్చయ్యొచ్చి చెప్పాడు .. గంట కిందటే ఆమె వెళ్ళిపోయిందని!

ఆశ్చర్యమేసింది. అంత జరూరు కాదేమోలే .. ఇంత చిన్నఉద్యోగం? అనిపించింది.

ఆ మాటే అంటే 'అదేమో తెలవదు సార్ ! ఆ అమ్మిని చూస్తే అట్లా అనిపించటంలా! ఇద్దరు ఆడబిడ్డలున్నారంట. మొగుడు వదిలేసాడంట .. అంతా ఆమె తలరాతలే సార్ .. ఎవుర్నుకొనీ ఏం లాభం?' అని గొణుక్కున్నాడు పిచ్చయ్య . ఆ నిష్ఠురం నన్ను గురించే అని అర్థమవుతూనే ఉంది!

ఆమె ఫైలు తెరిచి చూసా!బియ్యీడీ.. ఎకడమిక్ ట్రాక్ కూడా .. ఎక్సలెంట్!

ప్రాణం ఉసూరుమంది! ఎవరికి ఏది ప్రాప్తమో ఎవరికి తెలుసు?!

★★★

ఆ ఆదివారం మ్యాట్నీ చూసుకొని ఇంటికి తిరిగొస్తున్నాం నేనూ మా ఆవిడా. క్లాక్ టవర్ సెంటర్లోని లాండ్రీ షాప్ ముందు బండాపించింది శ్రీమతి. తను బ్యాంక్ ఎంప్లాయీ. గంజి పెట్టిన ఇస్త్రీ చీరెల్లో తప్ప డ్యూటీకి వెళ్ళదు.

ఇస్త్రీ బట్టలకని లోపలికి వెళ్ళిన ఆమె ఎంతకూ తిరిగి రాకపోయే సరికి .. నేనే షాపులోకి వెళ్ళా.

మా శ్రీమతి పక్కనే ఉన్న కౌంటర్ ముందు నిలబడి డెలివరీ బాయ్ కి పదే పదే ఏదో సంజాయిషీ ఇచ్చుకుంటూ కనిపించింది.. ఆ రోజు ఇంటర్వ్యూ కి వచ్చి అటెండవకుండానే తిరిగి వెళ్ళిపోయిన అభ్యర్థి!

'.. అక్కడికీ నేనా లాడ్జ్ వాళ్ళను బ్రతిమాలుతూనే ఉన్నానన్నా.. కాస్త ఎర్లీగా ఇంటర్వ్యూ చేసి పంపించమని. వింటేనా? బోడి ..రిసెప్షన్ పోస్టు క్కూడా లక్షా తొంభై రూల్సు! కుదరదంటే కుదరదన్నారు. కడుపు నిండిన వాళ్ళు .. వాళ్ళకేం తెలుస్తాయిలే .. దిక్కూ మొక్కూ లేని మనలాంటి వాళ్ళ కష్టాలు! ' అంటూ వెంట తెచ్చుకొన్న ప్లాస్టిక్ కవర్లోనించి తీసి కౌంటర్ మీద పెట్టిందామె ఆ రోజు కట్టిన క్రీమ్ కలర్ బెనారస్ చీరనే!

'ఇదే నీతో ప్రాబ్లం! చెప్పిన టైముకి ఎప్పుడూ తిరిగివ్వవక్కా ! గంటలు గంటలు డిలే చేస్తావ్ .. అదేమంటే ఏంటేంటో కథలు చెప్తావ్! మా షావుకారుకు గాని తెల్సిందంటే.. నేనూ నీకు లాగే అద్దె డ్రస్సుల్లో వెళ్ళి అడ్డమైన వాళ్ళ దగ్గరా షో చెయ్యాలి!' అన్నాడు షాపు కుర్రాడు ఆమె ఇచ్చిన ఆ క్రీమ్ కలర్ బెనారస్ చీరె మడతలు విప్పి చూసి .. 'రెండు దాగులు పడనే పడ్డాయిగా? ' అని విసుక్కున్నాడు.

తొందరగా ఇంటర్వ్యూ చేయమని ఆరోజు ఎందుకు బతిమాలిందో.. వెలిసిపోయిన వాయిల్ చీరెలో ఉన్న ఆమెను చూస్తే ఇప్పుడు అర్థమయింది!

పై పైన మెరిసే పట్టుచీరెల్లాంటివే కొందరి బ్రతుకులు. మడతలు విప్పి చూస్తే ..కనిపించేవి చిరుగులు! .. దాగులు!

చాల బాధనిపించింది.

బాధపడి మాత్రం ఏం లాభం.. ఉసూరుమని నిట్టూర్చటం తప్ప.

★★★

కథ

# మనుష్య ఋణం..!

బి కళాగోపాల్

"మనసు ముక్కలయితేనే తెరవడం సాధ్యమవుతుంది.." ఖలీల్‌గిబ్రాన్ ..

ఉదయం వేళ నాంపల్లి కేర్ హాస్పిటల్.. వచ్చిపోయే వాహనాలు,రోగుల తాకిడితో క్రమేపీ రద్దీని సంతరించుకోసాగింది. హాస్పిటల్ ఆవరణలోనున్న చెట్టు మొదట్లో కట్టిన వినాయకుడి గుడి రోగులకు అభయమిస్తుంటే చెట్టుమీద వాలిన రకరకాల పక్షుల ధ్వనులు జనాలకు బతుకుమీద ఆశను కోల్పోకుండా మావలె నిత్య చైతన్యంతో తొణికిసలాడటమే జీవనధర్మమని భోధిస్తున్నట్లుగా ఉన్నాయి. కొన్నిదిగులు పొరలను, కొంత ఉద్వేగపు చీకటిని గుండె లోతుల్లో అదిమిపెట్టి ఆటో దిగుతున్నారు ఆ దంపతులు.నిశ్శబ్దంగా ఉన్న ఆమె మోములో ఎలాంటి భావాలు తొణికిసలాడట్లేదు. ప్రక్కనే ఉన్న మధ్యవయస్కుడైన ఆమె భర్త చిక్కిపోయి జీవకళను కోల్పోయినట్టుగా ఉన్నాడు. కేర్ హాస్పిటల్ గేటుకు అటుపక్క ఇటుపక్క ఛాయవాలాల హడావుడి.. ఇడ్లీ సెంటర్లలో నిలబడి టిఫిను లాగించేస్తున్న సందడి జీవుల రొదలో అలవాటైన పనే అన్నట్లుగా ఆమె భర్త చేయిపట్టుకొని నెమ్మదిగా నడిపిస్తూ రిసెప్షన్ కౌంటర్ వైపు దారి తీసింది. తోవలో చెట్టుకింద వినాయకుడి దగ్గర డిశ్చార్జి ఐన రోగులు భక్తితో మొక్కి గేటు దాటుతున్నారు, లోనకు వెళ్లే ఇన్ పేషంట్లు భయం, భక్తి, ఆశ , నిరాశల నడుమ ఊగిసలాడుతూ అంతా ఆ పైవాడి దయ అనుకుంటూ ఏం జరుగుబోతుందో తెలీని అనిశ్చితి ఆందోళనలో ఆ వినాయకుడి ముందు ఒక్కక్షణం కళ్ళు మూసుకొని లెంపలేసుకొని చకచకా రెయిలింగ్ పట్టుకొని వాలుమార్గంలో రిసెప్షన్ కౌంటర్‌కు చేరుకుంటున్నారు. ఆమె మొహంలో ఎలాంటి భీతి, భయాందోళనలేవీ లేవు, జరుగబోయే పరిస్థితి అంతా తెల్సిందేనంటూ అన్నీ ముందు ఊహించుకున్నట్లే అన్నట్లు నిమ్మళంగా ఉంది. కౌంటర్‌లో తన ఫైలు చూపించి డాక్టరు పేరు రాయించి భర్తను తీసికొని డాక్టర్ విద్యాసాగర్ పేరున్న తలుపు ముందు పేషంట్ల వరుసలో కూర్చుంది. అలవాటైన ప్రదేశం వారిద్దరికి "అడ్మిట్ అవమంటాడేమో!మొన్నే చెప్పారుగా.. భయంగా ఉంది..శశీ ! నువ్వు, బాబు, అమ్మ, తోడబుట్టిన నా అన్నదమ్ములు..." అంటూ ఎగశ్వాసతో రొప్పసాగాడు. ఊరుతున్న కన్నీటిని తుడుచుకొని అతడి గుండెలమీద నెమ్మదిగా చేతితో రాయసాగింది. అనుకున్న ఘడియ రానే వచ్చింది. మరోరెండు గంటల్లో అతడ్ని ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లారు. బిలబిలమంటూ అతడి అన్నదమ్ములు, తల్లీ వచ్చి ఆమెను చుట్టుముట్టారు. అందరి లోనూ అలజడి.అగస్ట్‌పదమూడు మంగళవారం రాత్రి పదకొండు నలభై నిముషాలకు సడెన్ కార్డియాక్ హర్ట్ అరెస్ట్‌తో అతడి గుండె ఆగిపోయింది. కాలేయ మార్పిడి శస్త్రచికిత్సకు డాక్టర్లు బృందం ఆపరేషన్ థియేటర్లో అంతా సిద్ధం చేసుకున్న తరుణంలో ఈ స్ట్రోక్ రావడంతో అనుకున్నదంతా తల్లకిందులైంది. అన్నదమ్ములు, తల్లీ అంతాకల్సి అతడి శవాన్ని తమ సొంత ఊరుకు తీసుకువెళ్లారు. అప్పటికే అవయవాలు కుళ్ళిన వాసన వేస్తున్నాయి. ముక్కులో నుండి, చెవుల్లో నుండి రక్తం స్రవించసాగింది. లోకల్ రెడ్ క్రాస్ సొసైటీనుండి ఐసుబాక్సు తెచ్చి అతడి మృతదేహాన్ని ఆరాత్రి భద్రపర్చారు. అప్పటికే బాగా పొద్దుపోయింది. తెల్లారి బుధవారం అమావాస్య అపరాహ్నవేళకు వస్తుందని ఉదయం పన్నెండులోపే అతడి దహనక్రియలు నిర్వహించారు కుటుంబీకులు.ఎనభై

ఐదేళ్ల వృద్ధురాలు రమణమ్మ తమ కుటుంబానికి ఈ శాపమేమిటోనని? గతించిన తన భర్త ఇప్పుడు చెట్టంత కొడుకును పోగొట్టుకున్న దు:ఖంతో ఖిన్నురాలైంది. అన్నదమ్ములందరిలో విషాదఛాయలు అలుముకున్నాయి. తమ్ముడి గొప్పతనాన్ని, అతడి మంచితనాన్ని మాటిమాటికీ జ్ఞప్తికి తెచ్చుకొసాగారు. పక్కగదిలో శోకదేవతలా కూర్చుంది ఆమె . ఇన్నేళ్ల భర్త సాన్నిహిత్యం, కల్మషమెరుగని అతడి అతి స్వచ్ఛమైన ప్రేమ వాత్సల్యాలతో గడిపిన గత జీవితపు సంఘటనలు ఒక్కొక్కటిగా ఆమె స్మృతిఫలకంలో కదలాడసాగాయి.

★★★

“ నా గురించి అంతా చెప్పిన తర్వాత కూడా నన్నుపెళ్ళాడటం ఇష్టమేనా?” అని అడగాలనిపించడం లేదు. అన్నాడతను దూరంగా కదులుతున్న మేఘాలవంక నిర్లిప్తంగా చూస్తూ .. కించిత్తు బాధపడింది ఆమె. అతడి మాటల్లోని నిజాయితీ, నిండు గంభీరమైన విగ్రహం, అంతకుమించి తనసెంతో బాగా చూసుకోగలడన్న గొప్ప నమ్మకం ,ప్రేమను పంచే అతడి తత్త్వం.. గుర్తెరిగి తన సమ్మతాన్ని మృదువుగా చేయినొక్కి తెలిపింది. ఎదురుగా కొమ్మలనడుమ పక్షుల జంటలు కువకువలాడాయి. ఆమె రాకతో అతడి జీవితంలో తేనెజల్లులు కురిశాయి. ఆనంద మధురిమలు వెల్లివిరిశాయి. పాతికేళ్ల కాలచక్రం గిర్రున తిరిగింది. వారిద్దరి దాంపత్య బంధానికి తీపిగుర్తుగా ఇరవై ఏళ్ల ఎదిగిన కొడుకున్నాడు. ఎన్ని మందులు వాడుకున్నా ,ఎన్నిసార్లు డాక్టర్లను కలిసినా ఏం ప్రయోజనం లేదని తెల్సి మళ్ళీ చెకప్‌లకని వెళ్ళడం ఆ దంపతులకు పరిపాటి. సిస్టర్ పిలుపుతో లోనకు వెళ్ళిన వారితో డాక్టర్ విద్యాసాగర్ ‘‘పాతికేళ్ళ నుండి చూస్తున్నాను మీ కేసును. చాలా అరుదుగా కొన్నిసార్లు జన్యుపరమైన కారణాల వల్ల అనువంశికంగా సంక్రమించే ‘హెపటైటిస్ సి ‘వ్యాధితో మీ పోరాటం గొప్పది. ఆరోజే మా డాక్టర్లు బృందం చెప్పిన మాట మీ కాలేయకణజాలం బాగున్నంతవరకు మీకే ఢోకాలేదు.ప్రస్తుతానికైతే దీనికి ఎలాంటి వ్యాక్సినూ కనుగొన బడలేదు. మీ జీవితకాలం దాదాపుగా యాభై ఒకటో..యాభై రెండో ఆ తర్వాత కాలేయవాపు తీవ్రంగా పరిణమించి అది లివర్ సిర్రోసిస్ గా (కాలేయ క్యాన్సర్‌గా ) మార్పు చెందుతుందని ఇహ అప్పుడు కాలేయమార్పిడి చేసినా మరికొన్ని నెలలుమాత్రమే మీ ఆయుర్దాయం పొడిగించ బడుతుంది.. కాలేయమార్పిడి శస్త్ర చికిత్స ఇప్పుడైతే అనవసరం.. జాండిస్ రాకుండా జాగ్రత్తలు పాటించండి. నిజానికి జాండిస్ జబ్బుకాదు. కానీ అది లివర్ అనారోగ్యం పాలవుతోందని తెలిపే ఒక రోగ లక్షణం మాత్రమే.

రేపటి మీ జీవితాన్ని మరింత నమ్మకంగా, ఆశావహంగా జీవించండి.ప్రస్తుతానికి చికిత్సలేని వ్యాధి ఇది. మీకుటుంబంలో నాన్నగారు ఇదే కారణంతో మరణించారు. మీ అన్నదమ్ములు నలుగురికీ, అక్కయ్యకు ఈ వ్యాధి సంక్రమించలేదు. తరతరాలుగా వస్తున్న అనువంశిక వ్యాధులు ఎవరిలో ఒకరికే జీన్‌మ్యూటేషన్ వలన సంక్రమిస్తాయి. దానికి మీ శరీరం వాహకమైంది. బతుకంటేనే పోరాటం..! మనల్ని మనం పడిపోకుండా నిలబెట్టుకోవాలి..! నేనేం మందులిచ్చినా అవి పై పై బలానికి తప్పితే ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయలేవు ’’ అంటూ మరోసారి ఇంకేం చేయలేమన్నట్లుగా డాక్టర్ మందుల చీటీ అందించాడతనికి. కాలం గడినా కొద్దీ భర్త దూరమవు తాడని తెలుసు.. కళ్ళముందు కదలాడే మనోశూన్యపు బెంగ.. అంతకన్నా ఏమీ చేయలేని ఆమె నిస్సహాయత కొంతకాలంగా ఆమెను సున్నితంగా ఆలోచిండం మానేసేలా చేసాయి.!

★★★★★★★★★★★★★★★★★★

★★★★★★★★★★★★★★★★★★

అతడు తనకున కొద్దిపాటి జీతమైనా అందులోనే కుటుంబ అవసరాలు తీర్చుకొని విరివిగా దానధర్మాలు చేసేవాడు. ఎప్పుడూ చలాకీగా నవ్వుతూ నలుగురికే సహాయపడుతూ ఎక్కడున్నా పదిమంది పెట్టు అన్నవిధంగా ఉత్సాహంగా జీవితాన్ని గడిపాడు. నిత్యనూతనంగా ప్రతీ రోజూ పండుగే ..! అన్న విధంగా తన చుట్టు ఉన్నవారికి మరింతగా

సంతోషాన్ని పంచాడు. గత ఆరేడు నెలలుగా పాడు జాండిస్‌సోకి అతడి కాలేయాన్ని తూట్లు తూట్లుగా ఛిద్రం చేయసాగింది. రెండేళ్ల క్రితం కరోనా సోకినా విజయవంతంగా ఎదిరించి బతికి బట్టగట్టాడు.చివరిదశలో తీర్థయాత్రలు తిరుగుతూ ఆధ్యాత్మిక మనోశాంతిని పొందుతూ చార్‌ధామ్ యాత్రలను కూడా పూర్తిచేసికొని వచ్చిన భాగ్యశాలి. కానీ ఆమెకు తెల్సు అతడే ఉద్దేశంతో ఈ యాత్రలనీ తిరుగుతున్నాడో..!

" ఈ దేహం శివయ్య వరం.. ఋణానుబంధ రూపేన పశుపత్ని సుతాలయా: ఋణ క్షయే క్షయం యాంతికా తంత్రం పరిదేవనా..! గొడ్డూగోదా,భార్యాబిడ్డలు ఇళ్ళువాకిళ్ళూ.. అన్నీ రుణానుబంధాలే అన్నది దాని తాత్పర్యం.. ఒక్క సారి ఆ రుణం తీరిందో ఇక మంత్రం వేసినట్టుగా వేటికవే వీగిపోతాయి. ఎక్కడ పుణ్యక్షేత్రాల్లో కాలిడినా అదే క్షేత్రంలో నా కాయం రాలిపోవాలని కోరుకున్నా..! కానీ ఈ దేహం ప్రాణికోటికి ఉపయోగపడాలని.. అంతర్గతంగా ప్రవహించే అతి పవిత్ర గుణం కృతజ్ఞతతో చివరికంటా జీవించాలని.." అన్నాడతను సత్సంగ్ నిరాకారి భక్తుడిగా తనను తాను మార్చుకున్న ఆధ్యాత్మిక ధోరణిలో... తత్వవేత్త లాంటి అతడి మాటల్లోని మర్మాన్ని తనలోని మరోకోణాన్ని అర్థం చేసుకుంది. ఐనా వారి జీవనశోభ పరిణితి చెందిన మనస్కుల కలయికలా జీవితంపై ఎపుడు చిగురించే ఆశలే గానీ ఎడారి మోడులాంటి అసంతృప్త భావనలేవీ దరికి చేరనివ్వకుండా జాగ్రత్త పడ్డారిద్దరు..

అతడు తన జీవన యానాన్ని గురించి చెప్పకున్నట్లు " నన్ను.. నిన్నూ బతికించే దారం పేరు ఆశ.అది మన హృదయాలను కుట్టి ఉండకపోతే నా గుండె ఎప్పుడో పగిలిపోయేది" అని .. ఇలాంటి నిర్వీర్యపు మాటల నేటపుడు ఆమె చప్పున అతడి నోటిపై తన చేయి అడ్డుగా పెట్టి కళ్ళతోనే వారించేది..జాండిస్‌తో అతడి పోరాటం మరింత ఉధృతమయింది.

అది ముదిరి ప్రాణాంతకమై అతడి ఊపిరి తీయకముందే శస్త్రచికిత్స కొరకై ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసి కుమారుడి ఆమెరికా చదువులకై పోగు చేసుకు సొమ్ము మొత్తాన్ని హస్పిటల్ కౌంటర్‌లో చెల్లించింది .దాత దొరికి మరికొన్ని గంటల్లో శస్త్ర చికిత్స జరుగబోతుందన్న తరుణంలో సడెన్ కార్డియాక్ అరెస్ట్ జరగటంతో మరికొన్ని నెలలు అనుకున్న అతడి ఆయుర్దాయం ఆరోజుతో ముగిసింది. డాక్టర్ల బృందం చెప్పిన మాట అక్షరాలా జరిగిన సత్యం అనడానికి ఆయన పార్థివ దేహం ఆపరేషన్ థియేటర్లో నుండి బయటకు తీసుకురాబడింది ..!

పదోరోజు శిలాస్నానం, పన్నెండోరోజు పిండ ప్రదానం,పదమూడో రోజు పెద్దకర్మ బంధు మిత్రులందరినీ పిల్చుకొని నిరాటంకంగా పూర్తి చేశారా కుటుంబీకులు. వృద్ధురాలు రమణమ్మ మాటలకందని విషాదాన్ని మోస్తూ..మరణించిన తన కొడుకుల ఫోటోలను భర్త ఫోటోను ఆర్తితో తడిమి వేదాంతాన్ని వల్లె వేసుకోసాగింది .ఓ రెండేళ్ల క్రితమే ఆమె పెద్దకొడుకు రోడ్డు ప్రమాదంలో దివంగతుడైనాడు. అగరొత్తులు దండలతో వెలిగిపోతున్న భర్త ఫోటోవైపు తదేకంగా చూడసాగిందామె.. మరణించాడంటే నమ్మబుద్ధి కావట్లేదు. అతడి కళ్లు తనతో ఏదో పంచుకోవాలన్నట్లు చూస్తున్నాయి. జీవించి ఉన్నపుడు తనెప్పుడూ చేప్పేమాటలు ఆమె జ్ఞాపకాల పొరల్లో కలుక్కుమన్నాయి.

★★★★

అతనితో ఎప్పుడు హాస్పిటల్ చెకప్‌లకని వెళ్లినా తను భయంతో చిగురుటాకులా వణికిపోయేది .క్షణ క్షణం వెంటాడే బతుకు భయంతో గుండె దిగులు మేఘమై వర్షించేది. "సూర్యాస్తమయాలే కాదు మరిన్ని సూర్యోదయాల్ని కూడా చూస్తాను..!" అంటూ గోరువెచ్చని చేతిస్పర్శతో భరోసానిచ్చేవాడు. దానికి తోడు చూట్టూ దీర్ఘకాలిక జబ్బులున్న రోగులను గమనించేది. రకరకాల పేషంట్ల బతుకు పోరాటాలు వారి బీభత్స భయానక జబ్బులు వారితో వచ్చిన రక్త సంబంధీకుల రోదనలు ఆమెను నిలువెల్లా నిర్వేదంలో ముంచేసేవి. తొమ్మిదేళ్ల బాలుడు కిడ్నీదాత లభించక మరణించిన

వైనం ఊపిరితిత్తులు చెడిపోయిన వారు , రకరకాల క్యాన్సర్ పేషంట్లు..వీరిని చూసినప్పుడల్లా జనన మరణాల చక్రభ్రమణాల్లో పరిభ్రమిస్తూ కాలచక్రంలో ఎప్పుడు ఎవరి సమయం ముగిసిపోతోందో ?ఆట ఆగిపోతుందో ? ఆ రోగులకు తెలిసినా వారి మనోధైర్యానికి గుండె దిటవుకు చలించిపోయేది .నిజం చెప్పాలంటే.. ఆ హాస్పిటల్ వాతావరణమే ఆమెలో ఆత్మశక్తిని, ఆత్మ నిర్భరతను హెచ్చించేలా చేసింది. చుట్టూ ఉన్న రోగులను చూసినపుడల్లా తడిమే జీవన పార్శ్వాల్లోని గాఢత అసలు జీవించి ఉండగలగడం ఎంతో గొప్పవరం అనుకునేలా ప్రభావితమైంది. అతనెప్పుడూ అనేవాడు "అవయవాల దానంకంటే అసలు శరీరాన్నే దానం చేస్తే పోలా..! దేవుడిచ్చిన అమూల్యదేహమిది. కుమార సంభవంలో ఆనాడే కాళిదాసు చెప్పిన సూక్తి ఎంత గొప్పది ''శరీమాద్యం ఖలు ధర్మ సాధనమ్ ' శరీరమే ముఖ్యమైన దర్మసాధనం దేహమే దేవాలయం అట్టిదేహంలో ఉన్న దైవాన్ని సందర్శించాలంటే ఉపయోగపడవసింది దేహమే! కర్మలు చేయడానికి కర్మఫలాలను అనుభవించడానికే పరమేశ్వరుడు ఈ శరీరాన్ని ప్రసాదించాడు. అందుకే పరమాత్మ ప్రసాదించిన ఈ దేహంతో సత్కర్మలు మాత్రమే చేయాలి ధర్మబద్ధంగా జీవించాలి. మనం చేసే మంచి పనులే అంతిమంగా శుభాలను కలుగజేస్తాయి.

నా అవయవాలు మరొకరి కంటిచూపై ఇంకొకరి గుండెలయగా, మరొకరి శ్వాసకోశాల్లో ఊపిరి తీసుకోవాలని ఉంది. జాతస్య ధ్రువం మరణమ్' ఈ సత్యాన్ని క్షణక్షణం గుర్తెరిగి మసలుకోమంటుంది నా మనసు.యౌవనంలోనే మరణం గురించి తెల్సుకున్నవాడ్ని, నువ్వు ఫలానా వయసులో చనిపోతావని చెప్పినపుడు ఎవరికైనా ఏమనిపిస్తుంది ? ఈ సత్యాన్ని అంత తేలిగ్గా జీర్ణించుకొని కాలం చిటికెనవేలు పట్టుకొని నడవటం అంత ఆషామాషీ కాదు. నా ఉచ్ఛ్వాసకు భంగం కలిగిన ప్రతీసారి కళ్లముందు మరణం ప్రత్యక్షమవుతుంది. వృధాగా మట్టిలో కల్సిపోయే ఈ దేహం మరొకరిలో చిగురులు వేసి వారి ప్రాణాల్ని నిలబెడుతుందన్న ఆ ఊహే ఎంత గొప్పది ..! 'మన: సత్యేన శుద్ధ్యతి' మనస్సు సత్యంతో శుద్ధి పొందుతుంది. ఇలాంటి సత్య వాక్కులు సకారాత్మకమైన ఆలోచనలే నా బతుకు ప్రేరణ. నా తదనంతరం నా ఆశయాన్ని నిలబెడతావా శశీ?! పోరాడి అస్తమించిన పార్థివ శరీరాన్ని ఖననం, దహనం చేస్తే ఏం ప్రయోజనం? వేలల్లో అవయవదానం కొరకు ఎదురుచూసే అభాగ్యులున్న మనదేశంలో ఈ చిరు ప్రయత్నం సఫలీకృతం అవదంటావా? ధర్మ నిర్వహణలో దైవ సహాయముందంటారే! శరీరాన్ని దానం చేస్తున్నట్లుగా మనం ముందే రిజిస్ట్రేషన్ చేసుకొని తత్సంబంధ మెడికల్ కాలేజీలో ఈ వీలునామా పత్రాన్ని ఇచ్చే సదుపాయం ఉంటే ఎంత బాగుండు? ఎన్నో మరణాలను అరికట్టి వారి కొడిగడుతున్న జీవితాలకు ఆశావహ భవిష్యత్తును అందించలేమా మనం? నాటి కాలంలో దధీచి దేహం పరోపకారార్థం,ధర్మార్థం,దేవ హితార్థం కైంకర్యం కాలేదూ? పరుల సుఖదుఃఖాల్లో పాలు పంచుకోవటం ఉత్తమ ధర్మం అనే ఆదర్శాన్ని చూపించిన త్యాగజీవి దధీచి ఆదర్శప్రాయుడై నిలిచాడు. పవిత్ర ఇతిహాసాల నీతిసూత్రాల నెందుకు విస్మరిస్తున్నాం? "

అతడి మాటల్లో ఎంతో వివేచన.. సంఘానికి తనవంతుగా ఎంతో కొంత మంచి చేయాలన్న తపన అహరహరమూ తొంగి చూసేది. పాడు జబ్బు ఆయన ప్రాణాలను మింగింది గానీ ఆశయానికి చావు లేదుగా! ఆమెలో తొలుగుతున్న దిగులు చీకట్లు.. రేపటి కర్తవ్యానికై పూనిక నిస్తున్నట్లుగా వీడుతున్న భయాల కారుమబ్బులు.

★★★★★

శుష్కించిన దేహం, మనో వ్యాకులతతోనున్న ఆమెను గాలిమార్పు కొరకై కొన్ని రోజులు పుట్టింటి వారు వైజాగ్ తీసికెళ్లారు. చాలా ఏళ్ళ తర్వాత

పుట్టింటికి చేరిన ఆమె తన గది కిటికీ తెరవగానే ఎదురుగా సాగర దృశ్యం! ఏళ్ళకేళ్ళుగా అదే సముద్రం.. అవే కెరటాలు ఉవ్వెత్తున ఎగసిడుతూ .. పడినా లేస్తూ.. ఆమెలోని అంతర్మథనానికి మౌనసాక్షిగా సాగరఘోష! సముద్రంలో మునకలేస్తున్న కెంజాయవర్ణ సూర్యాస్తమయాన్ని చూసి నిట్టూర్చేది. మరో వంక భర్త మాటలే పదే పదే జ్ఞప్తికి వచ్చి అసలు శరీరాన్నే దానం చేసే ప్రక్రియకు ఆద్యురాల్ని నేనెందుకు కాకుడదు? మదిని ప్రశ్నించే సమస్యకు సమాధానమేదో దొరికినట్లైంది. అది విశాఖ ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రాంగణం! ఆ మెడికల్ కాలేజీ స్థాపించి ఆ యేడు వందేళ్లు పూర్తి ఐన సందర్భంగా జరుపుకొనబోయే సప్తాహవేడుకలలో భాగంగా సుందరంగా తీర్చిదిద్దిన ప్రాంగణ ద్వారం ముందు ఆటో ఆపించింది ఆమె.స్వాగత తోరణాలతో ఎంతో ఉన్నతంగా, ఠీవిగా వెలిగిపోసాగింది ఆ మెడికల్ కాలేజీ! ఎంతో మంది గొప్ప పేరున్న వైద్యులను అందించిన ఘనత దాని సొంతం. ఆమె అడుగులు నేరుగా ప్రిన్సిపాల్ గదివైపు కదిలాయి! కొద్దిపాటి నిరీక్షణ అనంతరం ప్రిన్సిపాల్‌గారు రమ్మంటున్నారన్న పిలుపు అందుకొని ఆయన గదిలోకి అడుగుపెట్టిందామె. ఆయన సీటువెనుక ధవళ వస్త్రాల్లో దేవతలా వెలిగిపోతున్న మదర్‌థెరెసా, గోడలపై ఆ కాలేజీ స్థాపకుల ఫోటోలు, పట్టాపుచ్చుకున్న డాక్టర్ల ఫోటోలతో బాటు తన భర్తకు చికిత్సనందించిన ప్రముఖ గాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ విద్యాసాగర్ గారిని వెంటనే పోల్చుకుందామె. తన శరీరాన్ని మెడికల్ కాలేజీకి దానం చేయాలనుకున్నట్లుగా స్థిరంగా పలికిన ఆమె గొంతులోని ధైర్యానికి ఆశ్చర్యపోయారు ప్రిన్సిపాల్. వందేళ్ళ చరిత్రలో తమ కాలేజీకి శరీరదానం చేస్తానంటూ వచ్చిన మొదటి వ్యక్తి మీరేనంటూ అభినందించి అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే శరీరదానం, అవయవదానం చేయడంలో మనదేశం చాలా వెనుక బడి ఉందని, ఇప్పటికీ మృతుడి బంధువులను ఒప్పించడానికై చాలా సమయం పడుతుందని, ఈ లోగా అవయవాలు పాడై పోతున్నాయని, ఇంత గొప్ప మానవత్వంతో తాను అందిస్తున్న ఈ సాయం మరువలేనిదని కొనియాడి, శరీరదానానికై చేయదగ్గ విధివిధానాలను కలవాల్సిన అధికారులను తెలియజేశారు. ఆమె తిరిగి తన భర్త నివసించిన ఊరికి వెళ్లిపోయింది. ఆ ఊరి సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లి పొలం, ఆస్తిలాగే తన శరీరాన్ని ఆంధ్రామెడికల్ కాలేడీకి దానం చేస్తున్నట్లు ఒక విల్ (సమ్మతి) రిజిస్ట్రేషన్ చేయించాలి అని చెప్పింది." ఏమిటీ! శరీరాన్ని దానం చేస్తున్నారా? " అని అందరూ తొలుత విస్మయపడి ఆ తర్వాత మెల్లగా తేరుకొని నెలరోజుల సమయం తీసుకొని తమపై అధికారుల నుండి సమాచారం తీసుకొని రిజిస్ట్రేషన్ చేశారు. ఆరోజు ఆమె ఆనందం అంత ఇంతా కాదు..! తన ప్రాణం పోయిన తర్వాత కూడా మరి కొంత మందికి జీవితాన్ని పంచగలిగే వరం పొందినందుకు గుండెనిండు సంతోషాన్ని పొందింది. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు తన విల్‌ను అంద జేసింది. భర్త ఆశయం వేళ్ళూనుకొని శరీరదానం, అవయవదానం సమాజంలో వటవృక్షమై వర్ధిల్లాలని ఈ ప్రక్రియను నోటరీద్వారా కూడా సులువుగా అందరికీ అందుబాటులో తెచ్చేలా పోరాడింది. శరీరదానం చేసేందుకై అతి సుదీర్ఘ సమయాన్ని, ఎదురుతెన్నుల నిరీక్షణను పటాపంచలు చేస్తూ ఆమె వేసిన తొలి అడుగు అంకురమై నాటుకుంది. తన చుట్టూ ఉన్న సమాజాన్ని నివ్వెరపోయేలా చేసింది. మొదట విస్మయపడ్డారు.. వీస్తుపోయారు.. కంగారుపడ్డారు.. ఆనక దీంట్లోనూ గొప్ప ఆనందముందని తెల్సుకున్నారు. పైకి కనిపించే డొల్ల బతుకులు, పోయిన తర్వాత రాల్చే కల్తీ కన్నీళ్ళు, హడావుడిగా ఒక్కరోజులో కొద్ది గంటల్లోగా ముగిసే పిండ ప్రదాన ఆచార క్రతువులు.. శ్రద్ధాంజలి తదితర మరణానంతర కార్యక్రమాల్లో కనబడని మమతానురాగాల్ని నిరసిస్తూ తన పార్థివ దేహం ఏ మెడికల్ కళాశాలకి ప్రయోగాలకు పనికొచ్చినా చాలు.. లేదా తన అవయవాలు మరో దేహంలో తిరిగి ఊపిరి పోసుకున్నా అదే గొప్ప మనుష్య ఋణం తీర్చుకున్నట్లు అని భావించిందామె. తన బ్యాగులోనూ

ఎప్పుడూ శరీరదానం చేసినట్లుగా ఇచ్చిన ఐడికార్డు వేసుకొని వెళ్లేది. తాళం తీయగానే ఇంట్లో గోడకు ఎదురుగా తన శరీరదానానికి సంబంధించిన సర్టిఫికెట్, ఫోటో కనిపించేలా వేలాడదీసింది. ఫ్రేమ్ కట్టించుకున్న ఆ సర్టిఫికెట్ తన జీవనసాఫల్య కృషికి గుర్తింపుగా తలచేది. ఈ జీవితాన్ని జీవించి ఉన్నంతకాలం ఆనందంగా గడపలేమా? అన్పించేది ఆమెకు. మరణానంతరం దేహంలోని అవయవాలు దానం చేస్తే మరుసటి జన్మలో అవే అవయవాలు లేకుండా పుడతారేమోనన్న మూఢ జనుల మాటలకు పగలబడి నవ్వేది .నరజన్మ లభించటమే పరమోత్కృష్టమైనది. మరుసటి జన్మల ఎవరికెవరు? మనం పోయాక మన ఉనికి పునరపి జననం ఎక్కడో ఊహకు కూడా అందదు. ఇప్పుడే లభించిన ఈ తత్ క్షణమే పరులకు సేవ చేయడంలోని ఆనందాన్ని పొందాలి .గతం మారదు మార్చలేని గుణపాఠాన్ని బోధిస్తూ వెళ్ళిపోడమే దాని వంతు. వర్తమానంలో ఆశావహం.. భవిష్యత్ పట్ల గొప్పనమ్మకం ఇవేకదా ప్రతిమనిషి తనతో తాను చేసుకునే ప్రమాణాలు'' అంటున్న ఆమె మాటల ప్రవాహాన్ని అడ్డుకున్నట్లుగా

" మేడం మన సంస్థకు మరికొంతమంది శరీరదానాన్ని చేస్తున్నట్లుగా రిజిస్ట్రేషన్ పత్రాల్ని తెచ్చారు''

అంది క్లర్క్ . అందరినీ లోనకు రమ్మన్నట్టుగా సైగ చేసింది ఆమె. బిలబిలమంటూ ఓ ముప్పై మంది రకరకాల వయస్సు గల వ్యక్తులు లోనకొచ్చారు. వారందరి చేతుల్లో నిర్భయంగా రెపరెపలాడుతున్న శరీరదాన పత్రాలు..

వారు ఆమెకు ఆ పత్రాల్ని అందజేస్తుండగా జర్నలిస్టులు, రిపోర్టర్లు తమ కెమెరాలను క్లిక్ మనిపించారు. తన భర్త మరణించిన అగస్ట్ పదమూడు తేదీ అదే రోజు ప్రపంచ అవయవ దాన దినోత్సవం కావడం యాదృచ్ఛికమేమోగానీ.. ఆ సందర్భంగా తీసుకున్న ఆ ఇంటర్వ్యూ కథనం'' మనుష్య ఋణం..! "పేరిట తెల్లారి ఆమె టేబిల్‌పై రెపరెపలాడ సాగింది. నిజమే..! మనసు ముక్కలయితేనే తెరవడం సాధ్యమవుతుంది. టేబుల్‌పై నవ్వుతున్న భర్త ఫోటో పక్కన చిన్నదీపాన్ని వెలిగించింది. ఎప్పట్లాగే కొత్త పూలదండ వేసి దండం పెట్టుకొంది. తన ఆశయాన్ని బతికించడానికై గత పదేళ్ళుగా నిరంతరం శ్రమించిన ఆమె గుండె అలసిపోయింది. భర్త ఫోటోవంకే చూస్తున్న ఆమె గుండెల్లో  ఇనేళ్ళూ గూడు కట్టిన పెగలని దు:ఖం ఉప్పెనై ఎగసింది. ఛాతీనొప్పి సన్నటి దడ మాదిరిగా ఆరంభమై భుజం నొప్పి కొండచిలువలా ఆమెను చుట్టేయగా..ఉచ్ఛ్వాసనిశ్వాసల్లోని ఎగపోతతో తిమ్మిరి చేతులు వణుకుతుండగా.. సార్బిట్రేట్ మాత్ర కొరకై డ్రాలలో వెతుకుతుండగా ..నిస్తేజమై గుండె పోటుతో కుర్చీలో కుప్పకూలింది ఆమె ..!శరీరదానం చేసిన ఆమె ఐడికార్డు మాత్రం ఈ జీవి మనుష్య ఋణం తీరిందంటూ మరో పాత్రలోకి మారబోయే రూపాంతరం కొరకు నిరీక్షించసాగింది...


★★★!


# నవ్వండి ప్లీజ్ !




## నవ్వటం ఒక యోగం ,

నవ్వలేక పోవటం ఒక రోగం , తరువాత మీ ఇష్టం






కథ

# పత్తి నవ్వింది

వీరేశ్వర రావు మూల

అర్ధ రాత్రి పన్నెండు గంటలు. మేఘాలు ఒక్క సారి ఘర్జించాయి.
చినుకు చినుకు గా మొదలయిన వాన కుండ పోత గా మారింది. వాన పత్తి పువ్వుల్ని తాకి, గాలి తో కలిసి కొమ్మల్ని ఊపేస్తోంది.
ఎమ్మిగ నూర్ మాలపల్లి లో ఉన్న బక్కి రెడ్డి ఉలిక్కి పడ్డాడు. అతని భార్య పొడిగా ఉండే చోటికి సామానులు సర్దుతోంది.
"ఓరి నాయనో, ఈ సారి కూడా పత్తి పంట నష్టమేనా?" ఆవేదన చెందుతున్నాడు. వర్షం ఉధృతి పెరుగుతోంది.
విపరీత మైన గాలికి పెద్ద పెద్ద చెట్లే లేచి పోతున్నాయి.
ఉదయం ఆరు గంటలికి వర్షం తగ్గింది.ఇంకా
ఆకాశం లో అక్కడక్కడ నల్ల మేఘాలు తొంగి చూస్తున్నాయి.

★★★★★★★★

బక్కి రెడ్డి చేను ని చూసుకున్నాడు. విచ్చిన పత్తి వర్షం లో
తడిసిపోయింది. చేను ని చూడగానే బక్కి రెడ్డి కళ్ళ లో నీళ్ళు తిరిగాయి.
నెమ్మది గా కుప్పలా పడిపోయిన పత్తి మొక్కల్ని విడదీయడం మొదలు పెట్టాడు. ఎదురుగా బాల్ రెడ్డి కనిపించాడు.
"ఇలా ఊహించే నేను ఈ సారి పత్తి వెయ్యకుండా మిర్చి వేసాను" అని చెప్పి బండి మీద ఎమ్మిగ నూర్ వెళ్ళి పోయాడు.

★★★★★★

బక్కి రెడ్డి ఇంటికెళ్ళాక భార్య ఇచ్చిన గంజి తాగి ఆలోచిస్తున్నాడు. ఎంత కష్ట పడ్డాను! బ్యాంకులు ఋణం ఇవ్వక పోతే పటేల్ దగ్గర తీసుకున్నాను.మధ్యలో నకిలీ విత్తనాల వల్ల కొంత మోసపోయాను. మళ్ళీ అప్పు చెయ్య వలిసి వచ్చింది.
పటేల్ వడ్డీని, రక్తం లా పిండి వసూలు చేసే మనిషి. పంట పోయిందంటే పటేల్ ఏమంటాడో? బక్కి రెడ్డి మార్కెట్ యార్డ్ కి వెళ్ళి రేటు కనుక్కున్నాడు.
"క్వింటాలు, రెండు వేలు" అని వాళ్ళు చెప్పారు.
ఆ మాట వినగానే బక్కి రెడ్డి భూమి లోకి కృంగి పోయాడు. ఈ లెక్కన తనకు వచ్చే ది. ముప్పయి క్వింటాళ్ళ కి అరవై వేలేనా!

పటేల్ వడ్డికే సరిపోదు అసలెప్పుడు ఇవ్వాలా?

★★★★★★★'

బక్కి రెడ్డి మార్కెట్ నుండి రాగానే ఇంటి దగ్గర పటేల్ ఉన్నాడు. బక్కి రెడ్డి భార్య గంగ ఇచ్చిన టీ తాగుతూ, గంగ యవ్వనాన్ని కళ్ళ తోనే కొలుస్తున్నాడు. అతని దృష్టి ఆమె నాభి మీద పడింది.

గంగ చీర కొంగు నిండు గా కప్పుకుంది.

"బక్కి, ఈ సారి సమయానికి దుడ్డు(డబ్బు) అందక పోతే నీ ఆడదాన్ని నేను ఉంచుకుంటా" అన్నాడు బక్కి రెడ్డి కి వినబడేలా పటేల్ అన్నాడు.

" ఈ తూరి కనికరం సూపండి బాబూ" పటేల్ కాళ్ళ మీద పడ్డాడు బక్కి రెడ్డి.

" మొదటే సెప్పాను, డబ్బు దగ్గర నా అంత సెడ్డోడు ఉండదని"

పటేల్ వార్నింగ్ ఇచ్చి వెళ్ళి పోయాడు.

★★★★★★★★

మార్కెట్ రేటు పెరగలేదు. ప్రభుత్వం కూడా పత్తి నాణ్యత తగ్గిందని చెప్పి రేటు పెంచలేదు. రైతులకు గిట్టు బాటు ధర ఇప్పిస్తాం అనే మాటలు నీటి మూటలుగా మిగిలాయి.

★★★★★★★★★

వర్షం ఎవరికి హర్షం మిగల్చకుండా వచ్చి వెళ్ళి పోయింది.

ఆరోజు ఆదివారం.

ఆలస్యం గా లేచాడు బక్కి రెడ్డి. గంగ కనబడ లేదు. గంగా గంగా అని కేకలు పెట్టాడు.

"నీ ఆడదాన్ని పటేల్ బండి మీద సుశాను" అని మిర్చి రైతు మశేను చెప్పాడు.

"ఎదవ బతుకు, మనువు సేసుకున్న పెళ్ళాన్ని కాపాడు కోలేక పోయాను." బక్కి రెడ్డి మొత్తు కున్నాడు.

బక్కి రెడ్డి కి భవిష్యత్ అగమ్య గోచరం గా కనబడింది.

ఇంట్లో ఉన్న పురుగుల మందు డబ్బా తీసుకుని పొలం లోకి వెళ్ళాడు.

సరిగ్గా మందు నోట్లో వేసుకునే సమయానికి ఒక చెయ్యి ఆపింది.

" నన్ను సావనియ్యి"

" దేవుడు జన్మ నిచ్చింది చావడానికి కాదు" ఆపాడా యువకుడు. అతని పేరు నవీన్. అమెరికా లో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పని చేసి తన దేశానికి ఏదైనా చెయ్యాలని ఇండియా తిరిగి వచ్చాడు.

"బాబూ, మా రైతుల కతలింతే బాబూ"

"మీలాంటి వార్ని ఆదుకోవడానికి మేము పది మంది అమెరికా నుండి వచ్చాం. మీకు సహాయం చెయ్యడానికి. "

" అవునా"

పటేల్ సంగతి నవీన్ కి చెప్పాడు. అదే సమయం లో బక్కి రెడ్డి కి స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ఫోన్ వచ్చింది.

"నీ భార్య గంగ పటేల్ ని పొడిచేసి స్టేషన్ కి వచ్చి లొంగి పోయింది"

" గంగా, ఎంత పని సేసావు. నాలాంటి బక్క రైతు ని మనువాడి నీ బతుకు బుగ్గి పాలు సేసు కున్నావా?"

అని నెత్తి మీద కొట్టుకుంటున్నాడు.

బక్కి రెడ్డి అప్పులన్నీ నవీన్ తీర్చాడు. తరువాత ప్రభుత్వం తో పోరాడి రైతు భీమా పథకం తీసుకు వచ్చాడు నవీన్. మళ్ళీ పంట కి ధన సహాయం చేసాడు.

★★★★★★★★★

గంగ బెయిల్ మీద బయటికి వచ్చింది. బక్కి రెడ్డి కి నవీన్ దేవుడి లా కనిపిస్తున్నాడు.

" బాబూ మీరు ఎవరి అబ్బాయి?"

"వెంకట్రావు గారి అబ్బాయిని"

అబద్ధం చెప్పాడు.

నవీన్ వడ్డీ వ్యాపారి పటేల్ కొడుకు!

★★★★★★★★★

మరుసటి సంవత్సరం

బక్కి రెడ్డి పొలం లో తెల్లని పత్తి పువ్వులు వయసొచ్చిన అమ్మాయిల్లా విరబూసాయి. బక్కి రెడ్డి మనసు విరిసిన

పత్తి పువ్వయింది! అక్కడ పత్తి నవ్వింది పుడమి కి అహ్లాదం కలిగించేలా!

★★★

కథ

# సబ్ కో సన్మతి దే భగవాన్!

డాక్టర్ ఎమ్ సుగుణ రావు

ఆ ఇల్లంటే నాకు చాలా ఇష్టం. ఇంటి ముందు పెరట్లో ఉసిరి చెట్టు, వేప చెట్టు, ఇంకా కొబ్బరి చెట్లు, మామిడి చెట్లు, మధ్య మధ్యలో పూల మొక్కలు. అలా ఆకుపచ్చగా ఆ ఇల్లు ఒక పర్ణశాలలా కనిపించేది. ఇంటి గేటు తెరవగానే తులసి చెట్టు. దాని చుట్టూ తిరుగుతూ ఉండేది అన్నపూర్ణమ్మ. పసుపు రాసుకునే మొహం. పొడుగ్గా దిద్దుకున్న బొట్టు. ఆ ఇంటి అరుగు మీద తులసీదాసు గారు. పిల్లలకు పాఠాలు చెప్పే మాస్టారు.

రోజూ ఐదు గంటలకల్లా ఆ సాయంకాలపు ట్యూషన్ మొదలయ్యేది. తులసీదాసు గారి తమ్ముడు రామదాసు కూడా ఆ ఇంట్లో ఒక పోర్షన్‌లో ఉండేవాడు. ఆ అన్నదమ్ముల్లో తులసీదాసు గారికి ఇద్దరు కొడుకులు. రామదాసు గారికి ఒక కూతురు. ఇద్దరు అన్నదమ్ములు, వారి తల్లిదండ్రులు, ఆ తరువాతి తరం పిల్లలు, పండగ వచ్చిందంటే ఇంకా బంధువులు ` ఇలా ఆ ఇల్లంతా చాలా సందడిగా ఉండేది. ఇది పాతికేళ్ళ క్రిందటి సంగతి.

అయితే పదిహేను రోజుల క్రితం అన్నపూర్ణమ్మ గారు చనిపోయారు.

ఆవిడ చనిపోయిన రోజు నేను

చాలా దూరప్రాంతంలో ఉండడంతో

రాలేకపోయాను, కబురు అందినా.

సరిగ్గా ఆ మాసికం రోజున రాగలిగాను. అంతకుముందే ఐదేళ్ల క్రితం తులసీదాసు గారు చనిపోయారు. అప్పుడు వచ్చిన నేను ఆ ఇంట్లో మార్పులు చూసి ఆశ్చర్యపోయాను. ఆ ఇల్లు పడగొట్టి గ్రూపు హౌస్‌గా చేసేసారు. తులసీదాసు గారి ఇద్దరు కొడుకులకు, రామదాసు గారి కూతురుకు ముగ్గురికీ మూడు ఫ్లాట్లు. మిగతా మూడు ఫ్లాట్లు అమ్మేసారు. ఆ ఆరు ఫ్లాట్ల గ్రూప్ హౌస్‌లో ఆ ఇంటికి సంబంధించినవారు ముగ్గురు వేరు వేరుగా ఉంటున్నారు. నాకు ఆ ఇంటితో ఏ రక్త సంబంధం లేకపోయినా ఏదో తెలియని అలౌకిక బంధం. అప్పట్లో భోజనవేళ ఇంటికెవరు వచ్చినా వారికి తమతో పాటు వడ్డించేది అన్నపూర్ణమ్మ గారు. ఇంట్లో పని చేసేవారికి, బట్టలు ఉతికే మనిషికి, వాళ్ల గేదెలు మేసేవారికి కడుపు నిండా భోజనం పెట్టి పంపేది.

'మన దేహానికి చాలినంత ఆహారం తీసుకుంటే చాలు. మిగిలినది మరో జీవికి, ఆ జీవి జీవికకు ఉపయోగపడుతుంది. కారణం ` ఆ జీవిలోను, మనలోను ఉన్నది పరమాత్మే కదా! అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపం అనేవారు' మా తులసీదాసు మాస్టారు.

అలా ఎన్నోసార్లు ఆ ఇంట్లో భోజనం చేసాను నేను. అన్నపూర్ణమ్మ గారు అందరూ భోజనం చేసిన తర్వాత తను తినేది. తను తింటున్నప్పుడు వీధి వైపు దృష్టి సారించేది. ఎవరన్నా యాచకులు వచ్చి, అన్నం పెట్టు తల్లీ అంటే తన కోసం ఉంచుకున్నది వాళ్లకిచ్చేసేది. అయితే ఆ పద్ధతి ఆ ఇంటి కొడుకులకు పెళ్లయి, కోడళ్లు వచ్చేసరికి మార్చాల్సివచ్చింది. 'ఇది ఇల్లా లేక అన్నదాన కేంద్రమా' అంటూ కోడళ్లు ఆవిడ ఎదురుగా విమర్శించేవారు.

ఆవిడ ముగ్గురు కొడుకులు ` రఘుపతి, రాఘవ, రాజారాం. తమ భార్యలను సపోర్ట్ చేయడంతో ఇక విధిలేక అన్నపూర్ణమ్మ గారు తన అలవాట్లు మార్చుకుంది. కోడళ్లు, కొడుకులు క్రొత్తగా పెట్టిన శాసనాలకు తల ఒగ్గింది. పోనీలే, మాతోనే కదా గొడవ. పిల్లలు ముగ్గురూ కలసి వుంటే చాలనుకుంది. అయితే రోజులు గడిచేకొద్దీ కొడుకుల మధ్య వైరుధ్యాలు, వైవిధ్యాలు. అలా క్రమేణా అందరం ఒకే ఇంట్లో ఇరుకు గదుల్లో ఉండలేం. మా ముగ్గురు అన్నదమ్ములకు ముగ్గురు పిల్లలు. ఒకే టీవీ చూడడం కూడా కష్టమే అనుకుంటూ ఆ ఇల్లు పడగొట్టించి, దాన్ని డెవలెప్‌మెంట్‌కి ఇచ్చి, ముగ్గురూ మూడు ఫ్లాట్‌లలో వుండిపోయారు. ఆ ముగ్గురివీ టీచర్ ఉద్యోగాలే! రామదాసు గారి కూతురుకు పెళ్లయి వేరే ఊరు వెళ్లిపోయింది. ఆమె తల్లిదండ్రులు కూతురుతో పాటు అదే ఊళ్లో స్థిరపడ్డారు. కూతురు, అల్లుడు ఉద్యోగాలకు వెళ్లిపోవడంతో మనవలను చూసుకోవాలని.

తమ అన్నదమ్ములలాగానే తమ కొడుకులంతా కలిసి ఉండాలని ఆ ఇల్లు కట్టుకున్నారు. అయితే వాళ్లంతా వేరుపడి తులసీదాసు, అన్నపూర్ణమ్మ గారికి ఆవేదన మిగిల్చారు. ఒకే గ్రూప్ హౌస్‌లో ఉంటున్నా కొడుకులది ఎడమొహం, పెడమొహం. వారి విభేదాలు తారాస్థాయికి అందుకొన్నాయి. ఒకరు కారు కొన్నారనీ, ఇంకొకరు ఎక్కడో ఇళ్ల స్థలం కొన్నారనీ, ఒకరికి మామగారి నుంచి పొలం కలిసొచ్చిందనీ ` ఇలా ఒకరంటే ఒకరికి అసూయ, ద్వేషం. ఆ ద్వేషంతో ఆ ముగ్గురికీ ఒకరంటే ఒకరికి పగ పెరిగి మాట్లాడుకోవడం మానేసారు. ఐదేళ్ల క్రితం తులసీదాసు గారు కొడుకుల పరిస్థితి తలచుకొని బాధపడేవారు. వారికి రఘుపతి, రాఘవ, రాజారాం అనే శుభప్రదమైన పేర్లు పెట్టినందుకు వారి మధ్య ప్రేమవంతెనలు లేకపోగా అడ్డుగోడలు కట్టుకున్నారనీ వేదన చెందేవారు. ఒక రాత్రి బాధతో ఆలోచనలో పడి, నిద్రలోకి జారుకొని ఆయన శాశ్వతనిద్రకు లోనయ్యాడు. తులసీదాసు గారు చనిపోయన తర్వాత నెల నెలా మాసికం రోజన మాత్రం ముగ్గురూ కలిసేవారు. ఆ తర్వాత సంవత్సరీకం.

అన్నపూర్ణమ్మ గారు ముగ్గురు కొడుకుల ఇంట్లో మూడేసి నెలలు చొప్పున ఉండేవారు. తను తొమ్మిది నెలలు కడుపులో వారిని మోసి, పెంచినందుకు కాబోలు! ఒక్కొక్కరు మూడేసి నెలలు ఆవిడను పోషించడానికి నిర్ణయం తీసుకున్నారు. ఇదంతా నాకు ఎలా తెలిసిందంటే` అన్నపూర్ణమ్మ గారు నాకు ఉత్తరాలు రాసేవారు. ఆ ఉత్తరాలలో ఆవిడ దిగులు, వేదన వెళ్లగక్కేవారు. అలా ఆవిడను బ్రతికి ఉన్నప్పుడు చూడలేకపోయినా కనీసం ఆవిడ మాసికం రోజున ఆవిడ జ్ఞాపకాలతో గడుపుదామని వచ్చాను.

ఆ ఊళ్లో మాకు ఇల్లు ఉంది. నాన్నగారు రిటైర్ అయి ఆ ఊళ్లోనే స్థిరపడ్డారు. నాన్నగారి ద్వారా మరికొన్ని సంఘటనలు తెలిసాయి. ఆ ఊళ్లో పార్కు, కల్యాణ మండపం, శ్రీరాముడి గుడి... ఇవన్నీ ఉన్నాయి. వీటిని అప్పట్లో తులసీదాసు, రామదాసు గారు పర్యవేక్షించేవారు. వారి హయాంలో పార్కు ఎప్పుడూ కళకళలాడుతూ ఉండేది. దేవాలయంలో నిత్యపూజలు జరిగేవి. కల్యాణ మండపంలో కూడా ప్రతిరోజూ వేడుకలు జరుగుతూ ఉండేవి. అయితే ఇప్పుడు తండ్రుల వారసత్వంగా రఘుపతి, రాఘవ, రాజారాం ` ఈ ముగ్గురూ వేరుపడిపోవడంతో వారిని అనుసరించే ఆ ఊరివాళ్లు మూడు గ్రూపులుగా విడిపోయారు. దానితో గొడవలు, తిట్టుకోవడం. ఆ ముడిరటి మీద ఆధిపత్యం కోసం ఒకరిపై ఒకరికి ద్వేషం. ఆ ఇంట్లో ముగ్గురు అన్నదమ్ములే కాదు, ఆ ఊరు కూడా మూడు వర్గాలుగా విడిపోయింది. నాన్నగారు ఈ విషయం చెప్పి చాలా బాధపడ్డారు.

రెండు రోజుల తర్వాత మా ఇంట్లో మా నాన్నగారి సప్తతి వేడుకలు నిర్వహించాలనీ ఆ ముగ్గురు అన్నదమ్ములను పిలవడం కోసం వచ్చాను. అయితే ఆ ముగ్గురు ఇంట్లో లేరు. ఆ ముగ్గురు అన్నదమ్ములకు ముగ్గురు అబ్బాయిలు. వాళ్లంతా ఒకే తరగతి. ఆ ఊరికి పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక స్కూల్లో చదువుతున్నారు. ఆ ముగ్గురు ఆ అపార్ట్‌మెంట్ సెల్లార్ దగ్గర ఆడుకుంటున్నారు. నాకు చాలా సంతోషం కలిగింది. అన్నదమ్ముల మధ్య యుద్ధాలు జరుగుతున్నా, వారి పిల్లలు మాత్రం తమ స్నేహ సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఆ పిల్లలతో కబుర్లలో పడి, నేను కూడా వారి తండ్రులు వచ్చేవరకూ ఆ సెల్లార్‌లోనే గడిపాను. ఇంతలో రఘుపతి, రాఘవ, రాజారాం ముగ్గురూ వచ్చేసారు.

తల్లిగారికి వారి పుట్టింటివారి నుంచి ఏదో స్థలం సంక్రమించింది. ఆ స్థలం ఎవరికి చెందాలో రాయకుండా ఆవిడ చనిపోయింది. ఆ స్థలాన్ని అమ్మేసి ఆ డబ్బులు పంచుకుందామనే ప్రయత్నం ఉన్నారు ఆ ముగ్గురూ. నన్ను చూసి 'రా కేశవ్' అన్నాడు పెద్దవాడు రఘుపతి. నేను ముందు రఘుపతి ఇంటికి వెళ్లి, మా తండ్రి సప్తతి వేడుకలకు ఆహ్వానించాను. అలాగే మిగతా అన్నదమ్ములైన రాఘవ, రాజారాంలను కూడా పిలిచాను.

వారి ముగ్గురు పిల్లలు రఘుపతి ఇంట్లో పుస్తకాలు తీసి చదువుతున్నారు. అందులో ఒకడు రఘుపతి కొడుకు` ''నాన్నగారూ, జాతి సమైక్యత అనేదాని మీద వ్యాసరచన పోటీ పెట్టారు మా స్కూల్లో. దాని గురించి మాకు చెపుతారా?'' అని అడిగారు. అందుకు వెంటనే రఘుపతి` ''తర్వాత చూద్దాం లేరా. ఇప్పుడు నాకు అంత టైమ్ లేదు'' అన్నాడు. అతను కూడా ఏదో వ్యాపారం చేస్తున్నాడు, టీచర్ ఉద్యోగంతో పాటు. దాని కోసం స్కూలు నుంచి వచ్చిన తర్వాత బైట మార్కెట్ యార్డ్ ప్రాంతానికి వెళ్తాడు.

''సరే, నేను వెళ్తానురా. మీ నాన్నగారి సప్తతి వేడుకలకు వస్తాను'' అన్నాడు.

నేను ''అలాగేరా!'' అంటూ ఆ పిల్లల వైపు చూసి ''మీకు జాతి సమైక్యత గురించి చెబుతాను. రాసుకోండి.'' అన్నాను.

వాళ్లు ఉత్సాహంగా నా వైపు తిరిగి, నేను చెప్పింది రాసుకోవడం ప్రారంభించారు. ''ఎల్లుండి మా ఇంట్లో మా నాన్నగారికి పుట్టినరోజు. మీరు ఎలాగూ వస్తారు కదా! నేను చెప్పిన విషయం రేపు అందరి ముందు మాట్లాడాలి. బాగా మాట్లాడినవారికి బహుమతి ఇస్తాను'' అన్నాను.

''అలాగే అంకుల్'' అంటూ వాళ్లు ఉత్సాహంగా నా వంక చూసారు.

★ ★ ★

రెండు రోజుల తర్వాత మా ఇంట్లో మా నాన్నగారి సప్తతి వేడుకలు

ఘనంగా చేసాం. ఆ ఊళ్లో మా బంధువులు, స్నేహితులతో పాటు ఆ ముగ్గురు అన్నదమ్ములూ, వారి పిల్లలూ వచ్చారు. మా అమ్మా నాన్నలకు వారి ఆయురారోగ్యాలు నిమిత్తం పూజలు జరిపించాను. సత్యనారాయణ వ్రతం అయ్యింది. భోజనాలు అయిన తర్వాత ఎవరూ వెళ్లిపోవద్దనీ, ఇప్పుడు పిల్లలతో పాటలు, అలాగే వారి మాటలు, ప్రసంగాలు ఉంటాయనీ, పిల్లలందరినీ ఆశీర్వదించాలని చెప్పాను.

భోజనం చేసిన తర్వాత అంతా ప్రశాంతంగా ఇంటి ఎదురుగా షామియానాలో కూర్చున్నారు. నేను రఘుపతి, రాఘవ, రాజారాం, పిల్లలను వేదిక మీదకు పిలిచాను. ఆ పిల్లల పేర్లు రాముడు, కృష్ణుడు, భరతుడు. ''మీరు నేను చెప్పిన జాతీయ సమైక్యత గురించి చెప్పండి'' అన్నాను నవ్వుతూ.

రఘుపతి కొడుకు రాముడు చెప్పడం మొదలుపెట్టాడు.

''జాతీయ సమైక్యత అనేది కులం, మతం, సామాజిక భేదాలు లేకుండా ప్రజలనందరినీ ఒకే తాటిపై నడిపించే ఐక్యత. ప్రజల్లో ఏకత్వం, సోదరభావం పెంపొందించేది. దీనివల్ల దేశం సమగ్రంగా ఉంటుంది. అభివృద్ధి, జాతి సమైక్యత మీద ఆధారపడి ఉంటుంది.'' రాముడు చెప్పడం పూర్తి కాగానే రాఘవ కొడుకైన కృష్ణుడు చెప్పడం మొదలుపెట్టాడు.

''దేశాన్ని ఒకటిగా మార్చడంలో జాతీయ సమైక్యత ముఖ్య పాత్ర వహిస్తుంది. ప్రతీ పౌరుడికి సమాన అవకాశాన్ని ఇస్తుంది. ఒకరి విషయంలో ఒకరి జోక్యం లేకుండా అందరూ స్వేచ్ఛగా జీవించేందుకు జాతీయ సమైక్యత తోడ్పడుతుంది.'' కృష్ణుడు ముగించగానే భరతుడు, రాజారాం కొడుకు చెప్పడం మొదలుపెట్టాడు.

''జాతీయ సమైక్యత దేశం స్థిరంగా ఉండడంలో సహాయపడుతుంది. కుల, మత, ప్రాంత, భాషాపరమైన వివాదాలకు అతీతంగా జాతి సమైక్యత పని చేస్తుంది. దేశ అభివృద్ధిలో జాతీయ సమైక్యత అత్యంత కీలకమైనది. జాతీయ సమైక్యత ద్వారా సామాజిక సామరస్యం తద్వారా ఆర్థిక పురోగతి పెరుగుతుంది. అందువల్ల దేశ నిర్మాణంలో జాతీయ సమైక్యత ముఖ్య పాత్ర వహిస్తుంది.'' భరతుడు చెప్పడం పూర్తి చేసాడు.

ఆ ముగ్గురు పిల్లలు నేను చెప్పింది ఏదీ పొల్లు పోకుండా చెప్పడంతో ఆ ముగ్గురి తల్లిదండ్రులు లేచి ఉత్సాహంగా చప్పట్లు కొట్టారు.

''భలే చెప్పావయ్యా!'' అంటూ రఘుపతి, రాఘవ, రాజారాంలతో పాటు ఆ వేదిక మీద వున్న మిగతావారు నా వంక ప్రశంసాపూర్వకంగా చూసారు.

అందరికీ చేతులు జోడిరచి చెప్పడం మొదలుపెట్టాను.

''మిత్రులారా, నేను ఒక సైనికాధికారిని. దేశం సరిహద్దుల్లో నిత్యం మన దేశ భద్రత కోసం పహరా కాసే సైనికులకు వెన్నుదన్నుగా నిలిచేవాడిని. వాళ్లతో పాటు యుద్ధరంగానికి వెళ్లి శతృవులతో పోరాటం చేయడానికి వెనుకాడనివాడిని. మన దేశ పౌరుల ప్రాణానికి ఏ ప్రమాదం లేకుండా శతృవులతో పోరాడుతూ మేము ప్రాణాలను లెక్క చేయకుండా అక్కడ పని చేస్తుంటే, ఇక్కడ మీ కుటుంబాల్లో వైషమ్యాలు. ఒకరంటే ఒకరికి పడకపోవడం. ఒకే ఇంట్లో వుంటున్నా అడ్డుగోడలతో బ్రతికే మనుష్యులు. ఇలాంటి కుటుంబాలు వున్న ఊళ్లో కూడా ఆ కుటుంబంలోని విభేదాలే ఊళ్లోకి వస్తాయి. కుటుంబ సభ్యుల మధ్య ఉన్న అగాధం ఊరు కూడా వేరు పడేటట్లు చేస్తుంది. ఈ క్రమంలో మేము రెప్ప వాల్చకుండా కాపాడేది ఇలాంటి మనుష్యులనా! అనే నిస్పృహ కలుగుతుంది.'' మాట్లాడడం ఆపి ఆ ముగ్గురు అన్నదమ్ముల వంక పరిశీలనగా చూసాను. వాళ్లు తల వంచుకున్నారు.

''సమాజం అంటేనే కుటుంబాలు. కుటుంబాలు కలిసి వుంటే సమాజంలో ఐక్యత వస్తుంది. అలా అందరి సమైక్య రాగం సంఘటితంగా వినిపిస్తే అది దేశ సమైక్య రాగంగా మారుతుంది. అప్పుడు మనది వసుదైక కుటుంబం అవుతుంది. మన దేశాన్ని పావన గంగ, అగ్నిపునీత సీత, కర్మభూమి అనేవారు. ఎందరికో ఆశ్రయమిచ్చిన పవిత్ర భూమి ఇది. మనం కలిసి మెలసి సాగితేనే కుటుంబాలు ప్రేమ సూత్రంతో ముడి పడితేనే మన దేశానికి క్షేమం.'' చెప్పడం

ముగించాను. పాట అందుకున్నాను.
'రఘుపతి, రాఘవ, రాజారాం
పతిత పావన సీతారాం
ఈశ్వర అల్లాహ్ తేరే నామ్
సబ్ కో సన్మతి దే భగవాన్'
నా పాటతో అక్కడ ఉన్న
గొంతుకలన్నీ కలిసాయి.
'ఇది మార్పుకు నాంది. ఆ ముగ్గురి
అన్నదమ్ముల కుటుంబాల్లోనూ,
ఇంకా ఆ ఊళ్లోనూ.' అలా
ఆలోచిస్తూనే ఆ పాటను పాడడం
కొనసాగించాను

★★★

కథ

# కీడెంచి మేలెంచు .

వాగుమూడి లక్ష్మీ రాఘవరావు

అనూ మా అయ్య పోయినప్పుడు నా వయసు పది నెలల పది రోజులు.. ఊహలేని వయసు. ఊసులేని వయసు. ఎందుకు కిలకిల నవ్వుతానో, ఎందుకు గుక్కపట్టి ఏడుస్తానో ఏ జోల పాటకు ఎగిరి గంతేస్తానో నాకే తెలియని వయసు.

"జో అచ్యుతానంద జోజో ముకుందా...లాలి పరమానంద రామ గోవిందా" అని జోల పాడితే కిలకిల నవ్వేవాడినట." లాలి..లాలి ...లాలి పరమానంద చిదానంద గోవిందా..చిన్మయ బ్రహ్మానంద హరి గోవిందా" అని జోల పాడితే ఊయలలో ఏగిరెగిరి పడుతూ కిలకిల నవ్వేవాడినట.

నాకు ఊహ వచ్చేసరికి ఒంటరి తనమే నాకు బంధువయ్యింది. నాకు అమ్మమ్మతాతయ్యలు, మేన మామలు,మేనత్తలు, మామయ్యలు,బాబాయి పిన్నిలు, పెదనాన్న పెద్దమ్మలు అందరూ ఉన్నారు . నానమ్మ లేదు కానీ తాతయ్య ఉన్నాడు. అయితే వారంత నన్ను రకరకాలుగా తిట్టేవారు. అందరూ అయ్యను మింగి పుట్టాడు అని కామన్ గా తిట్టేవారు. అందుకే నాకు ఒంటరి తనం మహా నేస్తం అయ్యింది.

బంధువులు అనబడే
—బంధుల పచ్చి బూతుల
నడుమ,రాబంధువుల మిత్రుల,
అనుచరుల కొత్త కొత్త బూతుల
నడుమ పదవతరగతి లోకి
ప్రవేశించాను..

ఇక్కడ మీకొక అనుమానం రావచ్చు. బంధు వులు అంటే వారేదో పెడుతున్నారు కాబట్టి వారికి కొంచెం తిట్టే అధికారం ఉండవచ్చు. ఆ బంధువుల మిత్రులకు, అనుచరులకు నన్ను తిట్టే అధికారం ఎలా ఉంటుంది? ఇదే కదా మీ అనుమానం. మొగుడు తిరుగుబోతు దానా అంటే మొగుడుకు మందు పోయించేవాడు మహా తిరుగుబోతుదాన పక్క ఎక్కుతావా? అంటాడు.అప్పుడు మత్తులో ఉన్న మొగుడు, మందు పోయించిన మిత్రుడు లేక అనుచరుడు ఎవరిని ఏమన్నా పట్టించుకోడు. మొగుడుకి మత్తు దిగాక విషయం చెబితే, మందు పోయించే వాడు మాట తూలితే తప్పేమిటి? నీ లాంటి పెళ్ళాలు పండగ పూట కూడా పాత మొగుడేనా? అని పైకి అనకపోయిన మనసులో అనుకుంటారు. మా మిత్రులు ఓపెన్ మైండ్ ఉన్న వాళ్ళు కాబట్టి పైకి అనేసారు అంతే.. వారేమన్నా పట్టించుకోకు అంటారు. నా పరిస్థితి కూడా అంతే. అదేమంటే నువ్వు అయ్యని చంపి పుట్టినవాడివి రా.. నీకు తిట్లు తన్నులు తినే అధికారమే గానీ తిట్టే అధికారం,తన్నే అధికారం లేదు అనేవారు. గదిలో పెట్టి కొడితే పిల్లి కూడా పులి అవుతుంది. నిజమే. అయితే దానికి కొంచెం సమయం పడుతుంది. అప్పటి వరకు భరించక తప్పదు.

మన పురాణాలు మహా విచిత్రమైనవి. రామాయణం ఏకపత్నీవ్రతుని సమర్థిస్తూనే, ఏకపత్నీ వ్రతుడు భార్యను అనుమానించి అడవులకు పంపిన తప్పులేదు. అదే ఆదర్శ దాంపత్యం అంటుంది. భాగవతం శ్రీకృష్ణ లీలలను సమర్థిస్తుంది. బహుపత్నీ వ్రతాన్ని సమర్థిస్తుంది. ద్రౌపది నికూడ సమర్థిస్తుందిలే.

నోరుండాలే కానీ వేదాలను కూడా బూతు పురాణం అని అనవచ్చును.

ఏదేమైతేనేం కానీ పదవతరగతి లో నాకు స్కూల్ ఫస్ట్ వచ్చింది. ఆ విషయం తెలిసిన మరుసటి నెలలోనే మా తాతయ్య చనిపోయాడు. మా తాతయ్యను కొందరు అదృష్టవంతుడు అందరి నడుమ పోయా డంటే, మరి కొందరు కాదు కాదు దురదృష్టవంతుడు కొడుకులకోడళ్ళ కూతుళ్ళ అల్లుళ్ళ రంపపు కోత భరించలేక పోయాడు అన్నారు.

అప్పుడు మా అమ్మమ్మ తాతయ్యలు ,” నీ అయ్య అయ్య...తాత మహా కంత్రీవాడు. పదిమందిని ముంచీ నాలుగు చోట్ల భూములు బాగానే సంపాదించాడు. మీ పెద్దనాన్న కు, మీ బాబాయి కి మగపిల్లలు లేరు. ఇద్దరూ ఆడపిల్లలే. నిజం చెప్పాలంటే మీ బాబాయి కూతురు అతనికూతురు కాదు. మీ పిన్ని ఉంచుకున్నవాడి కూతురు. . కాబట్టి మీ తాత ఆస్తి మొత్తం నీకే చెందుతుంది. మీ అమ్మ అమాయకురాలు. నువ్వే మీ అమ్మను ఒప్పించి ఇద్దరూ మా యింటికి వచ్చెయ్యండి. అక్కడేదో పని చూసుకుంటే నీకు కూడుకు కొరతే ఉండదు. నీ పెద్దనాన్న, బాబాయి మహా దొంగలు.వారిని నమ్మకూడదు. ఎప్పుడైనా కీడెంచి మేలెంచాలి “అని అన్నారు.

ఆ తర్వాత మా పెద్దమ్మ, పిన్నీ . “ అదృష్టవంతుడిని లక్ష్మీ దేవి కరుణిస్తుంది. దరిద్రుడిని సరస్వతీ దేవి కరుణిస్తుంది. వీడు పెద్ద పెద్ద చదువులు చదివితే ఫీజులు, పుస్తకాలు మనమొక్కడినుండి తెచ్చిస్తాం” అని కూడబలుక్కుని నన్నురైస్ మిల్ లో వడ్ల బస్తాలు మోసే పనిలో పెడదాం అనుకున్నారు.

ఈ విషయం మా అమ్మకు చెప్పారు.”మా అమ్మ ఎవరేం చెప్పినా ఊ అనడం, తప్ప ఊఊ అనడం తెలియని అమాయకురాలు. నడుం వంచకుండా పనిచేసుకుని కడుపు నింపుకోవాలి గానీ పాపం పుణ్యం అని ఆలో చించకూడదు. ఎవరి పాపాన వారే పోతారనుకునే పురాణ కాలం నాటి స్త్రీమూర్తి.

పిన్నీ పెద్దమ్మ నన్ను రైస్ మిల్ పనికి పంపడానికి సిద్దమయ్యారు. మా లెక్కల మాస్టారు కామేశ్వరరావు గారు,” వాడు లెక్కల్లో వందకు వంద

మార్కులు తెచ్చుకున్నాడు. సైన్స్ లో తొంబది తొమ్మిది. తెలుగు లో తొంబది ఎనిమిది. అలాంటి వాడిని పై చదువులకి పంపాలిగానీ పనికి పంపడం ఏమిటి? మీరు చదివించలేక పోతే చెప్పండి? వాడిని చదివించే దాత లను నేను ఏర్పాటు చేస్తాను.” అని అన్నారు.

అప్పుడు పిన్నీ పెద్దమ్మ “ వాడు చదువులో తెలివిగలవాడే మాష్టారు.మేం రెక్కాడితే గానీ డొక్కాడని వాళ్ళం. మా యింట్లో ఆడవాళ్ళు ఇంత వరకు ఎప్పుడూ గడపదాటి ఎరుగం. ఎప్పుడన్నా సినిమాకు వెళ్ళాలన్నా గూడు బండిలో రెండవ ఆటకు వెళ్తాం. ఎవరికీ కనపడకుండా వెళ్ళి వస్తాం. ఇవన్నీ మీకు తెలియని విషయాలు కాదనుకోండి.

ఇక మన దాతలు ఉన్నారు చూసారు. ముందు స్వర్గం చూపిస్తారు. తమ అరచేతిలోనే వైకుంఠం ఉందంటారు.సరే అంటే ఆ తర్వాత నరకంలో పడేస్తారు. పరులను నమ్మి బురద గుంట లో పడేకంటే మనల్ని మనం నమ్ముకుని పచ్చడి మెతుకులు తినడం మంచిది. అయినా దాతలు చదివించగలరేమో గానీ ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించలేరు కదా?

మాలాంటి వారికి ఉద్యోగం లేని చదువులు బూడిదలో పోసిన పన్నీరే కదండి. మావాడు బాగా చదువుకున్నాక ప్రభుత్వ ఉద్యోగం రాకపోతే,ఇటు ఉద్యోగం రాక,అటు ఏ పనిరాక రెండిటికీ చెడ్డ రేవడి అవుతాడు. ఏదైన కీడెంచి మేలెంచమన్నారు.”అని అన్నారు.

పెద్దమ్మ పిన్నీ నన్ను పనిలోకి పంపించడానికి మంచి ముహూర్తం నిర్ణయించారు. మొదటి కూలీ తెచ్చి మాకే చెరిసగం ఇవ్వమని పిన్నీ పెద్దమ్మ నా దగ్గర మాట తీసుకున్నారు.

నేను పనిలోకి వెళ్ళే మంచి మూహూర్తం వచ్చే ముందు రాత్రే పెద్దమ్మ పాము కాటుకు బలై మరణిం చింది. అలా నా పని ముహూర్తం వాయిదా పడింది.

పెద్దమ్మ మరణం పిన్నిలో వణుకు పుట్టించింది.

కామేశ్వరరావు మాష్టారు ప్రోత్సాహం తో బాబాయి, పెద్దనాన్న నన్ను పైచదువుకు పంపారు.

“ మీ బంధువుల విషయంలో నువ్వు కీడెంచి మేలెంచు. మీ బాబాయి,మీ పెద్దనాన్న గాలివాటం మనుషులు. పెళ్ళాల చేతిలో కీలుబొమ్మలు. నాకు తెలిసి మీ బంధువులు రాబంధువులే కానీ నీ మేలు కోరే వారెవరూ లేరు.” అని నాకు కామేశ్వరరావు మాష్టారు చెప్పారు.

మాష్టారు మాటలు నాకు బాగా నచ్చాయి.

పెద్దనాన్న పెద్దమ్మ చనిపోయాక తాగుడుకు బానిసయ్యాడు. కలిసివచ్చే కాలం వస్తే నడిచి వచ్చే కొడుకు పుడతాడు అంటూ, తన కూతురుని బారు షాపు ఓనర్ కి ఇచ్చి పెళ్ళి చేసాడు.

పెద్దనాన్న కూతురు పెళ్ళి చేసేటప్పుడు అమ్మ సంతకాలు తీసుకుని కొన్ని భూములు అమ్మేసాడు. భూములు అమ్మగా వచ్చిన సొమ్ములో సగం బాబాయి కి ఇచ్చి దైవ దర్శనం చేసుకుని రమ్మని అమ్మని తిరు పతికి పంపించాడు. అమ్మ వాటా కింద దైవ దర్శనం ప్రాప్తించింది. దానికే అమ్మ మహదానంద పడిపోయింది. తాతయ్య సంపాదించిన దానిని నాలుగింతలు చేసింది నాన్న అని అందరికీ తెలుసు. ఉమ్మడి కుటుంబం లో అనుబంధాలు ఆత్మీయతలు నడుమ జరిగే శ్రమ దోపిడి, ఆర్థిక దోపిడి లెక్కలోకి రాదు. అందుకే నిజం తెలిసిన కాలం ఉమ్మడి కుటుంబాలను విచ్చిన్నం చేస్తుంది. ఆహా కాలమెంత యథార్థమైనది..

పెద్దనాన్న అల్లుడికి అంతకు ముందే పెళ్ళి అయ్యింది. ఆ విషయం పెద్దనాన్న కు అక్క పెళ్ళయ్యాక తెలిసింది. బావ మొదటి పెళ్ళాం చనిపోయింది. అతగాని పెళ్ళాం చనిపోయింది అని కొందరంటే కాదు కాదు అతగాడే పెళ్ళాన్ని చంపేసాడని కొందరు అంటారు.

నేను బావ ఇంటికి వెళ్ళినప్పుడు బావ నాకు తాగుడు అలవాటు చెయ్యాలని చూసాడు. కానీ అతనికది సాధ్యం కాలేదు. తాగిన మత్తులో పెద్దనాన్న “ మీ అయ్యి చనిపోవడానికి, మీ పెద్దమ్మ, పిన్నీ, మీ బాబాయిలే కారణం రా.. అందులో నేను ప్రాణమున్న పైకి ఏం అనలేని మట్టి బొమ్మను రా.. మీ పెద్దమ్మ ఆడపిల్లను కన్నది. మీ అమ్మ కంటే మీ పిన్నికే

ముందుగా కడుపు వచ్చింది. ఆ కడుపు మీ బాబాయి వలన రాలేదని కొందరంటారు. శృంగార పరంగా మీ బాబాయి కి అసలు తక్కువ.. ఆత్రం ఎక్కువ అని కొందరంటారు.

మీ అయ్య మంచివాడు. బంధాలకు అను బంధాలకు బాగా విలువ ఇచ్చేవాడు. నిజం చెప్పాలంటే మీ తాత అదే మా అయ్య కూడబెట్టిన ఆస్తిని పెంచి పెద్ద చేసింది మీ అయ్యే. మీ అమ్మ మగపిల్లవాడైన నిన్ను కనగానే,మీ పెద్దమ్మ కు,పిన్నికి కడుపులో మంట పెరిగింది.ఆ మంటే విషం అయ్యింది. కళ్ళల్లో నిప్పులు పోసుకున్నారు. రకరకాల విష వృక్షాల ఆకు పసరలతో మీ అయ్యను చంపేసారు. ఇది చట్టానికి దొరకని హత్య." అంటూ జరిగిపోయిన నిజాలను చాలా కక్కేసాడు.

అప్పటినుండి ఎవరేం చెప్పినా కీడెంచి మేలెంచ డం ఎక్కువగా అలవాటు చేసుకున్నాను.

పిన్ని అప్పుడప్పుడు నా దగ్గర చిత్రాంగి వేషాలు వెయ్యడం మొదలు పెట్టింది. అప్పటినుండి నాకు ఇంట్లో ఉండాలంటేనే కొంచెం కష్టంగా ఉండేది.

నేను కాలేజీ లో చదివేటప్పుడు నాకు చాలా మంది మిత్రలతో పరిచయాలు ఏర్పడినవి. ముఖ్యంగా అయిదుగురు గురించి చెప్పాలి. అందులో మొదటి మిత్రురాలు కృష్ణ కుమారి. నాతో ఎక్కువ సేపు గడపటానికి బాగా ఇష్టపడేది. చదువులో నాతో పోటీ పడటానికి ప్రయత్నించేది. ఒకసారి నాకు ఐ లవ్ యూ చెప్పింది. అప్పుడు నేను నా యింటి చరిత్రనంత చెప్పాను. అప్పటినుండి ఓన్లీ ఫ్రెండ్ షిప్ లవ్ లేదు.గివ్వు లేదు అన్నట్లు ప్రవర్తించసాగింది.

ఇక రెండవ మిత్రుడు రమణ మూడు ముసలం నాలుగు లవర్ ఐదు రంగ.

రమణ బాగా ఉన్నవాడు. కాలేజీ అంటే తాగడం, తిరగడం, ఎంజాయ్ చేయడం. పరీక్షలు వస్తే మాస్ కాఫీలు పెట్టి వీర విజయం సాధించడం అనేవాడు. అప్పుడు నేను దేనికైనా కీడెంచి మేలెంచాలి. మాస్ కాఫీలు పెట్టి ఇన్విజిలేటర్ కు దొరికిపోతే ఏమవుతుందో ఆలోచించు రమణ అనేవాడిని. వాడు నామాటలను లెక్కచేసేవాడు కాదు. లైఫ్ లో కీడెంచి మేలెంచు వాడు పైకి రాలేడు అనేవాడు. కాలేజీలో జరిగే చిన్న చిన్న పరీక్షలను కృష్ణ కుమారి తో వ్రాయించేవాడు. అందుకుగాను కృష్ణ కుమారి కి హ్యాండ్ బాగులు, లిప్ స్టిక్ లు, ఐస్ క్రీమ్ లు, మత్తు పానీయాలు బహుమతులు గా ఇచ్చేవాడు.

ఇక ముసలం గురించి చెప్పాలంటే వాడి అసలు పేరు ముసలం కాదు. ముసలం అనేది వాడి కలం పేరు. వాడు కవిత్వం వ్రాస్తాడు. కవిత్వంలోనే మాట్లాడతాడు. కవిత్వమొక అందమైన లోకం. ఆ లోకం లో నవర సాలన్నీ ఉంటాయి. ఆకలి మంటలు ఉంటాయి. ఆక్రందనలు ఉంటాయి. మరణాలు ఉంటాయి. మహా జననాలు ఉంటాయి. పోరాటాలు ఉంటాయి. ఆరాటాలు ఉంటాయి. సంకుచిత స్వభావాలు ఉంటాయి. వెన్ను పోట్లు ఉంటాయి. పెన్ను పోట్లు ఉంటాయి. ఏదేమైనా హితాన్ని కోరేది సాహిత్యం అనాలి. అలా కాకుండా నిజం చెబితే నిందలు వేస్తారు. బొందలో పెడతారు.అంటూ ఏవేవో మాట్లాడు తుంటాడు. నేను ఎక్కువగా ముసలం రూం లోనే ఉండేవాడిని.

కాలేజీలో ముసలం కవితకు ప్రోత్సాహక బహు మతి వచ్చిన నాడే తాగి తాగి పెద్దనాన్న చనిపోయాడు. నాడు పెద్దనాన్న అల్లుడు ఆస్తి కోసం గోల చేసాడు. బావ బాబాయి ఒకళ్ళ మీద ఒకళ్ళు పడి,కిందపడి చిన్నాక సైజు రౌడీల్లా కొట్టుకున్నారు. అప్పుడే కర్రపేడు గుచ్చుకోవడంతో బావ రెండు కళ్ళు పోయాయి. అక్క బాబాయి మీద పోలీసు కేసు పెట్టింది.

నా నాలుగవ మిత్రుడు లవర్. వాడి అసలు పేరు లవర్ కాదు. అది వాడికి వాడు పెట్టుకున్న పేరు. వాడి ఆలోచనలు ఎప్పుడూ ఆడపిల్లల బాడీ చుట్టూనే తిరుగుతుంటాయి. అమ్మాయిల వాలు చూపులలో విహరించాలంటాడు. చదువుకంటే లవ్వే సూపర్ అంటాడు.

రంగ కి తగవులంటే మహాయిష్టం. రంగ ముసలంతో కొత్త కొత్త తిట్లు రాయించుకుని

వాడికి నచ్చని వారందరిని తిడుతుంటాడు. వాడి తిట్లలో " జడకెదగని జుట్టుదాన, బొట్టటంటే ఇష్టపడని బోండం, మూతి రంగు దాన, ముసలి ఫేస్ ఉన్న పడుచు కన్య, నెల ఎక్కువ కుంక వంటి తిట్లు అధికంగా ఉంటాయి.

బాబాయి తన సెటప్ దగ్గరున్న దానిని ఇచ్చి నా పెళ్ళి చెయ్యాలని చూసాడు. బాబాయి ఆలోచనను పిన్ని కూడా సమర్థించింది.

" నిన్ను నష్టజాతకుడిని చేసింది మీ అమ్మేరా.. మీ అమ్మ మాటలు అసలు వినకు. మీ బాబాయి చెప్పినట్లు విని పెళ్ళిచేసుకో ..ఆస్తి నా పేరున వ్రాయి." అని నాతో పిన్ని అంది.

కీడెంచి మేలెంచడం అలవాటైన నాకు పిన్ని బాబాయి మాటల్లోని కీడు గురించి ఆలోచించాను. వారి మాటలకు కొద్ది రోజులు ఆగి నిర్ణయం తీసుకుంటానని సమాధానం చెప్పాను.

కాలేజీ చదువు పూర్తవ్వగానే ప్రభుత్వేతర ఉద్యోగం పేరుతో ఊరికి దూరం అయ్యాను. ఏవేవో చిన్న చిన్న ప్రభుత్వేత ఉద్యోగాలు చేసుకుంటూ పది సంవత్సరాలు గడిపేసాను. ఆ పది సంవత్సరాలు యింటి ముఖం చూడలేదు.

ఒకనాడు షాపింగ్ మాల్ దగ్గర మేఘన కనపడింది. మేఘన కామేశ్వరరావు మాష్టారు గారి ఏకైక సంతానం." అసలు ఊరి ముఖం చూడటం లేదేమిటి?" అని నన్ను అడిగింది.

" అమ్మే ఊర్లో కాలు పెట్టవద్దంది. అమ్మ కు బంధువు లంటే మహా ప్రాణం. తన బంధువులంతా రాబంధు వులని ఆమెకు తెలుసు. అయినా వారి నడుమనే తను కాలం చెయ్యాలంటుంది. నేను తండ్రిని మింగిన తాచుపాము ని అంటుంది. పుట్టగానే పోకుండా పెరిగావు. ఇక ఎవరి కంట పడకుండా నీ పొట్ట నువ్వు పోసుకో " అని అమ్మ అన్న మాటలన్నిటినీ మేఘనకు చెప్పాను.

" నా పెళ్ళి కుదిరిన పది రోజులకే నాన్న చనిపోయారు. నా పెళ్ళి ఆగిపోయింది. నేను ఇక్కడకు ఉద్యోగ నిమిత్తం వచ్చేసాను. మా అమ్మకు క్యాన్సర్ వచ్చింది. అప్పుడు మీ అమ్మగారే ఆర్థిక సహాయం చేసారు. మా అమ్మ చనిపోయినప్పుడు కూడా నా చేతిలో చిల్లిగవ్వ లేదు. అప్పుడూ మీ అమ్మగారే సహాయం చేసారు.

నువ్వు ఊరినుండి బయటకు వచ్చేసాక మీ అమ్మ ను మీ పిన్నీ బాబాయి తెగ హింసించసాగారు. అప్పుడు మా నాన్న కలగ చేసుకుని పోలీస్ కేసు పెడతానని మీ బాబాయి ని బెదిరించాడు. అప్పుడు మీ పిన్ని మా నాన్నకు మీ అమ్మ కు అక్రమ సంబంధం అంటగట్టాలని చూసింది. ఆమె మాటలను ఎవరూ నమ్మలేదు. అప్పుడే మీ పిన్ని తన కూతురుని ఒక వ్యభిచారికి ఇచ్చి పెళ్ళి చేసింది. వాడు రెండు సంవత్సరాలు తిరగకుండానే గుటుక్కుమన్నాడు.

మీ అమ్మ పిండి వంటలు చేసేవారి దగ్గర పనిలోచేరింది. మీ పిన్నీ బాబాయి లకు దూరంగా వేరే ఉండసాగింది. అప్పటినుండి మీ అమ్మ జీవితం హాయిగా గడిచిపోతుంది. నాలుగు డబ్బులు కళ్ళ చూస్తుంది. నలుగురికి తను చెయ్యగల సహాయం చేస్తుంది.

మీ పెద్దనాన్న అల్లుడు కూడా చనిపోయాడు. మీ పెద్దనాన్న కూతురు కు కూడా మీ అమ్మే అప్పుడప్పుడు ఉప్పు పప్పు బియ్యం ఇచ్చి వస్తుంటుంది. మీ బాబా యి కి ఏవేవో నాలుగు రకాల రోగాలు వచ్చాయట.

అవి పోయే రోగాలే కానీ బతికి బట్ట కట్టే రోగాలు కాదట. దానితో మీ బాబాయి మంచం లో పడ్డాడు. మీ పిన్ని నువ్వెప్పుడు కంటపడతావా? ఉన్న ఆస్తిని నీతో ఎలా తెగనమ్మించాలా అని ఎదురు చూస్తుంది. మీ పిన్ని నువ్వెక్కడ ఉన్నావో తెలుసుకోవడానికి జ్యోతిష్యుల దగ్గరకు వెళ్ళింది. యంత్రాలు వేయించింది. మంత్రాలు చదివించింది." అని ఊర్లో మా యింట జరిగిన విషయా లు నాకు మేఘన చెప్పింది.

" నువ్వెక్కడ ఉంటున్నావు?" మేఘనని నేను అడిగాను.

మేఘన తనుండే యింటికి నన్ను తీసుకువెళ్ళింది .

తన స్నేహితురాలు కరుణకు పరిచయం చేసింది. ఆ తర్వాత ఇద్దరూ అప్పుడప్పుడు నా రూం కి రాసాగారు.

నాలుగు నెలల అనంతరం మేఘన ఊరెళ్ళి అమ్మను కలిసింది. నా విషయంలో అమ్మ మనసు మారలేదని మేఘన ద్వారా గ్రహించాను.

తన ఐదవతనాన్ని హరించిన భూతాన్ని నేన్నది అమ్మ ప్రగాఢ నమ్మకం.

నాకు ప్రభుత్వ ఉద్యోగం రాలేదు కానీ నా అంకిత భావ వర్క్ చూసి ప్రైవేటు యాజమాన్యం నన్ను బాగా లైక్ చేసేది.

ఒకసారి మేఘన ఊరు వెళ్ళి వచ్చింది. మంచంలో ఉన్న బాబాయి ని పిన్నే మందు పెట్టి చంపేసిందన్న విషయాన్ని చెప్పింది. అమ్మ మనసు మారలేదని చెప్పింది.

మేఘన ఒకసారి ఒంటరిగా నా రూం కి వచ్చింది. "కరుణను చూసావు కదా? చాలా మంచి అమ్మాయి. అనాథ. ఉద్యోగం చేసి నాలుగు రాళ్ళు వెనక వేసుకుంది. కరుణను పెళ్ళి చేసుకుంటావా?" అని నన్ను అడిగింది.

మేఘన మాటలను విన్న నేను," ఏం నన్ను పెళ్ళి చేసుకోవడం నీకు ఇష్టం లేదా? నిజంగా నేను ఆడవారి ఐదవతనాన్ని హరించేవాడినా?"అని అడిగాను. నా ప్రశ్నకు సమాధానం చెప్పకుండానే మేఘన రూం నుండి బయటకు వెళ్ళిపోయింది.

మరునాడు నేను మేఘన యింటికి వెళ్ళాను. మేఘన ఊరు వెళ్ళిందని కరుణ చెప్పింది. నేను రూం కి వచ్చేసాను.

నాలుగు రోజుల అనంతరం మేఘన నా రూం కి వచ్చింది." నేను ఊరు వెళ్ళాను. మీ అమ్మ ను కలిసాను. నువ్వు నాతో అన్న మాటలను చెప్పాను.

అప్పుడు మీ అమ్మ వాడు నా ఐదవతనాన్ని హరించిన నష్టజాతకుడమ్మ. అలాంటి వాడు బంధువులమని చెప్పుకునే రాబందుల నడుమ ఉంటే వాడి ప్రాణానికే హాని జరుగుతుంది అని వాడి మనసును నొప్పించి ఊరు దాటించాను. అలా అమ్మగా మంచి పని చేసాననే అనుకుంటున్నాను. ఇక వాడి మనసు వాడి పెళ్ళి వాడిష్టం. నీ యిష్టం అని అందని అమ్మ చెప్పిందని" చెప్పింది.

" అమ్మంటే అమ్మే. అమ్మ ఎలాంటి బిడ్డనూ చంపుకోవడానికి ఇష్టపడదు. అమ్మా.. నువ్వు..ఎంత లోతెరిగిన మనిషివి. ?" అంటూ కొన్ని క్షణాలు గుక్కపెట్టి ఏడ్చాను. ఆ తర్వాత," నువ్వు పెళ్ళి కూతురువవుతావా? కరుణను పెళ్ళికూతురుని చేస్తావా?"అని మేఘనను అడిగాను.

" నా చిన్నప్పటినుండి నా గురించి నీకు బాగా తెలుసు. ఇక పెళ్ళయ్యాక ఎలా మారతాను అనేది నువ్వే ఆలోచించు. అంటే మేలెంచి కీడెంచు. కరుణ గురించి నాకు తెలిసింది నీకు చెప్పాను. అంతే ...ఇక నువ్వే ఆలోచించు అంటే కీడెంచి మేలెంచు " అని అంది మేఘన.

మేఘన మాటలను అనుసరించి ఆలోచించడం మొదలు పెట్టాను. కామేశ్వరరావు మాష్టారు గారు కీడెంచి మేలెంచమన్నారు. మేఘన విషయంలో కాలం మేలెంచి కీడెంచమంటుంది. కాలం ముందు ఎవరైనా సరే తలవంచాల్సిందే.

సర్వే జనాః సుఖినోభవంతు

కథ

# ఫ్రమ్ భారత్ విత్ లవ్

కొండగుంట వెంకటేష్

ఇస్లామాబాద్ ఇండియన్ ఎంబసి.

ఆ రోజు ఆదివారం. ఎంబసికి సెలవు. మాములుగా సెలవు రోజులో స్టాఫ్ అంతా సైట్ సీయింగ్ కు వెళతారు. ఎవరికి ఇష్టమైన చోటుకు వెళతారు. సాయంత్రవరకు ఎంజాయ్ చేస్తారు. . తరువాత ఒక్కోక్కరు తిరిగివస్తారు. . ఈ రోజు కూడా అదే హడావిడి ఉంది. కాని ఈ రోజు ఎవరు సైట్ సీయింగ్ కు వెళ్ళటం లేదు. ఏకంగా భారతదేశానికి తిరిగివెళ్ళిపోతున్నారు. నిన్నరాత్రి అంబాసిడర్ అతని భార్య వెళ్ళిపోయారు. ఈ రోజు స్టాఫ్ బయలుదేరుతున్నారు.

గేటు దగ్గర రెండు పెద్ద వ్యాన్ లు ఉన్నాయి. అందులోనే స్టాఫ్ ఏయిర్ పోర్ట్ చేరుకుంటారు. అక్కడ వాళ్ళకు భారతవైమానిక దళం ప్రత్యేకమైన విమానం ఎర్పాటుచేసింది. ఈ రోజు సాయంత్రంలోగా ఎంబసి ఖాళీ అయిపోవాలి. లేకపోతే పాకిస్థాన్ ప్రభుత్వం ఊరుకోదు. తగిన చర్యలు తీసుకుంటుంది.

అందరు సామాన్లు సర్దుకుని తయారుగా ఉన్నారు. ఒక్కొక్కరు వ్యాన్ లో కూర్చుంటున్నారు. వ్యాన్ బయలుదేరింది.

శద్రూప మాత్రం దూరంగా నిల్చుంది. ఆమె చేతిలో సెల్ ఉంది. మాటి మాటికి ఆ సెల్ వైపు చూస్తుంది. . తను జహీర్ అబ్బాస్ కాల్ కోసం కాచుకుంది. ఈ రోజు ఉదయం కాల్ చేస్తానని చెప్పాడు. టైం దాటిపోయింది. అయిన అతని దగ్గరనుంచి కాల్ రాలేదు. అందుకే కలవరపడుతోంది. దానికి కారణం లేకపోలేదు.

ఆమె జహీర్ అబ్బాస్ ప్రేమించుకున్నారు. పెళ్ళిచేసుకున్నారు కూడా. కాని వాళ్ళు పెళ్ళిచేసుకున్న విషయం ఎవరికి తెలియదు. ఒక్క అబ్బాస్ తల్లికి మాత్రం తెలుసు. శుద్రుపకు అమ్మ నాన్న లేరు. ఆరునెలలకు ముందు ఆమె తన వాళ్ళతో బారముల్లా ప్రాంతంలో ఉండేది. అప్పుడే ఆమెకు జహీర్ అబ్బాస్ పరిచయం అయ్యాడు. అతను భారత్ పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతంలో పరిచయం అయ్యాడు. ఆ రోజు ఆమెకు బాగా గుర్తుంది. . ఆ రోజు ఆమె డిగ్రీ ఫలితాలు వచ్చాయి. తన రిజల్ట్స్ తెలుసుకోవటాని కాలేజికి వెళ్ళింది. నోటీస్ బోర్డ్ లో అంటించిన ఫలితాలు చూసింది. ఆమె ఫస్ట్ క్లాసులో పాసయింది. సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయింది శద్రూప. ఈ శుభవార్త చెప్పటానికి వెంటనే ఇంటికి బయలుదేరింది.

అప్పుడే అనూహ్యమైన పరిణామం జరిగింది. ఉన్నట్టుండి ఆమెకు ఎదురుగా రాహుల్ ప్రత్యేక్షమయ్యాడు. అతను ఆమె క్లాస్ మెట్. చాల రోజులనుంచి ఆమెను ఇష్టపడుతున్నాడు. కొన్ని ప్రేమలేఖలు కూడా రాశాడు. కాని శద్రూప ఒప్పుకోలేదు. ఆమె లక్ష్యం ఆశయం ఒక్కటే. ఇంకో నాలుగు సంవత్సరాలలో ఆమె తండ్రి చక్రపాణి రిటైర్ కాబోతున్నాడు. ఈలోగా మంచి ఉద్యోగం సంపాదించుకోవాలి. చెల్లెలు వసంతసేనను చదివించాలి. తరువాత పెళ్ళి చెయ్యాలి. ఒక్క మాటలో చెప్పాలంటే ఒక కొడుకు తీసుకోవలసిన బాద్యతలు తీసుకోవాలనుకుంటుంది. అందుకే ప్రేమకు పెళ్ళికి ఆమె సముఖంగా లేదు. అదే విషయం రాహుల్ కు చెప్పింది.

అతను వినిపించుకోలేదు. విపరీతమైన ప్రేమ ఉన్నాదం అతన్ని అవహించుకుంది. శద్రూప మీద ఒక రకమైన పొసెసివ్ నెస్ ఉంది అతనికి. అందుకే శద్రూప మాటలు పట్టించుకోలేదు. రోజు తన ప్రేమను ఒప్పుకోమని వేదించేవాడు. రెండు సంవత్సరాలు ఆమెను చాల టార్చర్ కు గురిచేశాడు. ఫైనల్ ఇయర్ పరీక్షలు దగ్గరకు వచ్చాయి. శద్రూప పూర్తిగా చదువులో మునిగిపోయింది. రాహుల్ విషయం తాత్కాలికంగా మరిచిపోయింది. కాని రాహుల్ మాత్రం మరిచిపోలేదు. శద్రూప తప్ప అతనికి లోకంలో ఎవరు కనబడటం లేదు. ఇంకా కొన్ని రోజులలో ప్రిపేరేషన్ సెలవులు ఇస్తారు. . తరువాత శద్రూప వెళ్ళిపోతుంది. తరువాత పరీక్షలకు వస్తుంది. . ఈ లోగా తన ప్రేమను ఇంకోసారి వ్యక్తం చెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

ఆరోజు కాలేజి చివరిరోజు. అందరు పరీక్షలు ప్రిపేర్ కావటానికి వెళ్ళిపోతారు. తరువాత పరీక్షలు మొదైలన తరువాత వస్తారు... అంతవరకు ఆగే ఓపిక రాహుల్ కు లేదు. ఈ రోజు తాడో పేడో తేల్చుకోవాలని అనుకున్నాడు. అందుకే మళ్ళి ఒక ప్రేమలేఖ రాసి శద్రూపకు ఇచ్చాడు. అది ప్రేమ లేఖ అని ఆమె గ్రహించింది. తిన్నగా ఆ ఉత్తరాన్ని తీసుకుని ప్రిన్స్ పాల్ గదిలోకి వెళ్ళింది.

జరిగిన దంతా చెప్పి ఆయనకు ఆ ఉత్తరం ఇచ్చింది. దాన్ని చదివిన ప్రిన్స్ పాల్ అగ్గిమీద గుగ్గిలంలా మండిపోయాడు. రాహుల్ ను చెడ మడ తిట్టాడు. అంతేకాదు ఇంకోసారి ఇలాంటి పిచ్చివేషాలు వేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించాడు. గత్యంతరం లేక అందరిముందు రాహల్ క్షమాపణ కోరవలసివచ్చింది.

అవమానం కోపం కలిసికట్టుగా అతన్ని కుదిపేశాయి. కుతకుతలాడిపోయాడు. శద్రూప మీద కోపంతో ఉగిపోయాడు. తనకు ఆమె దక్కక పోయిన ఫర్వాలేదు. ఇంకెవరికి దగ్గకూడదని అనుకున్నాడు.

అందుకే భయంకరమైన ప్లాన్ వేశాడు. సమయం కోసం ఓపికగా

కాచుకున్నాడు.

ఆ సమయం రానేవచ్చింది.

రిజల్ట్స్ రోజు.

శద్రూప తప్పకుండ వస్తుందని అతనికి తెలుసు. అందుకే ఒక సీసాతో తయారుగా ఉన్నాడు. ఆ సీసాలో యాసిడ్ ఉంది. ఒక చుక్క శీరరం మీద పడిన వెంటనే కాలిపోతుంది. విపరీతమైన బాధ కలుగుతుంది. అదే మొత్తం యాసిడి శరీరం మీద పడితే ఆ బాధ వర్ణించలేరు. నరకం కంటే దారుణంగా ఉంటుంది.

అతను అనుకున్నట్టుగా శద్రూప వచ్చింది. ఆమె ఫలితాలు చూసుకుని తిరిగి వస్తుంటే అప్పుడు ఆమెకు ఎదురుపడ్డాడు రాహుల్. అతని చేతిలో ఉన్న బాటిల్ చూసింది. అందులో ఏముందే గ్రహించింది. అంతే ఒక్కక్షణం ఆలస్యం చెయ్యలేదు. తూనీగలా వేగంగా గేటు వైపు పరిగెత్తింది. అదే వేగంతో రోడ్డు మీద దూసుకుపోయింది. అయిన భయపడలేదు రాహుల్. తను కూడా రెట్టించిన వేగంతో ఆమె వెనుక పడ్డాడు.

అలా పరిగెత్తి పరిగెత్తి ఒక చోట ఆయాసంతో ఆగింది. ఆమెకు ఎదురుగా ఒక పెద్ద కంచెకనిపించింది. ఆ కంచె కు కొంతదూరంలో ఒక గుహ ఉంది. అది సహజసిద్దంగా ఏర్పడిని గుహ. కంచె దగ్గర ఒక బోర్డు ఉంది. దాని మీద ఇది పాకిస్తాన్ భూభాగం ఇటు వైపు ఎవరు రాకూడదని రాసుంది. ఈ విషయం ముందే శద్రూపకు తెలుసు.అటువైపు వెళ్ళవద్దని తండ్రి ఎన్నోసార్లు హెచ్చరించాడు. కాని ఆ రోజు ఆ విషయం ఆమెకు గుర్తుకురాలేదు... ఆమె ఆలోచన ఒక్కటే. ఎలాగైనరాహుల్ భారినుంచి తప్పించుకోవాలని.

అందుకే మొండి ధైర్యంతో కంచెలో ఉన్న కన్నంలోంచి లోపలికి వెళ్ళింది. గుహలో వెళ్ళి దాక్కుంది. కంచె దగ్గరకు వచ్చిన రాహుల్ అక్కడే ఆగిపోయాడు. అతనిలో అంతకుముందు ఉన్న కోపం పోయింది. దాని స్థానంలో సంతోషం కనిపించింది. పెదవులు విజయగర్వంతో విచ్చుకున్నాయి. లోపలికి వెళ్ళిన వాళ్ళు ఎవరు తిరిగిరారు. ముఖ్యంగా అడపిల్లలు అసలు రారు. ఒక వేళ వచ్చిన మాములుగా రారు. దారుణంగా రేప చెయ్యబడతారు. తరువాత వాళ్ళను చంపి రోడ్డు మీద పడేస్తారు.

దానికి రుజువు. ఇటివల జరిగిన ఒక సంఘటన. ఒక అమ్మాయి అబ్బాయి ఆసక్తితో కంచె దాటి లోపలికి వెళ్ళారు. తరువాత వాళ్ళు మళ్ళి బయటకు రాలేదు. ఏమైయ్యారో తెలియదు. వాళ్ళ కన్నవాళ్ళు పోలీసులుకు రిపోర్ట్ ఇచ్చారు. సరిగ్గా వారం తరువాత వాళ్ళిద్దరి శవాలు కంచె ఇవతల కనిపించాయి.. ఆ అమ్మాయిని దారుణంగా రేప్ చేసి చంపేశారు. అబ్బాయి కి కూడా అదే గతి పట్టింది.

ఆ సంఘటన భారత ప్రభుత్వాన్ని కదిలించింది. ప్రజలు కూడా విపరీతంగా స్పందించారు. అక్కడ క్కడ కొన్ని దరణాలు జరిగాయి. పాకిస్థాన్ సైనికుల రాక్షసత్వాన్ని నిరసిస్తూ ఉరేగింపులు జరిగాయి.

ఇంత జరిగిన పాకిస్థాన్ మాత్రం స్పందించలేదు. ఆ విషయం కొంచం కూడా పట్టించుకోలేదు. ఈ విషయం రాహుల్ కు తెలుసు. అందుకే అతను లోలోపల సంతోషపడ్డాడు. శద్రూప చాలఅందమైంది. పాకిస్థాన్ సైనీకులు ఆమెను విడిచిపెట్టరు. పీల్చి పిప్పిచేస్తారు.. ఆమె అందాన్ని పూర్తిగా ఆస్వాదించి చంపేస్తారు. . అతనికి కావల్సింది కూడా అదే. అందుకే సంతోషంతో వెనక్కి వెళ్ళిపోయాడు.

“మీరు లోపలికి రావటం చూశాను. మీ వెనుక వచ్చిన వ్యక్తి అప్పుడే వెళ్ళిపోయాడు. ఈ విషయం మీకు వెంటనే చెప్పాలని అనుకున్నాను. కాని అప్పుడే అర్జంట్ పని వచ్చింది. వెంటనే వెళ్ళిపోయాను. పాపం అనవసరంగా మీరు భయంతో ఇంత వరకు గుహలో ఉన్నారు”అన్నాడు సానుభూతిగా.

అతని మాటలు విన్నతరువాత శద్రూప భయంపోయింది. ఆ తరువాత ధైర్యంగా ఇద్దరు మాట్లాడుకున్నారు. అతని పేరు జహీర్ అబ్బాస్.. పాకిస్తాన్ ఇంటర్నల్ సెక్యురిటి డిపార్ట్ మెంట్ లో క్యాప్టన్ గా పనిచేస్తున్నాడు.. చాల మంచివాడు, సహృదయుడు. శద్రూపను స్వయంగా కంచె

దాటించాడు. ఇంకేపప్పుడు ఇటువైపు రాకూడదు అని హెచ్చిరించాడు.

బ్రతుకు జీవుడా అని ఆటోలో ఇంటికి చేరుకుంది శద్రూప. మరునాడు కంప్యూటర్ క్లాసుకు బయలుదేరింది శద్రూప. బ్యాగ్ లో సెల్ లేదు. అన్నిచోట్ల వెతికింది. కాని ఎక్కడ సెల్ కనిపించలేదు. బహుశా గుహలో మరిచిపోయిఉంటానని గ్రహించింది. వెంటనే ఆటోలో కంచె దగ్గరకు చేరుకుంది. ఆ రోజు లాగే లోపల సెక్యూరిటి ఎవరు లేరు. గుహలోకి వెళ్ళబోతుంటే అప్పుడే ఎదురు వచ్చాడు జహీర్ అబ్బాస్. . అతని చేతిలో ఆమె సెల్ ఉంది.

"ఫోన్ లో మీ స్నేహితుల నెంబర్లు ఉన్నాయి. ఇప్పుడే వాళ్ళకు కాల్ చేసి చెప్పాలనుకున్నాను. ఈ లోగా మీరే వచ్చారు"అని సెల్ ఇచ్చాడు.

అలా మొదలైన పరిచయం ప్రేమకు దారితీసింది. ఇద్దరు పెళ్ళిచేసుకోవాలని తీర్మానించుకున్నారు. కాని ఈ విషయం మాత్రం తండ్రికి చెప్పలేకపోయింది. అబ్బాస్ ఆమె సామాజికవర్గానికి చెందినవాడు కాదు. వేరే మతస్థుడు. పైగా పాకిస్థాన్ దేశస్థుడు. తండ్రి అతన్ని అల్లుడిగా ఒప్పుకుంటాడా అని సందేహపడింది. అందుకే ఎటు తేల్చుకోలేకపోయింది. ఎన్నోసార్లు తండ్రికి చెప్పాలనుకుంది. కాని ధైర్యం చాలలేదు. అప్పుడే ఒక అనూహ్యమైన పరిణామం జరిగింది. భారత్ పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతం గురించి చర్చించుకోవాలని నిశ్చయించుకున్నాయి. అది ఒక చారిత్రాత్మక సమావేశం కాబోతుంది. ఆ సమావేశం రక్షణ వ్యవహారాలను చూడటానికి పాకిస్తాన్ ప్రభుత్వం అబ్బాస్ ను చీఫ్ సెక్యూరిటి ఆఫీసర్ గా నియమించింది. ఆ నేపథ్యంలోనే అతను ఢిల్లీ వెళ్ళాడు ఏర్పాట్లు చూడటానికి. అక్కడ పని పూర్తిచేసుకుని బారముల్లా లో ఆగాడు. తిన్నగా శద్రూప ఇంటికి వెళ్ళాడు. చక్రపాణిని కలుసుకుని తన మనస్సులో మాటను చెప్పాడు. అంతకుముందు తనని తాను పరిచయం చేసుకున్నాడు.

ఆ మాట వినగానే తండ్రి మండిపోతాడని అనుకుంది. ఇద్దరిని చెడమడ తిడతాడని భావించింది. ఆశ్చర్యంగా అలాంటిదేం జరగలేదు. ముందు చక్రపాణి షాక్ అయిన మాట నిజం. కాని క్షణంలో తేరుకున్నాడు. ఏదో ఆలోచన తట్టినట్టు అబ్బాస్ భుజం మీద చెయ్యి వేసిఅన్నాడు.

"నాకు ఈ సంబంధం ఇష్టమే. కాని అమ్మాయికి మంచి ఉద్యోగం వచ్చింది. పదిరోజులు ఆమె ట్రయినింగ్ కోసం ఢిల్లీ వెళ్ళాలి. తను వచ్చిన తరువాత పెళ్ళి పనులు పెట్టుకుందామని చెప్పాడు. దానికి అబ్బాస్ కూడా ఒప్పుకున్నాడు.

తరువాత అబ్బాస్ తన అధికారులకు రిపోర్ట్ చెయ్యటానికి ఇస్లామాబాద్ వెళ్ళిపోయాడు. అప్పుడే శద్రూప సెల్ చప్పుడు చేసింది.

తన గతంలోంచి వెంటనే బయటపడి సెల్ ఆన్ చేసింది.

"అక్కడ ఏమవుతుంది"అడిగాడు అబ్బాస్. .

"స్టాఫ్ బయలుదేరుతున్నారు. నీ కాల్ కోసమే కాచుకుని ఉన్నాను. ఇంతకి ఏమైంది. నన్ను బయలుదేరమంటావా "అడిగింది శద్రూప.

"అప్పుడే కాదు. నాకు కొంచం టైం ఇవ్వు. రెండు చిన్న పనులు మిగిలి ఉన్నాయి. వాటిని పూర్తిచేసిన తరువాత నీకు కాల్ చేస్తాను. . అప్పుడు బయలుదేరు"అని లైన్ కట్ చేశాడు అబ్బాస్.. .

నిరుత్సాహంగా సెల్ ఆఫ్ చేసింది. తిరిగి గతం తాలుకు ఆలోచనలు ఆమెను చుట్టుముట్టాయి. ఆ తరువాత శద్రూప ట్రియినింగ్ కోసంఢిల్లీ వెళ్ళింది. విజయవంతంగా ట్రయినింగ్ పూర్తిచేసి ఇంటికి బయలుదేరింది.

అంతకుముందు రాత్రి ఒక దారుణమైన సంఘటన జరిగింది. ఆ సంఘటన భారత ప్రభుత్వాన్ని అతలాకుతలం చేసింది. ఆ రోజు రాత్రి సరిహద్దులోంచి కొందరు ఉగ్రవాదులు బారముల్లా లోకి ప్రవేశించారు. అందరి దగ్గర సబ్ మెషిన్ గన్స్ ఉన్నాయి. విచక్షరహితంగా అందరి మీద కాల్పులు జరిపారు. ఇళ్ళలోకి

దూరి మరి కాల్చారు. ఆ రక్తపాతం దాదాపు గంట సేపు జరిగింది. తరువాత తిరిగి సరిహద్దులోకి పారిపోయారు.

దాదాపు వందమంది దారుణంగా చనిపోయారు. ఆ చనిపోయినవారిలో శద్రూప తల్లి తండ్రి చెల్లెలు కూడా ఉన్నారు. ఆ షాక్ నుంచి తేరుకోవటానికి ఆమెకు వారంరోజులు పట్టింది. తరువాత అబ్బాస్ వచ్చాడు. ఆమెను ఓదార్చాడు. తల్లి తండ్రి పోయారు. ఉన్న ఒక్క చెల్లెలు కూడా చనిపోయింది. ఇక ఆ ఇంట్లో ఉండిచేసేది ఏం లేదు. పాత జ్ఞాపకాలు తవ్వుకోవటం తప్ప. అందుకే ఆ ఇంటిని అమ్మకానికి పెట్టింది. పైగా ఆమెకు ఇస్లామాబాద్ లో పోస్టింగ్స్ రావచ్చు. నాలుగు రోజుల తరువాత ఇళ్ళు అమ్మేసింది. మరునాడు ఆమెకు ఇస్లామాబాద్ లో పోస్టింగ్స్ వచ్చాయి. ఇండియన్ ఎంబసిలో పోలిటికల్ అటాచిగా చెయ్యబోతుంది.

ఈ విషయం వెంటనే అబ్బాస్ కు చెప్పింది. ఆ తరువాత ఇస్లామాబాద్ చేరుకుంది. తరుచు ఇద్దరు రహస్యంగా కలుసుకునేవారు. ఒకసారి శద్రూపను తన ఇంటికి తీసుకువెళ్ళాడు అబ్బాస్. . తన తల్లి షబ్నమ్ ను పరిచయం చేశాడు. అందమైన తన కోడలిని అక్కున చేర్చుకుంది షబ్నమ్. ఆ రోజే వాళ్ళిద్దరికి తన సమక్షంలో పెళ్ళి చేసింది. అది హిందువు సాంప్రదాయపద్ధతిలో. అబ్బాస్ శద్రూప మెడలో తాళికడుతుంటే ఆనందంతో చూసింది షబ్నమ్.

సమయం చూసి అందరి సమక్షంలో పెళ్ళిచేసుకుందామని చెప్పాడు అబ్బాస్. . . ఆ సమయం రానే వచ్చింది. ఉన్నట్టుండి పాకిస్థాన్ భారత్ ల మధ్య అగ్గి రాజుకుంది. దానికి ప్రధాన కారణం భారతీయుడైన ఒక క్రిప్టోగ్రాఫర్ హత్య. దానికి ప్రతికారంగా ఢిల్లోలో పాకిస్థాన్ ఎంబసిలో పనిచేస్తున్న ఒక అమ్మాయిని చంపారు. దాంతో రెండు దేశాల మధ్య శత్రుత్వం నెలకొంది. దానికి తగినట్టు రెండు దేశాల నాయకులు ఇష్టంవచ్చినట్టు మాట్లాడారు. అ మాటలు అగ్నికి ఆజ్యం పోసినట్టుగా అయింది.

రెండు దేశాలు తమ సరిహద్దుల దగ్గర సైన్యాన్ని మొహరించాయి. ఏ క్షణంలో అయిన యుద్ధం జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.. దాంతో భారత్ ముందు జాగ్రర్తకోసం తన పౌరులను ఇండియా వచ్చెయ్యమని కోరింది. అంతకుముందు రోజు ఇండియన్ అంబాసిడర్ ఆయన భార్య డిప్లమెటిక్ విమానంలో వెళ్ళిపోయారు. ఇప్పుడు ఈ రోజు స్టాఫ్ బయలుదేరుతున్నారు. ఒక సారి పాకిస్థాన్ దాటితో మళ్ళి అబ్బాస్ ను కలుసుకునే అవకాశం ఉండదు. అందుకే అబ్బాస్ ఈ రోజు అన్ని ఏర్పాట్లు చేస్తానని చెప్పాడు. అతని కాల్ కోసమే ఎదురుచూస్తోంది శద్రూప.

XXXX

ఇక్కడ శద్రూప ఆలోచినస్తున్న సమయంలో అబ్బాస్ తన అఫీషియల్ కారుని హాస్పటల్ మార్చ్యురి ముందు ఆపాడు. లోపలకు వెళ్ళి అటెండర్ ను కలుసుకున్నాడు. అటెండర్ అతన్ని శవాలు ఉన్న గదిలోకి తీసుకువెళ్ళాడు. అక్కడ రెండు శవాలు ప్రత్యేకంగా విడిగా కనిపించాయి.

"మీరు చెప్పిన గుర్తులు ఆనవాలు ఉన్న శవాలు ఇవి చూడండి"అని ఒక శవం మీద ఉన్న బట్టను తీశాడు. అది ఒక అందమైన అమ్మాయి శవం. చాల ఆకర్షణీయంగా ఉంది. అబ్బాస్ తన పర్స్ తీశాడు. అందులో శద్రూప ఫోటో ఉంది. ఫోటోను శవాన్ని మార్చీ మార్చీ చూశాడు. తరువాత తలపంకించి రెండో శవం చూపించమన్నాడు. వాడు రెండో శవం మీదు ఉన్న బట్ట తీశాడు.

అది కూడా ఒక అందమైన అమ్మాయి శవం. ఆమె ఇంకా అందంగా ఆకర్షణీయంగా ఉంది. పైగా శద్రూప పోలీకలు కొన్ని కనిపిస్తున్నాయి. . అంతేకాకుండ ఆమె శరీర ఆకృతి శవం శరీర ఆకృతి బాగా కలుస్తున్నాయి. . అబ్బాస్ మొహం సంతోషంతో వెలిగిపోయింది. అతను వెతుకుతున్నది ఈ అమ్మాయినే.

"ఈ శవం తీసుకువెళ్తాను. . ఎంత కావాలో చెప్పు"అన్నాడు అబ్బాస్

పర్స్ తీస్తూ.

"మీ ఇష్టం సార్. ఇవి అనాథ శవాలు. నాకు తెలిసినంతవరకు వీళ్ళకు నా అన్నవాళ్ళు ఎవరు లేరు. కాని రేపు డాక్టర్ గారు వీళ్ళ గురించి ఖచ్చితంగా అడుగుతారు. సరిఅయిన జవాబు చెప్పాలి. అందుకే కొంచం చూసి ఇవ్వండి"అన్నాడు నసుగుతూ అటెండర్.

అబ్బాస్ మాట్లాడకుండ పదివేలు వాడి చేతిలో పెట్టాడు. ఆ తరువాత తతంగం వేగంగా జరిగిపోయింది. అటెండర్ శవాన్ని పూర్తిగా కప్పి అబ్బాస్ డిక్కిలో పెట్టాడు. తరువాత అబ్బాస్ బయలుదేరాడు.

సంతోషం ఉద్వేకం కలిసికట్టుగా అబ్బాస్ ను కుదిపేస్తున్నాయి. . ఇన్నిరోజులకు అతని పధకం పూర్తయింది. విజయంవంతం అయింది కూడా. విజయగర్వంతో అతని పెదవులు విచ్చుకున్నాయి.

XXXX

చివరి వ్యాన్ స్టాఫ్ ను తీసుకుని ఏయిర్ పోర్ట్ కు బయలుదేరింది. అందరు వెళ్ళిపోయారు. ఎంబసి దాదాపు ఖాళీ అయింది. ఒక్క శద్రూప మాత్రం ఉండిపోయింది. స్టాఫ్ అందరు రమ్మని చెప్పారు.. కాని ఆమె ఒప్పుకోలేదు. కారులో వస్తానని చెప్పింది.

అందరు వెళ్ళిన తరువాత శద్రూప అందోళనతో ఉక్కిరిబిక్కిరి అయింది. ఇంకో రెండు గంటలు మాత్రం వ్యవధి ఉంది. ఈ లోగా శద్రూప కూడా ఎంబసి విడిచివెళ్ళాలి. లేకపోతే పాకిస్తాన్ మిలిట్రి అధికారులు ఆమె అరెస్ట్ చేస్తారు. . ఎందుకు ఏమిటి అని ప్రశ్నించే అధికారం కాని అవకాశం కాని ఎవరికి ఉండదు. చివరకు భారత ప్రభుత్వానికి కూడా.

అందుకే తెగ ఆందోళనపడుతుంది ఆమె.

పది నిమిషాలు ఉద్వేకంతో కదిలిపోయింది ఆమె.

అప్పుడే అబ్బాస్ కాల్ చేశాడు.

"నేను చెప్పేది జాగ్రర్తగా విను. కారు తీసుకుని పదవమైలు రాయి దగ్గరకు రా. అక్కడనుంచి ఎడం వైపు తిరిగి కొంత దూరం రా. ఎదురుగా నీకు విశాలమైన మైదానం దూరంగా పెద్ద కొండ లోయలు కనిపిస్తాయి. . అక్కడ నీ కోసం కాచుకుని ఉంటాను. వెంటనే బయలుదేరు. వచ్చేటప్పుడు నీ ఐడింటి కార్డ్ సర్టిఫికేట్లు కూడా వెంట తీసుకురా మరచిపోకు"అని చెప్పి లైన్ కట్ చేశాడు అబ్బాస్ .

XXX

శద్రూప డ్రైవ్ చేస్తున్న కారు పదవ మైలు రాయి చేరుకుంది. అక్కడనుంచి ఎడం వైపుకు తిరిగింది. అబ్బాస్ చెప్పినట్టుగానే విశాలమైన మైదానం కనిపించింది. దూరంగా కొండలు లోయలు కూడా కనిపించాయి. ఒక చోట అబ్బాస్ కనిపించాడు. అతని వెనుక కారు కూడా ఉంది. శద్రూప తన కారును తిన్నగా తీసుకువెళ్ళి అతని ముందు ఆపింది. తరువాత దిగి హడావిడిగా దగ్గరకు వెళ్ళింది.

"ఏమిటి ఇక్కడకు రమ్మన్నావు. మనం వెళ్ళవలసింది మీ ఇంటికి కదా"అంది శద్రూప ఆశ్చర్యంగా.

"అంతా వివరంగా చెప్తాను కొంచం ఓపిక పట్టు"అని తన కారు డిక్కి తెరిచాడు. లోపల అమ్మాయి శవం ఉంది.

"ఎవరుఈమే"అడిగింది శద్రూప.

"తరువాత చెప్తాను. . ముందు నీ బట్టలు విప్పి వాటిని ఈ శవానికి తొడుగు. నీ ఐడింటి కార్డ్ సర్టిఫికేట్లు కూడా తీసుకురా. ఈ శవాన్ని మనం లోయలోకి పడేస్తాం. . శవం కనిపిస్తుందో లేదో తెలియదు. ఒక వేళ కనిపిస్తే ఇండియన్ ఎంబసిలో పొలిటికల్ అటాచిగా పనిచేస్తున్న శద్రూప ప్రమాధ వశతు లోయలోకి పడిపోయిందని అనుకుంటారు. పక్కన ఉన్న సర్టిఫికెట్స్ ఐడింటిని చూసి అది నీ శవమే అని కన్ ఫర్మ్ చేసుకుంటారు. దాంతో నీ కేసు మూసేస్తారు. . ప్రపంచానికి శద్రూప చనిపోయింది. కాని నిజానికి ఆమె బ్రతికే ఉంది. తను నా భార్య. పేరు బెనజీర్"అని పూర్తిచేశాడు. .

నిర్ఘాంతపోయింది శద్రూప. కాని ఏం మాట్లాడలేదు.

అంతా అబ్బాస్ చెప్పినట్టుగానే చేసింది. తన బట్టలు తీసి ఆ శవానికి తొడిగింది. సర్టిఫికెట్స్ ఐడింటి కార్డ్ ఉన్న బ్యాగ్ ను

ఆమె భుజానికి తగిలించింది. తరువాత ఇద్దరు కలిసి ఆ శవాన్ని లోయలోకి పడేశారు. దాంతో పాటు శ్రద్రూప వచ్చిన కారును కూడా పడేశారు. ఢాం అంటు కారు పెద్దగా చప్పుడు చేస్తూ కిందపడింది. క్షణంలో పెట్రోల్ అంటుకుని కారు మండిపోసాగింది.

ఇద్దరు దూరంగా వచ్చి అబ్బాస్ కారు దగ్గరకు వచ్చి నిలబడ్డారు.

"ఏమిటి అబ్బాస్  ఇదంతా. నాకేం అర్ధం కావటంలేదు"అంది.

"ఇంతకాలం నీకు అసలు విషయం చెప్పలేదు. ఇప్పుడు చెప్పుతున్నాను. నిజానికి నేను ముస్లిం కాదు. హిందువును. అంతే కాదు నేను పాకిస్థానీయుడిని కాను. భారతీయుడిని. స్పెషల్ ఏజంట్ ని. అండర్ కవర్ లో పనిచేస్తున్నాను... ముందు జాగ్రర్తకోసం ఈ పని చేశాను. ఈ విషయం మాత్రం ఎవరికి చెప్పకు. నాకు అర్డర్స్ వచ్చేంతవరకు మనం ఈ దేశంలోనే ఉండాలి. తెలిసిన రహస్యాలను బారత్ కు చేరవెయ్యాలి. నా పేరు చెప్పలేదు కదు. నా పేరు సుయోధన్. నా తల్లి పేరు మీనాక్షీ. ఆవిడకు అన్ని విషయాలు తెలుసు."అన్నాడు.

ఆశ్చర్యం ఆనందం ఆమెను కుదిపేశాయి.

"అంటే నేను కూడా పైకి ముస్లింలా నటించాలి అన్నమాట"అంది.

"అంతే కాదు ముస్లింలు పాటించే అన్ని నియమాలు పాటించాలి. వాళ్ళ మతానికి మన వల్ల కొంచం కూడా కళంకం రాకూడదు. అది గుర్తుపెట్టుకో. .

"తప్పకుండ"అంది శ్రద్రూప.

"నీ సహయానికి ఈ ఉంగరాన్ని బహుమతిగా ఇస్తున్నాను "అని బంగారు ఉంగరాన్ని ఆమె వేలికి తొడిగాడు.

"చాల బాగుంది."

"మరి నాకేం బహుమతి ఇస్తావు?"అడిగాడు.

"ఫ్రమ్ ఇండియా విత్ లవ్ "అని సుతారంగా అతని చెక్కిలిని ముద్దుపెట్టుకుంది శ్రద్రూప.

సమాప్తం.

# నమ్మకాలు- నిజాలు

## ఏ మతం లోను సైన్సు లేదు

ఓ పుష్కరాలు , ఓ వైకుంట ఏకాదశి , ఓ కుంభ మేళా జాతర ఏదైనా పోతున్నవి మాత్రం ప్రజల ప్రాణాలు .దీనికి కారణం ఎవరు ? మనం మన అజగ్రత్తలా ? లేక మతోన్మాదమా ?

ఏ భావోద్వేగం అయినా సరే మోతాదుకు మించి వ్యక్తం అయితే అది ఉన్మాదమే! ప్రేమ కావచ్చు, ద్వేషం కావచ్చు, చివరికి భక్తి కూడా కావచ్చు. ఆ భక్తి ఉన్మాదం యొక్క వికృత ఫలాలు ఎలా ఉంటాయో ఇప్పుడు మనం చూశాం. తిరుమల వెంకటేశ్వర స్వామిని సరిగ్గా వైకుంఠ ఏకాదశి పర్వదినం నాడే దర్శించుకోవాలని తద్వారా పురాణాలు ఆధ్యాత్మిక గ్రంథాలు చెప్పే వైకుంఠ ప్రాప్తిని సునాయాసంగా దక్కించుకోవాలని అమాయకంగా నమ్మిన భక్తులు వాళ్ళు. అనూహ్యంగా జరిగిన తొక్కిసలాటలో తమ ప్రాణాలనే దేవుడికి బలి పెట్టారు. భక్తి, ఆధ్యాత్మికత కూడా ఉన్మాదరూపం దాలుస్తున్న నవీనయుగంలో మనం ఉన్నాం. సాంకేతికత ఎంతగా కొత్త పుంతలు తొక్కుతూ జనజీవన సరళి ఎన్నెన్ని కొత్త హంగులు అద్దుకుంటుందో అనే భయాల పుట్టిస్తున్న రోజుల్లోనే.. మూఢభక్తి అనేది అంతగా వెర్రితలలు వేస్తూ పోతున్న రోజులివి. భక్తి,

# మేలుకొలుపు

ఆధ్యాత్మిక ఉన్మాదం అంటే కేవలం ఒక దేవుడి పట్ల భక్తితో ఒకే మతంలోని మరొక దేవుడిని, మరొక మతానికి చెందిన దేవుడిని దూషించడం మాత్రమే కాదు. ఒకేమతంలోని ఒక దేవుడి పట్ల అపరిమితంగా, అనుచితంగా ప్రదర్శించడం కూడా! తమకు తెలియకుండానే అలాంటి ఉన్మాదంలో అమాయకంగా చిక్కుకుపోయిన ప్రజలే.. మరణానంతరం వైకుంఠప్రాప్తి దక్కుతుందనే ఆశతో వైకుంఠ ద్వార దర్శనం కోసం ప్రయత్నిస్తూ పరమపదించారు. వీరిది అమాయకమైన ఉన్మాదం.



'దేవుడిని చేరుకోగలిగే మంచి భక్తుడు ఎవడు?' అనే ప్రశ్నకు జవాబుగా భగవద్గీతలో గీతాకారుడు అనేక లక్షణాలను ప్రవచిస్తాడు. 'సర్వత్ర సమబుద్ధయః' అంటూ అన్నింటి పట్ల సమానమైన బుద్ధి కలిగి ఉండే భక్తుడు తనన చేరుకుంటాడని చెబుతాడు కృష్ణుడు!

అన్నింటి పట్ల సమామైన భావన ఉండాలనేది మంచి భక్తుడికి ఉండవలసిన లక్షణంగా దేవుడే చెప్పాడు. మరి ఆ లక్షణం దేవుడికి ఉండదా? వైకుంఠ ఏకాదశి అంటే మహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజు అని భావించే భక్తుడు.. భగవద్గీతలో ఉన్నది అబద్ధం, చెత్త అని నమ్ముతున్నట్టే కదా? భగవద్గీత నిజమైతే.. ఒకరోజుకు ప్రత్యేకత ఆపాదించడం ఒక మోసం, వంచన, వ్యాపార కిటుకు అని భావించాలి కదా! అనేది ఒక సందేహం. నిర్దిష్టంగా ఒక మాసాన్ని గానీ, ఏదైనా ఒక ప్రత్యేకమైన తిథిని గానీ, వారంలో ఒక రోజును గానీ.. ప్రత్యేకంగా ఇష్టపడితే అసలు అతను దేవుడు ఎందుకవుతాడు? అన్ని రోజులనూ అన్ని జీవులనూ సమానంగా ప్రేమించని తత్వం దైవత్వం అనిపించుకుంటుందా? ఫలానా రోజున వచ్చి తనను సేవించుకున్న వాడిని మాత్రమే కాస్త ఎక్స్ ట్రా గా కరుణిస్తాను అని అనే దేవుడిని తన ముఠాను కాపాడుకోవాలని తన జట్టులో చేరిన వారి బాగుకోసం మాత్రమే ప్రయత్నించే రాజకీయ నాయకుడితో సమానంగా చూడగలం తప్ప.. దేవుడిగా ఎలా పరిగణించగలం.

తన గుడికి వచ్చే వారిని మాత్రమే కరుణించాలనే ఉద్దేశం దేవుడికి ఉంటుందా? ఇలా అనుకోవడం దేవుడిని అవమానించడం కాదా? అనేది భక్తులు ఆలోచించాలి. గతిలేకగానీ, వ్యవధి లేక గానీ, నమ్మకమే లేకపోవడం వల్ల గానీ.. జీవితంలో ఒక్కసారి కూడా దైవ దర్శనానికి ఆలయానికి వెళ్లని ఎంతో మంచి వాడైన వ్యక్తి, తన పని తాను చేసుకుంటూ ఉండే వ్యక్తి, ఇతరులకు కించిత్తు కీడు తలపెట్టని, పొల్లుమాటలాడని వ్యక్తి ఎక్కడైనా ఒక మారుమూల కుగ్రామంలో బతుకుతూ ఉంటే అతనికి ఎప్పటికీ మోక్షం రాదా? తన వద్దకొచ్చి ఎప్పుడూ దర్శించుకోలేదు గనుక అతడి మీద పగబట్టి.. దేవుడు నరకానికి పంపిస్తాడా? ఇలాంటి లాజిక్ ను కూడా భక్తులు ఆలోచించుకోవాలి.

★★★★

# విశ్వంలో మరో సూర్యుడు ఉన్నాడా?



కొండేటి వీణ

గెలాక్సీలో చాలా నక్షత్రాలు జంటలుగా ఉన్నాయి. కానీ, మన సూర్యుడు మాత్రం అందుకు మినహాయింపు. ఎందుకంటే, సూర్యుడు ఒక్కడే. అయితే, ప్రస్తుతం శాస్త్రవేత్తలు ఒక ఆసక్తికరమైన సంకేతాన్ని కనుగొన్నారు. సూర్యుడికి తోడు ఉండి ఉండొచ్చనేందుకు ఆధారాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇప్పుడు ప్రశ్న ఏంటంటే..మరి ఈ కవల నక్షత్రం ఎక్కడికి వెళ్లింది?

అంతరిక్షంలో ఒంటరిగా ప్రయాణిస్తుండే నక్షత్రం సూర్యుడు. పాలపుంతలోని వర్తులాకారపు కక్ష్యలో ఒంటరిగా తిరుగుతూ 23 కోట్ల సంవత్సరాలకు ఒకసారి గెలాక్సీ చుట్టూ ప్రయాణం చేస్తుంటాడు.సూర్యునికి అత్యంత సమీపంలో ఉన్న నక్షత్రం ప్రాక్సిమా సెంటార్రై. ఇది భూమికి 4.2 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. ఇప్పటి వరకు నిర్మించిన వాటిలో అత్యంత వేగంగా ప్రయాణించే అంతరిక్ష నౌకలో ప్రయాణించినా ప్రాక్సిమా సెంటూరికి చేరుకోవడానికి 7వేల ఏళ్లకు పైగా పడుతుంది.మన గెలాక్సీలో, సౌర కుటుంబం మధ్యలో ఒక నక్షత్రం చాలా అసాధారణంగా కనిపిస్తుంది. గెలాక్సీ చుట్టూ జంటలుగా పరిభ్రమించే బైనరీ నక్షత్రాలు మాత్రం సాధారణంగా కనిపిస్తుంటాయి.అయితే, పాలపుంత మధ్యలో సూపర్ మాసివ్ బ్లాక్ హోల్‌కు సమీపంలో తిరుగుతున్న ఒక జంటను ఇటీవల ఖగోళ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆ జంటను గుర్తించిన ప్రాంతంలో బ్లాక్ హోల్‌కు చెందిన తీవ్రమైన గురుత్వాకర్షణ వల్ల ఒకప్పుడు నక్షత్రాలు ఒకదానికొకటి విడిపోయి లేదా కలుసుకుని ఉండొచ్చని ఖగోళ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

బైనరీ నక్షత్ర వ్యవస్థలో కొత్త విషయాలను కనుగొనడం సాధారణం. ఒకప్పుడు అన్ని నక్షత్రాలు బైనరీ రిలేషన్‌షిప్‌లో ఉండొచ్చని, అవన్నీ జంటలుగానే పుట్టి ఉండొచ్చని కొందరు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.అంటే ప్రతి నక్షత్రానికి మరో తోబుట్టువు ఉంటుంది. ఇదే ఇప్పుడు ఆసక్తికరమైన ప్రశ్నకు తెరతీసింది. ఒకప్పుడు బైనరీ నక్షత్రమైన సూర్యుడికి కూడా చాలా కాలం కిందట ఒక తోడు ఉందా? సూర్యుడు తన సహచరుడిని ఎప్పుడు కోల్పోయి ఉండొచ్చు అనే ప్రశ్నలు వస్తున్నాయి.అయితే, అదృష్టవశాత్తూ సూర్యుడికి తోడు లేకపోవడం మనకు నిజంగా మంచి విషయం. ఒకవేళ ఉండి ఉంటుంటే.. ఆ రెండో సూర్యుడి గురుత్వాకర్షణ వల్ల భూమితో పాటు ఇతర గ్రహాల కక్ష్యల్లో తరచు మార్పు వస్తూ ఉండేది. అంతే కాకుండా భూమి మీద ఉష్ణోగ్రతలతో పాటు చలి పెరగడం, పగటి కాలం ఎక్కువగా ఉండటం లాంటి అనేక సమస్యలు ఏర్పడేవి.భూమికి సమీపంలో ఉన్న బైనరీ నక్షత్రాలు అల్ఫా సెంటూరి ఎ,బి. ఈ రెంటి మధ్య దూరం భూమి సూర్యుని మధ్య ఉన్న దూరంతో పోలిస్తే 24 రెట్లు ఎక్కువ. ఇవి అక్కడ తమ కక్ష్యలో పరిభ్రమిస్తున్నాయి.

ప్రస్తుతం సౌర వ్యవస్థలో సూర్యునికి కూడా ఒక సహచరుడు ఉండొచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. అయితే, 1984లోనే నెమెసిస్ అనే ఒక ఊహాజనిత నక్షత్రం ఉండి ఉండొచ్చని తొలిసారి ప్రతిపాదన వచ్చింది. అయితే అనేక సర్వేలు, అధ్యయనాల తర్వాత అలాంటిదేమీ లేదని తేలింది.అయితే ప్రస్తుతం మనం చూస్తున్న సూర్యుడు 460 కోట్ల ఏళ్ల కిందట ఏర్పడింది. కానీ అది వేరే విషయం. కెనడాలోని క్వీన్ యూనివర్సిటీకి చెందిన ఖగోళ శాస్త్రవేత్త సారా సదావోయ్ 2017లో యువ బైనరీ నక్షత్ర వ్యవస్థలతో కూడిన అద్భుతమైన నర్సరీగా పేరున్న పెర్సియస్ మాలిక్యులర్ క్లౌడ్‌కు చెందిన రేడియో సర్వేలోని డేటాను ఉపయోగించి, నక్షత్ర నిర్మాణ ప్రక్రియ జంటలుగా ప్రొటోస్టార్లను ఏర్పరుస్తుందని నిర్ధరించారు.అన్ని నక్షత్రాలు జంటలుగా లేదా బహుళ నక్షత్ర వ్యవస్థలలో ఏర్పడి ఉండొచ్చని ఆమె, ఆమె సహోద్యోగులు కనుగొన్నారు.

పెర్సియస్ నక్షత్ర ధూళిలో నక్షత్రాల సంఖ్య కాస్త ఎక్కువగా ఉండవచ్చు. దీంతో వాటిలో కొన్ని రాలిపోయే అవకాశం ఉంది. దీన్నే మనం నక్షత్రాల విభజన ప్రక్రియ అంటాం. అవి బాగా దూరంగా ఉంటే ఒక దానికొకటి సమీపంగా వచ్చే అవకాశం ఉండదు. అలా కాకుండా బాగా దగ్గరగా ఉంటే గురుత్వాకర్షణ శక్తి వాటిని కలిపేస్తుంది.నక్షత్రాలు ఒకప్పుడు జంటగా ఉండేవని కొన్ని శాశ్వతంగా కలిసి ఉంటున్నాయని, కొన్ని మాత్రం మిలియన్ సంవత్సరాల పరిణామ క్రమంలో విడిపోయాయని సదావోయ్ పరిశోధన వెల్లడించింది.

నక్షత్రాలు సంవత్సరాల పాటు జీవిస్తాయి. విశ్వంలో ఇది క్షణకాలం పాటు మాత్రమే కావచ్చు. కానీ ఆ క్షణకాలంలోనే చాలా జరుగుతాయి.సూర్యుడి విషయంలోనూ ఇదే నిజమై ఉంటుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది. పాలపుంతలో రెండేసి నక్షత్రాలు తమ తమ కక్ష్యలో తిరిగే వ్యవస్థలో సూర్యుడు ఒకప్పుడు భాగమేననే కొన్ని ఆధారాలు ఉన్నాయి.ప్లూటోకు చాలా దూరంలో మన సౌర వ్యవస్థలో ఘనీభవించిన తోకచుక్కల ప్రాంతం ఉందని అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో ఖగోళ శాస్త్రవేత్తగా పనిచేసిన అమిర్ సిరాజ్ 2020లో చెప్పారు. దీన్ని ఊర్ట్ క్లౌడ్‌గా పేర్కొన్నారు. ఇందులో సూర్యుడి కవల నక్షత్రానికి చెందిన ముద్రలు ఉండి ఉండవచ్చు.మంచు, రాళ్లతో ఉన్న ఈ ప్రాంతం భూమికి చాలా దూరంలో ఉంది. అంతరిక్షంలో సుదూర ప్రాంతాలకు చేరుకునేందుకు నాసా ప్రయోగించిన వాయేజర్ 1 లాంటి వ్యోమనౌకల్లో 300 సంవత్సరాలకు కూడా ఊర్ట్ క్లౌడ్‌కు చేరుకోలేము. బాహ్య సౌర వ్యవస్థ అధ్యయనం కోసం ఈ అంతరిక్ష నౌకను లాంచ్ చేశారు.ఒకవేళ నిజంగానే సూర్యుడికి తోడు ఉండి ఉండుంటే, ప్లూటో వంటి ఎన్నో మరుగుజ్జు గ్రహాలు ఈ ప్రాంతంలో ఉండేవని సిరాజ్ అన్నారు. సూర్యుడి బాహ్య వలయంలో తొమ్మిదో గ్రహం నెప్ట్యూన్ పరిమాణంలో ఉన్న మరో పెద్ద గ్రహం ఒకటి ఇక్కడ అంతరించి ఉండిఉండవచ్చని ఖగోళ శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. సూర్యుడికి తోడు ఉండచ్చని చెప్పడానికి మరో సంకేతం ఏంటంటే.. సౌర వ్యవస్థ సమతులానికి సూర్యుడు ఏడు డిగ్రీలు పక్కకు వంగి ఉంటాడు. మరో నక్షత్రపు గురుత్వాకర్షణ శక్తి వల్లే ఇదిలా జరిగి ఉండొచ్చని 'అవర్ సన్ ఆఫ్ బ్యాలెన్స్' అనే నివేదికలో వివరించారు.



# క్యాన్సర్ లక్షణాలు తెలుసా ?

క్యాన్సర్ అనే పదం వింటే చాలు ఒక రకమైన ఆందోళన మనలో కలుగుతుంది. ఇది ప్రాణాలు తీసే అత్యంత ప్రమాదకరమైన వ్యాధి అని చాలా మంది భావిస్తుంటారు.కానీ, 1970 కాలం నుంచి ఈ వ్యాధి బారిన పడిన వారు కోలుకుంటున్న రేటు మూడింతలు పెరిగింది. ప్రారంభంలోనే ఈ వ్యాధిని గుర్తించడమే దీనికి కారణం. వాస్తవంగా చాలా రకాల క్యాన్సర్లు తీవ్రంగా ముదరకముందే గుర్తించి చికిత్సను తీసుకోవడం ద్వారా రోగులు ప్రాణాలతో బయటపడుతున్నారు.సమస్యేంటంటే ఈ వ్యాధి సోకిన చాలా మంది డాక్టర్లు చెప్పే మాటలు సరిగా వినిపించుకోవడం లేదు.ఈ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించగలిగే కొన్ని రకాల లక్షణాలను కూడా రోగులు పట్టించుకోవడం లేదు.

క్యాన్సర్ రీసెర్చ్ యూకే అనే సంస్థ చేపట్టిన అధ్యయనంలో, బ్రిటన్‌లో సగం కంటే ఎక్కువ మంది క్యాన్సర్ ఉనికిని సూచించే లక్షణాలలో ఒకదానితో బాధపడుతున్నారని తెలిసింది.కానీ, కేవలం 2 శాతం మంది మాత్రమే తమకు వ్యాధి ఉన్నట్లు అనుకుంటున్నారని, మూడొంతుల మందికి పైగా ప్రజలు ఈ ప్రమాద సంకేతాలను పట్టించుకోవడం లేదని క్యాన్సర్ రీసెర్చ్ యూకే అధ్యయనం పేర్కొంది.లక్షణాలను పట్టించుకోకుండా ఉండి, డాక్టర్ల వద్దకు వెళ్లడం లేదని తెలిపింది.''హైపోకాండ్రియాక్స్‌గా ఉండేలా ప్రజలను ప్రోత్సహించకూడదని చాలామంది అనుకుంటుంటారు. కానీ, డాక్టర్ వద్దకు వెళ్లేందుకు ఇబ్బంది పడే వారితోనే సమస్య.ఎందుకంటే, వారు డాక్టర్ వద్దకు వెళ్లడాన్ని టైమ్ వేస్ట్‌గా, ఆరోగ్య వ్యవస్థలోని వనరులను వారు అనవసరంగా వాడుతుంటారని భావిస్తుంటారు.క్యాన్సర్ లక్షణాలను వారు పట్టించుకోకుండా వదిలేస్తుంటారు.

ప్రజలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చూపుతోన్న అమెరికన్ క్యాన్సర్ సొసైటీ సూచిస్తోన్న 10 రకాల క్యాన్సర్ లక్షణాలను బీబీసీ ముండో వివరించేందుకు ప్రయత్నించింది.అవేంటో మనం ఇక్కడ తెలుసుకుందాం..

1. అతిగా బరువు తగ్గిపోవడం

క్యానర్స్ ఉన్న చాలా మంది ఒకానొక సమయంలో బాగా బరువు తగ్గిపోతుంటారు.ఐదు లేదా అంతకంటే ఎక్కువ కేజీలు బరువు తగ్గిపోవడాన్ని క్యాన్సర్ తొలి సంకేతంగా చూడొచ్చు.పాంక్రియాస్, కడుపు, ఊపిరితిత్తుల క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్ వచ్చినప్పుడు ఇలా జరుగుతూ ఉంటుంది.

2. జ్వరం

క్యాన్సర్ వచ్చిన రోగుల్లో జ్వరమనేది సాధారణ లక్షణం. క్యాన్సర్ పుట్టిన దగ్గర్నుంచి ఇతర అవయాలకు, శరీర భాగాలకు వ్యాప్తి చెందేటప్పుడు జ్వరం వస్తూ ఉంటుంది.క్యాన్సర్ ఉన్న ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో జ్వరం బారిన పడతారు.ముఖ్యంగా క్యాన్సర్, దాని చికిత్సలు రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం చూపుతుంటాయి. ఈ ప్రభావంతో క్యాన్సర్ ఉన్న రోగులు జ్వరం బారిన పడుతూ ఉంటారు.లుకేమియా లేదా లింఫోమా వంటి వాటికి జ్వరం ప్రాథమిక లక్షణం.

3. అలసటక్యాన్సర్ లక్షణాల్లో ఒకటి అలసట. ఇది విపరీతంగా ఉంటుంది. విశ్రాంతి తీసుకున్నా కూడా అలసట నుంచి బయటపడలేరు.క్యాన్సర్ పెరుగుతుందనే దానికి ఇది ప్రధానతేంగా ఉంటోంది.లుకేమియా లాంటి కొన్ని క్యాన్సర్లలో అలసటే తొలి లక్షణంగా ఉంటోంది.పెద్ద పేగు లేదా కడుపు క్యాన్సర్లు రక్తహీనతకు కారణమవుతాయి. ఆ సమయంలో కూడా అలసట అనేది సాధారణం.

4. శరీరంలో మార్పులు

చర్మ క్యాన్సర్లతో పాటు, కొన్ని ఇతర క్యాన్సర్లు కూడా శరీరంలో మార్పులకు కారణమవుతాయి.ఈ సంకేతాలు, లక్షణాల్లో కొన్ని:శరీర రంగు నల్లగా మారిపోవడం(హైపర్‌పిగ్మెంటేషన్),శరీర రంగు, కళ్లు పసుపు పచ్చగా మారడం(జాండిష్),చర్మం ఎర్రగా మారడం, దురద రావడం,బాగా జుట్టు పెరగడం,

5. పేగు, మూత్రాశయ తీరులో మార్పులు

మలబద్ధకం, డయేరియా, ఎక్కువ కాలం పాటు మలంలో మార్పులు పెద్దపేగు క్యాన్సర్‌కు సంకేతాలు కావొచ్చు. మూత్రానికి వెళ్లేటప్పుడు నొప్పి రావడం, మూత్రంలో రక్తం పడటం, మూత్రాశయ తీరులో మార్పులు అంటే పదే పదే మూత్రానికి వెళ్లాలనిపించడం లేదా తక్కువగా వెళ్లడం వంటివి బ్లాడర్ లేదా ప్రొస్టేట్ క్యాన్సర్లకు సంబంధించి ఉండొచ్చు.

6. గాయాలు మానకపోవడం

పుట్టుమచ్చలు పెరిగి, వాటి నుంచి రక్తం కారడం చర్మ క్యాన్సర్ లక్షణాలని చాలా మందికి తెలుసు.కానీ, చిన్న చిన్న గాయాలైనా ఎక్కువ కాలం మానకపోవడం కూడా క్యాన్సర్‌కు సంకేతాలని మనం తెలుసుకోవాలి.నాలుగు వారాల కంటే ఎక్కువ కాలం చిన్న గాయాలు మానకపోతే వాటిపై దృష్టిపెట్టాలి.నోటి క్యాన్సర్ వల్ల నోట్లో పుండు కూడా త్వరగా మానదు.మీ నోట్లో దీర్ఘకాలం పాటు ఏదైనా మార్పులు కనిపిస్తే, వెంటనే డాక్టర్‌ను లేదా డెంటిస్ట్‌ను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి.పురుషాంగం లేదా యోనిపై పుండ్లు కూడా ఇన్‌ఫెక్షన్‌కు లేదా ప్రారంభ దశలోని క్యాన్సర్‌కు సంకేతాలు.డాక్టర్ల దగ్గరికి వెళ్లి, వీటిని చూయించుకోవాలి.

7. రక్తస్రావం

ఒకవేళ మలంలో రక్తం పడితే, అది పెద్ద పేగు క్యాన్సర్‌కు లేదా మల క్యాన్సర్‌కు సంకేతం కావొచ్చు.ఎండోమెట్రియంకి చెందిన గర్భాశాయ క్యాన్సర్ వల్ల విపరీతమైన రక్తస్రావం కూడా అవుతుంది. మూత్రంలో రక్తం కనిపించడం బ్లాడర్ లేదా కిడ్నీ క్యాన్సర్‌కు సంకేతం.చనుమొనల నుంచి రక్తం కారడం రొమ్ము క్యాన్సర్ లక్షణాల్లో ఒకటి.

8. శరీరంలో ఏదైనా భాగం గట్టిగా మారిపోవడం

చర్మంలో మార్పుల ద్వారా మనం చాలా క్యాన్సర్లను గుర్తించవచ్చు.ఈ క్యాన్సర్లు ముఖ్యంగా రొమ్ముల్లో, వృషణాలు, గ్రంథులు, కణజాలల్లో ఏర్పడుతుంటాయి.క్యాన్సర్‌ను ప్రారంభంలో లేదా చివరి దశలో గుర్తించే సంకేతాల్లో ఒకటి ఏదైనా శరీర భాగం గట్టిగా మారిపోవడం.

9. మింగడం కష్టమవ్వడం

ఆహారాన్ని మింగడం లేదా నీటిని తాగడం వంటి వాటిల్లో ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, అవి అన్నవాహిక క్యాన్సర్‌కు, కడుపు క్యాన్సర్‌కు లేదా గొంతు క్యాన్సర్‌కు సంకేతంగా చూడొచ్చు.

10. విపరీతమైన దగ్గు లేదా గొంతు బొంగురుపోవడం,విపరీతంగా దగ్గు రావడం కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు సంకేతం.

మూడో కన్ను

# దేశం గర్వించదగ్గ ఛాయా చిత్రకారులు



తమ్ము శ్రీనివాస రెడ్డి





ఎం.రవీంద్రనాథ్ గత నాలుగు దశాబ్దాలకు పైగా ఫొటోగ్రఫీ రంగంలో ఉన్నారు. నలపు తెలుపు విభాగంలో "గోదావరి నదీ తీరం జీవన వైవిధ్యం" అన్న అంశంపై తీసిన ఛాయాచిత్రాలకు ఫ్రాన్స్లోని ఫొటోగ్రాఫిక్ ఇంటర్నేషనల్

డిలా ఆర్ట్ వారు ఎ.ఎఫ్.ఐ.సి. అనే గౌరవ పురస్కారాన్ని 1989 లో అందించారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీలో 5 స్టార్ ఎగ్జిబిటర్ గాను మొదటి పదిమందిలో ఒకరుగా వరుసగా ఎంపికైనారు. 2002వ సంవత్సరంలో ఎఫ్.ఐ.పి. ఫెలోషిప్పు ప్రదానం చేసింది. పిక్టోరియల్ ఫొటోగ్రఫీలో తనదైన శైలిలో గోదావరి నదీ తీరంలో తీసిన ఛాయాచిత్రాలకు పలుసార్లు ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారు. గత రెండు దశాబ్దాలకు పైగా ఫొటోజర్నలిజంలో వివిధ పత్రికలకు పనిచేస్తూ, వార్త దినపత్రిక ప్రారంభం నుండి నేటివరకు సీనియర్ జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. 1984 నుండి రాష్ట్రంలోను, జాతీయస్థాయిల్లో పలుమార్లు వర్క్‌షాపులు నిర్వహించారు. పలు ఫొటోగ్రఫీ అసోసియేషన్లు నిర్వహించే జాతీయ పోటీలకు పలుమార్లు న్యాయనిర్ణేతగా వున్నారు. "గ్రామీణ జీవనంపై" ఆయన తీసిన ఛాయాచిత్రాలు హాంగ్కాంగ్, సింగపూర్, తైపాయ్, మలేషియా, బంగ్లాదేశ్, ఫ్రాన్స్ పలు యూరోప్ దేశాల్లో ప్రత్యేకంగా ప్రదర్శించబడ్డాయి. ఇప్పటివరకు 110 అవార్డులు 200కు పైగా ప్రతిభాపురస్కారాలను అందుకున్నారు. పలువురు ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లను ప్రొఫెషనల్స్ గా తీర్చిదిద్దటమే గాక అంతర్జాతీయ ఖ్యాతిని గావించుటకు ప్రోత్సహించారు. 1980 నుండి దాదాపు ఓ దశాబ్దంకు పైగా దేశంలోనే రాజమండ్రికి ఓ ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి నలుపు-తెలుపు విభాగంలో ఫొటోలను



ప్రింట్స్ వేసే విధానంలో కొత్త పోకడలు కనిపెట్టి అనేక ప్రశంసలు అందుకుని, పలువురికి మార్గదర్శకులుగా నిలిచారు. గుజరాత్ లలితకళా అకాడమీ నుంచి, కె.కె. మూస్ అంతర్జాతీయ పురస్కారాన్ని భారతీయ దళిత సాహిత్య అకాడమీ బంగారు పతకంతో పాటు ఫెలోషిప్పు అందచేసింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫి అకాడమికి అధ్యక్షులుగా కొనసాగుతూ ఎంతోమంది ఔత్సాహికులను ఈ రంగంలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు.











## యువత తెలుసుకో
## నిన్ను నువ్వు మలుచుకో



# నిజమైన మానవుడు

జరిగినదంతా చూస్తూ

ఎరుగనట్లు పడివుండగ

సాక్షీభూతుణ్నిగాను

సాక్షాత్తు మానవుణ్ని

కాళోజీతో ఏ కొంత పరిచయమున్నవాళ్లయినా, ఆయన గురించిన అ కోట్స్ ఇట్టే చెప్పేస్తూ ఉంటారు.

ఒకసారి వరంగల్లో ఏదో సాహిత్య సమావేశం ప్రారంభం కావాల్సి ఉంది.

సభికులు వచ్చారు. అతిధులు వచ్చారు. సమయం కూడా దగ్గరపడింది. అయినా అందరూ నిలబడే ఉన్నారు. కారణం?

టెంట్హౌజ్ నుంచి వచ్చిన కుర్చీల బొత్తి మనిషెత్తు అలాగే ఉంది. వేసే మనిషి ఏమయ్యాడో తెలీదు. ఓహో, అయితే ఆ పనాయన వచ్చి, వేస్తేగానీ, ఈ కుర్చీలు వేసుకోమూ, కూర్చోమూ; కాళోజీ చకచకా కుర్చీలు తీసి వేయడం మొదలుపెట్టారు. మిగిలినవాళ్లు ఆయన్ని అనుసరించారు. 'మనిషంటే శ్రమ చేసేవాడే; అదే అసలైన నిర్వచనం' అన్నాడు

కాళోజీ మరో సందర్భంలో.

'అన్యాయాన్నెదిరించినవాడు నాకు ఆరాధ్యుడు.'

తండ్రి నుంచి మహారాష్ట్ర సత్వాన్ని, తల్లి నుంచి కర్ణాటక వారసత్వాన్ని పొంది తెలుగు తత్వంతో పెరిగినవాడు కాళోజీ. ఆయన పూర్వీకులు ఎప్పుడో వరంగల్ లో స్థిరపడ్డారు. జిల్లాలోని మడికొండ గ్రామం భవిష్యత్తులో కాళన్నగా మారబోయే కాళోజీని ప్రపంచానికి పరిచయం చేసింది. తండ్రి రంగారావు సహ వ్యవస్థాపకుడైన ఊరి గ్రంథాలయం కాళోజీకి ప్రపంచాన్ని పరిచయం చేసింది.

స్పందన కాళోజీ జీవగుణం. అది దుఃఖంలోంచి రావొచ్చు, అన్యాయం వల్ల కావొచ్చు. నూనూగు మీసాలురాని పదహారేళ్ల ప్రాయపు కౌమారంలో ఆయన భగత్సంగ్ ఉరితీత (1931) కు బాధపడుతూ తన తొలి కవిత రాశాడు. వరంగల్ కాలేజియేట్ హైస్కూల్ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా, యాజమాన్యం గణపతి ఉత్సవాలకు సెలవు నిరాకరిస్తే, 1400 మంది విద్యార్థుల్లో 1200 మంది విశ్వాసానికి అది వ్యతిరేకమైనదని భావించి, సుమారు 1100 మంది విద్యార్థుల చేత వ్యక్తిగత సెలవుచీటీలు ఇప్పించి మాస్ ప్రొటెస్ట్ చేయించారు.

కాళోజీ మనసంత గట్టిది కాదు శరీరం. ఇంటర్ చదువుతున్నప్పుడు క్షయ సోకింది. క్షయ ప్రాణాంతకమైన కాలం అది. వరంగల్లో పెదవి విరిచారు. హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తెస్తే, శస్త్రచికిత్స చేసి ఒక ఊపిరితిత్తిని తొలగించారు. ఆపరేషన్ తర్వాత విశ్రాంతి తీసుకొమ్మన్నారు వైద్యులు. ఆ సమయంలో కాళోజీ ఎవరితోనే మాట్లాడుతుంటే, 'ఇలా ఎక్కువసేపు మాట్లాడితే ఆరు మాసాల్లో చనిపోతా'వన్నాడట డాక్టర్. 'మాట్లాడకుంటే ఆరు రోజుల్లో చనిపోతా' నన్నాడట కాళోజీ.

ఆ మాట అనేదాన్ని పోరాట ప్రతీకగా తీసుకుంటే, కాళోజీ మౌనంగా ఎన్నడూ లేడు; చివరిదాకా మాట్లాడుతూనే ఉన్నాడు. జీవితకాలమంతా మిగిలిన ఆ ఒక్క ఊపిరితిత్తితోనే బతికిన కాళోజీ, దాంతోనే ధైర్యాన్ని ఉచ్ఛ్వసించాడు; కవిత్వాన్ని నిశ్వసించాడు.

అవనిపై జరిగేటి అవకతవకల
చూసి ఎందుకో నా హృదిని
ఇన్ని ఆవేదనలు పరుల
కష్టము జూచి కరిగిపోవును
గుండె మాయమోసము జూచి
మండిపోవును ఒళ్లు

ఇలా ప్రకటించుకున్నవాడు కాబట్టే, ఆంధ్రమహాసభ ఉద్యమంలో చేరాడు. ఆర్యసమాజ్లో పనిచేశాడు. భారత స్వాతంత్ర్యానికి మునుపు, 1946లో వరంగల్ కోట మీద జాతీయ జెండా ఎగరేసిన కాంగ్రెస్ వాళ్లలో కాళోజీ కూడా ఒకడు. కత్తులతో, కఠార్లతో రజాకార్లు స్వైరవిహారం చేస్తున్న సందర్భం అదని చెబితే ఈ సంఘటన తీవ్రత తెలుస్తుంది. స్వాతంత్ర్యానంతరం హైదరాబాద్ సంస్థానాన్ని భారత

యూనియన్లో కలిపే పోరాటంలోనూ కాళోజీ పాల్గొన్నాడు. తెలంగాణా ఉద్యమానికి, మానవ హక్కుల ఉద్యమానికి, పౌర హక్కుల ఉద్యమానికి మద్దతుగా నిలిచాడు. ఏ పోరాటాలైతే ఆయన్ని ప్రజాకవిని చేశాయో, ఆ పోరాటాలన్నింటి లోనూ ఆయన ప్రజలకు బాధ్యుడిగా ఉన్నాడు.

సాహిత్య సమాజంలో విశిష్టస్థానం ఉన్నవాడు, అందునా వేమన మళ్లీ పుట్టాడనిపించుకున్నంత పాటివాడు అతిశయపు బారిన పడటం సహజం. కానీ కాళోజీకి సాహిత్య పరిమితుల పట్ల చాలా స్పష్టత ఉండేది. 'సమాజంలో విలువలను మార్చగలనన్న విశ్వాసం, మారుస్తానన్న ధీమా, మార్చవలెనన్న ఆతురత రచయితకు ఉంటుంది. అదంతా

వట్టి భ్రమే. అన్నాడు. ఎందుకంటే, విలువలు మారడానికి కారణాలు వేరే ఉంటాయి '(పాఠకుడి) వ్యక్తిగత టెంపరిమెంటు వల్ల, టెంపరిమెంటు వ్యక్తికి ఒకరకమైన సంస్కారాన్ని, అభిరుచులనూ బట్టీ ఆ వ్యక్తి తన రచయితలనూ, సాహిత్యాన్నీ ఎంచుకుంటాడు. రచన పట్ల పాఠకునికి ఏర్పడే అభిమానం రచన యొక్క విశేషం కాదు,' అన్నాడు. అయితే, సాహిత్యానికి ప్రయోజనం ఏమిటి?

'రాజకీయ విప్లవాల ద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించవచ్చు. విప్లవానంతరం ఏర్పడిన ప్రభుత్వాలు తమ కృషి ద్వారా సమానత్వాన్నీ స్థాపించవచ్చు. కానీ సౌభ్రాతృత్వం లేనిదే ఈ రెండింటివల్ల కలిగే ఫలితం సర్వేజనులకు చెందదు. ఈ సౌభ్రాతృత్వానికి కృషి చేయవలసింది రాజకీయనాయకులూ, విప్లవ కోవిదులూ కాదు; రచయితలు. నాయకులు విఫలమైనచోట రచయిత విజయం సాధించగలిగేది ఇక్కడే.' అన్నాడు. సాహిత్యం సర్వస్వం కాదని చెబుతూనే, సముచిత పీఠాన దాన్ని కూర్చోబెట్టాడు. సాహిత్యమే కాదు. జీవితపు పరిమితులను కూడా ఎరిగిన వాడు కాళోజీ. ఆయనకు జీవితం, సాహిత్యం వేర్వేరుకాదు. అయినప్పటికీ తనలో ఉన్న ఆ లేశమాత్రపు దారితప్పడాన్ని కూడా వెల్లడించకుండా ఊరుకోలేదు. గాంధీజీలాగా, చలంలాగా తన పొరపాట్లను తాను ప్రశ్నించుకున్నాడు. మానవ బలహీనతల గురించిన అత్యంత స్పృహ ఉన్నవాళ్లకు తప్ప ఇది సాధ్యం కాదు.

కాళోజీ ఉద్యమ జీవితంలో ఎన్నోసార్లు జైలుపాలయ్యాడు. ఒకసారి తప్పనిసరై నేరస్థజాతికి చెందిన మనిషితో లాకప్పు పంచుకోవాల్సి వచ్చింది. రాజకీయఖైదీ తను. 'వాడు' నేరగాడు. ఇక సమానత ఎక్కడ? అలాంటిది అతడు గాంధీజీ పేరెత్తగానే విచిత్రపడిపోయి కౌగిలించుకున్నాడట. 'నైజాం సంస్థానం మారుమూల గ్రామాల్లో అంత అట్టడుగు జీవితాల్లో కూడా గాంధీ పేరు చొచ్చుకుపోయింది. మేము మాత్రం మా అజ్ఞానంతో, అహంకారంతో గ్రామీణులను దూరం చేసుకున్నాం. గ్రామీణులతో కల్సిమెల్సి ఉండాలనే గాంధీ బోధనలు మామీద ఏ ప్రభావం వెయ్యలేదన్న విషయం ఆ రోజున నాకు సాక్షాత్కారం జరిగిందన్నమాట. నా జీవితం మరపురాని ఘట్టం. ఆ విషయం చెప్తుంటే ఇప్పుడు కూడా కన్నీరాగడం లేదు', అని ఆ అనుభవాన్ని పంచుకున్నాడు. అది తన గర్వభంగపు ఘటనగా చాటుకున్నాడు. కాళోజీకి మద్యం ఆఫర్ చేశాడట. 'ప్రభాకర్! బయట మద్యనిషేధ చట్టం ఉన్నది గనక తాగవద్దు. ఐనా, తాగుదామంటావు. ఖైరతాబాద్ చౌరస్తాకు బోయి, విశ్వేశ్వరయ్య విగ్రహం దగ్గర నడి చౌరస్తాల నిలబడి ఈ చట్టాన్ని మేము ఒప్పుకోవడం లేదు, కాబట్టి దీన్ని ఉల్లంఘిస్తున్నాం అని తాగుదాం,' అన్నాడు. అదీ ఆయన తత్వం. చాటుమాటుగా కాదు, ఏదైనా బాజాప్తాగా చేయాలనేవాడు. చేతికింద నలుగురు కుర్రాళ్లు ఉండగలిగే 'పెద్దరికం' వచ్చాక కూడా, కరెంటు బిల్లు కట్టడానికి వరుసలో నిలబడ్డవాడు కాళోజీ.

శిష్ట వ్యవహారికం కాదు, వ్యవహార శిష్టత కావాలనేవాడు కాళోజీ. 'నీ భాషల్నే నీ బతుకున్నది; నీ యాసల్నే నీ సంస్కృతున్నది... ఎవని వాడుక భాష వాడు రాయాలె. ఇట్లరాస్తే అవతలోనికి తెలుస్తదా అని ముందర్నే మనమనుకునుడు. మనను మనం తక్కువ చేసుకున్నట్లే. ఈ బానిస భావన పోవాలె. నేనెన్నోసార్లు చెప్పిన భాష రెండు తీర్లు. ఒకటి బడిపలుకుల భాష, రెండోది పలుకుబడుల భాష. పలుకుబడుల భాష గావాలె', అనేవాడు కాళోజీ. తెలంగాణ వరకే కాదు, తన భాషా సోయిని కళింగాంధ్ర, రాయలసీమకు కూడా వ్యాపింపజేసిన 'వ్యవహార' దక్షుడు.

★★★

# ఊడలమర్రి

# ఉపన్యాసాలు



విక్రమార్కుడు ఊడల మర్రి చేరుకునే సరికి భేతాళుడు, తన చుట్టూ ఓ నాలుగు పిల్లదెయ్యాలను కూర్చో బెట్టుకుని ఏదో కథ. చెప్పుతున్నాడు.

భేతాళుడిని చూస్తూ, ఏమిటి భేతళా పిల్లలకు ఏదోకథ చెబుతున్నావు ... అంటూ పలకరించాడు.

"అవును విక్కమార దేవత వస్త్రాలు అని ఓకథ వుందిలే' అది చెపుతున్నా అన్నాడు

"ఈ కథ ఎక్కడో విన్నట్టు వుందే .." అన్నాడు విక్ర మార్కుడు

". నువ్వు విన్నావా అయితే ముందు నువ్వు చెప్పు.. "అన్నాడు భేతాళుడు

'ఏముంది, ఆ కథలో ఓ రాజుగారని ఇద్దరు తెలివయిన దర్జీలు దేవతల వస్త్రాలు కుట్టి ఇస్తామని మోసేంచేసి బంగారం కొట్టి

వేస్తారు. చివరకు దేవతా వస్త్రాలు ఏవి అని దడిగితే, అవి పున్యాత్ముకలకే కాని పాపాత్ములకు కనపడవు అని చెపుతారు. దాంతో అక్కడున్న అందరూ తమని పాపాత్ములని మిగిలిన వాళ్ళు అనుకుంటారేమో నని, మాకు దేవతల వస్త్రాలు కనపడుతున్నాయి అని చెపుతారు

నిజానికి పాపం రాజు గారికి కూడా ఈ వస్త్రాలు కనపడవు. ఆమాట అంటే రాజు గారు పాపాత్ముడు అని అంటారని నాకు కనపడు తున్నాయి, చాలా అందంగా వున్నాయి అని వాటి ణి ధరిస్తున్నట్టు నటిస్తాడు .

దేవతా వస్త్రాలు ధరించిన రాజులు గారు ఏనుగు మీద. ఊరేగుతుంటే , రాజు గారి దిగంబర శరీరం చూసి అందరు. సిగ్గుతో తల వంచుకుంటారేకాని ఒక్కరూ నోరు మెదపరు. చివరకు అక్కడున్న ఓ చిన్న పిల్ల వాడు,



వెక్కిరించటంతో అసలు విషయం గ్రహించిన రాజుగారు సిగ్గుతో తలవంచుకుని వెను తిరుగుతారు. " ఇదే కథ అంటూ చెప్పుకొచ్చాడు విక్రమార్కుడు

" అంతా విన్న భేతాళుడు నవ్వుతూ.! 'అది నాచిన్నప్పుడు మా నాయనమ్మ చెప్పిన కథ. ఇప్పుడు కథ మారింది .. –నేనుచెప్పేది కొత్త కథ "అన్నాడు

"కొత్త కథా, కథ మారిందా.. అయతే అదేమిటో చెప్పు నేనుకూడా వింటాను' అంటూ అక్కడే పక్కనున్న ఓ సమాధిపైన కూర్చున్నాడు విక) మార్కు డు

"అనగనగా ఓ రాజుగారు, అదే అప్పట్లో రాజుగారు, ఇప్పుడు ఓ రాజకీయ నాయకుడు

"తరువాత "పిల్ల దెయ్యాలు ఉత్సావం ఆపుకోలేక అడిగాయి.

"వుండండ్రా, అంత తొందరెందుకు... చెబుతున్నాగా... ఆ రాజకీయ నాయుకుడు ఎన్నికల్లో గెలవటానికి ఎడాపెడా వాగ్దానాలు చేసేశాడు.."

" వాగ్దానాలకి, దేవతా వస్త్రాలకి సంబంధం ఏమిటి భేతాళా. .." అనుమానంగా అడిగాడు విక్రమార్కుడు

"విక్రమార్క కాస్త ఆగలేవా, నువ్వు కూడా వాళ్ళలా అడిగితే ఎలా?.."విసుక్కున్నాడు భేతాళుడు.

" ఆ రాజకీయ నాయకుడు ఇచ్చిన నాగ్దానాలలో ఉచితంగా దేవతా వస్త్రాలు , దేవతాభరణాలు కూడా ఇస్తానని నమ్మి బలికాడు "

"అయినా ఎవరన్నా ఉచితంగా వబియ్యం ఇస్తాము లేదా ఉచితంగా ఉప్పు పప్పు వంటి సరుకు లిస్తాము లేదా ఉచితంగా చదువు చెప్పిస్తాము, వైద్యం అందిస్తామంటూరు నేను ఎక్కడా ఉచితంగా దేవతా వస్త్రాలు, అభరణాలు ఇస్తామనతం చూడలా మరీ విడ్డూరంగా.. "అంటూ అడ్డుపడ్డాడు విక్రమార్కుడు

ఇందులో విడ్డురం ఏముంది ఉచితంగా బస్సు ప్రయాణాలు, ఉచితంగా తీర్ధయాత్రలు ఉచితంగా లాప్టాపులు, స్కూటర్లు సైకిళ్ళు ఇస్తున్నప్పుడు, ఉచితంగా దేవతవస్త్రాలు, ఇవ్వటంలో తప్పేముంది .. "సమర్ధించాడు భేతాళుడు

అది నిజమేలే ఆ తరువాత" విక్ర మార్కుడు తొందర పెట్టాడు.

" పిచ్చి జనం ,దేవతవస్త్రాయి ఇవ్వబోతున్నాడు అని ముందు వెనుక చూడ కుండా రాజకీయ నాయకుడిని గెలిపించారు. గెలిచిన తరువాత దేవతా వస్త్రాలు చాలా ఖరీదైనవి, వాటిని అందించాలంటే వాలా ఖర్చవ్వుతుంది అని. ప్రజలకు అందించే అన్ని సంక్షేమ పథకాలకు మంగళం పాడాడు ... "

" అవునవును దేవత వస్త్రాలు అంటే మాటలా చాలా ఖర్చుఅవుతుంది "ఓ పిల్ల దెయ్యం మిడి మిడి జ్ఞానం తో అన్నది

"పాపం పిచ్చిజనం, నిజంగా దేవత వస్త్రాలు తమ కోసం వస్తున్నాయని, అన్ని పథకాలు తీసేసినా నోరు ఎత్త లేదు. ఇదిగొ అదుగోఅంటూ కాలక్షేపం చేశాడు –... ఐదేళ్ళు


"మరి దేవతా వస్త్రాలు... " అనుమానం తీరక అడిగింది మరోపిల్ల దెయ్యం "

" మధ్య మధ్య లో వాటిగురించి అడిగిన వాళ్ళకు వాటిని ఇచ్చి, పుణ్యాత్ములకు మాత్రమే అవి కనపడతాయి అనేవాడు! అదంతా ఒట్టిదే అని తెలిసినా ఎవరికీ వాళ్ళు అందరూ తమను ఎక్కడ పాపాత్ములు అంటారేమోఅని నోరు మెదపలేదు. చివరకు జనం మొత్తాన్ని దెవతవస్త్రాల పేరుతో నడిరోడ్డు మీద నగ్నంగా నిలబెట్టాడు "అంతమోసం చేశాడా..." మరోపిల్ల దెయ్యం ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

"మోసమా.. ఎవరిది మోసం దేవతవస్త్రాలు ఇస్తానని చెప్పంగానే దురాశతో మోసగాళ్ళను గెలిపించి మంచి వాళ్ళని ఓడించటం మోసం కాదా ... మోసానికి మోసమే విరుగుడు. ఇలాంటి జనానికి అలాంటి రాజకీ మనాయకులే సరి" అంటూ ముగిం చాడు విక్ర మార్కుడు.★★★★

# మహా కవుల మానస పుత్రికలు

# "జానకి "




స్త్రీల సమస్యలు ప్రధానంగా చేసుకుని 1960ల నుండీ మహిళా రచయితలు నవలలు రాస్తున్నప్పటికీ 1980 ల తరువాత వెలువడిన నవలా సాహిత్యం సమస్యలకు పరిష్కారదిశగా సాగింది..1975-85 మధ్య కాలం అంతర్జాతీయ మహిళాదశాబ్దంగా యూ.ఎన్.ఓ. ప్రకటించింది.ఈ నేపథ్యంలో స్త్రీల సమస్యలు సమావేశాల్లో చర్చించడం, తమకుతాముగా మహిళలు చైతన్యవంతులవడం, ఈ దశాబ్దంలో జరిగింది. రంగనాయకమ్మ పేకమేడలు, రచయిత్రి వంటి నవలలు రాసినా 1980 లో ప్రచురించబడి వెలుగు చూసిననవల జానకి విముక్తి_ _ _

.. జానకి విముక్తి..మార్క్సిస్ట్ భావజాలంతో కూడిన నవల అయినప్పటికీ స్త్రీ వాదం పురిటినొప్పులు పడుతున్న కాలం.ఈ దశలో జానకి విముక్తి రావడం ప్రత్యేకతను సంతరించుకుంది.

నవలలో కథానాయిక జానకి_ _ _అమాయకురాలు.భర్తచేత పీడింపబడి, ఆ పీడను సహించలేక, అన్న, సత్యం బోధనలతో , చైతన్యవంతంగా తన జీవన మార్గాన్ని మార్చుకుంటుంది.

ఈ సందర్భంలో కుటుంబరావు గారి మాటలు గుర్తు చేసుకోవాలి." మన సమాజంలో కొందరు తక్కువ కులాల్లో పుడతారు. కొందరు బీదలకడుపున పుడతారు. మరి కొందరు ఆడవాళ్ళు గా పుడతారు."అంటారు.

అంటే ఆడదానిగా పీడించబడడానికి కులం,మతం, బీద, ధనిక తేడాలు లేవు.ఆడతనం ఒక ప్రత్యేకత తరహా తక్కువతనం...విప్లవ చైతన్యాన్ని ఇష్టపడే రచయిత రంగనాయకమ్మజానకి విముక్తి నవల ద్వారా స్త్రీ సమస్యల విముక్తి మార్గాలను చెప్పారు.

పితృస్వామ్య భావజాలం పేరుకుపోయిన సమాజంలో పురుషాధిక్యత పెచ్చుమీరిన సమాజంలో ఆడది ఎక్కువ చదువుకోకపోవడం వలన , పెద్దలు నమ్మిన సంప్రదాయాలను మనసులో స్థిరపరచుకుంటుంది. జానకి.

పెళ్ళయింతరువాత రెండేళ్ళ నుండీ అత్తవారింట్లో ,అత్తవలన , భర్త వల్ల పడుతున్న బాధలని తన అన్న సత్యంతో చెప్పుకుంటుంది.ఈ సందర్భంలో నవల మొదలవుతుంది... జానకీ పరిచయం అవుతుంది పాఠకులకు...భర్త మూర్ఖ చేష్టలన్నీ అన్న అసహ్యించుకోగా,చీదరించుకోగా ,తనంటే అంత ప్రేమ చూపడం తనకు తెలియకుండానే జానకికి ఇష్టమనిపిస్తుంది... అంటారు రచయిత.అతని చేష్టల వలన తన మనసు భర్తకు వ్యతిరేకంగా మారుతుందని తనకు తెలుస్తుంది."ఈ నీచునితో కాపురం చేస్తోనే వున్నావు అంటే చిన్నబుచ్చుకుంటుంది... "తప్పుతుందా! అంటుంది."

ఇక్కడ కట్టుబాట్లకు లోనైన సాధారణ యువతి కనబడుతుంది."తక్షణం వెళ్ళిపోయాం పద!"అని సత్యం అనగానే ఆశ్చర్యంగా చూస్తుంది.అలా చెయ్యొచ్చా! అన్నట్లు..."నీకిష్టమైతే మంచి వ్యక్తిని పెళ్ళి చేసుకుందువు గాని.." అని అన్న అనగా, ఛీ! పెళ్ళేంటీ! అంటుంది.మళ్ళీ పెళ్ళి చెసుకోవడం అవమానంగా భావించిన సగటు ఇల్లాలు జానకి.అంటే భర్త ఏమన్నా ,కొట్టనీ, తిట్టనీ, ఇంటెడు చాకిరీ చేసి కూడా, ఏమీ ప్రతిఘటన చెయ్యకుండా ఉండాలి ఆడది

..ఇది సమాజం నీతి.జానకి విముక్తి నవల కాలం నాటి న్యాయం. ఇప్పుడు కొంత మారినప్పటికీ స్త్రీ జీవితం పెళ్ళితో మారుతుందన్న ది నిజం...మంచీ కావచ్చు, చెడూ కావచ్చు.

ఇప్పుడున్న సమాజంలో స్త్రీల కేమైనా సమస్యలున్నాయా లేవా... ఉంటే.. అవి యేమిటి? ఎందుచేత ఉన్నాయి?అవి ఎలా పోతాయి? అనే విషయాలు స్త్రీలకు తెలపడమే ఈ నవల ముఖ్య ఉద్దేశ్యం అంటారు రచయిత..ప్రధానంగా జానకి, భర్త వెంకట్రావు, అన్న సత్యం పాత్రలుంటాయి.

జానకి ఆమె ప్రమేయం లేకుండానే భర్త బాధలను అన్నతో పంచుకోగాపుట్టింటికి పోదామని జానకిని తీసుకు వెళ్తాడు సత్యం....

చిన్నప్పుడే పెళ్ళయిన ,లోకం చూడని ఆడదానికి స్వంత నిర్ణయాలుండవు కదా! అన్నతో వెళ్ళిందె కానీ తన సంసారం మూన్నాళ్ళ ముచ్చటేసింది బాధ పడుతుంది.

మళ్ళీ భర్త వచ్చి పశ్చాత్తాపం నాటకాలాడి జానకిని తీసుకువెళ్తాడు..అప్పుడూ తన ప్రమేయం ఏమీ లేదు..

వయసు పెరిగే కొద్దీ, అన్న బోధనల వలన, పుస్తక పఠనంతో తనని తాను తెలుసుకుంటుంది.. రెండవ భాగంలో సాహసం మూర్తీభవించిన మనిషిగా, సత్యాన్ని, నిజాయితీని నమ్మే మనిషిగా జానకి కన్పిస్తుంది... అప్పటికి ఒక మగ పిల్లవాడిని జన్మనిస్తుంది....

ఎన్ని సంవత్సరాలు గడిచినా మారని మనిషి వెంకట్రావు.

" మూఢాచారాలని నమ్మే వెంకట్రావు, అబద్ధాలాడే వెంకట్రావు,కోపంకలిగిన వెంకట్రావు,నీతిలేని వెంకట్రావు, అవసరాన్ని బట్టి ఊసరవెల్లి లా రంగులు మార్చే వెంకట్రావువల్ల చేదు అనుభవాలెన్నింటినో చూసింది జానకి.

ఆ అనుభవాలకు పరాకాష్ట భర్తకు వ్యభిచార లక్షణాలు కూడా వుండడం....ఇంక ఆమె

సహనానికి తెరపడింది.

కోపం కట్టలు తెంచుకుంది...
ఆవేశం ఊపిరి పోసుకుంది.

వెంకట్రావు ను నిలదీసింది ..ఇది జానకి మానసిక పరిణామక్రమం...
అవునూ! పిల్లిని కూడా కట్టేసి కొడితే పులి అవుతుంది...
అలాగే జానకి బాధలు పడీ,పడీ చివరకు భర్తతో పెనవేసుకున్న జీవిత బంధం అబద్ధమనీ, కృత్రిమమనీ,మోసపూరితమనీ రుజువైనప్పుడు ఒక నిర్మలమైన ఆత్మకు కలిగే పరితాపం అది.

నేటి సమాజంలో కూడా ఎంతోమంది జానకి వంటి బాధలను భావిస్తున్న ఆడవారున్నారు..తను చదివిన పుస్తకాల జ్ఞానంతో ...
ఇంకానా...ఇకపై చెల్లదు...
దుర్మార్గం..అనుకుని ఒక స్థిర నిశ్చయంతో ఇంటినుంచి,అతని నుంచి దూరంగా కొడుకుతో సహా వెళ్ళిపోతుంది..

గుప్పిట్లో ఉంచిన తన సంసారవిషయాలన్నీఆవేశంతో తల్లికి అన్నకు చెబుతుంది. ...

"24 గంటలూ ఏదో ఒక సాధింపు తో చూస్తూ ఉంటాడు.మనిషిలో ఏ గుణము చూద్దామన్నా అసహ్యమే! నోరు తెరిస్తే అబద్ధాలు." అని అతని దుర్గుణాలచిట్టా పరుస్తుంది.

సున్నిత స్వభావం, పేదలపై సానుభూతి కలిగిన జానకి లోకజ్ఞానంతో ఎదిగి, స్టడి సర్కిల్ లో పనిచేస్తున్న ,పరిచయమైన ప్రభాకర్ అన్నివిధాలా యోగ్యుడని భావించి అతనితో జీవితం పంచుకోడానికి సిద్ధపడుతుంది.

అతను కోరిన తరువాత...
కొడుకుతో సహా అతని జీవితంలో ప్రవేశిస్తుంది. ఆత్మానుభవంతో ప్రవర్తించి ,మానసిక, శారీరక బాధలనుండి విముక్తి పొందింది.

ఇలా జానకి పాత్రలో క్రమ పరిణామాన్ని చూపారు.


రచయిత.తనకు తానుగా చైతన్యవంతమైతేనే ఆ మార్పు శాశ్వతం అని కూడా ఆ పాత్ర ద్వారా చూపారు.సాంప్రదాయ బద్ధంగా పెరిగిన జానకి,తాను సంపాదించిన జ్ఞానంతో తన మార్గాన్ని సుగమం చేసుకుంది.

ఈ రోజుల్లో ఇలాగే కొంతమంది భర్తలతో వేగలేనప్పుడు విడాకులు తీసుకుని మళ్ళీ వివాహం చేసుకోవడం చూస్తూనే ఉన్నాం..పురుషులందరూ అలా ఉంటారని కాదు...కానీ చదువుకుని,ఉద్యోగం చేస్తున్న స్త్రీని కూడా నీకేం తెలియదు...
అని తీసి వేయడం ,ఆమెపై పెత్తనం చేయడం ఇంకా జరుగుతూనే ఉన్నది..ఆడవాళ్ళు సహనవంతులు కాబట్టి సర్దుకుని వెళ్ళిపొతున్నారు....
అత్యాధునిక కాలంలో ఆడవాళ్ళ ద్వారా బాధలు పడుతున్న మగవాళ్ళు కూడా లేకపోలేదు...

ఈవిధంగా సగటు స్త్రీ గా మొదలైన జానకి పాత్ర తన జీవితానికి తానే నియంత అనే విధంగా నిర్ణయాలు తీసుకునే సాహసం కల స్త్రీ పాత్ర జానకి..

★★★

# నవ్వండి ప్లీజ్






శ్రీనివాస్ కార్టూన్లు

**నవ్వటం ఒక యోగం ,**

**నవ్వలేక పోవటం ఒక రోగం ,**

**తరువాత మీ ఇష్టం**









# జ్యోతి సురేఖ



క్రీడల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాలను తాజాగా ప్రకటించింది కేంద్ర సర్కారు. అలాగే అర్జున అవార్డులను కూడా అనౌన్స్ చేసింది. 2024 సంవత్సరానికి గానూ నలుగురు క్రీడాకారులను ఖేల్‌రత్నకు ఎంపిక చేసింది. ఇందులో ఒలింపిక్స్ డబుల్ మెడలిస్ట్ మను బాకర్, వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ విన్నర్ డి.గుకేశ్, హాకీ టీమ్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్ ఉన్నారు. అలాగే గతేడాది క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 32 మంది ప్లేయర్లకు అర్జున అవార్డు ప్రకటించింది సర్కారు. అయితే అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతున్న ఒక తెలుగు అమ్మాయికి మాత్రం మొండిచెయ్యి ఎదురైంది. ఈసారైనా ఖేల్‌రత్న వస్తుందని అనుకుంటే మళ్లీ అన్యాయం జరిగింది. ప్రముఖ ఆర్చర్, తెలుగు తేజం వెన్నం జ్యోతి సురేఖకు మరోసారి అన్యాయం జరిగింది. నాలుగు సంవత్సరాలుగా ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు మొదటి స్థానంలో ఉన్నప్పటికీ ఆమెకు అవార్డు దక్కలేదు.

ఈ సంవత్సరం కూడా కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఆమె పేరు ప్రతిపాదించలేదు. గతేడాది ఏషియన్ గేమ్స్‌లో 3 బంగారు పతకాలను సాధించిన ఏకైక క్రీడాకారిణి జ్యోతి సురేఖ. ఇప్పటివరకు 62 అంతర్జాతీయ మెడల్స్ సాధించిన ఈ తెలుగు అమ్మాయి పేరు తాజాగా ప్రకటించిన అవార్డు లిస్టులో లేకపోవడంపై క్రీడాభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు

. ఖేల్ రత్న అవార్డుకు తన పేరును పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్కు చెందిన అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖ గతేడాది జనవరిలో హైకోర్టులో వ్యాజ్యం వేశారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు, ఉన్నం అఖిల్ చౌదరి వాదనలు వినిపించారు. సురేఖ సాధించిన అవార్డులు, పాయింట్లను కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వెన్నం జ్యోతి సురేఖ అంతర్జాతీయ స్థాయిలో ఎక్కువ పతకాలు సాధించినప్పటికీ ఖేల్రత్న అవార్డు ఎంపికలో ఆమెను విస్మరించారని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కుడా తప్పుపట్టింది. అవార్డుకు ఎంపికైన వారికంటే సురేఖకు ఎక్కువ పాయింట్లు ఉన్నాయని తేల్చిచెప్పింది. అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్చంద్ ఖేల్రత్న అవార్డును జ్యోతి సురేఖకు ఇచ్చే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర క్రీడల, యువజన మంత్రిత్వశాఖ, ఎంపిక కమిటీని ఆదేశించింది. 2023, 2024 సంవత్సరాలకు ఖేల్రత్న అవార్డుకు ఇప్పటికే ఎంపికైన క్రీడాకారులతోపాటు జ్యోతి సురేఖ పేరును పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. పిటిషనర్ నుంచి ఈ విషయంలో తాజాగా దరఖాస్తు కోరవద్దని స్పష్టం చేసింది. 2024 సైతం ముగిసిన నేపథ్యంలో 2023లో ఖేల్రత్న అవార్డుకు ఎంపికలను ఈ దశలో రద్దు చేయడం సరికాదని అభిప్రాయపడింది. ఖేల్ రత్న పురస్కారానికి ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసేందుకు మార్గదర్శకాలను రూపొందించాలని కేంద్ర క్రీడలు, యువజన శాఖ కార్యదర్శిని ఆదేశించింది. సెలక్షన్ కమిటీకే విచక్షణాధికారాన్ని వదిలేయకుండా, ఎలాంటి అస్పష్టతకు తావివ్వకుండా మార్గదర్శకాలు, నిబంధనల మేరకు కట్టుబడి ఉండేలా చూడాలని స్పష్టం చేసింది.



**కొత్త సీరియల్**

క్రైం సీరియల్

# ఆమె ఎవరు?



కొండగుంట వెంకటేష్.

## జరిగిన కధ:

మేఘమాల కళ్ళు తెరిచే టప్పటికి ,తను ఉన్న ప్రదేశం కొత్తగా అనిపిస్తుంది .తన గదిలోకి ఓ అపరిచిత స్త్రీ వచ్చి మేఘమాలా లండన్ లో ని తన సొంత ఇంట్లో ఉన్నదని చెపుతుంది .మేఘమాలకి ఏమి అర్ధం కాదు.లారి ఆక్సిడెంట్ లో గాయపడినట్టు చెపుతాడు రాజేష్.తండ్రి గదిలో ఉన్న ఫోటోలోని వ్యక్తిని గుర్తు పట్టటానికి ప్రయత్నిస్తుంది .కేంద్ర హోం మినిస్టర్ చిదంబరం కూతురు మేఘమాల కిడ్నాప్ అవుతుంది .

ఇక చదవండి

ఇండియా న్యూఢిల్లీ.

పత్తేదార్ పత్రిక ఆఫీసులోకి వేగంగా దూసుపోయింది బైక్. పార్కింగ్ స్పేస్ లో పార్క్ చేసి బైక్ దిగాడు విశాల్. బ్యాగ్ తీసుకుని లోపలికి వెళ్ళాడు. లిఫ్ట్ ఎక్కి నాలుగవ అంతస్థు చేరుకున్నాడు. అతని ఆఫీసు ఆ ఫ్లోర్ లోనే ఉంది. తిన్నగా చీఫ్ ఎడిటర్ చాంబర్స్ లోకి వెళ్ళాడు.

“గుడ్ మార్నింగ్ సార్”ఎడిటర్ ను విష్ చేశాడు విశాల్.

“గుడ్ మార్నింగ్ రా. నీకోసమే ఎదురుచూస్తున్నాను”అన్నాడు ఎడిటర్.

ఆయన ఎదురుగా కూర్చుని బ్యాగ్ లోంచి ఫైలు తీశాడు. దాని మీద టాప్ సీక్రేట్ అని ఎర్రరంగుతో రాసుంది.

"ఇదిగో సార్ ఫైలు. ఇందులో ఆ వ్యక్తి గురించి అన్ని వివరాలు ఉన్నాయి"అన్నాడు విశాల్.

"ఇంత తొందరగా ఎలా సంపాదించావు"ఆశ్చర్యంగా అడిగాడు ఎడిటర్.

"అది వృత్తీరహస్యం చెప్పకూడదు"అని నవ్వాడు విశాల్.

"నా మాటే నాకే అప్పచెప్పుతున్నావా"అని ఫైలు అందుకుని చూశాడు.

మొదటి పేజిలో ఒక ఫోటో ఉంది. దాన్ని చూసి త్రాచుపామును చూసినట్టు ఉలిక్కిపడ్డాడు ఎడిటర్.

"ఏమిటి ఇది"అన్నాడు ఆశ్చర్యంగా.

"ఈ ఫోటో శివరావుది. అధికారంలో ఉన్న ప్రభుత్వంలో ఒక ముఖ్యమైన నాయకుడు. స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి. పైకి ఆయన మాములు మంత్రి, లోపల ఆయన ఒక పెద్ద నేరస్తుడు. ఎంతో మంది నేరస్తులతో ఆయనకు సత్ సంబంధాలు ఉన్నాయి. ముఖ్యంగా కోల్ మాఫియా ఆయిల్ మాఫీయా మెడికల్ మాఫీయాలతో సంబంధాలు ఉన్నాయి. వాళ్ళతో ఆయనకు ఒప్పందం కూడా ఉంది. దానికి సంబంధించిన అగ్రిమెంట్ కాగితాలు కూడా ఆ ఫైలులో ఉన్నాయి. "

"అంతా బాగానే ఉంది. కాని ఈ విషయాలను మన ప్రతికలో ఎలా ప్రచురించమంటావు"ఆందోళనగా అడిగాడు ఎడిటర్.

"ఇంతకుముందు మనం ఎంతో మంది నేరస్తుల గురించి ప్రచురించాం. అవి ఎంతో ప్రజాధరణ పొందాయి. ముఖ్యంగా టైగర్ కిట్టు గురించి కూడా మన పత్రిలో వచ్చింది. అతను చేసిన హత్యలు మానభంగాలు అన్ని వివరంగా రాశాం. వాటికి సంబంధించిన ఆధారాలు కూడా సంపాదించాం. అతని గురించి మన పత్రికలో చదివిన పోలీస్ అధికారులు వెంటనే అతన్ని అరెస్ట్ చేసి జైలుకు కూడా పంపించారు. ప్రస్తుతం అతని కేసు కోర్ట్ లో నడుస్తుంది. పటిష్టమైన ఆధారాలు సాక్ష్యాలు ఉన్నాయి కనుక తప్పకుండ అతనికి శిక్షపడుతుంది. "

"అతని గురించి పత్రకలో చదివిన పాఠకులు ఎంతో స్పందించారు. చాల మంది సంతోషం ఆనందం వ్యక్తపరిచారు. ముఖ్యంగా కిట్టువల్ల బాధపడిన వాళ్ళు ప్రత్యేకంగా ఉత్తరాలు రాశారు. అందులో వాళ్ళు తమ కృతజ్ఞతను తెలియచేశారు. ఇది కూడా అలాంటే కేసే. కాకపోతే ఈ ఫైలులో ఉన్న రాజకీయనాయకుడు. అంతే తేడా."

"అదే నేను కూడా చెప్పుతున్నాను. శివరావు ఒక ఆకురౌడి కాదు. స్టేట్ లో అధికారంలో ఉన్న పార్టీ నాయకుడు. అతను తలుచుకుంటే మన పత్రికను నామరూపాలు లేకుండ చెయ్యగలడు. నేను చీఫ్ ఎడిటర్ ను కనుక ధైర్యంగా అతని ఆగడాలు ప్రతికలో ప్రచురించగలను. కాని మేనేజ్ మెంట్ ఒప్పుకుంటుందా. మన కంపెనికి అయిదుగురు డైరక్టర్స్ ఉన్నారు. వాళ్ళలో ఇద్దరు శివరావుకు మంచి సన్నిహితులు. వాళ్ళకు ఈ విషయం తెలిస్తే మన చీటి చినిగిపోతుంది. అంత రిస్క్ తీసుకోవటం అవసరం అంటావా"అన్నాడు బేలగా.

"అయితే ఏం చేద్దాం అంటారు"అడిగాడు విశాల్.

"ఈ ఫైలు నా దగ్గరే ఉండనివ్వు. సమయం చూసి డైరక్టర్స్ తో మాట్లాడతాను. వాళ్ళు సరే నంటే అప్పుడు వేద్దాం. లేకపోతే"అని ఆగిపోయాడు.

"లేకపోతే ఫైలును నాశనం చేస్తారు అవునా. ఈ వివరాలు సంపాదించటానికి నేను ఎంత కష్టపడ్డానో ఎన్ని రాత్రులు నిద్రపోలేదో నాకు తెలుసు. ఆ డైరక్టర్ల గురించి నాకు ముందే ఎందుకు చెప్పలేదు. చెప్పిఉంటే ఇంత రిస్క్ తీసుకునేవాడిని కాను. ఇంత కష్టపడేవాడిని కాను. నా శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరు అయింది"అన్నాడు విశాల్ చిరాకుగా.

"సారీ విశాల్"అన్నాడు అపాలజటిక్ గా ఎడిటర్. నువ్వు ఎవరి గురించి తెలుసుకుంటున్నావో నాకు మందే చెప్పలేదు. చెప్పిఉంటే ఆపేవాడిని."

"ఎప్పుడు మాత్రం చెప్పాను. టైగర్ కిట్టు గురించి చెప్పలేదు.

అమ్మాయిలను తార్చే బ్రోకర్ టోని గురించి చెప్పలేదు. ఇంకా చాల మంది గురించి మీకు చెప్పనే లేదు. అందుకే శివరావు గురించి కూడా చెప్పలేదు. "

"పెద్దవాడిని నా మాట విను. ఈ ఫైలు గురించి మరిచిపో. మన డైరక్టర్స్ ఖచ్చితంగా దీన్ని ప్రచురించటానికి ఒప్పుకోరు. కాదు కూడదని మనం మొండిగా ప్రవరిస్తే మన ఉద్యోగాలు ఊడిపోతాయి. నేను పిల్లలు గలవాడిని. నాకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పెద్దదానికి పెళ్ళయింది. చిన్నది ఇంకా డిగ్రీ చదువుకుంటోంది. చదువు పూర్తయిన తరువాత పెళ్ళిచేస్తాను. ఆంతవరకు నా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలి కదా. నా పరిస్థితి అర్ధంచేసుకో"

"జరిగింది మరిచిపోండి. మీ ఇష్టప్రకారమే చెయ్యండి. కాకాపోతే నాకు పదిరోజులు సెలవు కావాలి"అన్నాడు విశాల్.

"అలాగే తీసుకో"అన్నాడు ఎడిటర్ నవ్వుతూ. ఆయన మొహంలో ఇంకిపోయిన కళకాంతులు తిరిగి వచ్చాయి.

XXXX

విసుగ్గా ఇంటికి చేరుకున్నాడు విశాల్. జరిగింది అతను తట్టుకోలేకపోతున్నాడు. చీఫ్ ఎడిటర్ గురించి ఎంతో గొప్పగా ఊహించుకున్నాడు. కాని ఇలా ప్రవర్తిస్తాడని అనుకోలేదు. ఒక చీఫ్ ఎడిటర్ గా ప్రజలకు నిజమైన వార్తలు ఇవ్వవలసిన బాధ్యత అతని మీద ఉంది. కాని ఆయన అలా చెయ్యలేదు. ఉద్యోగం కాపాడుకోవటం కోసం ప్రజలు ఖచ్చితంగా తెలుసుకోవలసిన వార్తను నొక్కేస్తున్నాడు. తాము ఎంతో ఇష్టపడి ఎన్నుకున్న ప్రతినిధి ఎంత పెద్ద నేరస్థుడో తెలుసుకునే ఆవకాశాన్ని వాళ్ళు పోగోట్టుకున్నారు. దీనికి ప్రధాన కారకుడు ఎడిటర్.

కాఫీ తాగుతూ బాల్కని దగ్గర నిలబడ్డాడు. తొందరపడి సెలవుతీసుకున్నాడు. కాని ఆ సెలవులలో ఏం చెయ్యాలి. ఫ్రెండ్స్ సర్కిల్ తక్కువ. బాగా క్లోజ్ ఫ్రెండ్స్ ఇద్దరో ముగ్గురోఉన్నారు. వాళ్ళంతా విదేశాలలో స్థిరపడ్డారు. అయితో వారానికి రెండు మూడు సార్లు వాళ్ళతో ఫోన్ లో మాట్లాడతాడు విశాల్. అంతకుమించి సిటిలో ఎవరు పెద్దగా లేరు.

అప్పుడే సెల్ ఫోన్ చప్పుడు చేసింది. డిస్ ప్లే మీద అన్ నోన్ నెంబర్ కనిపించింది. అయిన ఆన్ చేసి "హల్లో "అన్నాడు.

"చాల తప్పు చేశావు. దానికి మూల్యం త్వరలోనే చెల్లించుకుంటావు"అవతలనుంచి ఒక గొంతు వినిపించింది.

"ఏం తప్పు చేశాను. ఇంతకి నువ్వు ఎవరు."

"అది అంత అవసరం కాదు"అని లైన్ కట్ చేశాడు అతను. వెంటనే విశాల్ ఆ నెంబర్ కు కాల్ చేశాడు. కాని రెస్పాన్స్ లేదు. పోలీస్ డిపార్ట్ మెంట్ లో అతనికి చాల మంది తెలుసు. వాళ్ళ సహాయంతీసుకుంటే ఆ నెంబర్ ఎవరిదో తేలికగా తెలుస్తుంది. కాని పెద్దగా ఇంట్రస్ట్ చూపించలేదు విశాల్. ఇలాంటి బెదరింపులు రావటం అతనికి మామూలే. ఇన్ వెస్టిగేటివ్ జర్నలిస్ట్ అన్నతరువాత ఇలాంటివి తేలికగా తీసుకోవాలి. లేకపోతే ఈ వృత్తిలో కొనసాగటం చాల కష్టం.

కాఫీ తాగి బెడ్ రూంలోకి వెళ్ళబోతుంటే మళ్ళీ సెల్ రింగ్ అయింది. అతనే మళ్ళీ చేశాడని అనుకున్నాడు. కాని అతను కాదు. విశాల్ గరల్ ఫ్రెండ్ స్మిత

"హాయ్ చెప్పు"అన్నాడు మాములుగా.

"ఏమిటి నీ గొంతు అదోలా ఉంది"అంది స్మిత.

"ఎలా ఉంది."

"నిర్లిప్తంగా ఏదో పోగోట్టుకున్నవాడిలా."

"సారీ ఇప్పుడే ఆఫీసునుంచి వచ్చాను. బాగా అలసిపోయినట్టున్నాను. అందుకే నీకు అలా అనిపించి ఉండవచ్చు."

"ఏం చేస్తున్నావు?

"ఏం చెయ్యటం లేదు. కాఫీ తాగుతూ టీవి చూస్తున్నాను."

"ఇంట్లోనే ఉండు. అరగంటలో వస్తున్నాను"అని లైన్ కట్ చేసింది.

మామూలుగా అయితే స్మిత వస్తుందంటే ఉత్సాహంగా ఉండేవాడు. ఆమెతో మాట్లాడటానికి ఎంతో ఇష్టపడేవాడు. కాని ఈ రోజు అతని మూడ్ పూర్తిగా అప్ సెట్ అయింది. శివరావు విషయంలో ఎంతో కష్టపడ్డాడు. దాదాపు పదిహేను రోజులు రాత్రిపగలు తేడాలేకుండ తిరిగాడు. రహస్యంగా అతన్ని అనుసరిస్తూ వెళ్ళాడు. ఇంతేచేస్తే ఆ ఎడిటర్ చివరిక్షణంలో మోసం చేశాడు. శివరావు పత్రిక యాజామాన్యానికి బాగా సన్నిహింతుడు కనుక తను ప్రచురించలేనని ఖచ్చితంగా చెప్పేశాడు.

ఆలోచనలకు బ్రేక్ వేసి రెండు కప్పులు కాఫీ తయారుచేశాడు. బ్రడ్ టోస్టర్ లో బ్రెడ్ కాల్చీ కట్ చేసి సాండ్ విచ్ ఆకారంలో చేశాడు. వాటిని కాఫీని టేబుల్ మీద పెట్టి తిరిగి హాలులో కూర్చున్నాడు.

సరిగ్గా అరగంట తరువాత స్మిత వచ్చింది. ఆమె ఒక పేరుపొందిన యాడ్ కంపెనిలో పనిచేస్తుంది. అచ్చంగా మోడల్ లా ఉంటుంది.

“ఏమైంది విశాల్”అంది అతని పక్కన కూర్చుంటు.

“నాకేమైంది.నేను బాగానే ఉన్నాను కదా.”

“అబద్దం చెప్పుతున్నావు. మనం రెండు సంవత్సరాలనుంచి కలిసి తిరుగుతున్నాం. కాని ఎప్పుడు నీ గొంతు ఇలాలేదు. నిజం చెప్పు. ఏమైంది”అంది మెల్లగా.

దాచే ప్రయత్నం చెయ్యలేదు విశాల్. జరిగినదంతా చెప్పాడు.

అంతా శ్రద్ధగా విన్నా స్మిత తేలిగ్గా కొట్టిపారేసింది.

“ఇది చాల చిన్న విషయం. దీనికి ఇంతగా బాధపడాల.”

“నీకు కూడా ఇది చిన్న విషయంలా తోస్తుందా. ఈ నిజం బయటకు తియ్యటానికి నేను ఎంత కష్టపడ్డానో నాకు మాత్రమే తెలుసు.”

“ప్రతి ప్రయత్నం విజయవంతం కాదు. ఒకవేళ విజయం సాధించిన మనం అనుకున్న లక్ష్యాన్ని గమ్యాన్ని ఆ విజయం చేరకపోవచ్చు. నువ్వు నిజాయితిగా డ్యూట్ మైండెడ్ గా నీ పని పూర్తిచేశావు. దానికి తగిన ప్రతి ఫలం లభించలేదు. అందుకని నిరాశపడతావా. నీ ప్రయత్నంలో ఓడిపోయావని సరిపెట్టుకో. జయం అయిన అపజయం అయిన సమాంగా తీసుకోవాలి. అప్పుడే మనం ఇంకో ప్రయత్నాన్ని ఉత్సాహంగా మొదలుపెట్టగలం. లేకపోతే నిరాశతో కృంగిపోతాం. దాని వల్ల మన భవిష్యత్తు ముందుకు సాగదు.”

“నువ్వు శివరావు గురించి తెలుసుకుంటున్నావని నాకు ముందు ఎందుకు చెప్పలేదు.”అంది.

“చెపితే ఏం చేసేదానివి”నవ్వుతూ అడిగాడు విశాల్.

“నీ ప్రయత్నాన్ని ఆపేదాన్ని.”

“ఎందుకు?

“ఎందుకంటే మా కంపెని డైరక్టర్ మీ కంపెని డైరక్టర్స్ శివరావుకు మంచి స్నేహితులు కనుక.”

“ఈ విషయాలు నీకు ఎలా తెలుసు?ఆశ్చర్యంగా చూశాడు విశాల్.

“ఒక రోజు మీ కంపెని డైరక్టర్స్ ఇద్దరు మా కంపెని డైరక్టర్ , శివరావు అందరు మా డైరక్టర్ చాంబర్స్ లో సమావేశం అయ్యారు. కారణం నాకు తెలియదు. గంట వరకు తనని ఎవరు డిస్టర్బ్ చెయ్యవద్దని మా డైరక్టర్ చెప్పాడు. మా డైరక్టర్ కు శివరావుకు ఉన్న స్నేహం నాకు తెలుసు. కాని మీ డైరక్టర్స్ కు మా డైరక్టర్స్ కు ఉన్న పరిచయం కూడా నాకు తెలుసు. కాని మీ డైరక్టర్స్ కు శివరావు తెలుసని అప్పుడే నాకు తెలిసింది. వెంటనే ఈ విషయం నీకు చెప్పాలని అనుకున్నాను. తరువాత ఏదో పని వల్ల మరిచిపోయాను.”

“ఇప్పుడు చెప్పు ఈ విషయం చెప్పిఉంటే నువ్వు నువ్వు ఇంత కష్టపడేవాడివి కాదు. ఒకవేళ కష్టపడిన ప్రతిఫలం ఉండదని సరిపెట్టుకునేవాడివి. అవునా.”నీ లక్ష్యం ఆశయం ప్రజలకు నిజం తెలియటం. అది సాధ్యం కానప్పుడు నువ్వు మాత్రం ఎందుకు ఆ ప్రయత్నం చేస్తావు. ఖచ్చితంగా చెయ్యవు. బుర్రఉన్నవాడు ఎవడు చెయ్యాడు. ఒకరి దగ్గర

ఉద్యోగం చేస్తున్నప్పుడు కొన్ని విషయాలలో సర్దుకుపోవాలి. కాదుకూడదనుకుంటే ఉద్యోగం చెయ్యలేం. ఎక్కడ ఉద్యోగం దొరకదు. జరిగింది మరిచిపో. హాయిగా ఉండు"అంది.

ఆమె మాటలు అతనికి సబబుగానే తోచాయి.

"నిజమే. ఇంత దూరం నేను ఆలోచించలేదు. ఇప్పుడు నా మనస్సు తేలికపడింది"అన్నాడు విశాల్.

తరువాత ఇద్దరు సాండ్ విచ్ తిని కాఫీ తాగారు.

"రేపు నీ ప్రోగ్రాం ఏమిటి"అడిగాడు విశాల్.

"ప్రత్యేకంగా ఏం లేదు. రొటిన్ వర్క్"అంది స్మిత.

"పదిరోజులు ఆఫీసుకు సెలవు పెట్టాను. ఎక్కడికి వెళ్ళాలా అని ఆలోచించాను. లండన్ వెళ్ళాలనిపించింది. వస్తావా"

"నాకు రావాలనే ఉంది. కాని వీలుపడదు. రేపు ఆఫీసులో ఒక ముఖ్యమైన మీటింగ్ ఉంది. కొత్త ప్రాజెక్టు గురించి చర్చించబోతున్నాం. అందుకే సారీ"అంది అపాలజటిక్ గా.

నిరుత్సాహంగా చూశాడు విశాల్.

"రేపు సాయంత్రం ఫ్లైట్ కు బయలుదేరాలని అనుకుంటున్నాను. రేపు ఉదయం వరకు ఆగుతాను. ఈ లోగా ఆలోచించి నీ నిర్ణయం చెప్పు"అన్నాడు.

"సారీ విశాల్. రేపు మాకు కొత్త ప్రాజెక్ట్ రాబోతుంది. దాదాపు వందకోట్ల ప్రాజెక్టు. వారంరోజులలో పూర్తిచెయ్యాలి. ఇది ఒక క్రియేటివ్ ఫీల్డ్. సమయానికి పూర్తికాదు. అందుకే నేను రాలేను"అంది.

"సరే అయితే"అన్నాడు నిర్లిప్తంగా.

అతని నిరుత్సాహాన్ని ఆమె గమనించింది.


"ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఎవరు చెప్పలేరు. లండన్ లో నీకు మంచి సబ్జక్టు దొరకవచ్చు. ఇన్ వెస్టిగేటివ్ జర్నలిస్ట్ వి కదా. ప్రయత్నిస్తే సాధ్యం అవుతుంది. దాని వల్ల నీ పేరు ప్రఖ్యాతలు దేశం అంతా మారుమ్రోగిపోవచ్చు."

"నేను వెళుతుంది విదేశానికి. అక్కడ నా లాంటి ఇండియన్ ఇన్ వెస్టిగేటివ్ జర్నలిస్ట్ కు ఏం పని ఉంటుంది. సైట్ సీయింగ్ చెయ్యటం తప్ప"అన్నాడు.

"ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరు చెప్పలేరు. అది మంచి అయిన చెడు అయిన. సరే నేను బయలుదేరుతాను. రేపు మీటింగ్ కోసం నోట్స్ తయారుచేసుకోవాలి"అని బై చెప్పి వెళ్ళిపోయింది స్మిత.

(ఇంకా ఉంది )

# శప్తభూమి




శప్తభూమి అంటే శపించబడిన నేల అని అర్థం. 18వ శతాబ్దంలో రాయలసీమ ప్రాంతానికి చెందిన చరిత్రను రచయిత ఈ నవలలో నమోదు చేశాడు. శ్రీకృష్ణదేవరాయల పాలన తరువాత పాలెగాళ్ళ సంస్థానాల లోని రాజకీయాలు, కక్షలు కార్పణ్యాల మధ్య నలిగిన ప్రజల జీవితాలు, పాలెగాళ్ల దౌర్జన్యాలు, బసివిని వ్యవస్థ, సతీ సహగమనం వంటి అనాచారాలు, కరువు కాటకాలకు తట్టుకోలేక పసిపిల్లలను అమ్ముకునే దుస్థితీ ఈ నవలలో కనిపిస్తాయి. రచయిత తనకు తెలిసిన గాలిదేవర సమాధి, గులిగానప్ప పరస, కదిరప్ప స్వామి పరస, వీరగల్లులు మొదలైన చారిత్రక దాఖలాలను ఆధారం చేసుకుని ఈ నవలను రాసాడు.అదే సమయంలో వర్తమాన సందర్భమైన తెలంగాణా ఉద్యమం కూడా రచయితను ప్రభావితం చేసింది. రాయలసీమ ప్రాంత ఆర్థిక, సామాజిక, రాజకీయ, మత, సాంస్కృతిక పరమైన చరిత్రను నవలారూపంలో అందించాలని రచయిత భావించాడు.

# చదవాల్సిన పుస్తకం

శప్తభూమి 2017 లో ప్రచురితమైన తెలుగు చారిత్రిక నవల. 18 వ శతాబ్దపు రాయలసీమ చరిత్ర నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. ఈ ఈ నవలను బండి నారాయణస్వామి రచించాడు. 2017 మే లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) నిర్వహించిన తెలుగు నవలల పోటీలో ఇది, మరో రెండు నవలలతో సంయుక్తంగా మొదటి బహుమతిని పంచుకుంది. 2019 లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందింది.

1775 ప్రాంతాలలో అనంతపురం సంస్థానాన్ని హండేరాజు సిద్ధరామప్పనాయుడు పరిపాలిస్తుంటాడు. తన శత్రువులైన తాడిమర్రి సంస్థానం వారు బుక్కరాయసముద్రం చెరువుకు గండి పడేటట్లు చేసి అనంతపురాన్ని ముంచివేయాలనే కుట్ర పన్నుతారు. కానీ బిల్లే ఎల్లప్ప అనే గొర్రెల కాపరి సాహసంతో వారి కుట్రను భగ్నం చేస్తాడు. రాజు మెచ్చి అతడిని అమరనాయకుడిగా నియమిస్తాడు. అతడు ఎల్లప్పజెట్టీగా పిలువబడుతుంటాడు. తన రాజు బొక్కసం నింపడం కోసం తాడిమర్రి సంస్థానానికి చెందిన యెల్లుట్లను దోచుకుంటాడు.



సిద్ధరామప్పనాయుడు మైసూరు నవాబు టిప్పుసుల్తానుకు రెండు సంవత్సరాలు ఖండినీరూకలు బాకీ పడినాడు. దానిని వసూలు చేసుకోవడానికి మైసూరు నవాబు తరపున గుత్తి సుబేదార్ అనంతపురం సంస్థానంపై దాడికి దిగుతాడు. అతడితో చెరువులోపల్లె పరగణా కుదువ పెట్టడానికి, ఇరవై ఐదు వేల రూకలు చెల్లించడానికి ఒప్పందం కుదురుతుంది. ఐతే పద్నాలుగు వేల రూకలు మాత్రమే సర్దుబాటు కావడంతో గుత్తి సుబేదార్ కోపంతో కోటవాకిళ్లు, దివాణం వాకిళ్లు పడగొట్టి పోతాడు.

తమ దొరకు జరిగిన అవమానానికి ఎల్లప్పజెట్టీ కృంగిపోతాడు. వానల కోసం వీరమంటపం ఎక్కడానికి శ్రీశైలం మల్లికార్జునస్వామికి మొక్కుకుంటాడు ఎల్లప్పజెట్టీ. గండకత్తెరతో తన శరీరంలోని అంగాలను అన్నింటిని కత్తిరించి మల్లికార్జునికి అర్పించి దేహ త్యాగం చేయడంతో నవల సమాప్తమౌతుంది.

ఈ కథతో పాటు ఎల్లప్పజెట్టీని తిరస్కరించి వివాహ బంధం నుండి బయటపడిన ఇమ్మడమ్మ, నాయకరాజుల సంప్రదాయాన్ని పుణికి పుచ్చుకున్న రాచవేశ్య పద్మసాని, ఇంగ్లీషు చదువులు చదివిన ఆమె కుమారుడు మన్నారుదాసు, కండబలం వున్నా కులం బలం లేక అన్యాయాన్ని ఎదురించలేని కంబళి శరభుడు, తండ్రి మరణానికి కారకుడైన వాడిపై ప్రతీకారం తీర్చుకునే హరియక్క, మతం ముసుగుతో లైంగిక దోపిడీకి పాల్పడే నాగప్ప ప్రగడ, ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నించే గురవడు, తన కూతురి దుర్గతికి కారణమైన స్త్రీలోలుడు సిద్ధప్పనాయుడి పతనానికి ఎత్తులు వేసిన బయ్యన్నగారి అనంతయ్య శ్రేష్ఠి మొదలైనవారి కథలు ఉన్నాయి.

★★★★




## ఆణిముత్యాలు

# మీర్జా గాలిబ్

### జాతీయ ఉత్తమ చిత్రం



ఈదర శ్రీవిద్య




గాలిబ్ అంటే అర్థం ఉన్నతమైన అని. 'గాలిబ్కు గాలిబే సాటి' అని వినయంతో కూడిన ఆత్మవిశ్వాసంతో ప్రకటించుకున్న మహాకవి గాలిబ్. అసలు పేరు మీర్జా అసదుల్లా బేగ్ ఖాన్ (1797–1869). ఆగ్రాలో జన్మించాడు. ఉర్దూ, పర్షియా, అరబిక్ భాషల్లో రాశాడు. తన కాలానికి ఆధునిక కవి. చిన్న మాటలతోనే పెద్ద భావాన్ని పలికించాడు.

మనిషిలోని దుఃఖం, ఊహాప్రేయసి, ప్రేమ, శృంగారం, విరహం, కరుణించని ప్రేయసి కాఠిన్యం, స్వీయాన్వేషణ, నీతి, సౌకుమార్యం, జీవితపు గాఢత, మానవుడి అంతరంగ లోతు, ఒంటరితనపు క్షోభ, బతుకు రుచి, లోకరీతి, ఏదీ శాశ్వతంగా ఉండిపోదన్న వాస్తవం... ఇలాంటివన్నీ గాలిబ్ కవితల్లో కనిపిస్తాయి.

అటువంటి గొప్ప కవి జీవిత మీద తీసిన చిత్రం మీ ర్జా గాలిబ్ 1954, డిసెంబరు 10న విడుదలైన హిందీ, ఉర్దూ సినిమా. కవి మీర్జా గాలిబ్ జీవితం ఆధారంగా రూపొందిన ఈ సినిమాకు సోహ్రాబ్ మోడీ దర్శకత్వం వహించారు. భరత్ భూషణ్ గాలిబ్ గా, సురయ్యా అతని ప్రియురాలిగా నటించిన ఈ సినిమా విడుదలైన తర్వాత ప్రశంసలు అందుకుంది. 1954లో జరిగిన రెండవ జాతీయ చలన చిత్ర అవార్డులలో ఈ సినిమాకు ఉత్తమ చిత్రంగా గోల్డెన్ లోటస్ అవార్డు వచ్చింది. రాష్ట్రపతి భవన్‌లో ఈ సినిమా ప్రత్యేక ప్రదర్శన జరిగింది. ఆ కార్యక్రమంలో సురయ్యా మీర్జా గాలిబ్ గజల్స్ పాడగా, ఆమె నటనను అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రత్యేకంగా ప్రశంసించాడు.

ఈ చిత్రం చివరి మొఘల్ రాజు బహదూర్ షా జాఫర్ కాలంలోని ప్రముఖ కవి మీర్జా గాలిబ్ జీవితంలోని ఒక ఘట్టాన్ని చిత్రీకరిస్తుంది . ఈ కథ సురయ్య పోషించిన మోతీ బేగం (మీర్జా గాలిబ్ “చౌధ్విన్” (చంద్రముఖి) అని పేరు పెట్టారు), భరత్ భూషణ్ పోషించిన మీర్జా గాలిబ్ పట్ల ఆమెకున్న ప్రేమ ,అభిమానం చుట్టూ తిరుగుతుంది .చిత్రం ముగింపు ‘చాధ్విన్’ (సురయ్య) విషాదకరమైన మరణంతో ముగుస్తుంది.

గాలిబ్ అప్పటికే వివాహితుడు, “ఉమ్రావ్ బేగం” (నిగర్ సుల్తానా )ను వివాహం చేసుకున్నాడు, ఆమె ఒక పవిత్రమైన స్త్రీ, ఆమె కవి భర్తను ప్రేమిస్తుంది ,అతని పట్ల భక్తితో ఉంటుంది. స్వయంగా కవి అయిన చక్రవర్తి బహదూర్ షా “జాఫర్” (ఇఫ్తేఖర్) “ముషైరా” (కవితా పారాయణ ) నిర్వహిస్తుంటాడు .. “ముషైరా”లో, “జౌక్” కవిత్వాన్ని చాలా మంది ప్రశంసించారు; మరోవైపు, మీర్జా అసదుల్లా ఖాన్ “గాలిబ్” తన “గజల్స్” (కవితలు) ను ఎవరూ అంగీకరించరు. సాధారణ ప్రజలు కూడా అతని గజల్స్ చాలా లోతైనవి, అతని ఉర్దూ చాలా కష్టం అని భావిస్తారు.ముషైరా యొక్క మరింత మేధో వాతావరణంలో, ముఫ్తీ (మురాద్) మరియు కొత్వాల్, హష్మత్ ఖాన్ (ఉల్హాస్) తప్ప ఎవరూ గాలిబ్ కవిత్వం అభినందించడానికి ముందుకు రారు . ముఫ్తీ గాలిబ్ పట్ల తన ప్రశంసను వ్యక్తపరుస్తాడు కొత్వాల్.

గాలిబ్ గజల్‌ను రాసుకుంటూ తన సమయాన్ని గడుపుతాడు. గాలిబ్ ఇతరులు చేసినట్లుగా శ్రావ్యంగా పఠించడానికి బదులుగా, తన గజల్స్‌ను పాడిగా “చదవడం” ద్వారా ప్రారంభిస్తాడు, అది అక్కడ ఉన్న కొంతమంది కవులను చికాకుపెడుతుంది, గాలిబ్ ఆస్థానం నుండి బయటకు వెళ్లగొడతారు .

ఇంటికి వెళ్ళేటప్పుడు, ఒక స్త్రీ తన సొంత గజల్స్‌లో ఒకటి పాడటం అతను వింటాడు. ఆ గాయని మోతీ బేగం (సురయ్య), పదవీ విరమణ చేసిన తవైఫ్ (దుర్గా ఖోటే) కుమార్తె. మోతీకి గాలిబ్ కవిత్వం అంటే పిచ్చి, మరియు ఆ



వ్యక్తి మీద కూడా పిచ్చి, ఆమెకు ఇష్టమైన కవి ఎలా ఉంటాడో ఆమెకు తెలియదు. గాలిబ్ తన కవిత్వాన్ని ఇష్టపడుతున్నాడని సంతోషించి, గాలిబ్ తన గజల్స్ పట్ల ఆమెకున్న ఉత్సాహాన్ని చూసి ఆశ్చర్యపోతాడు, ఆమె అందాన్ని చూసి కూడా ఆశ్చర్యపోతాడు మరియు ఆమెను చౌధ్విన్ బేగం (చౌధ్విన్ అంటే "పౌర్ణమి" అని అర్థం) అని సంబోధిస్తాడు. తాను గాలిబ్ అని ఆమెకు తెలియదని గ్రహించినప్పుడు, గాలిబ్ కవిత్వాన్ని అవమానించడం ద్వారా ఆమెను ఆటపట్టిస్తాడు.

కొన్ని రోజుల తరువాత, గాలిబ్ తన గజల్స్‌లో ఒకటి పాడుతున్న మరొక వ్యక్తిని చూస్తాడు. ఈసారి, ఒక పేద భిక్షువు గాలిబ్‌ను ప్రశ్నించినప్పుడు, మోతీ బేగం తనకు ఈ గజల్స్ నేర్పించి, కొన్ని పైసలు సంపాదించవచ్చని చెబుతాడు. గాలిబ్, అహంతో నిండిపోయి, మోతీ బేగం ఇంటికి మళ్ళీ వెళ్తాడు, ఇప్పుడు తనను తాను చౌద్విన్ బేగం అని పిలుచుకునే ఆ స్త్రీ అతన్ని ఎంతో ఆనందంతో స్వాగతించింది. అతను గొప్ప కవి కావచ్చు, కానీ ఆ గొప్పతనం తోడేళ్ళను తలుపు నుండి దూరంగా ఉంచడానికి సరిపోదు. కొంతవరకు దయగల తోడేలు వడ్డీ వ్యాపారి మధురదాస్ (ముక్రి), గాలిబ్ అతనికి పెద్ద మొత్తంలో డబ్బు బాకీ ఉన్నాడు. మధురదాస్ అప్పుడప్పుడూ వచ్చి అప్పు తీర్చమని అడుగుతాడు; కానీ గాలిబ్ ఎల్లప్పుడూ అతన్ని మోసం చేస్తాడు.

గాలిబ్ భార్య (నిగర్ సుల్తానా) చాలా మతపరమైన మహిళ, ఆమె తన పిల్లలలో ఎవరూ బాల్యం దాటి జీవించలేకపోవడం వల్ల బాధపడుతుంది. ఆమె భర్తతో ఆమెకున్న సంబంధం సులభమైన స్నేహం; ఆమె అతనికి గట్టి మద్దతుదారు, వారు ఎప్పటికీ అప్పుల్లో ఉన్నారని ఎప్పుడూ చెప్పని భార్య . తన భర్త మరొక స్త్రీని ప్రేమిస్తున్నాడని ఆమె అనుమానించినప్పుడు కూడా, ఆమె తనపై అతని ప్రేమను నిరసించదు ,బదులుగా, ఆమె అతనికి రెండవసారి వివాహం చేసుకోమని చెబుతుంది.

అయితే, ప్రస్తుతం కష్టాలను ఎదుర్కొంటున్నది చౌద్విన్ బేగం. కోత్వాల్ హష్మత్ ఖాన్ ఆమెను ఎక్కువగా ఇష్టపడుతున్నాడు మరియు చౌద్విన్ తల్లిని తన కుమార్తెను అతనికి ఇచ్చి వివాహం చేయమని ఒప్పించాడు. అతను రూ. 2,000 కన్యధూవరాన్ని కూడా చెల్లించాడు . చౌద్విన్ తల్లి, వివాహం జరగాలని పట్టుబడుతోంది. నిరాశతో, చౌద్విన్ గాలిబ్‌కు ఒక లేఖ రాసి, తన డోర్ కీపర్-కమ్-జనరల్ డాగ్ బాడీ ద్వారా, మద్యం రుచిగల వ్యక్తి ద్వారా అతనికి పంపుతుంది. ఆ వ్యక్తి మంగళవారం గాలిబ్ ఇంటికి బయలుదేరి, వైన్ షాపులోకి వెళ్ళి, గురువారం బయటపడతాడు, ఈ అవాంఛిత వివాహం నుండి చౌద్విన్‌ను రక్షించడానికి చాలా ప్రభావవంతమైన ప్రణాళికను రూపొందించడానికి గాలిబ్‌కు చాలా తక్కువ సమయం మిగిలి ఉంటుంది. అతను చౌద్విన్ తల్లికి రూ. 2,000 ఇవ్వాలని నిర్ణయించుకుంటాడు; కానీ అతని వద్ద అంతగా లేకపోవడంతో, జూదం ద్వారా దానిని 'సంపాదించడానికి' బయలుదేరుతాడు. అతను విజయం సాధించాడు,డబ్బు సంపాదించి వృద్ధురాలికి ఆ మొత్తాన్ని ఇవ్వడానికి తొందరపడతాడు.

ఈలోగా, వృద్ధురాలు మారిపోయింది, ఇదంతా నిరాశ చెందిన చౌద్విన్ ఆత్మహత్యకు ప్రయత్నించడంతో. అకస్మాత్తుగా తల్లి ప్రేమతో ఉక్కిరిబిక్కిరి అయిన చౌద్విన్ తల్లి, ఇప్పుడే వచ్చిన కోత్వాల్ తలపై నిందలు వేస్తుంది: అతను చౌద్విన్‌ను వివాహం చేసుకోడు, కోత్వాల్ కోపంగా ఉండి ప్రతీకారం తీర్చుకుంటాడు - ప్రధానంగా గాలిబ్‌పై.

గాలిబ్ పై ప్రతీకారం తీర్చుకోవడానికి కోత్వాల్ చేసే ప్రయత్నాలు; చౌద్విన్ బేగం పట్ల గాలిబ్ కు పెరుగుతున్న ప్రేమ, మరియు అతని భార్య యొక్క పెరుగుతున్న నిరాశ - ఒక వైపు, చౌద్విన్ బేగం పట్ల అసూయ; మరోవైపు, తన భర్త ఆనందాన్ని కోరుకోవడం. ఇవన్నీ 'చాద్విన్' (సురయ్య) విషాదకరమైన మరణానికి దారి తీస్తుంది

★★

# “ తనివి తీరలేదే నా మనసు నిండలేదే ”

జ్ఞానిక




చిత్రం: గూడుపుఠాణీ (1972)

సంగీతం: ఎస్ పీ కోదండపాణి

సాహిత్యం: దాశరథి కృష్ణమాచార్య

నేపథ్యగానం: బాలసుబ్రహ్మణ్యము, సుశీల

గూడుపుఠాణీ చిత్రం లోని ఈ పాట ఎన్ని సార్లు విన్నా తనివి తీరదు .మీకోసం ఈ పాట

తనివి తీరలేదే నా మనసు నిండలేదే

ఏనాటి బంధమీ అనురాగం

తనివి తీరలేదే నా మనసు నిండలేదే

ఏనాటి బంధమీ అనురాగం

చెలియా ... ఓ చెలియా.

ఎన్నో వసంతవేళలలో

వలపుల ఊయలలూగామే

ఎన్నో వసంతవేళలలో

వలపుల ఊయలలూగామే

ఎన్నో పున్నమిరాత్రులలో

వెన్నెల జలకాలాడేమే

అందని అందాల అంచుకే చేరిననూ

అందని అందాల అంచుకే చేరిననూ

విరిసిన పరువాల లోతులే చూసిననూ

తనివి తీరలేదే నా మనసు నిండలేదే


ఆ..ఆ..ఆ...ఆ

ఏనాటి బంధమీ అనురాగం

తనివి తీరలేదే నా మనసు నిండలేదే

ఏనాటి బంధమీ అనురాగం

ప్రియతమా ఓ ప్రియతమా




ఎప్పుడు నీవే నాతో ఉంటే

ఎన్ని వసంతాలైతేనేమి

ఎప్పుడు నీవే నాతో ఉంటే

ఎన్ని వసంతాలైతేనేమి

కన్నుల నీవే కనబడుతుంటే

ఎన్ని పున్నములు వస్తేనేమి

వెచ్చని కౌగిలిలో హాయిగా కరిగించిననూ

వెచ్చని కౌగిలిలో హాయిగా కరిగించిననూ

తీయని హృదయంలో తేనెలే కురిపించిననూ

తనివి తీరలేదే నా మనసు నిండలేదే

ఏనాటి బంధమీ అనురాగం

ఊహు..ఊహు..ఊహుహు..

ఊహు..ఊహు..ఊహుహు..

ఊహు..ఊహు..ఊహుహు..

ఊహు..ఊహు..ఊహుహు..

# "ఫ్లెక్సి" లీడర్లు

జి .అనుదీప్

## క్రాస్ రోడ్ కబుర్లు

1915కు ముందు మహాత్మ గాంధీ అంటే ఎవరో మనదేశంలో ఎవరికీ తెలియదు . దక్షిణాఫ్రికా నుండి 1915 లో గాంధీ మన దేశానికి తిరిగి వచ్చి ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొనాలని నిర్ణయిం చుకున్నారు. అప్పటి నుంచి రెండేళ్ళ పాటు రైలులో ప్రయాణించి దేశం మొత్తం తిరిగారు. అలా ఆయన దేశంలోని ప్రతి ఒక్కరికి చేరువకావటమే కాక, తదనంతర కాలంలో దండి మార్చి (ఉప్పు సత్యాగ్రహం) పేరుతో 240 మైళ్ళు పాదయాత) నిర్వహించారు. బహుశా మనదేశంలో రాజకీయ నాయకులు చేసిన మొట్ట మొదటి పాదయాత్ర ఇదేనేమో. .స్వాతంత్రం కోసం బ్రిటీష్ వారితో పోరాడి దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఓ గొప్ప నాయకుడిగా నిలిచిపోయారు.

ఇక ప్రస్తుతానికి వస్తే దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి, ప్రస్తుత ముఖ్య మంత్రి చంద్ర బాబు, మాజీ ముఖ్య మంత్రి జగన్ అందరూ పాదయాత్రులు చేసి ప్రజల కష్ట సుఖాలు తెలు సుకుని నాయకులుగా ఎదిగిన వారే. అంత దాక ఎందుకు పూర్వం రాజులు కూడా

# కబుర్లు... ఉత్తినే



తమ బిడ్డలను దేశాటన చేసి రమ్మని పంపించేవాళ్లు. దేశా ట న చేస్తే ప్రజల కష్ట సుఖాలు తెలుస్తాయి అని వారి నమ్మకం. ఆథరువాత వారికి పట్టాభిషేకం చేసే వాళ్ళు.

ఏచూరి సీతారాం, నేటి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, లూప్రసాద్ యాదవ్,నితిష్ కుమార్ , మమత బెనర్జి వంటి వాళ్ళు కాలేజిలో చదువుకునే రోజుల నుంచే అనేక సమస్యలపై పోరాడుతూ నాయకులుగా ఎదిగి మంత్రులు , ముఖ్య మంత్రులుగా పని చేస్తున్నారు. ఎవరైనా నాయకుడిగా ఎదగాలంటే. ఓ దశాబ్ద కాలం పాటు సుదీర్ఘ ప్రయాణం చెయ్యాల్సి వుంటుంది.

కాని నేడు అందుకు విరుద్ధంగా రాత్రికి రాత్రి నాయకులుగా ఎరిగిపోతున్నరు కొంత మంది . వీరికి ప్రజలతో పనిలేదు, వారి సమస్యలతో అంతకన్నా పనిలేదు . కేవలం సామాజిక మాధ్యమాల్లో ప్రచారంతోనే రాత్రికి రాత్రి నాయుకులై పోయి తమ వెంట ఓ పదిమందిని వెంటేసుకుని తిరుగుతున్నారు.

అంత దాకా ఎందుకు నామటుకు నేను చాలా సార్లు మా కాలనీలో సారా వ్యతిరేక ఉద్యమాలు ,పెరిగిన కరెంటు బిల్లుల పై నిరశనలు వంటి అనేక సమస్యలపై పోరాడాను, జనాన్ని చైతన్య పరిచి, ముందుండి వారిని నడిపించినా కాని నేను నాయకుడిగా పెద్దగా ఎదగలేకపోయాను.

ఒకప్పుడు ఉద్యమాల నుంచి , పోరాటాల నుంచి పాదయాత్రల నుంచి నాయకులు పుట్టుకొచ్చేవాళ్ళు . కాని ఇప్పుడు వాట్సప్ లు , యూ ట్యూబ్ లు టి.వి. ఛానళ్ళ నుంచి, సామాజిక మాధ్య మాల నుండి, నాయకులు పుట్టుకొస్తున్నారు. ఇప్పుడు రాజకీయాల్లో కొత్త పంథా నడుస్తోంది. ఒకప్పుడు నాయకులంటే ప్రజలతో సంబంధం ఉండేవాళ్లు. ఇప్పుడు లీడర్లు ప్రజలతో కాకుండా, కేవలం ప్రచారంతోనే రాత్రికి రాత్రే అయిపోతున్నారు. ప్లెక్సీల్లోనూ, యూట్యూబ్, అలాగే వివిధ టీవీ ఛానెల్స్లో మాట్లాడుతూ ప్రముఖ నాయకులుగా చెలామణి అవుతుండడం చర్చనీయాంశమైంది.

సృష్టిలోని ప్రాణుల నుంచి

# కబుర్లు ...ఉత్తినే

నాయకులు చాలా నేర్చుకుంటారు. కప్పులా పార్టీల్లోకి గెంతుతారు. చేరిన పార్టీని పొగుడ్తారు. వీడిన పార్టీని తిడ్తారు. పాములా ప్రత్యర్థులపై విషం చల్లుతారు. సోషల్ మీడియా పాయిజన్కి సప్లై చానల్. కాలకూట విషాన్ని కూడా క్షణాల్లో ఎక్కించొచ్చు.

సీతాకోక చిలుకలా రంగుల రెక్కల్ని ప్రదర్శిస్తారు. అది మేకప్ అని లోపలుండేది గొంగళి పురుగు అని జనానికి తెలుసు. అయినా చప్పట్లు కొడ్తారు. కొట్టకపోతే కొడతారని భయం.

నాయకులు ఎంత తెలివైన వాళ్లంటే ఎలుగుబంటికి హెయిర్ డై అమ్మగలరు. గొర్రెకి తోలు ఒలిచి, దానికి కంబలి కప్పగలరు. పట్టు పురుగుకే పట్టుచీర గిఫ్ట్ ఇవ్వగలరు.

ఇలాంటి వాళ్లే వివిధ రాజకీయ పార్టీల అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తుంటారు. అదృష్టవశాత్తు వీళ్లు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలు అధికారంలోకి వస్తే, పదవులు కూడా వరిస్తుంటాయి. దీంతో నిత్యం అభిప్రాయం ప్రజల్లో ఉంటూ, ఖర్చులు పెట్టుకునే నిజమైన నాయకులు ఎవరికీ తెలియని అనామకులుగా మిగిలిపోతున్నారు. అనర్హులంతా లబ్ది పొందుతుంటే, నిఖార్సైన సైనికులైన తమను పట్టించుకోలేదని ఆవేదన చెందుతుంటారు.

ఒకవేళ తాము ప్రాతినిధ్యం వహించే పార్టీ అధికారం కోల్పోగానే, అడ్రస్ లేకుండా పోతుంటారు. లేదంటే అధికార పార్టీలో చేరిపోతుంటారు. ఇప్పుడు ఇలాంటి వాళ్ల పనే రాజకీయాల్లో బాగుందనే మాట వినిపిస్తోంది. ఆర్థికంగా లబ్ధి పొందుతూ, లాబీయిస్టులుగా మారి, అధికారం ఎక్కడుంటే, అక్కడ వాలిపోతుండడంపై జనం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అధికారం ఉన్నప్పుడు ఏ మాత్రం ప్రయోజనం పొందని నాయకులు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం తాము గుర్తుకు వస్తుంటామని వాపోతున్నారు. ఏది ఏమైనా ఇప్పుడు ప్లెక్సీలు, మీడియా లీడర్లదే కాలమైన దుస్థితి ఏర్పడింది.

★★★

కథ

# వలస పక్షి

కొత్తపల్లి ఉదయబాబు.

అమ్మా రేపు సాయంత్రమే మా ప్రయాణం. ఈ మూడు రోజులు జాగ్రత్త. మళ్ళీ ముక్కనుమనాడు వచ్చేస్తాం.''తల్లి పక్కన కూర్చుని చెప్పాడు చంద్రం.
ఏదో చెబుదామని తటపటాయించిన లోకేశ్వరి " సరేనాయనా! జాగ్రత్తగా వెళ్ళిరండి " అంది. " నేను మీతో వస్తానురా ".. అని అందామనుకుందిగాని అనలేకపోయింది.

" నాకు నాకు పదివేలు కావాలమ్మా.. మళ్లీ ఊరునుంచి వచ్చాక ఇచ్చేస్తాను " నసిగాడు చంద్రం.
''అలాగే... వెళ్ళేటప్పుడు ఇస్తాను .నాకేమీ తిరిగి ఇవ్వక్కర్లేదు '' అంది లోకేశ్వరి.
''మా మంచి అమ్మ.'' అని తల్లి మొబ్బమీద ముద్దుపెట్టుకుని తనగదిలోకి వెళ్ళిపోయాడు.
గదిలోకి వెళ్ళాకా భార్య అడిగింది.'' కాయా...పండా?''
''చెవిలోపువ్వు. లేకపోతే నేను అడగడమూ అమ్మ ఇవ్వకపోవడమూనా వెర్రిమొహమా .''భార్య బుగ్గమీద చిటికేసి అన్నాడు .

''ఆవిడ ఎపుడూ పండుగ వచ్చినా

మూడు రోజులు ముందే ఇచ్చేసేది...

అడక్కపోతే మీ అక్కకి దోపుతుంది.

మళ్ళీ ఇవ్వక్కర్లేదుగా తిరిగి?''
''ఓహ్...అలా వచ్చావా....'మనం ఇచ్చేస్తాననడమూ, ఆవిడ వద్దనడమూ రివాజేగా...'aఅనిచెప్పి ''అమ్మా... కేరేజీలు రెడీ చేసేసావా?'' అని అరిచాడు.

''ఆ. డైనింగ్ టేబుల్ మీద పెట్టాను తీసుకెళ్లండి.'' అంది లోకేశ్వరి కొడుకును కాన్వెంట్ బాస్ ఎక్కించి క్రెచ్ లో అప్పగించేందుకు చంటిపిల్లను ఎత్తుకుని కోడలు, కొడుకు ఆఫీసులకు వెళ్లిపోయారు.

★★★★★★★

ఒక్కసారి నిస్త్రాణ వచ్చేసింది లోకేశ్వరికి.
''అయ్యో..అత్తగారు ఒక్కరే ఉంటారు... ఆవిడని మనతో తీసుకెళదాం...''అని కోడలు కొడుకుని అడగదు .వాడూ అనడు. పోనీ కోడలు తల్లేనా ' మీ అత్తగారు ఒక్కర్తి ఉంటుంది కదా.. ఆవిడను కూడా తీసుకురావచ్చు కదా పాపం!'అని చెప్పుకోదేమో కూతురికి.

కొడుకు, కూతురు, మనుమలు ఉండికూడా తను ఎప్పుడూ ఒంటరే. కొన్ని బతుకులు అంతేనేమో.

ఆమెకు భర్త గుర్తొచ్చాడు. రోజుకోసారైనా గుర్తొస్తాడు. బ్రతికి ఉన్నంతకాలం తనని శారీరకంగా, మానసికంగా ఏడిపించి హఠాత్తుగా చనిపోయినందుకు. ఎక్కువమంది భర్తలు భార్యని హింసించి సంతృప్తి పడటంలో మహదానందం పొందుతారు. ఇద్దరు పిల్లలు పుట్టాక కూడా వాళ్ళచేత 'అమ్మని కొట్టు అమ్మని తిట్టు..' లాంటి శాడిస్ట్ పనులే కాదు... రాత్రి కూడా శారీరకంగా ఎంతో హింసించేవాడు.

అలాంటి ఉద్రేకంలోనే ఒక్కసారిగా గుండె పట్టుకొని కుప్ప కూలిపోయాడు. అంతే. మళ్లీ పైకి లేవలేదు.

తన కన్నతండ్రి పిల్లలతోసహా తన ఇంటికి వచ్చేస్తే చూస్తాననే అన్నాడు. ఆమె అంగీకరించలేదు.

దానికి కారణం జీవితాన్ని ఎదిరించి బ్రతకడం నేర్పేడు భర్త. ప్రతి సన్నివేశాన్ని ఎదుర్కొని కొత్త విజ్ఞానాన్ని సంపాదించడంలో ఆమెకు ఆసక్తి అభిరుచి పెరిగింది.

భర్త డెత్ సర్టిఫికెట్ తీసుకుని తన బిడ్డలను పక్కింటి వాళ్ళకి అప్పగించి ఇంటి గడపలో ఓ కాలు, ఆఫీస్ గడుపలో ఓ కాలు అన్నట్టు భర్త పనిచేసిన ఆఫీసుల గడపలన్నింటికీ తిరిగింది.

డబ్బుతో పాటు తనని ఆశించారు.. లోకం మీద అసహ్యం వేసింది. తండ్రిఉద్యోగం పిల్లవాడిచదువు పూర్తి అయ్యాక వాడికి ఇప్పించొచ్చు అని నిర్ణయించుకుని తన డిగ్రీలతో ఎయిడెడ్ పాఠశాలలో చేరింది.

తెలిసి తెలియని వయసులో తండ్రి చేతిలో శిక్షణ పొందిన పిల్లలిద్దరినీ దగ్గర కూర్చోబెట్టుకుని సమాజంతో ఎలా యుద్ధంచేయాలో కథలుగా చెప్పింది.

'ఒకవేళ మీ నాన్నలా నేను కూడా అర్ధాంతరంగా చచ్చిపోతే మీరు రోడ్డున పడతారు' అని హెచ్చరించింది.

అర్థం చేసుకున్న పిల్లలతో శ్రద్ధగా చదువుకున్నారు. అమ్మాయికి డిగ్రీ పూర్తయ్యాక తన తమ్ముడు తన కూతుర్ని చేసుకుంటానని వచ్చాడు. ఆలోచించకుండా వాడికిచ్చి పెళ్లి చేసేసింది.
కొడుకు డిగ్రీ పూర్తయ్యాకా భర్త ఆఫీసు చుట్టూ తిరిగి తిరిగి ఏడాదిపాటు పోరాడి భర్త ఉద్యోగం కొడుక్కి వచ్చేలా చేసింది. అతనిష్టపడిన అమ్మాయిని చూసి పెళ్లి చేసింది.

అటు ఉద్యోగం వల్ల వచ్చేటువంటి డబ్బుతో ఆర్థిక సుఖం, ఇష్టమైన అమ్మాయిని పెళ్లి,కాపురంతో అతను తల్లి తనకోసంపడ్డ కష్టాన్ని మర్చిపోయాడు.

అలాంటి సమయంలో అనుకోకుండా భర్త తనకు తెలియకుండా చేసిన ఎల్ఐసి పాలసీల సొమ్ము మెచ్యూరిటీ పొంది తనకు అందింది. ఆ సొమ్ముతో చక్కని అపార్ట్మెంట్ అద్దెకు తీసుకుని కొడుకుతో

కోడలితో కలిసి జీవిస్తోంది.
పిల్లలు పుట్టాక కోడల్ని తనే ఉద్యోగం చేయమని కోరింది. ఎందుకంటే నగరంలో ఇద్దరు సంపాదన ఉంటే గాని కుటుంబం గడవదు. కుటుంబం గడిస్తేనే గానీ పిల్లల్ని చదివించుకోలేని పరిస్థితి. ఆ లోటు వాళ్లకు రాకూడదని పిల్లలిద్దరికీ ఏడాదికో మారు తాను ఫీజు కడుతూ పిల్లల దగ్గరే గడపడం అలవాటు చేసుకుంది.

పిల్లలు పుట్టకముందు అయితే ప్రతి శని ,ఆదివారాలు అత్తారింటికి వెళ్లిపోయేవారు.

జీవితంలో ఇంతటి ఒంటరి పోరాటంచేసిన ఆమె, కొడుకు భార్యని తీసుకుని అత్తవారింటికి పండగల రూపంలో ప్రతీ పండుగకు వెళ్ళిపోతుంటే ఆ ఒంటరితనాన్ని భరించలేకపోతోంది. . కానీ జీవితం జీవించడం కోసం. తప్పదు అని సరిపెట్టుకుంది.

ఆ మర్నాడు సాయంత్రం తమ ప్రణాళిక ప్రకారం కొడుకు కోడలు ప్రయాణమై వెళ్లిపోయారు.

★★★★★★

మళ్ళీ ఒంటరితనం. ఎంతసేపని టీవీ చూస్తుంది? పుస్తకాలు చదువుదామంటే కళ్ళు లాగేస్తున్నాయి. ఏవో ఒక వ్యాపకం ఏర్పాటుచేసుకోవాలి.ఎలా? మెరుపులాంటి ఆలోచన వచ్చింది .వెంటనే సెల్ తీసుకుని తనకు కావలసిన సమాచారం కోసం గూగుల్ లో వెతికింది. ఆమె మనసు సంతోషంతో ఎగిరి గంతేసింది. ఆ వెంటనే తన ప్రణాళికను సిద్ధం చేసుకుంది.

★★★★★★

''ఏంటమ్మా? మేము ఆఫీసులకి వెళ్లిపోయాకా రోజూ ఎక్కడికో వెళ్లి తిరిగి వస్తున్నావు..పైగా సెలవు రోజుల్లో కూడా వెళ్ళిపోతున్నావు. ఆ తిరుగుడువల్ల నీకు ఏమైనా అనారోగ్యం వస్తే మాకు ఎంత ఇబ్బంది చెప్పు?

''పిచ్చివాడా...మనిషి తిరక్కపోతే అనారోగ్యం వస్తుందిరా.. తిరిగితే రాదు. అయినా నాకు నేనుగా అనారోగ్యం వచ్చే పని ఎందుకు చేస్తాను?మీరు ఉద్యోగస్తులు కాబట్టి మీ వ్యాపకం మీకు ఉంది. కాస్త నా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాను అంతే. నావల్ల మీకు ఇబ్బంది రానివ్వను. అలా వస్తుందనుకున్ననాడు ఆనాడే మానేస్తాను. సరేనా?'' అంది తన సంచీలో ఆరోజు చిరుతిళ్ళు సర్దుకుంటూ.

''అదికాదమ్మా..'' ఏదో చెప్పబోయిన కొడుకుని చేత్తో వారించి అంది.

''చూడు నాన్న. నాకు ఓపిక ఉన్నంతకాలం నాకోసం నన్ను బ్రతకనివ్వండి. మీపనులు అన్ని పూర్తిచేశాకనే నేను వెళ్ళేది. ఈవిషయంలో అడ్డు చెప్పొద్దు '' అని సెల్ లో ఆరోజు తాను వెళ్ళవలసిన చోటుకు వెళ్లే బస్సుఎక్కేందుకు బయల్దేరింది లోకేశ్వరి.

తన అనుభవాలు వాళ్లకు, వాళ్ళ అనుభవాలు తనకు పంచుకునే ముసలిపక్షులుండే వృద్ధాశ్రమాలకు ఆమె వలసపక్షి మరి!

సమాప్తం

కథ

# " అపర్ణ "

యశోదా కైలాష్

ఆరోజే అపర్ణ భర్త పనిచేసిన ఫ్యాక్టరీ లో అటెండర్ గా చేరబోతోంది.

భర్త రామకృష్ణ యాక్సిడెంట్లో చనిపోయినమూలాన ఫ్యాక్టరీ రూల్స్ ప్రకారం డిపెండెంట్ గా అపర్ణకున్నవిద్యార్హతలు బట్టి అపర్ణను అటెండర్ గా తీసుకున్నారు ఫ్యాక్టరీ యాజమాన్యం.

భర్త ఆకస్మిక మరణం తో కృంగిపోతున్న అపర్ణకు ఉద్యోగం చేయాలనే ఆసక్తి ఎంత మాత్రమూ లేదు.
భర్త చాటునే ఇన్నాళ్లూ ఆనందంగా జీవితం గడిపింది.
తను కేవలం టెన్త్ క్లాస్ మాత్రమే పాస్ అయింది.. భర్త బ్రతికి ఉన్నప్పుడు అపర్ణను ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బి..ఏ చదవమని ప్రోత్సహించేవాడు. తనూ చదవాలనే అనుకుంది .

ఇంతలో ఈ దుర్ఘటన జరగడంతో ఇష్టం లేక పోయినా తను ఉద్యోగంలో చేరడం తప్పని పరిస్తితి అయింది.
ఉన్న ఒక్కపిల్లవాడినీ ప్రయోజకుడుని చేయడానికైనా తను గడపదాటక తప్పదు.

వేలమంది ఉద్యోగులు పనిచేస్తున్న సంస్థకు బిక్కు బిక్కుమంటు బెదురుచూపులతో ఎపాయింట్ మెంట్ ఆర్డర్ అందుకున్న అపర్ణ భర్త పనిచేసిన ఆఫీస్ కు వెళ్లింది.

అన్ని ఫార్మాలిటీస్ పూర్తి అయిన తరువాత ఆమెను వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ ఇన్ ఛార్జ్ దగ్గర అటెండర్ గా పోస్టింగ్ ఇచ్చారు.

ఆ డిపార్ట్ మెంట్ ఇన్ ఛార్జ్ పేరు దివాకర్ . అపర్ణ ఆయనకు రిపోర్ట్ చేయగానే, ఆమె వివరాలడుగుతూ, అపర్ణ భర్త చనిపోయినందుకు తన సంతాపాన్ని వెలిబుచ్చాడు.
అపర్ణ ముఖం వైపే చూస్తూ చాలా జాలిచూపిస్తూ మాట్లాడసాగాడు.
భయం భయంగా, బెరుగ్గా చూస్తూ, మాటిమాటికీ తల దించుకుంటూ సమాధానం ఇవ్వసాగింది అపర్ణ.
ఆ సెక్షన్ లోని మిగతా స్టాఫ్ అందరికీ ఆమెను పరిచయం చేసాడు.
అపర్ణ చూడడానికి కళగా ఆరోగ్యంగా ఉంటుంది.. "అరె, ఈ అమ్మాయి భర్త చనిపోయాడా పాపం" అనేవిధంగా, నిరాశగా బాధగా కనిపించదు పైకి చూసేవారికి. కాని ఆమె అంతరంగం భర్త జ్ఞాపకాలతో తల్లడిల్లిపోతోంది. కళ్లనిండా కాటుక, బొట్టు పెట్టుకుంటుంది.. అసలే పెద్దవైన ఆమె కళ్లు కాటుక పెట్టుకోవడంతో మరింత పెద్దగా కనిపిస్తాయి.. ముఖం కళ కళ లాడుతూ ఉంటుంది. రామకృష్ణ బ్రతికి ఉన్నప్పుడు అపర్ణ ఎప్పుడైనా కాటుక పెట్టుకోపోతే ఏమిటీ నీ కళ్లు ఏడ్చినట్లుగా ఉన్నాయంటూ కాటుక పెట్టుకోకపోతే ఊరుకునే వాడు కాదు. రామకృష్ణ కు తను ఎలా ఎలా ఉంటే ఇష్టమో అతను లేకపోయినా అతని ఇష్ట ప్రకారం తయారవుతుంది.
ఆమె వైపే పదే పదే చూ స్తూ ఆమె చేయాల్సిన పనులు గురించి చెపుతూ, ఏ సందేహం ఉన్నా మిగతా స్టాఫ్ ను కూడా సంప్రదించమని అదోలా ఆమె వైపే చూస్తూ చెప్పాడు.

అపర్ణకు ఏమిటో భయంగా అనిపించింది.. తను జాబ్ చేయగలనా అనుకుంది.

అక్కడ వాతావరణం అంతా ఎంతో ఇబ్బందిగా ఊపిరాడనట్లు అన్పించసాగింది .
అపర్ణ భర్త రామకృష్ణ ఎప్పుడు ఆఫీస్ గురించి చెప్పినా, సహద్యోగులందరూ ఎంతో ఆత్మీయంగా ఒకే కుటుంబంలా ఉంటామని చెబుతూ ఉండేవాడు.

కానీ ఇదేమిటి ఇక్కడ ఇలాగుంది ? తనకి చూపించిన సీట్లో కూర్చున్నా ఆ ఆఫీసర్ ఏమిటో తన వైపు పదే పదే చూస్తున్నాడు. కేవలం తన భ్రమా ?
చూద్దాం కొన్నిరోజులు అనుకుంటూ తనకు తనే ధైర్యం చెప్పుకుంది.

ఒక నాలుగురోజులు నెమ్మదిగా గడిచాయి.
తన పని ఫైల్స్ అన్నీ ఎక్కడవక్కడ నీట్ గా సర్దడం, ఆఫీసర్ దివాకర్ ఏ ఫైల్ అడిగితే అది అందివ్వడం, లెటర్స్ డిస్పాచ్ సెక్షన్ కు అందచేయడం, వచ్చిన లెటర్సన్నీ ఏఏ ఫైల్స్ లో ఎలా ఫైల్ చేయాలో దివాకర్ అసిస్టెంట్ శేఖర్ అపర్ణకు చెప్పాడు.. లెటర్ రిఫరెన్స్ నంబర్ లో ఫైల్ నంబర్ కూడా ఉంటుంది, కాబట్టి ఆ రిలవెంట్ ఫైల్స్ లో జాగ్రత్తగా ఫైల్ చేస్తూ ఉండాలని చెప్పాడు .

కాన్ఫిడెన్షియల్ లెటర్స్ మటుకు దివాకరే సెపరేట్ గా ఒక ఫైల్ లో పెట్టుకుంటాడు.. ఆ ఫైల్ అతని అధీనంలో మాత్రమే ఉంటుంది.

అపర్ణ చాలా అణుకువుగా ఉంటూ మెల్లిగా తన పనిని అర్థం చేసుకోసాగింది .
చదువుకోకపోయినా ఆమెకు గ్రహింపుశక్తి, జ్ఞాపక శక్తి అమోఘం.. రామకృష్ణ బ్రతికి ఉండగా అపర్ణను ఆటపట్టిస్తూ ఉండేవాడు, " నిన్ను మీవాళ్లు ఎక్కువ చదివించి ఉంటే ఇందిరాగాంధీని మించిపోయి ఉండేదానివి. ప్రతీ విషయాన్నీ కూలంకషంగా చర్చిస్తూ ఎప్పుడో జరిగినవి కూడా భలే గుర్తు చేస్తూ, నన్ను డమ్మీని చేస్తావు అప్పూ అనేవాడు". అపర్ణను 'అప్పూ' అని పిలవడం అతనికి ఇష్టం.

పనిచేసుకుంటున్నా మాటి మాటికీ భర్త గుర్తొచ్చినప్పుడల్లా కళ్లు తడి

అవడం, గబుక్కున ఎవరైనా చూస్తున్నారేమోననుకుంటూ జేబురుమాలుతో తుడుచుకుంటూ ఉండేది.

మధ్య మధ్యలో దివాకర్ అపర్ణను ఏదో ఫైల్ తెమ్మనమని చెపుతూ ఫైల్ ను అందుకుంటూ ఆమె చేతులను తాకేవాడు.

మొదట్లో అసంకల్పితంగా తగిలిందేమోనని భావించేది. కాని పెళ్లి అయి, దాంపత్య జీవితాన్ని నిండుగా భర్తతో పంచుకున్న అపర్ణకు అది కావాలని తనను తాకుతున్నాడని గ్రహించలేనంత అమాయకురాలుకాదు.

కానీ ఎలా దాటాలి ఈ విపత్కర పరిస్తితిని ?

ఇంకా కొత్తగా ఉంది, ఎవరకు చెప్పుకోవాలి తన సమస్యను ?

అతనా ఎన్నో సంవత్సరాలనుండి ఒక ఉన్నతమైన పదవిలో పనిచేస్తున్నాడు.

తనా, చాలా చిన్న ఉద్యోగిని, పైగా కొత్తగా చేరింది.

ఫలానా ఆఫీసర్ ఇలా ప్రవర్తిస్తున్నాడని చెపితే నమ్మితే ఫరవాలేదు, నమ్మకపోతే తననే ఎక్కువ అనుమానించే పరిస్తితి రావచ్చు.

“భర్త చనిపోయాడు, వయస్సులో ఉంది, ఆఫీసర్ ను వలలో వేసుకుంటోంది అని తిరిగి ఆ ఆరోపణ తనమీదకే వస్తే” ?

“అరిటాకు వెళ్ళి ముల్లు మీద పడ్డా, ముల్లు వెళ్ళి అరిటాకు మీద పడ్డా ఆకుకే నష్టం అన్న సామెత ఊరికే అనలేదు పెద్దలు”.

“హమ్మో...... తనకెలాంటి అపఖ్యాతి వచ్చినా తను తట్టుకోలేదు, ఆత్మహత్యే శరణ్యం”!

ఇలా అపర్ణ ఆలోచనలు సాగిపోతున్నాయి.

అపర్ణకు ఏమీ ఉత్సాహంగా ఉండడంలేదు.. బలవంతంగా ఒక బలిపశువులా ఆఫీస్ కు వస్తోంది.

అతన్నెదురుకోవడం అంత తేలిక కాదని అపర్ణకు అర్ధం అయ్యింది.

అందుకే సాధ్యమైనంతవరకు బిజీగా ఉంటూ, తనకు తను గిరిగీసుకుంటూ ముక్తసరిగా ఉంటోంది.

మెల్లిగా రోజులు నెలలుగా గడచిపోతున్నాయి.

ఆ రోజు దివాకర్ కు ‘సి అండ్ ఎమ్ డి’ ఆఫీస్ నుండి ఫోన్ వచ్చింది.

ఎంప్లాయీస్ కు ఏదో స్పెషల్ వెల్ ఫేర్ ఫండ్ కోసం అదివరలో సిఅండ్ఎమ్డి కి రిక్విజిషన్ పెట్టుకుంటే, సీఅండ్ఎమ్డీ గారు ఆ ఫండ్ ను అప్రూవ్ చేస్తూ, ఒక లెటర్ వ్రాసి సంతకం చేసి దివాకర్ కు పంపారు.. అది హైలీ కాన్ఫిడెన్షియల్ లెటర్. ఆ లెటర్ ను బోర్డ్ ఆఫ్ డైరక్టర్స్ కు పంపాలి బడ్జట్ సాంక్షన్ చేయాలంటే.

ఆ ఎప్రూవల్ లెటర్ ఉంటేనే ఆ ఫండ్ ఆ ఇయర్ బడ్జట్ లో సేంక్షన్ అవుతుంది.. కోట్ల రూపాయల విలువైన ఫండ్.. పైగా ఆ ఫండ్ కోసం యూనియన్ చాలా ఫైట్ చేసి సీఅండ్ఎమ్డీ చేత ఓకే చేయించింది.

ఆ లెటర్ వెంటనే కావాలని, తమ ఆఫీస్ కాపీ ట్రేస్ అవడంలేదని బడ్జెట్ ఎలొకేషన్ కు ఆ లెటర్ బోర్డ్ కు పంపాలని సీఅండ్ఎమ్డీ పీ..ఏ ఫోన్ చేసి, ఆ లెటర్ స్వయంగా తమ ఆఫీస్ కు వచ్చి అందచేయమని దివాకర్ కు ఇనస్ట్రక్షన్స్.

దివాకర్ తెగ వెతికేస్తున్నాడు ఫైల్సన్నీ.. అతని అసిస్టెంట్లుకూడా వెతుకుతున్నారు.. నిజానికి దివాకర్ అటువంటి లెటర్స్ అన్నీ తనే స్వయంగా తన కాన్ ఫిడెన్స్ ఫైల్ లో ఫైల్ చేసుకుంటాడు. దివాకర్ కు చాలా టెన్షన్ గా ఉంది.. ఆ లెటర్ కనబడడం లేదు.. ఎమ్ డి గారు బాంబే టూర్ లో ఉన్నారు.. ఆ లెటర్ బోర్డ్ కు పంపకపోతే ఈ సంవత్సరం ఆ ఫండ్ సేంక్షన్ కాదు.

ఎందుకు సేంక్షన్ కాలేదంటూ బోర్డన్ని ఆరాలు, ఎన్ క్వైరీలు,

చివరకు యూనియన్ తనమీద ధ్వజమెత్తడం, తన అసమర్ధతకు తనని సస్పెండ్ చేయడం...... ఇవన్నీ తలచుకుంటుంటే దివాకర్ కు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అదికేవలం తన నిర్లక్ష్యానికి సంబంధించిన విషయమే, తన స్టాఫ్ ను ఎవరినీ బ్లేమ్ చేయలేని పరిస్తితి.

అపర్ణను ఎవరూ ఏమీ అడగలేదుకానీ, ఏదో 'ఎమ్ డి ఎప్రూవల్ లెటర్' అని, వెల్ ఫేర్ ఫండ్ కు సంబంధించినదని, చాలా ముఖ్యమైన లెటర్ అని దాని కోసం హడావుడి పడుతున్నారని మాత్రం గ్రహించింది.

అందరూ బోర్డ్ ఆఫీస్ కు పంపాలిట, బడ్జెట్ సేంక్షన్ కోసం అని మాట్లాడుకోవడం వింటోంది.

తటాలున అపర్ణకు గుర్తుకొచ్చింది.. ఒక పదిరోజుల క్రితం దివాకర్ తనకు చాలా లెటర్స్ ఇస్తూ ఫైలింగ్ చేయమన్నాడు. అన్ని లెటర్స్ కూ రిలవెంట్ ఫైల్స్ దొరికాయి కానీ ఒక లెటర్ ను ఏ ఫైల్ లో ఫైల్ చేయాలో తెలియక చటుక్కున ఒక కొత్త ఫైల్ ఓపెన్ చేసి అందులో ఫైల్ చేసేసింది.. దాని ఇంపార్టన్స్ అప్పుడు ఆమెకు అంతగా అర్ధం కాకపోయినా ఆ లెటర్ మీద ఎమ్.. డీ సంతకం, ఎర్ర సిరాతో అప్రూవ్డ్ అని వ్రాసి ఉండడం మాత్రం చూసింది. అసలు ఆ లెటర్ తన దగ్గరకు రాకూడదు, అంటే దివాకర్ తనకు ఇవ్వకూడదు .

కానీ పొరపాటున అన్ని పేపర్లతోబాటూ అది తన చేతికి వచ్చేసింది.

తను మామూలుగా వేరే ఫైల్ లో ఫైల్ చేసేసింది .

వెంటనే సీట్లోంచి లేచి ఫైల్స్ కింద ఎక్కడో పెట్టిన ఆ కొత్త ఫోల్డర్ కోసం వెతికింది. చెక్కు చెదరకుండా అక్కడే ఉంది. పైకి తీసి చూసింది.

ఎమ్ ..డి గారి లెటర్ అందులో కనిపించింది.

అది అవునో కాదోననుకుంటూ దివాకర్ దగ్గరకు వెళ్లి, " సర్ ఈ లెటర్ చూడండి" ఒకసారంటూ ఫోల్డర్ అతనిచేతికిచ్చింది.

ఆ లెటర్ చూసిన అతని ముఖంలో ఆశ్చర్యానందాలు. ఫుల్ ఎక్సైజ్ మెంట్ కు లోను అవుతూ "ఎక్కడ దొరికిందని అడగడంతో అపర్ణ జరిగిన సంగతి చెప్పింది". ఆమె చెప్పేది సరిగా వినీ వినకుండానే ఆ లెటర్ తీసుకుని ఎమ్.. డీ ఆఫీస్కు పరుగెత్తాడు. ఎమ్.డి విభాగం అంతా వేరే బిల్డింగ్ లో ఉంటుంది.

ఆయన అటు వెళ్లగానే ఆ సెక్షన్ లోని అందరూ అపర్ణను చుట్టుముట్టి అభినందించడమే. చక్కగా జాగ్రత్తగా ఫైల్ చేసి సరియైన సమయానికి గుర్తుచేసుకుని ఇచ్చినందుకు. దివాకర్ ఆ లెటర్ని సి.అండ్. ఎమ్. డి పి..ఎ కు ఇవ్వడం, ఆ పీఏ దానికి జిరాక్స్ కాపీలు తీసి ఒకటి దివాకర్ కు ఇచ్చి, ఆ ఒరిజనల్ లెటర్ బోర్డ్ కు కొరియర్ సర్వీస్ లో పంపేసాడు.

"హమ్మయ్య...... దివాకర్ లో ఎంతో రిలీఫ్" !

తిరిగి తన సీట్ కు వస్తూ ఆత్మపరిశీలన చేసుకున్నాడు.

"ఇది తన తప్పే, తన అజాగ్రత్తే" ! కాన్ఫిడెన్షియల్ లెటర్ అదీ ఎంతో ముఖ్యమైన దాన్ని అజాగ్రత్తగా బధ్రపరచకపోవడం.

అయినా కూడా ఒక చిన్న అటెండర్ ఎంతో బాధ్యతగా ప్రవర్తించి ఆ లెటర్ ను సేఫ్ గా దాచి, గుర్తుపెట్టుకుని సమయానికి తనకి అందచేసింది . లేకపోతే తనేస్తితిలో ఉండేవాడో ఇప్పుడు ?

అమాయకంగా, అణుకువుగా ఎప్పుడు తలవంచుకుని తనపనిని చేసుకుపోయే అపర్ణ కళ్లముందు కనబడింది.

తను ఆ అమ్మాయిపై అసభ్యకరంగా ప్రవర్తిస్తూ చాలా వేధించాడు.

భర్తలేదు, ఆమెను లొంగదీసుకోవచ్చనుకున్నాడు. పాపం ఆ అమాయకురాలు తనని

సివియర్ క్రైసిస్ నుండి కాపాడింది.
అతనిలో పశ్చాత్తాపం కలగడం
ప్రారంభించింది.

మౌనంగా వచ్చి సీట్ లో
కూర్చున్నాడు.

అప్పటికే ఆఫీస్ అవర్స్
అయిపోతున్నమూలాన అందరూ
ఎవరికి వారు తమ బాగ్ లను
సర్దుకుంటూ తమ సీట్లను
విడిచిపెట్టి వెళ్లిపోతున్నారు.

అపర్ణ ఫైల్స్, ముఖ్య వస్తువులున్న
ఉన్న బీరువాలకి తాళాలు
వేస్తోంది.

మెల్లిగా "అపర్ణ గారూ అంటు
పిలిచాడు" దివాకర్.

అసలే దివాకర్ అంటే భయపడే
అపర్ణ ఇప్పుడు పిలుస్తున్నాడేమిటి
అనుకుంటూ బెదురుగా వచ్చి
నిలబడింది.

ఆ పరిసరాల్లో ఎవరూలేరు.

"అపర్ణగారూ, చాలా థాంక్స్
అమ్మా"!

"ఈరోజు మీరు చేసిన మంచి
పనిని నేను జీవితాంతం
గుర్తుపెట్టుకుంటాను . మీకు
చాలా ఋణపడి ఉన్నాను
అపర్ణగారూ".

"ఇన్నాళ్లూ మీతో నా
అసభ్యప్రవర్తనకు
సిగ్గుపడుతున్నాను".

"నన్ను క్షమించండి అమ్మా,
నావలన మీకు ఎటువంటి సమస్యా
ఉండదు ఇంక".

"మీరు నిశ్చింతగా ఉండొచ్చు
అపర్ణగారూ........ ఐ ప్రామిస్ యూ
అంటూ ఆమెకు అభయమిచ్చాడు".

"సరే సర్ అంటూ" తలవంచుకుని
అపర్ణ తన బేగ్ ను తీసుకుని
అక్కడనుండి వచ్చేసింది.

ఇంటికి వస్తున్న అపర్ణకు భర్త
ఎప్పుడూ తనతో అనే మాటలు
గుర్తొచ్చి కళ్లు చెమర్చాయి .

" ఏదేనా సమస్య రాగానే మనం
పరిష్కారం గురించి ఆలోచించటం
మానేసి, విచారించటం
ప్రారంభిస్తాం అపర్ణా. సముద్రం
ఎంత పెద్దదైనా, నీళ్ళని లోపలికి
రానివ్వకపోతే పడవ మునగదు.
అలాగే సమస్య ఎంత పెద్దదైనా,
మనసులోకి రానివ్వకపోతే బాధ
ఉండదంటూ ఎంతో ధైర్యాన్ని
చెప్పే భర్త తన పక్కన లేడుకదా
అనుకుంటూ బాధగా నిట్టూర్చింది"

★★★.

కథ

# " బ్లాక్ బటర్ ఫ్లై"

మూలా వీరేశ్వర రావు

ఇన్ స్పెక్టర్ రంజిత్ తన ఆఫీసు లో కూర్చుని సిడ్నీ షెల్డన్ నవల " if tomorrow comes" చదువుకుంటున్నాడు.
నవల లో లీనమయి ఉండగా గుమ్మం దగ్గర చప్పుడయింది.
శబ్దం వచ్చిన వైపు చూసాడు. అక్కడ నలభై ఐదు సంవత్సరాల వ్యక్తి నిలబడ్డాడు.
"చెప్పండి"
"సార్, నా కూతురు మిస్సయింది"
"ఎప్పటి నుండి"
" సెప్టెంబర్ 10 నుండి"
"మీ కూతురు వయసు ఎంత?"
" 25 "
" అంటే, మీ అమ్మాయి మీతో ఉండడం లేదా?"
" అమ్మాయి మమ్మల్ని కాదని వేరే వ్యక్తి తో సహజీవనం లో ఉంటోంది."
"అలాగ, అమ్మాయి ఏం చేస్తోంది"
" సాఫ్ట్ వేర్ ఇంజనీర్"

" మీ అమ్మాయి సహజీవనానికి కారణం? "

" ఏం చేస్తాం సార్, నా ఖర్మ తన అక్క సాంప్రదాయ బద్ధం గా పెళ్ళి చేసుకుని కష్టాలు పడిందని, రెండో కూతురు సంహిత సహజీవనం వైపు మొగ్గు చూపింది. "

" సార్ నా కూతుర్నీ ఏలాగైనా వెతికి పెట్టండి. ఇవాళ దాని పుట్టిన రోజు! ఎక్కడుందో నా చిట్టి తల్లి " అని కన్నీళ్ళు

పెట్టుకున్నాడు రంజిత తండ్రి మాధవ రావు.

" ఫిర్యాదు రాయండి. మీ అమ్మాయి ఎవరితో ఉంటోందో అతని వివరాలు, లోకేషన్ రాయండి "

" ఎంక్వయిరి లో ఏదైనా తెలిస్తే మీకు అప్డేట్ చేస్తాను. "

★★★★

" మీ పేరు " అడిగాడు రంజిత్!

" శేఖర్ "

" మీరు సంహిత తో సహజీవనం లో ఉన్నారా?"

"అవును"

" సెప్టెంబర్ 10 నుండి కనబడ లేదని, సంహిత నాన్న గారు

ఫిర్యాదు ఇచ్చారు"

" అదే నేను స్టేషన్ కి వచ్చి ఇద్దామనుకున్నా"

" అవునా, మరీ ఆలస్యం చేసారే "
" లేదు, 10 న నేను ఢిల్లీ లో ఉన్నాను"

" ఆ తరువాత బిజినెస్ పని మీద యూపి వెళ్లాను "

" అలాగ, ఢిల్లీ లో ఏ హోటల్ లో ఉన్నారు? "

" విక్రమ్"

" కొద్దిగా వాటర్ ఇస్తారా?, ఫ్రిడ్జ్ వాటర్ "

" ఫ్రిడ్జ్ రిపేరు లో ఉంది"

" సరే, మళ్ళీ కలుస్తాను. మీ సహకారం కావాలి"

వెడుతూ రంజిత్ శేఖర్ చేతి వైపు చూసాడు. అది టాటూ.

నల్ల సీతాకోక చిలుక.

" మీకు బ్లాక్ అంటే ఇష్టమనుకుంటాను "

" అవును "

★★★

రంజిత్ ఆలోచిస్తున్నాడు. సంహిత కిడ్నాపయిందా లేక హత్య కు గురయిందా ఆలోచిస్తున్నాడు. కిడ్నాపయితే

ఈ పాటికే ఫోన్ రావాలి. హోటల్ విక్రమ్ కి ఫోన్ చేసి కనుక్కోవాలి. ఆ రోజు ఉన్నాడో లేదో. రిసెప్షన్ లో ఉన్న వ్యక్తి శేఖర్ వచ్చినట్టు చెప్పాడు.

సరే నన్నాడు.

సంహిత కు ఎవరైనా శత్రువులు ఉన్నారేమోనని సంహిత ఆఫీసు కు వెళ్ళాడు. సంహిత అప్పుడప్పుడు నరేష్ తో పబ్ ల్లో గడుపుతున్నట్టు వాళ్ల మాటల ద్వారా తెలిసింది.

నరేష్ తో మాట్లాడదామంటే అందుబాటు లో లేడు.

★★★★

నాలుగు రోజుల తర్వాత రంజిత్ కి ఒక ఫోన్ వచ్చింది.

"నేను కానిస్టేబుల్ కనకారావు ని మాట్లాడు తున్నా. ఇక్కడ కొండపురం రైలు గేటు దగ్గర తెగిన చెయ్యి దొరికింది. ప్లాస్టిక్ బ్యాగ్ లో. మీరు వెంటనే క్లూస్ టీం తో రండి"

"వస్తున్నా"

రంజిత్ ఆ చెయ్యిని పరీక్షించాడు.

చేతి మీద టాటూ రంజిత్ ని ఆకర్షించింది!

అది నల్ల సీతాకోక చిలుక! ఎక్కడ చూసాను అని ఆలోచించాడు.

యస్! శేఖర్ చేతి మీద క్లూస్ టీం చేతి ని పరీక్ష కు తీసుకెళ్ళారు.

★★★

ఫోర్సెనిక్ రిపోర్ట్ వచ్చింది. చెయ్యి ఒక స్త్రీ దని, వయసు 25 ఉండవచ్చని, ఆమె చనిపోయాక కట్ చేసి ప్లాస్టిక్ బ్యాగ్ లో పెట్టారని తెలిపారు. చెయ్యి గుప్పిట లో వెంట్రుకలు ఉన్నాయని, వాటిని పరీక్షించాలని చెప్పారు.

★★★

రంజిత్ సిటి లో ఉన్న ఫేమస్ టాటూ షాపు కి వెళ్ళి శేఖర్, సంహితల ఫోటోలు చూపించి, వాళ్ళ గురించి అడిగాడు. షాపు యజమాని black butter-fly టాటూ వేయించుకున్న జంటే కదా అని చెప్పాడు. అంటే ఆ చెయ్యి సంహిత దేనా? బ్లాక్ బటర్ ఫ్లై వేరే వాళ్ళు వేయించు కుంటే! మిస్సింగ్ కేస్ లు వేరే ఉన్నాయేమో చూడాలి.

★★★

రంజిత్ కి ఢిల్లీ కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్ నుండి ఫోన్ వచ్చింది. సెప్టెంబర్ 10 న శేఖర్ రాలేదని. విక్రమ్ లో లేదని.

"అంటే"

" విక్రమ్ హోటల్ ఎప్పుడో కంప్యూటరైజయిందని, రూం బుకింగ్ అంతా ఆన్ లైనని చెప్పారు"

"ఆ రోజు లిస్టు లో విక్రమ్ పేరు లేదు".

" రిసెప్షనిస్ట్ రిజిస్టర్ చూసి చెప్పానన్నాడు" సందేహం గా అడిగాడు రంజిత్.

"సాఫ్ట్ వేర్ సమస్య వచ్చి నప్పుడు రిజిస్టర్ లో రాసి కంప్యూటర్ లో అప్ డేట్ చేస్తారు. చెయ్య లేదంటే అది ఫేక్ "

" thank you "

" ఎలిబి కోసం శేఖర్ ఆడిన నాటకం "

అంటే శేఖర్ కి సంహిత మిస్సింగ్ కి ఖచ్చితం గా లింక్ ఉంది" అనుకున్నాడు రంజిత్.

★★★

ఫోర్సెనిక్ ఎక్స్పెర్ట్ ప్రవీణ్ రంజిత్ తో చెప్పాడు. దొరికిన

చెయ్యి లోని వెంట్రుకల కి DNA టెస్ట్ చెయ్యాలని.

" ఎందుకు? "

" ఎందు కంటే చేతి లోని వెంట్రుకల లోని DNA, శేఖర్ ఒంటి లోని DNA సరిపోతే శేఖరే సంహిత ను చంపాడని

అనుమానించవచ్చు"

" మీరు ఆ పని పూర్తి చెయ్యండి. నేను శేఖర్ ని పరీక్ష చేయడానికి అనుమతి తీసుకుంటాను"

★★★

మర్నాడు ఇన్ స్పెక్టర్ రంజిత్, డాక్టర్ మరియు ఇద్దరు కానిస్టుబుల్స్ తో శేఖర్ ఇంటికి వెళ్ళాడు. శేఖర్ మొదట సహకరించకపోయినా తరువాత డిఎన్ ఎ పరీక్ష కి ఒప్పుకున్నాడు. అదే సమయం లో రంజిత్ శేఖర్ ఇంటి లోని వాష్ రూం కి వెళ్ళాడు. లోపల నాలుగు గోడలు చూసాడు. గోడల మీద ఎగురు తున్న నల్ల సీతాకోక చిలుకలు! పెయింటింగ్! సీతాకోక చిలుకల్ని చూస్తు ఒక చోట ఆగాడు. అక్కడ ఒక ఎర్రబిందువు! డ్రై బ్లడ్ డ్రాప్! అనుమానం వచ్చి క్లూస్ టీం ని పిలిచాడు.

★★★

రంజిత్ మాధవ రావు కి ఫోన్ చేసి సంహిత బ్లడ్ గ్రూప్ కనుక్కున్నాడు. సంహిత బ్లడ్ గ్రూప్, ఆ ఎర్ర బిందువు బ్లడ్ గ్రూప్ తో సరిపోయింది

★★★

శేఖర్ ని అరెస్ట్ చేసాడు రంజిత్.

" నేనే అని ఎలా చెప్పగలరు? నరేష్ కూడా ఇందు లో ఉన్నాడు"

"కంగారు పడకు మొత్తం చెబుతాను. సెప్టెంబర్ 10 రాత్రి నీకు, సంహిత కు మధ్య ఘర్షణ మొదలయింది. నరేష్ తో తిరుగుతూ, నిన్ను నిర్లక్షం చేసిందని సంహితను చంపి ముక్కలు చేసి, ఫ్రిడ్జ్ లో పెట్టావు. నీతో ఘర్షణ పడినప్పుడే

నీ పొడుగు జుట్టు సంహిత చేతి లో ఉండిపోయింది. చెయ్యిని వేరే బ్యాగ్ లో పెట్టావు. తరువాత బాత్ రూమ్ లో చంపావు కాబట్టి ఒక ఎర్రని నెత్తుటి బొట్టు గోడ కి అంటుకుపోయింది. క్రింద నేల మీద అంతా కడిగావు.

నీ ఇంట్లో దొరికిన ఎర్ర బిందువు బ్లడ్ గ్రూపు, సంహిత బ్లడ్ గ్రూపు సరిపోయింది. జుట్టు లోని DNA, నీ ఒంట్లోని DNA సరిపోయాయి. ఇక సెప్టెంబర్ 10 న నువ్వు హైదరాబాద్ లో ఉన్నావు. ఎలిబీ నాటకం కంప్యూటర్ ద్వారా బయటపడింది. విక్రమ్ లో తెలిసిన రిసెప్షనిస్ట్ ద్వారా రిజిస్టర్ లో పేరు ఉంది. కంప్యూటర్ లో లేదు. ఆ రోజు సాఫ్ట్ వేర్ సమస్య లేదు. "

శేఖర్ తప్పించుకుందామని ప్రయత్నించాడు. రంజిత్ పిస్తోలు తీసి," పిచ్చి పనులు చెయ్యకుండా లొంగి పో"

ఫ్రిడ్జ్ రిపేరని అబద్ధం ఆడావు అందు లోనే సంహితను దాచావు. అభివృద్ధి చెందిన ఫోర్సినిక్ సైన్స్ కి దొరక్క తప్ప లేదు."

"పిల్లతో సరైన కమ్యూనికేషన్ లేక పోతే ఇలాంటి అనర్థాలే" అన్నాడు రంజిత్ సంహిత తండ్రి మాధవ రావు ని ఓదారుస్తూ

★★★

కథ

# "బిక్షుకి"

ఉప్పలూరి మధుపత్ర శైలజ

కొత్తగా జర్నలిజంలోకి అడుగుపెట్టిన భార్గవ, కొత్త విషయాలను, ఆసక్తి, ఆశ్చర్యం కలిగించే సంఘటనలను తన మనసనే కంప్యూటర్‌లో భద్రపరచి పేపర్‌కు కథనాలను రాస్తూంటాడు. ప్రతిరోజూ ఊరిబయటనున్న పాడుబడిన బస్‌షెల్టర్ మీదనుండి వెడుతూ, ఎన్నోసార్లు ఎండకు, వానకు అక్కడే కాసేపు తలదాల్చుకుని, ఓ బిక్షుకిని గమనించేవాడు.

అదేం చిత్రమోగానీ తానా ప్రదేశానికి ఎప్పుడు వచ్చినా ఆ బిక్షుకి నిద్రపోతూనే కనిపించేది. ఆమె పక్కనే ఓ గోనెసంచి, సొట్టలు పడిన సత్తుపళ్ళెం, గ్లాసు, వాటికి రక్షణగానో, ఆమెకు కాపలాగానో అన్నట్లుగా కూర్చున్న వీధికుక్క, ఆమెను రోడ్డుమీద నడిపించటానికి సాయంగా ఓ పొడవాటి కర్ర. చిత్రకారుడు గీసిన బొమ్మలో మాదిరి ఎన్ని సార్లు చూసినా అదే దృశ్యం కనిపించేది భార్గవకు. కాసేపు ఆమెను నిద్రలేపి ఆమె కథను తెలుసుకుని చేతనైన సాయం చేయాలన్నది అతని ఉద్దేశ్యం.

భార్గవకూడా ఓ అనాధాశ్రమంలో పెరిగి దాతల చలువతో తన చదువు సాగించి తనకిష్టమైన జర్నలిజం కోర్సును పూర్తి చేసుకుని, ఓ దినపత్రికలో పనిచేస్తున్నాడు.

పగలంతా పత్రికాఫీసులో పనిచేసి, సాయంత్రం నాలుగు వీధులు తిరుగుతూ, జీవన సమరంలో అభాగ్యులుగా మిగిలిన తనలాంటి వారికి, తన అక్షరాల ద్వారా లక్షల సాయం కాకున్నా, కొద్దోగొప్పో ధన సాయం అందేలా కృషి చేస్తున్నాడు.

ఆ బిక్షుకి తన చుట్టు తెరలాగా ముసురుకున్న దోమల సంగీతాన్ని కూడా లెక్కచేయకుండా ఒళ్ళుమరచి నిద్దురపోతోంది. ముగ్గుబుట్టవంటి తల, ముడతలుపడిన దేహంతో 'నాకు నేనే తోడు నీడ' అని ధైర్యంగా అనుకుంటోంది కాబోలు. భార్గవకు ఆమెను చూడగానే మహాకవి శ్రీశ్రీ రాసిన "బిక్షుకి" కవిత గుర్తుకొచ్చింది. కళ్ళనుండి ఉబికిన నీళ్ళు బుగ్గలపై నుండి జారి గుండెగదిని తడుపుతున్నాయి.

తనలాంటి అదృష్టం అందరికీ దొరకదు. ఎందరో పుణ్యాత్ముల దయతో తన జీవితం ఇలా జరుగుతోంది. ఆశ్రమంలో ఉంటూ చేసే చిరుద్యోగం ద్వారా వచ్చిన జీతంలో కొంత భాగాన్ని రాత్రివేళ్ళల్లో వీధుల్లో అడుక్కు తినే బిక్షుకులకు ఆహార పొట్లాలనందించటానికి ఉపయోగిస్తున్నాడు. అదేవిధంగా బస్‌షల్టర్‌కు వచ్చినప్పుడల్లా, ఒక్కసారైనా సరిగా చూడలేని ఆ ముసలి బిక్షుకి పక్కన ఓ బ్రెడ్ ప్యాకెట్‌ను ఉంచి వెళ్ళేవాడు.

శ్రావణ మాసానికితోడు అల్పపీడనం ఏర్పడటంతో ముసిరిన వాన నాలుగురోజులపాటు తెరిపి నివ్వలేదు. భార్గవకు రోడ్డుమీదకెళ్ళే అవకాశం కుదరనే లేదు. "పాపం ఆ బిక్షుకి ఈవానలకు బయటకు వెళ్ళలేక తిండిలేక ఎలా ఉందో? ఏమిటో?" అనుకున్నాడు భార్గవ. వచ్చేది చలికాలం. ఈ నెల జీతంలో ఆమెకో రగ్గును కొనివ్వాలని నిర్ణయించుకున్నాడు.

మరునాడు వర్షం ఆగటంతో ఈ రోజయినా ఆ అవ్వను చూసి రావాలని మనస్సులో దృఢంగా అనుకుని, సాంబారన్నం ప్యాకెట్ తీసుకుని ఆమె దగ్గరకు వెళ్ళాడు భార్గవ.

ఆ బస్‌షెల్టర్ అంతా నీళ్ళతో నిండిఉంది. అక్కడున్న బెంచిపై మూలుగుతూ, ముడుచుకుని పడుకున్న అవ్వను చూడగానే భార్గవకు దుఃఖం ఆగలేదు. "ఏమయినాసరే ఈ అవ్వను తానుండే ఆశ్రమానికి తీసుకెళ్ళాలి. పాపం పెద్దవయస్సులో ఎంతో కష్టపడుతోంది" అనుకుంటూ బండిని ఆపి భార్గవ, "అవ్వా!" అని పిలవగానే కళ్ళు విప్పి, లేవలేక లేస్తూ "బాబూ ఆకలిగా ఉంది. నాలుగు రోజులనుండి తిండి లేదు. బయటకువెళ్ళి అడుక్కునే వీలులేకపోయింది" అంటూ దీనంగా చేయి చాచింది.

చేతిలోని సాంబారన్నం పొట్లాన్ని ఆమెకు ఇచ్చి, బండిలోని వాటర్‌బాటిల్‌లోని నీరు గ్లాసులో పోసాడు భార్గవ. ఆవురావురుమంటూ తింటుందనుకున్న అవ్వ, భార్గవ అంచనాను తల్లకిందులు చేస్తూ, మొదటి ముద్దను తన నేస్తమైన కుక్కకు పెట్టి తాను తినటం మొదలుపెట్టింది.

"ఇన్నాళ్ళకు ఆ అవ్వకు కాస్త తిండిని పెట్టగలిగాను" అనుకుంటూ భార్గవ ఆ అవ్వతో, "అవ్వా! మా ఆశ్రమానికి వచ్చి ఉంటావా? రెండుపూటలా భోజనం పెడతారు. కట్టుకోవడానికి బట్టలిస్తారు. నీకు తోచిన పనిని వాళ్ళకు చేసి పెడుదువుగాని" అన్నాడు.

ఆకలి తీరిన అవ్వ హాయిగా నవ్వుతూ "వస్తాను బిడ్డా! నా టైం దగ్గరకొచ్చింది. కాళ్ళల్లో సత్తువ తగ్గిపోయింది. నాలుగడుగులేస్తే ఆయాసం. పెయ్య అలసిపోయింది. వీధివీధికి తిరగలేకపోతున్నాను" అంది.

"అవ్వా! మా ఆశ్రమం వాళ్ళతో మాట్లాడి రేపు పొద్దున్నే వస్తాను. ఇక్కడే ఉండు. నిన్ను ఆశ్రమానికి తీసుకెడతాను" అన్నాడు భార్గవ. "సరే బిడ్డా! నా ఆయువు కూడా పోసుకుని నిండు నూరేళ్ళు చల్లగా వుండు" అని దీవించింది అవ్వ. "నీవు హాయిగా పడుకో ఈ రాత్రికి. జాగ్రత్త" అని చెప్పి బయలుదేరాడు భార్గవ. సందు మలుపు దగ్గరకు వెళ్ళాక వెనుకకి తిరిగి చూశాడు. అంతులేని వేగంతో వస్తున్న కారును ఆపమంటూ వెనుకనే ముసలవ్వ పరిగెత్తి వస్తోంది.

"ఏమయ్యింది అవ్వా?" అంటూ గబగబా ఎదురెళ్ళాడు. తన చేతిలోని కర్రను కారువైపు బలంగా విసిరింది

అవ్వ. కర్ర దెబ్బకు కారు వెనుక అద్దం భళ్ళున పగిలింది. ఇంతలో పోలీసు విజిల్ వినిపించింది. దాంతో కారు నుండి ఓ అమ్మాయిని రోడ్డుమీదకు తోసివేసి శరవేగంతో కారు వెళ్ళిపోయింది.

కారు వెనుకనే ఉన్న అవ్వ ఒక్కవుదుటున ఆ పిల్లను పొదివిపట్టుకుని, "బాబూ కాస్త సాయం చేయండి. ఈ బిడ్డకేమయ్యిందో? ఏమిటో? పోలీసువానొస్తోంది కదా! వాళ్ళే ఆ దొంగ వెధవలను పట్టుకుంటారు. మనం ఈమెను డాక్టర్‌దగ్గరకు తీసుకెళ్దాం" అంటూ భార్గవను అడిగింది.

"అవ్వా! ఆ వెధవలను వదిలేశాం" కోపంగా భార్గవ అంటున్న మాటలకు, "ముందీ పిల్లను కాపాడాలి" అంది అవ్వ.

తన దగ్గరున్న వాటర్‌బాటిల్‌లో మిగిలిన నీటిని ఆమెపై జల్లి, స్ట్రీట్‌లైట్ చిరు వెలుగులో ఆమెను పరికించాడు భార్గవ. దాదాపుగా 19, 20 ఏళ్ళ వయస్సులోవుందామె. చిందరవందరై చిరిగిన బట్టలు, కళ్ళవెంట కన్నీటి చారికలు, కార్లోనుండి తోసివేయడంతో నుదురు చీరుకుపోయి రక్తం చిందుతున్న ముఖంతో వున్న ఆమె, చిగురుటాకులా వణికిపోతోంది.

స్పృహలోకి వస్తూ "ప్లీజ్! నన్నేం చేయకండి. నేనెక్కడున్నాను?. మా ఇంటికి వెళ్ళిపోతాను. అమ్మా, నాన్నలు కంగారు పడుతూంటారు" అంటూ ఏడుస్తోందామె

భిక్షుకి ఆమెకు నీళ్ళు తాగిస్తూ, ఆమె వాలకం పసిగట్టి "బాబూ! నా సంచీలో ఓ చీర వుంది, తీసుకురానాయనా" అని భార్గవకు పురమాయించింది.

"అవ్వా! ఈ మడతనలగని మరకల చీరనెందుకు దాచావు? నువ్వేమో చిరుగుల చీరను కట్టుకున్నావు" అంటూ ఆ చీరను అవ్వ చేతికిచ్చాడు భార్గవ.

"అదా! దాని వెనుక ఓ కథ వుంది బాబూ. నీకు తరువాత చెపుతాను" అంటూ ఆచీరను గబగబా ఆ యువతికి చుట్టబెట్టి, "ఓ ఆటోను పిలువు నాయనా! నలుగురు చేరక ముందే ఈ తల్లిని వాళ్ళింటికి చేరుద్దాం" అంది అవ్వ. వచ్చిన ఆటోలో ఆమెను కూర్చుండజేసి, తానూ కూర్చుంది అవ్వ. భార్గవ వారిననుసరించాడు.

లైట్లన్నీ వెలుగుతున్నా ఆ ఇల్లు గ్రహణం పట్టిన రాత్రిని తలపిస్తోంది. విషణ్ణవదనాలతో అయోమయస్థితిలో ఉన్న ఆమె తల్లిదండ్రులు, ఆటో ఆగిన శబ్దానికి గేటు దగ్గరకు కంగారుగా పరిగెత్తుకొచ్చారు.

ముందుగా ఆ యువతి కిందకు దిగింది. వెనుకనే భార్గవ అవ్వ చేతిని పట్టుకుని నడిపిస్తూ వచ్చాడు.

"తల్లీ మానసా! ఏమయ్యిందమ్మా? తలకు ఆ కట్టేమిటి?" అంటూ మానస తల్లి కూతుర్ని అడిగింది.

మానస తల్లిని చూస్తూనే అవ్వ, "ఏంకాలేదమ్మా! మీ పాప రోడ్డును దాటుతూంటే ఓకారు వాడు గుద్దేసి వేగంగా వెళ్ళిపోయాడు. కింద పడిపోవటంతో రక్తం కారింది. బట్టలకు మరకలయ్యాయి. అందుకే ఈ చీర కట్టి తెచ్చాను. మన పాపకేమీ కాలేదు. అమ్మా! మీ అమ్మయిని ఆనాడు మీరిచ్చిన మరకలైన చీరతోనే, ఆమె జీవితంపై మరక పడకుండా కాపాడి మీ కప్పగించాను. ఆ సమయంలో ఈ బాబు నాకు తోడుగా ఉండి, ఆటో అదీ తీసుకొచ్చి సాయం చేసాడు. దండాలు" వస్తానంటూ భార్గవతో కలసి కదిలింది బిక్షుకి.
ఎంతో సమయస్ఫూర్తితో అవ్వ చెప్పిన మాటలను వింటున్న భార్గవ, ఆ బిక్షుకిని మనస్సులోనే అభినందించాడు భార్గవ.
అవ్వను తీసుకుని భార్గవ వెళ్ళాక మానసను, "తల్లీ! ఆ అవ్వ మాటలు నిజమేనా?" అంటూ అడిగారు తల్లిదండ్రులు. అప్పటిదాకా ఆపుకున్న దుఃఖం ఒక్కసారిగా పెల్లుబకగా బావురుమంటూ ఏడ్చింది మానస.

ఆ తరువాత "అమ్మా! నా స్నేహితురాలు శ్యామల పుట్టినరోజని ఇద్దరం సినిమాకు వెళ్ళి తిరిగి ఆటోలో వస్తున్నాం. తోవలోనే శ్యామలా వాళ్ళ ఇల్లుంది. అక్కడ తను దిగింది. ఇంతలో ఆటో డ్రైవర్‌కు వాళ్ళ అబ్బాయిని హాస్పటల్‌కు తీసుకెళ్ళాలి. అర్జంట్‌గా రమ్మనమని ఇంటినుండి ఫోను రావటంతో, నన్ను కూడా

శ్యామలా వాళ్ళింటి దగ్గరే దింపేసి అతను వెళ్ళిపోయాడు.

శ్యామల నన్ను వాళ్ళింట్లోనే ఉండమంది. కానీ మీరు కంగారు పడతారని ఓ సందు తిరిగితే మనింటికి వచ్చేస్తానని నెమ్మదిగా నడుస్తూ వస్తున్నాను. ఇంతలో నా పక్కగా ఓ కారాగి, నేను కన్నుమూసితెరిచేంతలో నన్ను కారులోకి లాగేసి కారును స్పీడుగా పోనిచ్చారు.

నేను భయంతో గట్టిగా అరిచాను, భయంవేసి ఏడ్చాను. నన్ను కారులోని వాళ్ళు.. అంటూ ఏడుపుతో గొంతు పెగలక మాటలు రాక ఆపింది.

ఇంతలో కారు అద్దం భళ్ళున బద్దలయ్యింది. పోలీసు విజిల్ వినిపించింది. ఈ హడావిడీకు కారులోనుండి నన్ను రోడ్డుమీదకు తోసేసి వాళ్ళు పారిపోయారు.

దేవుడు పంపినట్లుగా అక్కడేవున్న ఆ అవ్వ ఇవాళ నన్ను కాపాడింది. అమ్మా! ఇందాక అవ్వ మాట్లాడుతూ ఈ చీర నువ్విచ్చిన చీరే అని చెప్పింది. మరి ఆ చీర అవ్వ దగ్గరకు ఎలా వెళ్ళింది?" అని అంత బాధలోనూ తల్లిని ప్రశ్నించింది మానస.

"ఆ సంగతి నన్నడుగమ్మా! ఒకరోజు ఆ అవ్వ సిగ్నల్స్ దగ్గర బిక్షం అడుగుతూ 'డబ్బులొద్దు పాత చీర వుంటే ఇవ్వండి' అని అడిగింది. కార్లో చీరలెక్కడుంటాయి? మీ అమ్మ అప్పుడెప్పుడో మరకలున్నాయని డ్రైవాష్‌కు ఇవ్వమన్న ఈ చీర కార్లోనే ఉండిపోయింది. ఆ విషయం గుర్తుకొచ్చి, పోనీలే ముసలామె చిరిగిపోయిన బట్టల్లో ఉంది. మరకలైన చీరను మీ అమ్మ ఎట్లాగూ కట్టదు అని ఆ చీరను అవ్వకు ఇచ్చాను. పని వత్తిడిలో ఆ విషయం మీ అమ్మకు చెప్పలేదు. ఆ తరువాత నీ పుట్టినరోజున గుళ్ళో అర్చన చేయించటానికి మనం రామాలయానికెళ్ళాం. అక్కడ గుడి మెట్ల మీద ఆ చీర కట్టుకుని అవ్వ కూర్చుంది. మీ అమ్మ, ఆమెను చూసి "అగ్గిమీద గుగ్గిలమే" అయ్యింది. "ఆ చీరను దొంగతనంగా కాజేసావంది. పైగా ఇలాంటి దొంగలతో కలసి మీరు గుళ్ళో కూర్చుంటారా? ఆమెను ఇక్కడకు రానీయకండి" అంటూ మిగిలిన బిచ్చగాళ్ళకు చెప్పింది.

ఆమెకు ఆ చీరను నేనే ఇచ్చానన్న సంగతి కార్లో ఇంటికి తిరిగి వెడుతూండగా మీ అమ్మకు చెప్పాను.

"ఎంత పాపం చేసానో? ఆమె మీద దొంగ అని ముద్ర వేసి ఆమెను గుడికి రాకుండా చేసాను అని బాధపడింది" అంటూ చీర అవ్వకు చేరిన సంగతిని వివరించాడు మానస తండ్రి.
నీ గురించిన కంగారులో నేను అవ్వను గమనించలేదు. "మానసా! ఆమె మనకెంతటి మహోపకారం చేసిందో ఈరోజు. మాటలను పడినప్పటికి నా చీరను పదిలంగా దాచుకుని ఇప్పుడు నీకు రక్షణగా మార్చింది".

"మానసా! నిజంగా ఆ అవ్వ మన పాలిట దేవతే! దొంగ అని నలుగురిలో తిట్టి అవమానించి పంపినా, నీ జీవితానికి మరక పడకుండా కాపాడి నాకు జీవితపు విలువలను నేర్పించింది. నిన్ను నలుగురి కంటా పడకుండా క్షేమంగా ఇంటికి చేర్చింది" అంటూ తన మనసులోని భారాన్ని కొంత తగ్గించుకుంది మానస తల్లి.

మానస ఇంటినుండి బయటకు వచ్చిన భార్గవ "అవ్వా! జాగ్రత్తగా నా బండి ఎక్కగలవా. నన్ను నీ మనవడనుకొని మా ఆశ్రమానికి రా" అంటూ తనతో ఆశ్రమానికి తీసుకెళ్ళాడు.

తన గదికొచ్చాక "అవ్వా! ఈ రోజు నీవు చేసిన ఉపకారం ఆ కుటుంబానికి ఎంతో మేలుచేసి ఉంటుంది కదా!" అన్నాడు.

"ఔను బాబూ! ఈ జీవితపు చరమాంకంలో ఓ ఆడపిల్లను కాపాడగలిగాను. ఈ జన్మకిది చాలు" అంది అవ్వ.

"అవ్వా! మనందరిని కాపాడే పైవాడు, మనల్ని ఇలాంటి మంచి పనులు చేయటానికే అనాధల్లా పుట్టించుంటాడు. మరిప్పుడు చూడు నేను, నావాళ్ళు అనే స్వార్ధం లేని నీవు ధైర్యంగా ఓ జీవితాన్ని కాపాడగలిగావు. ఇక పడుకో" అంటూ ఓదార్చాడు భార్గవ.

★★★★★

కథ

# నైతిక విలువలు

P.L.N. మంగారత్నం.

ఇప్పుడంటే ఆఫీసుల్లో కంప్యూటర్లు సీటుకి ఒకటి వచ్చాయి గాని ..
ఇరవై ఏళ్ల క్రిందట అయితే .. అన్నిటినీ ఒకే ప్రదేశంలో అమర్చేవాళ్ళు. అవసరాన్ని బట్టి అందరం అక్కడికే వెళ్లి టైపు చేసుకుని, పక్కనే ఉన్న ప్రింటింగ్ మిషన్లో ప్రింట్ తీసుకుని వచ్చే వాళ్ళం.

మా ఆఫీసు చిన్నదే. ఆఫీసరుగారి గదీ, ఒక పెద్ద హాలూ, వెనుక ఒక గదీ అంతే.
ఆ హాలులోనే .. ఓ పక్కగా కంప్యూటర్లు పెట్టి అవి బయటకి కనిపించకుండా చిన్న పార్టిషన్ను ఏర్పాటు చేసారు. మిగిలిన ప్రదేశంలో నేనూ, మా సూపరింటెండెంటూ, ఓ సీనియర్ అసిస్టెంటూ కూర్చునే వాళ్ళం. మిగిలిన వాళ్ళు వెనుక గదిలో.

ఓసారి ..నేను 'కంప్యూటర్ డెక్' లోకి వెళ్లి ఓ గంట సేపు టైపు చేసుకున్నాను.
నా ప్రక్కనే, ఉన్న టైపిస్టు కబుర్లు చెబుతుంటే, వింటూ డ్రాఫ్ట్ పూర్తి చేసాను. ప్రింట్ తీసుకోవడం కోసం అన్నట్లు పేపర్ల కోసం అని .. గోడ వారగా ఉన్న నా బీరువా దగ్గరకు వెళ్లాను.

బీరువా తలుపులు ఓ వారగా 'తెరిచే' ఉన్నాయి. అంత ఎప్పుడూ వదిలేసింది లేదు. గడియ పెట్టక పోయినా .. కనీసం దగ్గరకు అయినా జార వేస్తాను. ఇలా ఎలా? మర్చిపోయానబ్బా! అనుకుంటూ ,,

కాగితాలు తీసుకుంటుంటే .. జీతాల డబ్బులు పెట్టిన 'సంచి' కూడా అస్తవ్యస్తంగా కనిపించడంతో, ఇంత మతిమరుపు ఎలా వచ్చింది నాకు .. దీన్నీ ఇలా వదిలేసానా? అనుకుంటూ, దాన్నీ దగ్గరకు ముడి వేసి యదాస్థానంలో ఉంచి, కావాల్సిన తెల్ల కాగితాలు తీసుకుని కంప్యూటర్ దగ్గరికి వెళ్లాను.

ఎస్టాబ్లిష్మెంటు క్లార్కుని కూడా కావడంతో .. అందరికీ జీతాలు బ్యాంకు నుంచి తెచ్చి .. పంచే పని కూడా నాదే.

మరో పది నిమిషాల తర్వాత .. ప్రింట్ తీసుకొని వచ్చేసరికి, నా టేబుల్ ముందు గ్రామనౌకరు 'హనుమాన్లు' నిలబడి ఉన్నాడు. అతను అప్పుడే జీతానికి వచ్చాడు. ఆరోజు అంతకుముందే, మరో ఇద్దరు గ్రామనౌకర్లు వస్తే వాళ్లకు జీతం ఇచ్చేసి ..తీరికగ్గా కంప్యూటర్ దగ్గర కూర్చున్నాను .. ఇప్పుడు మళ్లీ ఇతను ..

" ఏమయ్యా! అప్పుడే నాలుగో తారీఖు వచ్చేసింది. మరీ ఇంత ఆలస్యంగానా జీతానికి వచ్చేది" అన్నాను.

" ఇంటి దగ్గర కొన్ని పనులు ఉండిపోయాయి ..అమ్మగారూ!" అనడంతో.. డబ్బు సంచిని తీసి, అతని జీతం లెక్కపెట్టసాగాను. ఎందుకనో! అన్నీ చిన్న నోట్లే తగిలాయి.

ఎంత వెతికినా 'పదులు' తప్ప వందలు దొరకలేదు. అంతకు ముందు ఇద్దరికి ఇచ్చినప్పుడు వందలు ఉన్నాయి. వాటికి ఓ రబ్బరు బేండు వేసి .. చిల్లరను మాత్రం అలాగే వదిలేసాను.

ఉదయం .. ఆఫీసరుగారి రూములో, ఉన్న 'సేఫ్ లాకర్' లోనుంచి 'డబ్బు సంచీ ' తెచ్చుకుంటుంటే .. మనసులోకి ఓ అనవసరపు ఆలోచన వచ్చింది. నోట్లు ఇలా కవర్లో నుంచి పైకె కనిపిస్తున్నా ఆఫీసు డబ్బు కాబట్టి, అలా ఉండిపోయింది. అదే మరొకటైతేనా! అన్నట్లు.

అది, ఏదో ముందస్తు హెచ్చరికకు సంకేతం అన్న విషయం అని నాకు అప్పుడు తెలియలేదు. జరగబోయేది ఏదైనా ఉంటే, ఒక్కోసారి అలా .. మనసులోకి అలా వచ్చేస్తాయట. అలాగే, జరిగింది ఆరోజు.

హనుమాన్లకి, సంచిలో ఉన్న పదులు అన్నీ లెక్కపెట్టి ఇచ్చేసి, అంతకు ముందు ఉండాల్సిన వంద నోట్లు ఏమయ్యాయి? ఆలోచనలో పడ్డాను. ఇంకా ఇవ్వవలసిన వాళ్ళ జీతం డబ్బులు లెక్క చూసుకుంటే .. నా దగ్గర ఉండాల్సిన డబ్బు కన్నా ఓ ' మూడు వేల రూపాయలు' తక్కువ అయ్యాయని తెలిసింది. అంటే ..

నేను కంప్యూటర్ దగ్గర ఉన్నప్పుడు, నా బీరువా ఎవరో! తెరిచారు. నేను వైట్ పేపర్ల కోసం వెనక్కి వచ్చినప్పుడు .. బీరువా తలుపులు వెయ్యడం మర్చిపోయానని అనుకున్నానే గాని, మరెవరో తెరిచారని అనుకోలేకపోయాను. ఆరోజు ఆఫీసులో స్టాఫ్ పెద్దగాలేరు. ఆఫీస్ సూపరింటెండెంటు మేడం గారికి టెన్త్ క్లాస్ ఎగ్జామినేషన్స్ కి, స్క్వాడ్ డ్యూటీ వేశారు. అందుకు ఆవిడ లేరు. ఆవిడ సీటు నా సీటు ముందే. ఆవిడే ఉంటే, అలా జరిగి ఉండకపోవచ్చు.

ఆఫీసర్ ' జగన్నాధ స్వామి' గారు ఎక్కడకో టూర్ వెళ్లారు. ఉన్న స్టాఫ్ వెనక రూములోకి చేరిపోవడం .. నేను కంప్యూటర్ దగ్గర ఉండిపోవడంతో, చాలాసేపు బయట ప్రపంచాన్ని గమనించలేదు.

ఉన్న అటెండర్ ' శేషాచార్యులు ' మాత్రమే వచ్చే జనాలకి సమాధానాలు చెప్పి పంపిస్తూ ఉన్నాడు. ఏం చేయాలో తోచింది కాదు మూడు వేలు వరకూ డబ్బు తక్కువ అయిపోయింది. అదే సమయంలో .. ఆఫీస్ చైర్మన్ వేణుగోపాల్, పది రోజులు శెలవు పెట్టి, తిరుపతి వెళ్లడంతో, అతని జీతం మాత్రం ఉండిపోయింది. ఇప్పుడు నేను అతనికి జీతం ఇవ్వాల్సి ఉన్నది.

★★★

నా మనసులో మాట బయటకి వచ్చిందో! లేదో!
" మరి బీరువా తలుపు వేసుకోకుండా, బయటకు వచ్చేస్తే ఎలా?" అన్న ప్రశ్నలు వచ్చాయి.

నేనైనా అంతలా ఎందుకు మర్చిపోయానో! నాకు తెలియలేదు.

'ఆఫీసు సీలు' కోసమో! రబ్బరు స్టాంపుల కోసమో! 'ఆచార్యుల' కు అప్పుడపుడూ నా బీరువా తెరిచే అలవాటు. మిగిలిన వాళ్ళు ఎవ్వరూ అలాంటి చొరవ తీసుకోరు. స్థానికంగా నివాసం ఉండడంతో .. కొన్ని పనులు మీద వేసుకుని చేసినట్లు చేస్తాడు. నేనూ పని జరుగుతుందిలే అన్నట్లు ఊరుకునేదాన్ని.

ఎస్టాబ్లిష్మెంటు క్లర్కును కావడంతో .. చాలా భాధ్యతలు నా మీదే ఉన్నాయి.

ఆప్పటికి ఆఫీసులో ఉన్నది .. అటెండరు ఆచార్యులే కాబట్టి, ఆచార్యుల్ని అడిగాను.
" అయ్యో! నేనెప్పుడు మీ బీరువా తెరిచానమ్మా! ఈ రోజు 'సారు' కూడా లేరు .. సంతకాలు అయిన సర్టిఫికేట్ల మీద 'రౌండ్ సీలు' వేద్దాం అన్నా.. గాని " అంటూ తన నిజాయితీని చాటుకున్నాడు. మరి అంతకు మందు ఉన్న వంద నోట్లు .. తరువాత ఎందుకు లేవు? మొత్తం అన్నీ తీస్తే వెంటనే, తెలిసిపోతుందని, చేతికి అందిన వంద నోట్ల కట్టే జేబులో వేసుకున్నారు.

సాయంత్రం నాలుగు గంటలకి ..

మా ఆఫీసరుగారు టూర్ నుంచి వచ్చిన తర్వాత విషయాన్ని వివరించి చెప్పాను.

" బీరువా తలుపు గడియ వేయకపోవడం 'తప్పు' మీదే కదా! అయినా సరే, తెలుసుకుందాం లెండి" అన్నారు.

నేను తలుపు దగ్గరికి వేసానో! లేదో! అప్పటికీ గుర్తు రాలేదు.

మౌనం వహించాను.

ఆఫీసు డబ్బు ఎవరు తీసేస్తారు? ఆఫీసులో అందరూ అందరికీ కావలసిన వాళ్ళే కదా! అనుకున్నా .. రూపాయి నోటుకి తరతమ భేదాలు ఉండవన్నది అప్పటికి గానీ తెలిసిరాలేదు.

ఆ తరువాత ..

ఆఫీసుకి చేరుకున్న ముగ్గురి అటెండర్లనూ పిలిచి ..

" మీలో ఎవరో .. ఒకరు డబ్బు తీసి ఉంటారు అని అనుకుంటున్నాం. ఎవరు తీసారో నిజాయితీగా .. రేపు ఆవిడ ఆఫీసుకి వచ్చేసరికి .. తీసిన ఆ డబ్బుని .. ఆవిడ 'టేబుల్ డెస్క్' లో పెట్టేసి వెళ్లిపోండి. మీరు ఎవరో బయటకి తెలియాల్సిన అవసరం లేదు. ఇది ఆఫీసు పరువుకి సంబంధించిన విషయం" అంటూ చెప్పారు ఆఫీసరుగారు.

అందుకు అటెండరు అప్పారావు " నేను మీతోనే ఉన్నాను కదా సార్! నాకు దీని గురించి ఏమీ తెలీదు" చెప్పాడు. నిజమే.

" నేనూ ట్రెజరీకి వెళ్లి, ఈ నాలుగు గంటలకే, మీరు వచ్చే ముందే వచ్చాను సార్! వచ్చీ రాగానే ' మేడం గారు ' ఈ విషయం చెప్పారు. అంతకు మించి నాకూ ఏమీ తెలీదు" అంటూ చెప్పాడు ముక్తేశ్వర రావు కూడాను. అదీ నిజమే.

ఇక మిగిలిది ఆచార్యులు. ఆఫీస్లో ఉన్నది అతను మాత్రమే.

" నాకు మాత్రం ఏం తెలుసు సార్! నేనూ ఇక్కడిక్కడే ఉన్నాను. ఆఫీసుకి జనాలు వచ్చి పోతుంటే, వాళ్ళకి సమాధానాలు చెప్పడం తోనే సరిపోయింది. ఎలా జరిగిందో! నాకూ తెలీదు. ఆఫీసులో ఉన్నందుకు నన్ను అనుమానిస్తే ఎలాగ? నాకేం తెలీదు. దేవుడి మీద ఒట్టు " అంటూ చెయ్యి తల మీద పెట్టుకుని 'ఒట్టు' కూడా వేసాడు ఆవేశంగా.

ఆచార్యులు కాస్త చేతివాటం గల మనిషి. లేని అలవాట్లు లేవు. జంధ్యం తీసి పక్కన పెట్టి .. తాగాలంటే

తాగుతాడు. తినాలంటే తింటాడు. అతని నైజం అందరికీ తెలిసిందే. అయినా, ప్రస్తుతం దేవుడిని అడ్డం పెట్టుకున్నాడు.

★★★

ఆ సాయంత్రం, ఇంటికి వెళుతూ కూడా అదే ఆలోచన ఉండిపోయాను. అలా వెళుతున్న క్రమంలో ఒక విషయం అవగాహనకు వచ్చింది.

వెంటనే, ఇంటికి వెళ్లి, మా ఆఫీసర్ గారికి, మా 'లేండు లైను' నుంచి ఫోను చేసి చెప్పాను.

" సరే రేపు చూద్దాంలేండి. మన 'ఆర్. ఐ' లు ఇద్దరినీ పిలిచి మీటింగ్ పెడదాం. లేకపోతే అప్పుడే పోలీస్ కంప్లైంట్ ఇవ్వచ్చు" అన్నారు భరోసాగా. ఆ మాటకు నేను ఎంతో సంతోషించాను ఆఫీసరుగారు 'నా పక్షాన' ఉన్నారు అని.

★★★

అయితే ఆ మరునాడు అనుకున్నట్టు ఏమీ జరగలేదు.

నేను ఆఫీసుకి వెళ్ళేటప్పటికే, ఆ ఇద్దరు 'ఆర్. ఐ' లూ కూడా ఆఫీసుకి వచ్చి " మాకు ఇలాంటివి జరుగుతాయని ముందుగా తెలియదు కదా! మేము టూర్ ప్రోగ్రామ్స్ ఫిక్స్ చేసుకున్నాము" అంటూ క్యారేజీలు తీసుకుని మరి బయటకు వెళ్లిపోయారట.

ఆఫీసులో చాలా ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉంటాయి. బయటకు తిరిగే వాళ్ళు ఉంటారు. ఎవరు ఎలా .. తిరిగినా మధ్యాహ్నం లంచ్ కి మాత్రం ఆఫీసుకే వచ్చేస్తారు. కానీ వీళ్ళిద్దరూ మాత్రం ఆ రోజు ఇక 'రాము' అని చెప్పే వెళ్లిపోయారట.

ఆఫీసర్ గారు కూడా టూర్ లోనే ఉన్నారు.

ఏ మీటింగూ జరగలేదు. నా విషయం కథలలేదు.

★★★

ఆ రోజే కాదు..

ఏ రోజూ కూడా కదలలేదు. నిమ్మకు నీరెత్తినట్టే ఉంది వ్యవహారం.

అయినా, ఆఫీసర్ గారి మీద నమ్మకంతోనే ఉన్నాను.

ఆ పని చేసింది అటెండరు ఆచార్యులే అని నా గట్టి నమ్మకం, అదే విషయం .. ఆరోజు ఫోన్లో చెప్పాను.

విషయం ఇలా నలుగుతున్నపుడే, ఆచార్యులు .. మా సీనియర్ అసిస్టెంటు ' వెంకన్నబాబు ' తో అన్నాడట. " ఇంకా నయం. ఆ రోజు నేను. కాసేపు నేను ఇంటికి వెళ్లాను కాబట్టి సరిపోయింది. లేకపోతే అదేదో నా మీద పడిపోయేది" అని. అంటే, అవి అప్పుడే ఇంటికి చేరిపోయి ఉంటాయి. అందుకే తను దొరకనన్న ధైర్యంతో బీరాలు పలుకుతున్నాడు. ఎవ్వరూ తియ్యకపోతే, బీరువాలో డబ్బులు ఏమై పోతాయి?.

మరో నాలుగు రోజులు గడిచిపోయినయ్. విషయం ఎక్కడ వేసిన గొంగళి అన్నట్లు .. అక్కడే ఉంది.

★★★

టెన్త్ క్లాస్ డ్యూటీకి వెళ్ళిన సూపరింటెండెంటు మేడం వస్తూనే " ఏమిటి ఆఫీసులో దొంగతనం జరిగిందంటా" అంటూ అడిగారు.

" అవును, మేడం" అంటూ విషయం వివరించాను. ఆ తర్వాత శెలవు మీద వెళ్ళిన వేణుగోపాల్ కూడా తిరిగి వచ్చాడు .

అతనికీ విషయం చేరిపోయింది. కాస్సేపటికి " నా జీతం" అంటూ వచ్చాడు.

" ఇలా జరిగింది వేణుగోపాల్" అంటూ కథ చెప్పాను.

" దానికి నేనేం చేస్తాను మేడం గారూ!" అన్నాడు. ఎలా అయినా నా జీతం నాకు ఇవ్వాలన్నట్లు.

అదీ నిజమే, పోయిన దానికి .. ఊరిలో లేని మనిషి ఏం చెయ్యగలడు?

" ఒక పని చెయ్యి

ఇన్ని రోజులైనా విషయం

కొలిక్కి రాలేదు. ఆఫీసులో ఏ ఎంక్వయిరీ జరగలేదు. నువ్వు .. సార్ దగ్గరికి వెళ్లి 'ఆమె' నా జీవితం ఇవ్వడం లేదు, అంటూ నా మీద 'కంప్లెంట్' చెయ్యి అప్పుడైనా విషయం కదులుతుందేమో చూద్దాం" అంటూ ఓ సలహా ఇచ్చాను.

అతను కాస్త తటపటాయించినా గత్యంతరం లేక నేను చెప్పినట్టే చేశాడు.

అందుకు మా ఆఫీసరుగారు నన్ను పిలిచి " ఏమిటీ " అన్నారు చాలా కొత్తగా.

" డబ్బు దొరకలేదు. సార్! " అన్నాను మాటలు తడుముకుంటున్నట్లు.

" అంటే, అతనికి జీతం పే చేయరా?" సూటిగా అడిగారు.

ఏం చెప్పాలో తెలీలేదు.

" ఎలాగోలా చేసి అతనికి జీతం పే చేయండి, ఆ కవర్లో అసలు డబ్బులు ఉన్నాయో! లేవో! నాకు తెలియదు. నేను చూడలేదు. మీరు డబ్బులు 'లేకుండా చేసి .. పోయాయని ' అంటున్నారేమో! నాకు ఏం తెలుసు? ఒకవేళ మీరు అతనికి జీతం పే చేయకపోతే .. నేనే 'మీ మీద' పోలీస్ కంప్లెంట్ ఇవ్వాల్సి ఉంటుంది" అంటూ అవడంతో .. నేను ఖంగుతిన్నాను. అది ఊహించని షాకు.

" సార్! " అన్నాను దెబ్బతిన్నట్లు. వేణుగోపాల్ నా వైపు ఇబ్బందిగా చూసాడు.

ఆఫీసరుగారు ఇలా అంటారని అనుకోలేదు. ఎలాగైనా పోయిన డబ్బు 'తిరిగి రప్పిస్తారానే' గుడ్డి నమ్మకంతో ఉన్నాను. ఆఫీసరుగారు నా పక్షం అన్న .. ఆశ జారిపోయింది.

"మూడు వేలు అంటే, 'నాకు' పదిహేను రోజుల జీతం సార్! " అన్నాను ఎలానో గొంతు పెగల్చుకుని .

" అది ఆఫీసుకి అనవసరం" చాలా నిష్కర్షగా తన నిర్ణయం తెలియచేసారు.

★★★

కొద్ది రోజులుగా ఇంట్లోనూ ఇదే చర్చ.

మా శ్రీవారు అన్నారు " ఆఫీసులో అనవసరంగా గొడవలు పెట్టుకోకు, చిన్న విషయం పెద్దది అయిపోతుంది. ఇంట్లో నుంచి డబ్బు తీసుకువెళ్లి కట్టేసెయ్యి" అంటూ.

చివరికి అదే జరిగింది, వేణుగోపాల్ కి జీతం ఇచ్చేసాను.

ఆఫీసర్ గారు చాలా నమ్మకంగా మాట్లాడి, చివరి నిమిషంలో .. ఇలా రివర్సు అయిపోవడం నన్ను చాలా ఇబ్బంది పెట్టింది. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలీలేదు.

చాలా 'అప్సెట్' అయిపోయాను. మూడు సంవత్సరాల పరిచయంలో నేనేంటో అతనికి తెలీలేదా? అన్నట్లు. డబ్బు పోయిన వెంటనే, ఓ సారి .. మా పై ఆఫీసు .. డివిజనల్ ఆఫీసుకి వెళ్ళి జరిగిన విషయం చెప్పాను. " మీ ఆఫీసులో ఇంతకుముందు కూడా ఒక 'తెఫ్ట్' కేసు జరిగింది. ఇది రెండోది అన్నమాట" అంటూ అవతలి వాళ్ళు ఓదార్చారు తప్ప నా సమస్యకు పరిష్కారం ఏమీ దొరకలేదు.

అందుకే ఈసారి, జిల్లా కలెక్టర్ గారికి తెలియజేయాలి అనుకున్నాను.

★★★

" మా ఆఫీసరుగారు, ఒక్కసారి కూడా ఆఫీసులో మీటింగ్ పెట్టి డబ్బు ఎలా పోయింది? అని ఎవ్వరినీ అడగలేదు. నేను అటెండరు ఆచార్యులు పేరు సూచించినా .. ఇద్దరిదీ, ఒకే 'సామాజిక వర్గం' కావడంతో .. కనీస విచారణ జరపలేదు. దగ్గరతనానికి ప్రాధాన్యం ఇచ్చి 'అతన్ని' కాపాడడం కోసం, నన్ను ఇబ్బంది పెట్టారు. ఇంట్లోంచి డబ్బు తీసుకువెళ్లి కట్టాను. నా డబ్బు నాకు తిరిగి వస్తుందని కాదు, జరిగిన విషయం తమ దృష్టికి రావాలని తెలియజేస్తున్నాను" అంటూ కలెక్టర్ గారికి ఒక రిపోర్ట్ రాసి, రిజిస్టర్ పోస్ట్ చేశాను.

★★★

వారం రోజుల తర్వాత విషయం 'సీను' లోకి వచ్చింది.

ఆరోజు .. ఆఫీసర్ల కాన్ఫరెన్సు పూర్తయిన తర్వాత కలెక్టర్ గారు, మా ఆఫీసర్ గారిని పిలిచి " ఏమిటిది?' అంటూ నా కంప్లైంట్ చేతిలో పెట్టారట.

అంతా చదివి .. జరిగింది చెప్పారట.

" ఈ విషయం మీ డివిజనల్ ఆఫీసర్, కాకినాడ గారికి ఇస్తున్నాను. ఎంక్వైరీ చేయమని" అంటూ అక్కడే ఉన్న డివిజనల్ ఆఫీసర్ 'ధనుంజయ' గారి చేతిలో పెట్టారట ఆ కాగితాన్ని .

ఆ మర్నాడు .. సూపరింటెండెంటుని ముందు పెట్టుకుని .. కోపంతో ఊగిపోయారు మా ఆఫీసరుగారు.

" చూసారా! ఈమె 'నామీద' కంప్లైంట్ చేసింది కలెక్టర్ గారికి. నేను సరిగ్గా ఎంక్వయిరీ చేయకుండానే, ఆమెతో డబ్బు కట్టించాడట. కంప్లైంట్ చేయగలిగే తెలివితేటలు ఈమెకు మాత్రమే ఉన్నాయా? మనమూ చేద్దాం, ఈమె మీద కంప్లైంట్. ఈమె చేసిన పనికి .. అందరిలోనూ, నా తల కొట్టేసినట్లు అయ్యింది " అంటూ.
కొన్ని విషయాల్లో నాకు తల పొగరు అన్నట్టుగానే అనుకుంటారు ఆఫీసులో .. రూల్స్ మాట్లాడతానని.
" అంతే! మన మీద కంప్లైంట్ చేస్తే, మనం మాత్రం ఊరుకుంటామా ! ఏంటి? అలాగే చేద్దాం" అంది ఆవిడ తన వంతు సహకారం అందించే దానిలాగా. ఆవిడ నాకు పూర్తిగా వ్యతిరేకం. నేనంటే ఆవిడ నిప్పులు తొక్కినట్లే ఉండేది.

వాళ్ళ మాటల్ని బట్టి, నా అప్లికేషన్ కలెక్టరుగారు 'చూశారన్న' సంతోషం కలిగింది నాకు. నా డబ్బు నాకు తిరిగి వస్తుందని కాదు. జరిగిన అన్యాయం బయట ప్రపంచానికి తెలియచెయ్యాలని.

అనుకున్నట్టుగానే ..
వారం తర్వాత డివిజనల్ ఆఫీసరు ధనుంజయగారు మా ఆఫీసుకి వచ్చారు.

ఆఫీస్ అంతా చాలా అలర్ట్ గా ఉంది. 'నన్నేం పిలిచి అడుగుతారో నన్నసంశయం నాలోనూ ఉంది'.

కానీ అలా ఏం జరగలేదు.

వచ్చిన కాసేపటికే .. మా మండలం, పక్కనే 'పది కిలోమీటర్ల' దూరంలో ఉన్న కేంద్రపాలిత ప్రాంతం అయిన 'యానాం' వెళ్ళే ప్రోగ్రాం పెట్టుకున్నారు.


వెంట మా ఆఫీసరుగారూ అనుసరించారు.

అది మొదలు ..

వారానికి ఓసారి అయినా ధనుంజయగారు ఏదో వంకన మా ఆఫీస్ వైపు వస్తూనే ఉన్నారు. యానాం ప్రోగ్రాం వేసుకుంటూనే ఉన్నారు.

మొదట్లో మా ఆఫీసర్ గారు వెంట వెళ్లినా తరువాత .. తరువాత ఏదో ఆర్. ఐ కి ఎంగేజ్ చేసేస్తున్నారు.
చివరికి తెలిసిందే ఏమంటే, అతను 'మందు ప్రియుడు ' ఆంధ్రాలో కన్నా యానాంలో అయితే చవుక.
ఓ సారి 'ఆర్ ఐ' భీమరాజు ఆవేదన పడితే, తెలిసింది.

" మన డివిజనల్ ఆఫీసరుగారికి .. ఎవరు ఎంత ఖర్చు పెట్టినా అనవసరం. యానాం గవర్నమెంట్ గెస్ట్ హౌస్ లో .. మన గవర్నమెంటు కోసం కోసం ఒక రూమ్ ఉంటుంది. ముందుగా బుక్ చేసి, ఉంచడంతో .. కారు దిగి, తలవంచుకొని రూమ్ లోకి వెళ్తారు .. పని పూర్తవగానే తలవంచుకొని బయటకు వచ్చి 'కారు'లో కూర్చుంటారు .. అంతే.
లోపలికి 'మందు బాటిల్' పంపించి, బయట ఉన్న స్టాఫ్, సీ.సీ, డ్రైవరూ, అటెండరుకి స్నాక్సూ, కూల్డ్రింక్సూ సప్లయ్ చెయ్యాలి .. ఆఖరుకి మంచి నీళ్ళ బాటిల్స్ తో సహా. ఆఫీసులో పోయిన డబ్బు కన్నా.. పెట్టుకునే ఖర్చే ఎక్కువ అయిపోయింది" అంటూ .
మా ఆఫీసరు స్వామి గారు 'కనీసం' విచారణ చేయలేదన్న కారణంగా .. నేను ఆ విధంగా పైకి కంప్లైంట్ చేశానే గాని .. అది మరొకరికి 'ఈ' విధంగా ఉపయోగపడుతుందని అనుకున్నానా?
అప్పుడు అలా జరిగితే .. ఇప్పుడు ఇలా జరుగుతుంది. ఏదీ మన చేతుల్లో లేదు. అంతా నిమిత్త మాత్రం అన్నట్లు. ★★★



# త్రిపురాసుర వృత్తాంతం



ఆచార్య ఇరపని
మాధవి

ఆ మాటలకు దేవతలు,మునులు చాలా సంతోషించారు. అప్పుడు పరమేశ్వరుడితో బ్రహ్మదేవుడు “ నీవు నన్ను ప్రజాపతి పదవిలో నియమించావు. అందువల్ల ఆ పదవిలో ఉన్న కారణం చేత తగిన తపస్సు చేశారు కనుక నాకు గల స్వాతంత్ర్యంతో ముగ్గురు రాక్షసులకు మూడు అభేద్య నగరాలు ఉండేలా వరం ఇచ్చాను, వాటి వల్ల వారు ముగ్గురు ముల్లోకాలను భయంకరంగా ఆక్రమిస్తూ ఆయా లోకాలకు పీడ కలిగిస్తున్నారు. అది మాన్పించే శక్తి ఇతరులకు లేదు, వారిని వెంటనే నువ్వు నాశనం చెయ్యాలి, ఈ మునులు, దేవతలు, నేను నిన్ను ఆశ్రయించాము, నీ రక్షణ కోరుతున్నాము, నీవు దయతో మమ్ములను ఆదుకోవాలి. నీవు సకల ప్రాణులకు రక్షకుడివి, పోషకుడివి కూడాను. కనుక లోకాలను రక్షించగలవారు కానీ, రక్షించవలసిన వారు కానీ నీవు తప్పితే ఇతరులు లేరు” అన్నాడు.

ఇలా బ్రహ్మదేవుడు చెప్పేసరికి ఆ పరమేశ్వరుడు " ఆ రాక్షసులు వధింపదగినవారే, అయితే వారు బలం కలవాళ్ళు, వారు నేను ఒంటరిగా సంహరించడానికి ప్రయత్నించలేను, నా పరాక్రమంలోనూ, శక్తిలోను అన్ని విధాల రక్షింపబడవలసిన వాళ్ళం మేము, కనుక రక్షించు" అన్నారు. ఆ జగన్నాథుడు " నేను దేవతల పట్ల రాక్షసుల పట్ల సమ భావంతో ప్రవర్తిస్తూ ఉంటాను. మీ ఇద్దరి విషయంలోనే కాదు, సమస్త ప్రాణుల పట్లను సమభావంతో చేరుకునేటట్లు చేయండి" అని చెప్పి "ఇంకా ఒక సంగతి చెబుతున్నాను, అదీ కాక ఈ లోకాలకు అన్నింటికీ పశుభావం కలగాలి, నాకు పశుపతి భావం కలగాలి. ఇలా అవి కలిగినందువలన పశువులను చంపటం మూలంగా వచ్చే పాపం నాకు రాకుండా ఉంటుంది.



సగం మీకు ఇస్తాను, వాటితో మీరందరూ ఏకమై ఆ రాక్షసులను సంహరించండి" అన్నాడు. అప్పుడు ఆ దేవతలు "మా పరాక్రమానికి, శక్తికి రెండు ఇంతలుంటాయి ఆ రాక్షసుల పరాక్రమం,శక్తి. కనుక వాళ్ళు మా చేతిలో చావరు. అదీకాక నీ పరాక్రమాన్ని, శక్తిని మేము మోయగలమా, మాకు అంత శక్తి లేదు, కనుక మా అందరి పరాక్రమంలో, శక్తిలో సగం నీవే తీసుకొని, నీవే వారిని సంహరించు, మమ్మల్ని అన్ని విధాలా రక్షించవలసినవాడవు నీవు, ఉన్నందువలన నాకు శివుడు అనే పేరు సమస్త లోకాలు మన్నించేటట్లు ఉంటుంది. అయినా నిరంతరం పరపీడా కరమైన పనులు చేసే మరీ బుద్ధిహీనులైన వారిని సంహరించడానికి ప్రయత్నించడమే యుక్తం. మీరు ధర్మ ప్రకారంగా నడుచుకునేవారని పేరుపొందినవారు. ఇటువంటి మీకు అపకారం చేస్తున్న ఆ రాక్షసులను సంహరించి, మీకు సంతోషం కలిగిస్తాను. కనుక మీరంతా మీ మీ పరాక్రమంలోని సగభాగం, శరీరబలంలోని సగభాగం ఇచ్చి, అవి నన్ను నా కొరకు దివ్యమైన రథం, సారథి, అశ్వాలు, ధనుస్సు, భాణం నిర్మించి ఇవ్వండి. అలా అయితే రాక్షసుల పురదుర్గాలు నా చేత ధ్వంసమవుతాయి" అన్నాడు. అది విని దేవతలు పశుత్వం కలగటం గురించి జంకుగొంకులతో విషాదగ్రస్తులైన వైఖరి తెలుసుకొని శివుడు " మీరేమీ భయపడవద్దు, పశుత్వం నుంచి విముక్తి లభించే విధానం ఉన్నది వినండి. పాశుపతవ్రతం ఆచరించినందువలన పశుత్వం నుంచి విడుదల కలుగుతుంది,

ఆ వ్రతం 12 సంవత్సరాలు ఆచరించాలి. చేసే వారికి గల శ్రద్ధకు తగినట్లు ఒక సంవత్సరం అయినా, ఆరు నెలలైనా, రెండు నెలలైనా, ఒక నెలైనా, 12 దినాలైనా ఫలాన్ని ఇస్తుంది " అని చెప్పాడు. వారు అలాగే అని లోకాలకు పశుత్వం, లోకేశ్వరుడు అయిన పరమేశ్వరుడికి పశుపతిత్వము కలగడానికి ఒప్పుకున్నారు. ఆ మహా మనస్విని పశుపతివి అన్నారు. తమ తమ పరాక్రమం నుండి, శరీర బలం నుండి సగ భాగం ఆయనకు సమర్పించారు. వాటిని ఆయన స్వీకరించి ఎక్కువగా ప్రకాశించాడు. ఆ మహాదేవుని దేవతలు తగిన వైభవంతో త్రిపుర సంహారానికి అభిషిక్తుడిని చేశారు. త్వష్టతో మహాదేవుడికి ఒక రథం, దానికి ఆయనకు ఈ మహాకార్యానికి తగిన పనిముట్లు నిర్మించమన్నారు. ఆ విశ్వకర్మ తపఃశక్తి మహాత్మ్యం వల్ల గొప్పవాడయ్యాడు కనుక మిక్కిలి శ్రద్ధతో, నేర్పుతో భూమిని రథం చేశాడు, సూర్యచంద్రులను దాని చక్రాలుగా ఉంచాడు. సముద్రాన్ని ఇరుసు చేశాడు. హిమాచల, వింధ్యాచల, అస్తాచల, ఉదయాచలాలను బలమైన భాగాలుగా పెట్టాడు. త్రేతాగ్నులను త్రివేణుకములనే భాగాలుగా ఉంచాడు. మేరు పర్వతాన్ని జెండాగా ఉంచాడు. వేదాలు గుర్రాలుగా, సంవత్సరం ధనుస్సుగా, బాణం విష్ణువుగా మన్ననతో సమకూర్చాడు.

ఇలా చరాచర ప్రాణమయమైన విశ్వరూపంతో ప్రకాశిస్తున్న ఆ రథాన్ని చూశాడు నిటలాక్షుడు. కవచం తొడుక్కున్నాడు, విల్లు పట్టుకున్నాడు, అమ్ము తీసుకున్నాడు. రాక్షసులను గడగడలాడించే పూనికతో రథం ఎక్కాడు. దానిమీద వృషభ చిహ్నం గల జెండా అందగిస్తుంది. అప్సరసలు నృత్యం చేస్తూ, పాటలు పాడుతూ సంతోషంతో, ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. మునీశ్వరులు అనేక విధాలుగా బాగా స్తోత్రాలు చేస్తున్నారు. అప్పుడు దేవ నాయకులను చూచి చిరునవ్వు నవ్వుతూ శివుడు సారథి ఎవడు అని అడిగాడు. దేవతలు నీకు నచ్చిన వాడిని నీవే దయతో తీసుకొని రథం తోలుకో అన్నారు. అలా అనగా ఆ దేవుడైన శివుడు నాకంటే గొప్పవాడెవడో ఆలోచించి మీరే తెలుసుకొని అతడిని నాకు సారథిగా నియమించండి అని చెప్పాడు. అప్పుడు దేవతలు మహామునులందరిని ఒకచోట సమావేశపరిచి, మిక్కిలి వినయంతో బ్రహ్మదేవుడి సమక్షానికి వెళ్లారు. భక్తితో నమస్కారం చేశారు. "దేవా! నీలకంఠుడు నీ పట్లను నీవు కారణంగా మాపట్లను సంతుష్టుడయ్యాడు. నీ ఆజ్ఞతో మేము ఆయనకు ఒక రథం, తగిన పనిముట్లు సమకూర్చి పెట్టాము. సారథి ఒక్కడే దొరకలేదు. అది ఎలా అంటే సారథి అయినవాడు బలంలో కానీ, మానసిక బలంలో కానీ రథికుడి కంటే గొప్పవాడు కావాలి. రథం భూమి, గుర్రాలు వేదాలు, రథికుడు రుద్రుడు అయినప్పుడు తగిన సారథి అంత తేలికగా ఎలా దొరుకుతాడు, నీవు గుణాధికుడవు, కనుక నీవే సారథివి కావాలి. మేము రాక్షసుల భయంతో భ్రాంతులమైపోయాము, మమ్ములను రక్షించు, మాకు రక్షకుడవు నీవే, నీ అనుగ్రహంతో బ్రతుకుతాము" అని నమస్కరించేసరికి మిక్కిలి ఆదరంతో వారిని పైకి లేవదీసి బ్రహ్మదేవుడు కరుణతో చూసి "మీరు నిజమే చెప్పారు, రథికుడి కంటే అధికమైన నేర్పు,బలం తనకుంటేనే సారథి యుద్ధాలలో రథికుడిని గెలిపిస్తాడు. కనుక నా తెలివిని, భుజబలాన్ని రుద్రుడు మెచ్చుకునే విధంగా, దానవులు భయపడేటట్లు,ఆశ్చర్యపోయేటట్లు వేదాశ్వాలను తోలుతాను" అని చెప్పి దేవతలందరూ సంతోషించేటట్లు తన చేతిలో ఉన్న కమండలం ఒకచోట పెట్టాడు. తల మీది జడల ముడి బిగించాడు. మొలను వలువగా ఉన్న జింకతోలు గట్టిగా కట్టాడు, కమ్చీ కర్ర తీసుకున్నాడు, అలా తొట్టిలోకి ఎక్కాడు. ఇలా దేవతలు బ్రహ్మదేవుడిచేత శంకరుడి రథం తోలించారు. ఆ గుర్రాలు ఆ మహానుభావులు ఇద్దరినీ మోయలేక పడిపోయాయి. అప్పుడు బ్రహ్మ శక్తియుక్తులతో గుర్రాల పగ్గాలు పట్టి వాటిని పైకి లేవదీశాడు. అలా ఎత్తి ఆ గుర్రాలకు ఇంకా వీరత్వము శౌర్యము కలిగేటట్లు దయ చూపించాడు. రథం నడిపించాడు . అప్పుడు

కామాంతకుడైన హరుడు బ్రహ్మ యొక్క నేర్పును ప్రశంసించాడు. "ఆ రాక్షసుల పట్టణాల వైపు రథం తోలుము, ఈ వేళ లోకాల ఆపద, బాధ తొలగిస్తాను, నా చేతి బలం చూడు" అన్నాడు. ఆ మహాసారథి బ్రహ్మదేవుడు మనోవేగం, మారుతబలంగల ఆ వేదాలనే గుర్రాలను తోలాడు. అధర్వుడు, అంగీరసుడు అనే మునులు చక్ర రక్షకులుగా వచ్చారు. అలా ఆ రథం త్రిపురాల మీదకి వెళ్లేసరికి ఆ ప్రథమ రథికుడు హరుడు కోపంతో వెలిగిపోతూ ధనుస్సు ఎక్కుపెట్టాడు. అల్లెత్రాటికి అమ్ము సంధించాడు. దానికి పాశుపతాస్త్రం జోడించాడు. మనసులో త్రిపురాలను తలుచుకున్నాడు, వెంటనే అవి ఒక చోటికి చేరాయి. ఋషులు, దేవతలు జైజై అంటూ ప్రశంసించారు. అప్పుడు రుద్రుడు నారిలాగి ప్రయోగించాడు. దానితో దానవులతో సహా త్రిపురాలు తగలబడి బూడిద అయిపోయి పడమటి కడలిలో పడ్డాయి. ఆ మహాగ్ని లోకాలను దహింపసాగింది. త్రిపుర హరుడు దానిని ఆర్పివేశాడు. సమస్త ప్రాణులు సంతోషించాయి. అప్పుడు దేవతలు, మునులు కావాలనుకున్న పని అయిపోయింది గనుక భూతపతిని, ఉమాపతిని బాగా స్తుతించారు. ఆయన అనుమతితో అందరూ తమ తమ నివాసాలకు వెళ్ళారు.

★★★



## .కోటి విలువ చేసే గాలిపటం

:

సంక్రాంతి వచ్చిందంటే భాగ్యనగరంలో రంగురంగుల పతంగులను చిన్నా పెద్ద తేడా లేకుండా ఎగురవేస్తారనే విషయం తెలిసిందే. అయితే, తాజాగా హైదరాబాద్ పాత బస్తీలో రూ. కోటి కైట్ (golden kite) కలకలం రేపుతోంది. తాజాగా సోషల్ మీడియాలో కోటి రూపాయల గోల్డ్ కైట్ అంటూ గోల్డ్ మ్యాన్ అనే వ్యక్తి ఓ వీడియోలో చెప్పుకొచ్చాడు. మరోవైపు రూ. 40 లక్షల మాంజా అంటూ ప్రచారం చేశాడు. ఈ ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కోటి రూపాయల పతంగి కోసం హైదరాబాద్ పాతబస్తీలోని యువత ఎగబడే అవకాశం ఉందన్నారు. అయితే, గోల్డెన్ కైట్ కోసం కొట్టుకుని తొక్కిసలాట జరిగి ఎవరైనా చనిపోతే బాధ్యులు ఎవరంటూ సోషల్ మీడియాలో చర్చ జరిగింది. గోల్డ్ మెన్ను అరెస్టు చేసి, కోటి రూపాయల కైట్ను స్వాధీనం చేసుకోవాలని నెటిజన్లు పోలీసులను డిమాండ్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఫేమస్ అవ్వడం కోసం ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తుంటారని గోల్డ్మెన్ అనే వ్యక్తిపై నెటిజన్లు మండిపడుతున్నారు.

# సప్తపదులు










ఖండించు

దండించు

క్షమించు, సరిదిద్దు ,ప్రోత్సహించు శ్రమించి పండించు.

పొన్నాడ వరాహ నరసింహులు,ఆముదాలవలస

బుద్దులు

సుద్దులు

ప్రాయం చిన్నదయితే పాటించాలి యుక్తమైన హద్దులు

విత్తనాల విజయ కుమార్,హైదరాబాద్

రచించితిని

వచించితిని

ప్రకృతిని అందంగా వర్ణిస్తూ కవితలల్లి పరవశించితిని

జె.విజయకుమారి,విశాఖపట్నం

ఏడడుగులు

మూడడుగులు

జాగాలెన్ని సొంతమైనా చివరికి దక్కేది ఆరడుగులు

ఇలపావులూరి రాజ్యలక్ష్మి హైదరాబాద్

చినుకు

కునుకు

రెండూ లేక దిగాలుగా రైతు బ్రతుకు

టివిఎస్ రామకృష్ణ ఆచార్యులు ,కెనడా

ఇత్తడి

పుత్తడి

రంగును జూసి మోసపోతే బ్రతుకు చిత్తడి .

వి.సుబ్బారావు,,పెందుర్తి,వైజాగ్.

క్రోధం

విరోధం

జీవితంలో శాంతికీ, సౌఖ్యానికీ, ఎదగడానికీ అవరోధం

శాంతమూర్తి ,హైదరాబాద్

గర్వం

సర్వం

ఇదే కదా మహాభారత మొదటి పర్వం ...

యాంబాకం,హైదరాబాద్

# సప్తపదులు






మోదం

ప్రమోదం

ఎదటివారిని కించపరచని వినోదం ఆమోదం!

గోపరాజు వెంకట సూర్యనారాయణ ,హైదరాబాద్.

కాంతము

శాంతము

అరవైలో అయినా ఆమే అతనికి అయస్కాంతము

శేష శైలజ( శైలి ), విశాఖపట్నం

ద్వయము

సమన్వయము

ఉపాయమ్ము ఎఱిగినవారు ఎన్నడూ ఒప్పుకోరు పరాజయము*

శ్రీవిశ్వేశ్వరశర్మా–భువనేశ్వరము–ఒడిశా

రవి

కవి

సంస్కృతకవులలో అర్థగౌరవాన్ని కావ్యంలో నింపినవాడు భారవి

సూర్యదేవర రవికుమార్ గుంటూరు

రవి

కవి

తేజస్సుకు అస్తమయం ఉండదు ఏ భువి

మాధవి మేళ్ళచెర్వు గుంటూరు

వాడకు

ఓడకు

నిజమైనా నిష్ఠూరమైనా ఎప్పుడూ సత్యాన్ని వీడకు....!!

శ్రీమతి భారతీకృష్ణ,హైదరాబాద్

ఉత్సవం

మహోత్సవం

కన్నుల పండువగా తిరుమల రాయని..దీపోత్సవం.

కాకర్ల చెంచలరావు ,ఒంగోలు

అంబరం

సంబరం

జగత్తులో ఎంతగానో కష్టమైనది – పూర్తిగానిరాడంబరం

కే. ఎం. కే. మూర్తి సికింద్రాబాద్










సీరియల్

# నయన



శ్రీ విజయదుర్గ

"నయన! ఐ లవ్ యు! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. మన మధ్య ఏ దాపరకము లేకుండా... ఈ విషయం నీకు చెప్పాలని నీ ముసుగు తీయించాను. నువ్వు ఇప్పుడే విరిసిన తాజా కమలంలా ఉన్నావు. నిజంగా చాలా చాలా బాగున్నావు" అన్నాడు.

నయన సిగ్గుగా తలవంచి, అప్పటికే కెంపులుగా మారిన తన బుగ్గలను సుభాన్ కి చూపించలేక, సిగ్గుగా తల పక్కకు తిప్పుకుంది.

సుభాన్ నయన పరిస్థితిని అర్థం చేసుకుని, నయక కాస్త దూరం జరిగి నయన ముఖారవిందాన్ని, తన మనసులో నింపుకుంటూ కళ్ళు మూసుకున్నాడు.

అప్పటి వరకూ తన గుప్పిటలో దాచిన దానిని సుభాన్ ముందు ఉంచుతూ...

"సుభాన్! నేను నిన్ను ఒక కోరిక కోరతాను తీర్చగలవా!" అంది.

సుభాన్ వెంటనే, నయన వైపు తిరిగి తన ముఖాన్ని దోసిట్లోకి తీసుకుంటూ... "తప్పకుండా తీరుస్తాను. అది ఎంతటి కష్టమైనదైనా!" అన్నాడు.

నయన చిన్న నవ్వు నవ్వి, తన గుప్పెడం తెరిచి సుభాన్ కి చూపించి, ఇది నా నుదుటన పెడతావా?" అంది.

సుభాన్ షాక్ అయ్యి! "నుదుటన కుంకుమ పెట్టడం ఏమిటి?" అన్నాడు.

నయన కన్నీళ్ళతో, "నేనంటే నీకు ఇష్టం లేదా!" అంది.

"అది కాదు నయన! నువ్వంటే ఇష్టం లేక కాదు. ఇలా కుంకుమ పెట్టుకునేది హిందువులు కదా! మనం అలా పెట్టుకోముగా!" అన్నాడు.

నయన షాక్ గా కళ్ళు తెరిచి, సుభాన్ ఒక ముస్లిం అనే విషయాన్ని మర్చిపోయి తను తన నుదురు మీద కుంకుమ పెట్టు అనడం గుర్తుకు వచ్చి, వెంటనే ఆ చేతిని వెనక్కి తీసుకుని కళ్ళ నీళ్లు పెట్టుకుంది.

సుభాన్ కి ఏమీ అర్థం కాక, అప్పటి వరకు గమనించని నయన ముఖాన్ని తీక్షణంగా గమనించి, నయన రెండు కనుబొమ్మల మధ్యలో ఉదయించిన సూర్యుడిలా ఎర్రగా మెరుస్తూ ఉన్న బొట్టును చూసి షాక్ అయ్యి!

"నయన! నువ్వు మా వాళ్లు కాదా!" అన్నాడు.

నయన అడ్డంగా తల ఊపుతూ... కాదు అంది.

కాసేపు మౌనంగా ఉండిపోయిన సుభాన్! వెంటనే ఒక నిర్ణయానికి వచ్చి, నయన వెనక్కి తీసుకున్న చేతిని తన చేతిలోకి తీసుకుని గుప్పెట తెరిచి, అందులో ఉన్న కుంకుమను నయన నుదుటి మీద అలంకరించాడు.

నయన కళ్ళ నిండా సంతోషం నింపుకుని సుభాన్ వైపే చూసింది.

సుభాన్ అమాంతం నయనని హత్తుకుని, "నువ్వు ఏదైనా కానీ, నా ప్రాణంలో ప్రాణంగా కలిసి పోయావు. ఎవరు అడ్డు వచ్చినా నేను నిన్ను వదులుకోను" అన్నాడు.

సుభాన్ ఇచ్చిన ధైర్యంతో, నయన సుభాన్ ని మరింతగా హత్తుకుని, తన కళ్ళ నుండి జాలువారిన నీటిని స్వేచ్ఛగా విడిచిపెట్టింది.

ఇద్దరూ ఒకరి కౌగిలిలో ఒకరు మైమరిచి జగాన్నిమరిచారు. పక్షుల కిలకిలా రావాలికి ఇద్దరు కళ్ళు తెరిచి, ఒకరికి ఒకరు దూరం జరిగారు. నయన సిగ్గుతో తలవంచుకోగా... సుభాన్!

"ఇది నమ్మలేకపోతున్నాను. నువ్వు ఇలా ముసుగు వేసుకుని ఉండడంతో, మా వాళ్ళ అమ్మాయి అనుకున్నాను. కానీ, నీకు తెలుసుగా నేనేమిటో! అయినా నువ్వు నాతో స్నేహం చేశావు. నన్ను ఇష్టపడ్డావు. ఎంతో ఉన్నతమైన స్థానాన్ని ఇచ్చావు. మన చదువులు అవగానే, నేను మీ పెద్ద వాళ్లతో మాట్లాడుతాను. ఎన్ని అడ్డంకులు వచ్చినా! నీ చెయ్యి వీడను" అంటూ... నయన చేతిలో తన చేతిని వేసి నయన వేళ్ళతో పెనవేశాడు.

★★★ ★★★ ★★★

నయన సుభాన్ తోటి స్నేహంగా ఉండడం గమనించిన రాగిణి, ఒకానొక సమయంలో తన తండ్రి దగ్గర నయన విషయం చెప్పడంతో, రాగిణి తండ్రి రామాచారికి ఇదీ విషయమని తెలియజేశారు. కోపంతో ఊగిపోయిన రామాచారి! కూతురు సంగతి తేల్చాలని, కావాలనే, కూతురు గుడికి వెళ్తాను అనగానే ఒప్పుకుని పంపించి, వాళ్లని వెంబడిస్తూ వెళ్లారు. అలా వెళ్లిన ఆయనకి పార్కులో ఇద్దరూ ఒకరి కౌగిలో ఒకరు మైమరచి ఉండడం చూసి, తన సాంప్రదాయాలను మట్టి కలిపింది అని కూతురు మీద విపరీతమైన కోపంతో ఊగిపోతూ... తన వెంట తెచ్చుకున్న కత్తితో నయనను పొడిచారు. నయనకు అడ్డుగా వచ్చిన సుభాన్ ని కూడా పొడిచారు. ఇద్దరూ రక్తపు మడుగులో పడి ప్రాణాలు విడిచారు.

అప్పటి వరకూ ప్రశాంతంగా ఉన్న అక్కడి వాతావరణం, ఒక్కసారిగా గంభీరంగా మారిపోయింది. అక్కడున్న సెక్యూరిటీ పోలీసులకు ఇన్ఫార్మ్ చేసి రామాచారిని అరెస్ట్ చేయించారు.

అగ్రహారంలోని వాళ్లంతా...
అన్యమతస్థుడిని కూతురు పెళ్లి చేసుకుని పరువు మంట కలిపింది అని, సున్నితమైన మనసు కలిగి ఉండవలసిన వృత్తిలో ఉండి, ఇద్దరి ప్రాణాలను తీయడానికి కారణమైన రామాచారిని వారి సంఘం నుండి వెలివేస్తూ... రామాచారిని అవహేళన చేస్తూ అంతా నవ్వారు.

★★★ ★★★ ★★★

'లేదు అలా జరగడానికి వీల్లేదు ఈ విషయం ఎవరికీ తెలియకూడదు' అని కలవరిస్తూ కళ్ళు తెరిచి చుట్టూ చూసుకున్నారు.

నయన గురించి ఆలోచిస్తూ గుడిలో స్తంభానికి ఆనుకుని ఉండిపోయిన రామాచారి, ఒక్కసారిగా ఉలిక్కిపడి కళ్ళు తెరిచి చుట్టు చూసుకున్నారు. తాను గుడిలో ఉన్నానని తెలుసుకుని, ఒక్క క్షణం ఏమీ అర్థం కాలేదు.

'అంటే నయన, ఆ వ్యక్తితో కలిసి ఉండడం అంతా నా కల! అంటే అదంతా జరగలేదా! లేదు అలా జరగడానికి వీల్లేదు. అసలు ఈ విషయం ఎవరికీ తెలియడానికే వీల్లేదు. నా కూతురు చచ్చిపోయినా పర్వాలేదు. నాకు నా పరువే ముఖ్యం' అని, ఒక నిర్ణయానికి వచ్చి దేవుడి వైపు చూసి ఆయనకి నమస్కరించుకుని,

'తప్పైనా తప్పడం లేదు. నన్ను క్షమించండి. లోకులు అనే మాటలు వింటూ నేనే చస్తూ బ్రతకలేను. ఈ నిర్ణయమే సరి అయినది' అని గుడిలో ఒక పక్కగా ఉన్న గన్నేరు చెట్టు దగ్గరికి వెళ్లి ఆ చెట్టుకు ఉన్న కాయలను తెంపి వాటిని గుడిలోనే దేవుడికి గంధాన్ని అరగదీసే రాయి పై బాగా నూరి వాటి గుజ్జుని, ఆ రోజు దేవుడికి నైవేద్యాన్ని సమర్పించిన పొంగలిలో కలిపి ఆ గిన్నె మీద అరిటాకు మూత వేసుకుని ఎర్రబడ్డ కళ్ళతో ఇంటికి చేరుకున్నారు.

జయంతి యధావిధిగా నీళ్లు తీసుకుని భర్తకు ఎదురు వెళ్లింది.

భర్త చేతిలో ఉన్న నైవేద్యంన్ని అందుకోవడానికి చెయ్యి ముందుకు జాపిన జయంతి చేతిని పక్కకు తోసి,

"నయన ఏం చేస్తుంది?" అని అడిగారు.

"నయన బయటకు రాలేదు, తలనొప్పిగా ఉందంట" అని చెప్పారు.

"సరే అయితే," అని మంచి నీళ్లు తాగి ఆ నైవేద్యం ఉన్న గిన్నెను తీసుకుని నయన గదిలోకి అడుగు పెట్టారు.

రాత్రి అంతా నిద్రపోకుండా ఏడుస్తూ ఉన్న కారణంగా మొహం అంతా పీక్కుపోయి, ఎప్పుడూ ఎంతో ఆకర్షణీయంగా మెరుస్తూ ఉండే కన్నులు వాడిపోయి కనపడ్డాయి.

మనసులో ఒక్క క్షణం కన్న ప్రేమ పొంగుకు వచ్చి జాలి అనిపించినా... మరు క్షణమే వాటన్నిటినీ తన మతం మీద ఉన్న ప్రేమ కప్పి పుచ్చి,

"నయన!" అంటూ గంభీరంగా పలికారు.

శూన్యంలోకి చూస్తూ పరాకుగా ఉండిపోయిన నయన,

తండ్రి మాటకి ఉలిక్కిపడి ఒక్క ఉదుటన కూర్చుంది.

ఎదురుగా ఉన్న తండ్రిని చూసి ఓపిక లేకపోయినా... కష్టంగా లేచి నిలబడి,

"ఏంటి నాన్నగారు!" అంది.

రామాచారి తన చేతిలో ఉన్న గిన్నె వైపు ఒకసారి చూసి, నయన ముందుకి ఆ గిన్నెను చాపారు.

నయన ఎందుకు అన్నట్టుగా రామాచారి వైపు చూసే సరికి,

రామాచారి కూతురు కళ్ళల్లోకి చూడలేక తల తిప్పుకుని,

"దేవుని ప్రసాదం మొత్తం నీవే తిను" అంటూ కూతురి చేతికి అందించారు.

నయన నైవేద్యం గిన్నె అందుకుంటూ... తండ్రి చేయి వణకడం గమనించింది.

తండ్రి తన కోసం ప్రేమగా ఇస్తున్నాడని సంతోషంగా ఆ గిన్నెని అందుకుని,

"తప్పకుండా తింటాను నాన్న

గారు" అని ఆయన ముందే దానిని మూసి ఉంచి ఉన్న అరటి ఆకును పక్కకి తప్పించి, రెండు ముద్దలు ఆయన ముందే నోట్లో పెట్టుకుంది.

రామాచారి ఎంత కఠినంగా ఉన్నా... కూతురు తన కళ్ల ముందే తన స్వహస్తాలతో చేసి ఇచ్చిన విషాన్ని నోట్లో పెట్టుకుని తింటుంటే చూడలేక కళ్ళల్లో నీళ్లు తిరిగి బయటికి వచ్చి తన వాలు కుర్చీలో కూర్చున్నారు.

జయంతికి ఏమీ అర్థం కాకుండా ఉంది. 'ఎప్పుడు గుడి నుంచి నైవేద్యం తీసుకుని వచ్చినా... తన చేతికి ఇచ్చి భోజనంలో అందరికీ ముందుగా ప్రసాదం వడ్డించమంటారు. అలాంటిది ఈ రోజు కూతురికి ప్రత్యేకంగా ఇవ్వడం ఏంటో అర్థం కాలేదు. ఏమోలే నిన్న తనని బాధ పెట్టాను ఏమీ తినకుండా ఉంది అని అలా తెచ్చి ఇచ్చారు కాబోలు' అని అనుకుని కొద్దిపాటి సంతోషంతో రామాచారి భోజనానికి అన్నీ సిద్ధం చేశారు.

తండ్రి ప్రేమగా తెచ్చి ఇచ్చాడని ప్రసాదం గిన్నెలో కొంచెం కూడా వదలకుండా తృప్తిగా తిన్న నయనకి వెక్కిళ్లు మొదలయ్యాయి.

ఆ గిన్నెను తీసుకుని చెయ్యి కడుక్కుని మంచి నీళ్లు తాగుదాం అనుకుని గదిలో నుంచి బయటికి వచ్చిన తనకి తల తిరుగుతున్నట్టుగా అనిపించింది.

అయినా అలాగే ముందుకు నడుచుకుంటూ వచ్చి, హఠాత్తుగా గిన్నెను వదిలి నేల పై పడిపోయింది.

వంట గదిలో కూరలు సర్దుతూ ఉన్న జయంతి పరుగున నయన దగ్గరికి వచ్చి,

"అయ్యో! ఏం జరిగింది తల్లి అలా పడిపోయావేంటి?" అని కింద పడిన కూతురి తలని వడిలోకి తీసుకుని చంప పైన తడుతూ అడిగారు.

అప్పటికే నయన వెక్కుతూ కళ్ళు తేలేస్తూ ఉంటే, జయంతి అక్కడికి పది అడుగుల దూరంలోనే కూర్చున్న రామాచారిని

"ఏవండీ! త్వరగా రండి" అంటూ పిలిచింది.

భార్య అంత రోదిస్తూ కూతురికి ఏదో జరుగుతుంది అని పిలుస్తున్నా... రామాచారి చెవుల్లో సీసం పోసుకున్నట్టుగా కదలకుండా బొమ్మలా అలానే కూర్చుని ఉండిపోయాడు.

నయన వెతుక్కుతూ... వెతుక్కుతూ... ఒక రెండు నిమిషాలకి నోట్లో నుంచి రక్తం వస్తూ ఉండటం చూసి జయంతి

"ఏవండీ!" అంటూ పెద్దగా కేకలు వేస్తూ రామాచారి ని అరిచే సరికి,

రామాచారి కుర్చీలో నుంచి కోపంగా లేచి,

"ఎందుకలా అరుస్తున్నావు? అది ఇంకా చచ్చిపోలేదు కదా! చచ్చిపోయిన తర్వాత అప్పుడు ఏడుద్దువు కాస్త ఓపిక పట్టు" అన్నారు.

భర్త మాటలకి జయంతికి గుండె ఆగినట్టుగా అయ్యింది.

"ఏం మాట్లాడుతున్నారండి? చచ్చిపోవడం ఏంటి? ఏం చేశారు నా కూతుర్ని? ఏం పెట్టారు? మర్యాదగా చెప్పండి" అని కూతుర్ని వదిలి, భర్త మెడలో ఉన్న ఉత్తర్యాన్ని పట్టుకుని నిలదీశారు.

అయినా కొయ్యలాగా కదలకుండా ఎటువైపో చూస్తూ నిలబడి ఉన్న రామాచారిని వెనక్కి తోసి,

"మీరు ఇంత కఠిన హృదయాలు అనుకోలేదండి. ఏం జరిగింది అనేది పూర్తిగా తెలుసుకోకుండా... అమ్మాయితో ఒక్క మాట మాట్లాడుకుండా ఇంత దారుణమైన నిర్ణయం తీసుకుంటారా? ఒక్కగానొక్క కూతురిని, నాకు కాకుండా చేస్తారా!" అని గుండెలవిసేలా ఏడుస్తూ... నయన పక్కకు చేరి,

"నా బంగారు తల్లి! నీ తండ్రి మాటకు విలువ ఇచ్చి నిన్ను ఇన్నాళ్లు కష్టపెట్టాను. నన్ను క్షమించు తల్లి! ఎప్పటికైనా ఆ మనిషిలో మార్పు రాకపోతుందా! నీ మీద లోలోపల దాచుకున్న ప్రేమని బయటికి చూపించకపోతారా అని ఎదురు చూశాను. నన్ను క్షమించు తల్లి! ఈ రోజు నీ ప్రాణాల మీదకు రావడానికి కారణం ఆయనే, నిన్ను నేను ఎలాగైనా బ్రతికించుకుంటాను" అంటూ బలవంతంగా కూతురిని పైకి లేపాలని ప్రయత్నిస్తూ విఫలమై అలానే లాక్కుంటూ కాస్త దూరం

తీసుకుని వచ్చారు.

'వద్దమ్మా! నన్ను ఇలాగే ఆ దేవుడి వద్దకు వెళ్ళిపోనివ్వు నాన్నగారి కోరికను నెరవేరనివ్వు అన్నట్టుగా...' తల్లి వైపే దీనంగా చూస్తూ నయన తుది శ్వాస విడిచింది.

కన్న కూతురు తన ఒడిలోనే కన్నుమూయడంతో, ప్రాణం లేని కూతురు శరీరాన్ని ఒడిలో ఉంచుకుని జయంతి తలబాదుకుంటూ ఏడ్చారు.

రామాచారి నిలబడిన చోటే ఉండిపోయి, కూతురు తుది శ్వాస విడిచింది అని తెలిసి ఒకే ఒక్క కన్నీటి బొట్టుని జార్చి అక్కడి నుంచి ముందుకు కదిలి,

నయన తిన్న నైవేద్యం గిన్నెను వంట గదిలోకి తీసుకుని వెళ్ళి దాన్ని శుభ్రంగా కడిగి పెట్టి ఒక తెల్లని వస్త్రాన్ని తీసుకుని వచ్చి, నయన ముఖాన్ని శుభ్రంగా తుడిచి తన నోటి వెంట వచ్చిన రక్తాన్ని శుభ్రంగా తుడిచారు. ఆ గుడ్డను పెరట్లోకి తీసుకుని వెళ్లి అగ్గి ముట్టించి మసి చేశారు.

భర్త చేస్తున్న పనిని బొమ్మలా చూస్తూ ఉండిపోయింది జయంతి.

జయంతి ఒడిలో ఉన్న నయనను తన భుజానికి ఎత్తుకుని నయన గదిలోకే తీసుకుని వెళ్లి తన మంచం మీద పడుకోబెట్టి, ఇంటి నుంచి బయటకు వచ్చారు రామాచారి.

తన ఇంటి ఎదురుగా ఉండే సీతారాంని పిలిచి, ఆందోళన నటిస్తూ...

"నా కూతురు నయన కళ్ళు తిరిగి పడిపోయింది. ఎంత లేపినా లేవడం లేదు కాస్త వచ్చి చూడు" అన్నారు.

సీతారాం ఆయుర్వేద వైద్యుడు అవడంతో, గబగబా రామాచారి ఇంట్లోకి పరుగు తీసి నయన గదిలోకి వెళ్లి నయన నాడి పట్టి పరీక్షించి చూశాడు.

అప్పటికే నయన హృదయ స్పందనలు ఆగిపోయి ఉండడంతో సీతారాంకి నయన నాడీ అందలేదు.

విషాన్న వదనంతో నయన చేతిని తిరిగి మంచం మీద పెట్టి పక్కనే ఉన్న రామాచారి భుజం మీద చెయ్యి వేసి,

"నన్ను క్షమించు రామం! ఆ దేవుడు నీకు అన్యాయం చేశాడు. నీ కూతురు నీకు దూరం అయిపోయింది" అని చెప్పాడు.

రామాచారి గొల్లున ఏడుస్తూ...

"అయ్యో నా తల్లి! నీకు అప్పుడే నూరేళ్లు నిండిపోయాయా!" అని కపట కన్నీళ్లు కార్చారు.

కూతురు ప్రాణం పోయింది. అని తెలిసినప్పుడే మూగబోయిన జయంతి, ఆ తర్వాత భర్త ప్రవర్తించిన తీరుకి పూర్తిగా మతిస్థిమితం కోల్పోయింది.

కూతురు పక్కనే కూర్చుని, కూతురి తలని నిమురుతూ...

"నిద్రలే తల్లీ! పాలు తాగుదువు" అంటూ మాట్లాడుతూ ఉండే సరికి సీతారాంకి అనుమానం వచ్చి,

జయంతిని పలకరిస్తూ మాట్లాడాడు.

"అన్నయ్య! నా కూతురు నిద్రపోతుంది. నువ్వు గట్టిగా మాట్లాడకు, వదినని అడిగి కాస్త మీ పెరట్లో ఉన్న గోంగూర కొంచెం ఇమ్మని చెప్పవా! నా కూతురికి గోంగూర పచ్చడి అంటే చాలా ఇష్టం చేసి పెట్టాలి" అని నోటికి ఏది వస్తే అది సంబంధం లేకుండా పిచ్చిపిచ్చిగా మాట్లాడుతూనే ఉన్నారు.

సీతారాంకి కూతురు హఠాత్ మరణంతో జయంతికి మతిభ్రమించింది అని అర్థం చేసుకుని, రామాచారికి ధైర్యం చెబుతూ... తనను తీసుకుని హాల్ లో కూర్చోబెట్టి బయటికి వచ్చి తన స్నేహితులందరినీ పిలుచుకుని వచ్చారు.

అందరూ కన్నీళ్లు పెట్టుకుంటూ... రామాచారి దగ్గరికి వచ్చి హాల్ లోనే చాప పరిచి దాని మీద మెత్త పరిచి నయనని తీసుకుని వచ్చి హాల్ లో చాప పైన పడుకోబెట్టారు.

నయనకి ఒంటి మీద ఎర్రని చీర కప్పి మెడలో పూల దండలు వేసి నుదుటిన ఎర్రని బొట్టు పెట్టి తల దగ్గర దీపం వెలిగించారు.

జయంతి కూతురికి కాస్త దూరంగా ఉన్న స్తంభానికి ఆనుకుని తనలో తనే ఏవేవో మాట్లాడుకుంటూ ఉంది. చుట్టు పక్కల వాళ్లంతా రామాచారి

ఇంటికి చేరుకుని,

'ఎంతో చక్కగా సాగిపోతున్న సంసారం ఒక్కసారిగా ఇలా అయిందా!' అంటూ ఎంతో బాధను జాలిని చూపించారు.

రామాచారిని తలుచుకుంటూ...

"అరెరే! ఉన్న ఒక్క కూతురు ప్రాణాలు కోల్పోయింది. కట్టుకున్న భార్యకి మతిభ్రమించింది. ఇప్పుడు ఈ వయసులో ఈయన పరిస్థితి ఏమిటి?" అని అంతా జాలి చూపించారు.

సాయంత్రం అయ్యే సరికి, సుభాన్ రామాచారి పళ్ళు తెమ్మనడం గుర్తుకు వచ్చి రామాచారి ఇంటికి పళ్ళ బుట్ట పట్టుకుని బయలుదేరాడు.

వీధి మొదలు వరకూ ఎంతో హుషారుగా వచ్చిన సుభాన్ కి, ఒక్కసారిగా గుండె భారం అవుతూ అడుగులు తడపడ్డాయి.

'ఇదేంటి ఇలా అవుతుంది' అని అనుకుంటూనే అడుగులో అడుగు వేసుకుంటూ రామాచారి ఇంటి దగ్గరికి చేసుకున్నాడు.

ఇంటి ముందు చాలా మంది జనాలు నిలబడి ఉండడం చూసి,

'ఇంత మంది ఉన్నారు ఏంటి? ఏం జరుగుతుంది?' అనుకుంటూ వారందరినీ తప్పించుకుని వీధి గుమ్మం దగ్గర నిలబడి తనకి అడ్డుగా ఉన్న వాళ్ళ భుజం మీద నుంచి తల ఎత్తి లోపలికి చూసాడు.

తనకి ఎర్రని చీర కప్పి నేల పై పడుకోబెట్టిన ఒక వ్యక్తి కనబడింది. తన ముఖానికి అడ్డుగా వేరే ఎవరో ఉండడంతో అది ఎవరూ అని అర్థం కాలేదు.

సుభాన్ కి ఒక్కసారిగా మనసంతా బాధ అనిపించింది. ఆ పక్క వాళ్ళను ఏం జరిగింది అని అడిగాడు.

ఆ వ్యక్తి కళ్ళ నీళ్లు పెట్టుకుంటూ...

"ఏం చెప్పమంటావు బాబు! ఒక్కగానొక్క కూతురు ఎంతో అపురూపంగా పెంచుకున్నాడు. ఏమైందో ఏంటో హఠాత్తుగా చనిపోయింది. కూతురు హఠాత్! మరణాన్ని తట్టుకోలేక ఆ తల్లికి మతిభ్రమించింది. రామాచారి ఒక్కసారిగా ఒంటరి అయిపోయాడు" అని చెప్పాడు.

సుభాన్ కి రామాచారిని తలుచుకుని చాలా బాధ అనిపించింది. వెనక్కి తిరిగి వెళ్ళిపోతూ... చనిపోయిన వాళ్ళు దేవుడితోటి సమానం అని వాళ్ళ బాబా చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి,

ఒక్కసారి దగ్గరకు వెళ్లి దండం పెట్టుకుని వెళ్దాం అని లోనికి వచ్చాడు.

గుమ్మంలో అడుగు పెట్టినప్పటి నుంచీ తన గుండె బరువెక్కిపోయి తనకి ఊపిరి అందనట్టుగా అయ్యి అడుగులు తబడ్డాయి. శరీరం తూలుతూఉన్నట్టు అయ్యి, ఒక్కొక్క అడుగు బలంగా కూడ తీసుకుని ముందుకు వేసి నేల పై పడుకోబెట్టిన నయన దగ్గరికి చేరుకున్నాడు.

కాళ్ల దగ్గర నుంచి అలా చూస్తూ తన ముఖం దగ్గరికి వచ్చే సరికి తన ముఖం మీద ముసుగు వేసి ఉంది. కళ్ళు మాత్రమే రెప్పలు మూసి కనిపిస్తున్నాయి.

ఒక్కసారిగా తన కాళ్ళ కింద భూమి కంపించినట్టు అయ్యింది. తన కళ్ళు సరిగా కనిపించకుండా ఉండకపోయే సరికి, తన కంటిని నింపేసిన కన్నీటిని తుడుచుకుని చేతులతో కళ్ళను రుద్దుకుని, కళ్ళను పెద్దగా తెరిచి తను చూస్తున్నది నిజమా కాదా! అని చూశాడు.

'వెంటనే అవును! ఆ కళ్ళే! కళ్ళు మూసి ఉన్నా ఆ కళ్ళను నేను గుర్తించగలను. అంటే, నా నయన సుందరి రామాచారి అమ్మాయా! ఏం జరిగింది? ఇంత హఠాత్తుగా ఇలా జరగడం ఏంటి? రెండు రోజుల క్రితం ఎంత హుషారుగా నా తోటి మాట్లాడింది' అని బాధపడుతూ నయన కాళ్ళను తన కళ్ళకు అద్దుకుని దండం పెట్టుకుని భారమైన గుండెతో ఇంటి నుంచి బయటికి వచ్చాడు.

(ఇంకా ఉంది )

కథ

# "అవని "

ఈదర శ్రీనివాస రెడ్డి



ఫోన్ అదే పనిగా మోగుతోంది. ఫోన్ ఎవరు చేస్తున్నారో అవనికి తెలుసు, అందుకనే కాల్ ఎత్తట్లేదు.

ఇప్పటికి అదే నంబరు నుండి నాలుగు సార్లు కాల్ వచ్చింది.

ఒక నిమిషం తరువాత ఫోన్ మోగటం ఆగిపోయింది,కాని అవని కళ్ళల్లో నుంచి కన్నీళ్లు కారటం మాత్రం ఆగలేదు .

కన్నీళ్ళు తుడుచుకుంటూ వంట పనిలో నిమగ్నమైపోయింది అవని .

"ఇదిగో మీనాన్న ఫోన్ చేస్తున్నాడు "అంటూ మధు తన ఫోన్ తీసుకొచ్చి ఇచ్చదు మాట్లడమన్నట్టు

పనిలోపడి చూసుకోలేదు, నేను చేస్తాలెండి" అద్దం ఆడింది అవని

"ఎమంత పని అని, మీ నాన్న ఫోన్ కూడా ఎత్తవా ? నువ్వేదో ఇక్కడ కష్ట పడిపోతున్నావు అని అందరూ అనుకోవాలా "
గొణుక్కుంటూ వెళ్ళి పోయాడు మధు

కొడుకు మాటలు విన్నదో లేదో కాని, హాల్లో నింపాదిగా పేపర్ వదువుతున్నది కాస్తా దూసుకుంటా వంట గదిలోకి వచ్చి, "మీ నాన్నకు ఫోన్ చెయ్య వద్దు అన్నానా.. "అంటూ అరిచినంత పని చేసింది అత్తగారు

* నేను చెయ్యలేదు , ఆయనే చేస్తున్నారు.... పొడి పొడిగా సమాధానం ఇచ్చింది అవని

"సిగ్గులేని జన్మలు, చెయ్యక ఏం వేస్తాయి.... " అంటా గొణుక్కుంటు వెళ్ళి పోయింది అవని అత్త గారు అఖిలాండేశ్వరి.

అవని కిది మామూలే, రోజు కొక్క సారన్నా ఏదో ఒక వంక పెట్టి అవనిని తిట్టటం పనిగా పెట్టుకుంది అవని అత్త. మామగారు మంచివాలే కాని అత్త నోటికి భయపడి తన నోరు తెరవటం ఎప్పుడో మానేశారు .

అవని పై అత్త అలా విరుచుకు పడటానికి దానికి కారణం, అవని ఓ దిగువ తరగతి రైతుకుటుంబం నుంచి వచ్చింది. మధు మాత్రం పుట్టటం తోనే బంగారపు మొలతాడుతో పుట్టాడు. బాగా ఉబ్బున్న వాళ్ళ కుటుంబం, ఒక్కడే కొడుపు అవ్వటం తో , అతి గారాబంగా పెరిగాడు మధు. కాలేజికి వచ్చేనాటికే అవ్వాల్సిన దురలవాట్లు అన్ని అలవాటు అవటం తో చదువుకు ఎగనాం పెట్టి బలాదూరుగా ఊరి మీద పడి తిరగడం మొదలు పెట్టాడు .

అటువంటి వాడికి పిల్లనెవరిస్తారు? ఎంత మందిని చూసినా మధు గురించి వాకాబు చేసి వెనక్కి వెళ్ళి పోయే వాళ్ళు.

ఇక లాభంలేదని, కట్నాలు గిట్నాలు ఏవి అవసరం లేదు , పిల్ల మంచిదైతే చాలు అనుకుంటున్న సమయంలో అవని సంబంధం వచ్చింది.

అవని తల్లిలేని పిల్ల, తల్లి చిన్న తనంలోనే చని పోవటంతో తండ్రి అన్నీ అయి అల్లారు ముద్దుగా పెంచాడు. డిగ్రీ వరకూ చదివించాడు. ఒక అయ్య చేతిలో పెడదామని చూస్తే, వాళ్ళు అడిగే కతనాలు ఇవ్వలేక తనలో తనే కుమిలి పోయేవాడు అవని తండ్రి మాధవ రావు .

అవని మాత్రం, "ఎందుకు నాన్న బాధ పడతావు , నేను వెళ్ళి పోతే నిన్ను ఎవరు చూస్తారు. అందుకే భగవంతుడు సంబంధాలేవి కుదర్చటం లేదు "అని నచ్చచెప్పేది తండ్రికి.

అ సమయంలో మధు సంబంధం రావటంతో కాదన లేక పోయాడు అవని తండ్రి. అదే అతను చేసిన పెద్ద తప్పు.

★★★

'ఆస్తి లేక పోయినా, పరువుగల కుటుంబం అని సంబంధం కలుపుకున్నాము. ఇప్పుడు ఆ పరువు కాస్తా గంగలో కలిపాడు మీ నాన్న" హాల్లో కూర్చున్న అత్తగారి గొంతు పక్క వీధిలోకి కూడా వినపడుతోంది .

ఆ మాటలు గుండెల్ని బద్దలు చేస్తున్నా, అత్తగారి సంగతి తెలుసు కాబట్టే, అవని మౌనంగా వుండి పోయింది.

'ఈ వయసులో ఆ ముసలోడికి ఇవన్నీ అవసరమా... ... ఇలాంటి పనులు చేసే ముందు వెనుక ముందు. ఆలోచించక్కర్లేదా?" ఇంట్లోకి అడుగు పెడుతున్న కొడుకును చూస్తూ అన్నది అఖిలాండేశ్వరి

ఎవరి గురించి అంటుందో అర్ధం కాక ," ఎవరి గురించి అమ్మా.. ఇంతలా అరుస్తున్నావు.. నాన్న గారేమన్నా తప్పు చేశారా?" అయోమయంతో అడిగాడు మధు

"మీనాన్నా, అంత ధైర్యం వుందా ?.... నేను భార్య మాట్లాడేది మీ మావగారి గురించి.. " జవాబిచ్చింది

"మామగారా... అయనేం చేశారు..."

'ఏం చేశాడో నీ పెళ్ళాన్నే అడుగు.. "సమాధానం చెప్పుకుంగా విసవిస నడుచుకుంటా వంట గదిలోకి వెళ్ళిపోయింది ఎదో పని ఉన్నట్టు

బెడ్రుము లోకి వస్తూ,' ఏమైంది, ఏం చేశాడు మీ న్నా.. అమ్మ అంతలా అరుస్తుంది" అవనిని చూస్తూ అడిగాడు మధు

'మీ అమ్మగారి సంగతి తెలిసిందేగా .. అయిన దానికి కానిదానికి గొంతుంది కదా అని అరవడం అలవాటయి పోయింది' n వస్తున్న

కోపాన్ని దిగమింగుకుంటూ జవాబిచ్చింది

'అంటే ఏమి జరగకుండానే అరుస్తుందా ఊరికినే."అనుమానంగా అడిగాడు

"ఏమి జరగలేదని నేనలేదే.... "

'మరి అసలేం జరిగిందో చెప్పి ఏడువు "అన్నాడు తీవ్రమైన స్వరం తో

ముందు ఏంచెప్పాలో అవనికి అర్థం కాలేదు, ఒక క్షణం తరువాత ఏదైతే అది అయ్యిందని 'నాన్న రెండో పెళ్ళి చేసుకున్నాడు.. " నెమ్మదిగా జవాబిచ్చింది అవని

ఆ జవాబుకు ఆశ్చర్యపోతూ, " ఏంటి మీనాన్న రెండో పెళ్ళి చేసుకున్నాడా? ఈ విషయం నీకు ముందే తెలుసా?' అడిగాడు మధు.

ఆ ప్రశ్నకు ఏం జవాబు చెప్పాలో అర్థంకాక మౌనంగా వుండి పోయింది అవని, ఎందుకంటే ఆ పెళ్ళి థానే దగ్గరుండి జరిపించింది కాబట్టి

★★★

ఈ పెళ్ళి ఇష్టంలేదా .. లేక అసలు పెళ్ళే ఇష్టంలేదా" కాస్త కోపంతో అన్నాడు మాధవరావు

"నాన్నా నేను పెళ్ళి చేసుకుని వెళ్లి పోతే రేపు నిన్నెవరు చూస్తారు చెప్పు. నా కసలు పెళ్ళే ఇష్టంలేదు " కన్నీళ్ళు పెట్టు కుంటూ తండ్రి భుజం మీద వాలిపోయింది అవని

"పిచ్చి తల్లి అదా నీ బాధ... ఏముందమ్మా ఇన్నాళ్ళు ఎలా జరిగిందో రేపు అలాగే..."

'ఇన్నాళ్ళు. అంటే నేనున్నాను కాబట్టి సరిపోయింది. రపు నేను పెళ్లి చేసుకుని వెళ్ళ పోతే నిన్నెవరు చూస్తారు, వేళకు భోజనం ఎ_వరు పెడతారు ... " దిగులుగా అంది అవని

మాధవరావుకు ఏంజవాబు చెప్పాలో అర్థంకాక, "అయినా నువ్వు ఎక్కడు కెళ్తున్నా వని.. మీ అత్త గారిది కుడా ఇదే వూరు, కాక పోతో ఓ . పది కిలో మీటర్ల దూరం,నువ్వు పిలవాలేగాని... నిమిషాల్లో రానా" అంటు ఊరడించాడు.

'అదంతా నాకు తెలియదు నువ్వు మళ్లీ పెళ్లి చేసుకో.. అప్పడే నేను పెళ్ళి చేసుకుంటా మొండిగా అన్నది అవని

దానికి పెద్దగా నవ్వుతూ .." నాకు మళ్ళీ పెళ్ళా ... వింటే ఎవరైనా నవ్వుతారు. ఊళ్ళ వాళ్ళ ముందు మన పరువేం గాను.."

"ఎవరు ఉళ్ళో వాళ్ళు.. రేపు వాళ్ళు వచ్చి నీకు ఒక్క పూటన్నా అన్నం పెడతారా?"

"కాదనుకో తల్లి ... నిన్ను ఒక అయ్య చేతిలో పెడితే "

"సరే అయితే నా పెళ్ళి అయిన తరువాత చేసుకుంతానని మాటివ్వు "

వెంటనే ఏమి జవాబు చెప్పాలో అర్థం కాలేరు మాధవరావుకి. ఆక్షణాన అవనిని ఒప్పించటానికి సరేనన్నాడు

కాని అవని మాత్రం తన పెళ్లి తరువాత తన తండ్రికి పెళ్ళి చెయ్యలని గట్టిగా విశ్చయించుకుంది

★★★

పెళ్లైన దగ్గర నుండి తండ్రిని పిలిచి ఒక్క పూట భోజనం తృప్తిగా పెడదామన్న కోరిక, తీరని కోరిక లాగానే మిగిలిపోయింది అవనికి

కట్నకానుకలు తీసుకురాని ఆడపిల్లలకు అత్తారింట్లో ఎటువంటి మర్యాదలు జరుగుతాయో అవనికి ఒక్కక్కటిగా అవన్నీ ఎదురవుతుంటే తండ్రి ని తన ఇంటికి పిలవాలనే కోరిక రోజు రోజుకు చచ్చిపోసాగింది అవనికి

మరో పక్క ఒంటరిగా తండ్రి పడుతున్న బాధలు చూడ లేక, తండ్రికి ఎలాగైనా రెండో పెళ్ళి చెయ్యాలని గట్టిగా నిశ్చయించుకుని మ్యారేజ్ బ్యూరో వాళ్ళ ద్వారా వాకాబు చెయ్యటం మొదలు పెట్టింది అవని.

అంతగా కష్ట పడకుండానే రాజేస్వరి

తారస పడింది అవనికి.

రాజేశ్వరి అవని స్నేహితురాలికి పిన్ని వరస అవుతుంది. భర్త ఆర్మీలో పనిచేస్తూ మరణించటం తో , ఆమే జీవితం అగమ్య గోచరంలా తయారయ్యింది. అప్పటికే తల్లిదండ్రి , మరణించటం తో నాలుగేళ్ళ పిల్లాడితో అక్క పంచన చేరింది.

రాజేశ్వరిని తండ్రి కిచ్చి పెళ్ళి చేస్తే, ఇద్దరి సమస్యలకు పరిష్కారం దొరికినట్లవుతుంది అని, రాశేశ్వరిని కదిలించి చూసింది అవని

ఇద్దరి మధ్య బాగా వయసు తేడా వుండటంతో,ముందు వద్దనుకున్నా, తర్వాత ఆలోచిస్తే కొడుకు భవిష్యత్తు రీత్యా అదే మంచిదనుకుని సరే నన్నది రాజేశ్వరి.

కాని తండ్రిని మాత్రం ఒప్పించ లేక పోయింది అవని .

మాధవరావు రెండో పెళ్ళికి ససేమీర అన్నాడు,చివరికి అవని పోరు పడలేక రాజేశ్వరికి, ఆమె

పిల్లాడికి ఆశ్రయం ఇవ్వటానికి ఒప్పుకున్నాడు. అందుకు ప్రతిఫలంగా రాజేశ్వరి వంట చెయ్యటమే కాక మాధవరావుగారి మంచి చెడ్డలు చూసుకోవాలి. ఆ ఒప్పందానికి ఇద్దరూ సంతోషంగా ఒప్పుకోవటంతో, ఓ సుముహూర్తాన రాజేశ్వరి బిడ్డతో సహా మాధవరావు ఇంట్లో అడుగు పెట్టింది.

క్షణాల్లో ఆవార్త దావాలనంలా ఊరంతా పాకిపోయింది. కొంత మంది అర్థం చేసుకోగల మనసున్న వాళ్ళు "పోనలె , పాపం . పాపం మాధవరావు" 'అంటూ జాలి చూపిస్తే ,'ముసలోడికి ఇదేం పోయే కాలం ' అంటూ మరి కొంత మంది ఈసడించుకున్నారు.

ఒక ఒంటరి మగాడి ఇంట్లోకి ఏదిక్కూలేని అడది అడుగుపెడితే పెద్ద మనసుతో ఆలోచించే విశాల హృదయం మన సమాజనికిలేదు. అన్నది అందరికే తెలిసిందే. ఒక రకంగా చప్పాలంటే అవని బలవంతం మీదు మాధవరావు, రాజేశ్వరి సహజీవనం మొదలు పెట్టారు ఆనాటి నుంచి.

ఆనోటా, ఈ నోటా పడి అవని అత్తగారి దాకా వచ్చింది. దీనికంతటికి సూత్రధారి అవని అనే విషయం మాత్రం అఖిలాండేశ్వరికి తెలియదు. కొంతలో కొంత అదే అవనిని కాపాడింది. అవనికి తెలియకుండా మాధవరావు రెండో పెళ్ళి చేసుకున్నాడని అనుకుంది .

★★★

"మీ నాన్న, మన ఇంట్లోకి అడుగుపెడితే అమ్మ ఊరుకోనంటోంది" అవని తో గదిలోకి వస్తూ చెప్పాడు మధు

కొడుక్కి చెప్పి పంపించిందో ఏమో, గది బయట నిలబడి వింతోంది అఖిలాండేశ్వరి.

" అంత పెద్ద తప్పు ఆయనేం చేసాడు? అవని కాస్త గట్టిగానే అడిగింది

"ఎవర్నో ఉంచుకున్నాడని ఊరంతా కోడై . కూస్తోంది... నీకు కనీసం చీమకుట్టినట్టన్నా లేదా?" మధు కూడా గొంతుపెంచాడు.

ఆ స్వరం లో మగవాడి అహంకారం తొంగి చూసింది

దాన్ని ఉంచుకోవటం అనరు, సహజీవనం అంటారు"భర్తకు విషయం తెలిసిందని అవని గ్రహించింది,అయినా ఏ మాత్రం భయపడకుండా జవాబిచ్చింది.

"చేసేవన్నీ తప్పుడు పనులు, పైగా అబద్ధలోకటి . మాటలు బాగా నేర్చావు" అరిచినంత పనిచేసాడు మధు

"నేనేం అబద్ధం ఆడాను..." అంతే గొంతుతో అరచిరచింది

మొన్న అడిగినప్పుడు రెండో పెళ్లి అన్నావు, ఇప్పుడు నవాజీవనం అంటున్నావు.. రేపు ఎం చెబుతావో ' అఖిలాండేశ్వరి కొడుక్కి వత్తాసుగా గొణిగింది

" మీకు ఎదుటి మనిషి కష్టాన్ని చూసి అర్థం చేసుకునే సంస్కారం లేదు అందుకనే అలా చెప్పాను" గట్టిగా బదులిచ్చింది అవని

నాకు సంస్కారం లేదంటావా.. చూసావురా నీపెళ్ళం ఎంత మాటందో... "కొడుకుని రెచ్చగొట్టింది

"మా అమ్మను అంత మాట

అంటావా.. "అంటూ అరుస్తూ మధు చెయ్యి పైకెత్తాడు అవనిని కొట్టటానికి

"ఆగండి ..." అంటూ పెద్ద అరుపు అరిచింది అవని

అవని ఉగ్ర రూపం చూసి తల్లి కొడుకు లిద్దరూ భయపడ్డారు.

"కట్టుకున్న భార్య పై చెయి ఎత్తుతున్నావు, నీ సంస్కారం ఇదేనా.... అయినా మా నాన్న ఏం తప్పు చేసాడు "

".. సహజీవనం... "అండ గొణిగాడు మధు

"ఆ సహజీవనం చేస్తున్నారు తప్పేమిటి. భార్య వనిపోయి, ఇంత ముద్ద ఉడకేసే వాళ్ళు లేక ఓ ఆడపిల్లకు ఆశ్రయం ఇవ్వటం కూడా తప్పేనా? అలా అయితే నువ్వు చేసే పనులను ఏమనాలి? సుఖ జీవనం అనాలా? అసహ్య జీవనం అనాలా? భార్యను ఇంట్లో పెట్టుకుని బలాదూరుగా తిరుగుం తున్నావు. నీగురించి బయట నలుగురు ఏమనుకుంటున్నారో తెలిస్తే మీఅమ్మ కొడుకులు ఇద్దరు ఉరి వేసుకోవాలి" అంటూ ఇద్దరినీ కడిగి పారేసింది

ఏం మాట్లాడాలో తెలియక తల్లీకొడుకు లిద్దరు తలదించుకున్నారు.

."అయినా మా నాన్న ఎదో

చేస్తే .. నేను ఎలా బాధ్యురాలు అవుతాను . అసలు మా నాన్న ఆపని చెయ్యటానికి కారకులు మీరే. పెళ్లైన దగ్గర నుంచి మా నాన్నను ఇంటికి పిలిచి ఒక్కరోజన్న కడుపు నిండా అన్నము పెట్టుకునే అవకాసం కలిగించారా ? మీరసలు మా నాన్నను గడప తొక్క నిచ్చారా? అందుకె మా నాన్న బాధ చూడలేక బాధ పడుతుంటే నేనే నాన్న తో మాట్లాడి ఒప్పించాను"అసలు విషయం బయట పెట్టింది అవని

" నువ్వా .... "గొంతులో ఏదో అడ్డం పడ్డట్టు అన్నది అఖిలాంగేశ్వరి

"అవును నేనే మానాన్నకు పెళ్లిచేసింది "

" ఇంతకు తెగించావు . . ." గొణిగింది అఖిలాండేశ్వరి

"నీ కొడుక్కి ఎవ్వరు పెళ్ళి సంబంధాలు రాక పిల్లను ఇవ్వము పొమ్మంటూటే, అప్పుడు మీ సంబంధం వచ్చింది. నీ విషయం తెలిసి మానాన్న కూడావెనక్కి వచ్చేసాడు . ఇక నీకు జన్మ లో పెళ్ళి కాదేమోనని, మీ నాన్న స్వయంగా వచ్చి మా నాన్నను బతిమిలాడాడు . పెళ్లైన తరువాత మారతాడు అని చెప్పి ఆయనను నమ్మించాడు .పాపం మామగారి మాటలు విని ఆయన మోనపోయాడు. భార్యను ఇంట్లో పెట్టుకుని బలాదూరుగా తిరిగే నీ కొడుకు లాంటి వాడితో కాపురం చెయ్యటం నాది తప్పు .అప్పుడు తెగించలా , ఇప్పుడు తెగిస్తున్నా ..నీకు నీ కాపురానికి దండం " అంటూ మధు వంక చూసింది అవని

అంతా విన్న మధు కు ఏమి మాట్లాడాలో అర్థం కాలేదు . మౌనంగా అవనీ చేతులు పట్టు కున్నాడు, ఇంక మాట్లాడటానికి ఏమిలేదన్నట్టు

మధు కళ్లల్లో సన్నటి కన్నీటి తెరను గమనించింది అవని

" ఇంకా నాకు సెలవు .." అంటూ ఆ ఇంటి గడప దాటింది అవని

(సమాప్తం )

# ధర్మ సందేహాలు

## సహస్ర వ్యాస కవి



## శ్రీ రాముడు మనిషా ?దేముడా ?

శ్రీరాముడు మానవుడా లేక దేవుడా అనే ప్రశ్న చాలా కాలంగా చర్చనీయాంశం. ఈ ప్రశ్నకు ఒకే సమాధానం లేదు. ఎందుకంటే ఇది విశ్వాసాలపై ఆధారపడి ఉంటుంది.

వివిధ దృక్పథాలు:

విష్ణుమూర్తి అవతారం: వైష్ణవ సంప్రదాయంలో శ్రీరాముడు విష్ణుమూర్తి యొక్క ఏడవ అవతారంగా భావిస్తారు. అంటే, అతను దైవిక శక్తి భూమిపై అవతరించిన రూపం.ఆదర్శ మానవుడు: ఇతర దృక్పథాల ప్రకారం, శ్రీరాముడు ధర్మం, నీతి, కర్తవ్యం వంటి ఆదర్శాలను ప్రతిబింబించే ఒక ఆదర్శ మానవుడు. అతను మనందరికీ ఆదర్శంగా నిలబడతాడు.రెండింటి మిశ్రమం: మరికొందరు శ్రీరాముడు మానవుడిగా జన్మించి, తన కర్మల ద్వారా దైవిక స్థాయికి చేరుకున్నాడని నమ్ముతారు.

ఎందుకు ఈ విభేదాలు:

పురాణాల వివరణ: రామాయణం వంటి పురాణాలు శ్రీరాముడిని వివిధ కోణాల నుండి చిత్రిస్తాయి. దీని వల్ల విభిన్న అభిప్రాయాలు ఏర్పడతాయి.

వ్యక్తిగత విశ్వాసాలు: ప్రతి వ్యక్తికి తనదైన విశ్వాసం, అవగాహన ఉంటాయి. దీని ఆధారంగానే వారు శ్రీరాముడిని గురించి తమదైన విధంగా అర్థం చేసుకుంటారు.

ముఖ్యమైన విషయం:

శ్రీరాముడు ప్రతీక: శ్రీరాముడు ఒక వ్యక్తిగా మాత్రమే కాకుండా, ధర్మం, నీతి, కర్తవ్యం వంటి విలువలకు ప్రతీకగా నిలబడ్డాడు.

ఆదర్శం: మనందరం శ్రీరాముని జీవితం నుండి స్ఫూర్తిని పొందవచ్చు. అతని ఆదర్శాలను పాటిస్తూ మన జీవితాన్ని మెరుగుపరచుకోవచ్చు.

ముగింపు:

శ్రీరాముడు మానవుడా లేక దేవుడా అనే ప్రశ్నకు ఒక నిర్దిష్టమైన సమాధానం కంటే, ఈ చర్చ మనల్ని మనం గురించి మరియు మన చుట్టూ ఉన్న ప్రపంచం గురించి ఆలోచించేలా చేస్తుంది. ప్రతి ఒక్కరికి తమదైన అభిప్రాయం ఉండే హక్కు ఉంది.

తాతయ్య కథలు ..

# నెట్టేయవచ్చు



బి వి డి ప్రసాద రావు

రాము, సోము మంచి స్నేహితులు. వీళ్లు కలిసి ఆడుకుంటూ, చదువుకుంటూ మరియు కొత్త విషయాలు నేర్చుకుంటూ ఉండేవారు.

ఒకరోజు, వీళ్లు ఓ చెట్టు కింద కూర్చొని మాట్లాడుకుంటున్నారు.

“సోమూ! మనం ఒకరికొకరు సాయ పడుతూ విజయాలు సాధిస్తున్నాం.” రాము చెప్పాడు.

“అవును రాము. స్నేహితులు కలిసి ఉంటే ఎన్నో అడ్డంకులను దాటవచ్చు.” సోము చెప్పాడు.

కాలం గడుస్తోంది.

రాము, సోముల చదువు పరీక్షలు దగ్గర పడుతున్నాయి.

రాము కొంత కష్టంగా తన పాఠాలను చదువుతున్నాడు. కానీ సోము సులభంగా తన చదువు పాఠాలను చక్కగా చదివేసాడు.

రాము తన బిడియం వీడి, “సోమూ! నా చదువు కొంచెం కష్టంగా సాగుతోంది. నువ్వు నాకు సహాయం చేయవా.” అడిగాడు.

“అవునా! నువ్వు నన్ను అడగడానికి వెనుకాడకు. నేను నీకు సహాయం చేస్తాను.” సోము ఆనందంగా సమాధానమిచ్చాడు.

సోము చొరవతో రాము తన చదువు కష్టాలను అధిగమించగలిగాడు.

పరీక్షలు పూర్తయ్యాయి.


సోము సూచనల ప్రకారం పరీక్షలు సులభంగా రాసేసి.. రాము కూడా సోములా మంచి మార్కులు సాధించాడు.

స్నేహితుల నడుమ ఇచ్చి పుచ్చుకొనేలాంటి సహాయాలు ఎంత ముఖ్యమో తెలుసుకున్నారు రాము, సోములు.

రాము, సోములులా స్నేహితులు ఒకరికొకరు సహాయంగా మెసులుకుంటుంటే.. వ్యతిరేక పరిస్థితులను చక్కగా, సులభంగా నెట్టేయవచ్చు.

★★★

# బొమ్మలు చేద్దాం రండి







**దగ్గర దారి కనిపెట్టటానికి సహాయం చెయ్యండి**




**బొమ్మకు రంగులు వెయ్యండి**




## తేడాలు కనిపెట్టండి



# రాశి ఫలాలు

## ఈ నెల మీ అదృష్టం....



కొలుకుల చంద్ర శేఖర్




ఈ మాసంలో గ్రహస్థితి మిశ్రమంగా ఉంది. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. సోదరులు, ఆత్మీయు లతో పనులు నెరవేరుతాయి




నలుగురిలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వివాహాది శుభకార్యాలు ఫలిస్తాయి. వ్యాపారం లాభదాయకంగా ఉంటుంది. వివాదాలకు దూరంగా ఉండాలి. ఉద్యోగులకు పనిచేసే చోట ఆదరణ పెరుగుతుంది. కొత్త వస్తువులు కొను గోలు చేస్తారు




మాట పలుకుబడి పెరుగుతుంది. ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతారు. విద్యా ర్థులకు అనుకూల సమయం. ఆదాయం స్థిరంగా ఉంటుంది. అయితే అనవసర మైన ఖర్చులు ముందుకు వస్తాయి.




ఈ మాసంలో గ్రహస్థితి అనుకూలంగా ఉంది. వివాహాది శుభకార్య ప్రయ త్నాలు ఫలిస్తాయి. కుటుంబంతో సంతోషంగా ఉంటారు. సమయానుకూల నిర్ణయా లతో సత్ఫలితాలు పొందుతారు.




ప్రారంభించిన పనుల్లో ఆటంకాలు ఎదురైనా విజయవంతంగా పూర్తి చేస్తారు. ఆదాయ, వ్యయాలను బేరీజు వేసుకోవడం అవసరం. కొత్త పరిచయాలు ఏర్పడుతాయి. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నవారికి విజయం..





ఈ మాసంలో గ్రహస్థితి బాగుంది. ఉద్యోగులకు అనుకూల సమయం. ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. మానసికంగా సంతృప్తిగా ఉంటారు. సాహితీవేత్త లకు గుర్తింపు లభిస్తుంది.



# రాశి ఫలాలు

## ఈ నెల మీ అదృష్టం....






ప్రారంభించిన పనులు నిర్ణీత సమయంలో పూర్తవుతాయి. స్వయం ఉపాధిలో ఉన్నవాళ్లకు మంచి అవకాశాలు లభిస్తాయి. వ్యాపారులకు భాగస్వాము లతో సత్సంబంధాలు ఏర్పడతాయి. ఉద్యోగులకు పదోన్నతి సూచన.




అనవసరమైన ఆలోచనలతో ఒత్తిడికి గురవుతారు. ప్రారంభించిన పను లను పట్టుదలతో పూర్తిచేస్తారు. వ్యాపారంలో లాభాలు గడిస్తారు. కొత్త ఒప్పందా లను వాయిదా వేసుకోవడం మంచిది.




పనులు ప్రారంభించడంలో జాప్యం జరుగుతుంది. చివరికి విజయ వంతంగా పూర్తిచేస్తారు. అనవసరమైన ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వకుండా కర్త వ్యాన్ని నిర్వర్తించండి. ఆత్మీయులతో వివాదాలు తలెత్తవచ్చు. ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉంటుంది.




ఊహించని ఖర్చులు ముందుకు రావచ్చు. ఆరోగ్యం నిలకడగా ఉంటుంది. వ్యాపారం లాభసాటిగా కొనసాగుతుంది. విద్యార్థులు శ్రద్ధ కనబరిస్తే మంచి ఫలితాలను పొందుతారు. పై చదువులకు అనుకూలం. ఉత్సాహంతో ఉంటారు.




బంధువులతో అనుబంధం పెరుగుతుంది. వివాహాది శుభకార్య ప్రయ త్నాలు అనుకూలిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆరోగ్యం నిలకడగా ఉంటుంది. విద్యార్థులకు విదేశీయాన యోగం.




ఈ నెలలో మిశ్రమ ఫలితాలు ఉంటాయి. అవసరాలకు సరిపడా డబ్బు చేతిలో ఉంటుంది. విద్యార్థులకు అనుకూల సమయం. పట్టుదలతో ఫలి తాలు సాధిస్తారు.



## కొత్త సినిమాలు –కథా కమీషు

# ఎమోషనల్ గా సాగే డీసెంట్ లవ్ డ్రామా




**తండేల్ కథ** :"తండేల్ " అంటే పడవ నడిపేవాడు అని అర్థం .అంటే జాలర్లు అన్నమాట .మత్స్యకారులు జీవనవిధానాన్ని కళ్లకి కట్టిన సినిమా 'తండేల్'. శ్రీకాకుళం జిల్లా డీ మత్స్యలేశం గ్రామంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా అల్లిన ఫిక్షనల్ లవ్ స్టోరీ 'తండేల్'. బుజ్జితల్లి (సాయి పల్లవి )పై సముద్రమంత ప్రేమ ఉన్న రాజు (నాగ చైతన్య) సముద్రంలో వేటకి వెళ్లి.. పాకిస్తాన్ కోస్ట్‌గార్డ్‌లకు బంధీగా దొరికిపోతాడు. ఆ చెర నుంచి రాజు ఎలా బయటపడ్డాడు? తన తోటి జాలర్ల కోసం ఎలాంటి యుద్ధం చేశాడు? రాజు కోసం బుజ్జితల్లి చేసిన సాహసం ఏంటి? అనేదే 'తండేల్' కథ.

సత్య (సాయిపల్లవి) ఒక జాలరి (పృథ్వీ) కూతురు. ఆమె, జాలర్ల నాయకుడైన రాజు (నాగచైతన్య)ను ప్రేమిస్తుంది. సముద్రంలో వేటకు వెళ్లిన ఓ జాలరి మరణించడంతో, భయపడిన సత్య, రాజుకు వేటకు వెళ్లొద్దని చెప్పుతుంది. కానీ, అతను వెళ్తాడు. పొరపాటున బోట్ పాకిస్తాన్ నీటిలోకి వెళ్లడంతో, పాకిస్తాన్ నేవీ వారిచే అరెస్ట్ అవుతారు. అక్కడే జైల్లో కొన్ని రోజులు గడపాల్సి వస్తుంది. రాజు రాక కోసం సత్య ఎదురుచూస్తుంటుంది, కానీ తాను వెళ్లొద్దని చెప్పినా వెళ్లాడన్న కోపంతో మురళి (కరుణాకరన్) అనే వ్యక్తితో పెళ్లికి ఒప్పుకుంటుంది. చివరికి, పాకిస్తాన్ జైలు నుంచి రాజు మరియు అతని అనుచరులు ఎలా విడుదలయ్యారు? రాజు, సత్య

ఒక్కటయ్యారా? అనేదే కథ.

ఈ కథ దాదాపుగా ట్రైలర్లోనే అర్థమైపోతుంది. అయినప్పటికీ, కథనం ఎలా సాగిందో అనుభవించేందుకు సినిమా చూడాల్సిందే. హీరో, హీరోయిన్ మధ్య విరహవేదన, ఎడబాటు వంటి భావోద్వేగ దృశ్యాలు, ఎంతగా పోయటిక్గా తెరకెక్కించారనేదే ప్రధానమైనది. ఈ విషయంలో, చందూ మొండేటి దాదాపు సక్సెస్ అయ్యాడు. దీనికి తోడు దేవీ శ్రీ ప్రసాద్ నేపథ్య సంగీతం, హైలెస్సో పాట లవ్ ట్రాక్ను నిలబెట్టాయి.



వాస్తవ కథ ఆధారంగా సినిమా అంటే.. అందులోని సోల్ మిస్ కాకుండా కథని నడిపించడం అంటే కత్తిమీద సామే. వాటన్నింటినీ బ్యాలెన్స్ చేస్తూ వాస్తవ కథను ఆడియన్స్‌కి కనెక్ట్ చేసేందుకు కమర్షియల్ యాంగిల్‌లో ప్యూర్ లవ్ స్టోరీని చూపించారు దర్శకుడు చందు మొండేటి. సముద్రంలో వేటకి వెళ్లిన మగాళ్లంతా పాకిస్తాన్‌లో చిక్కుకుపోతే.. ఇక్కడ ఆడాళ్లు ఎలాంటి ఇబ్బందులు పడ్డారనే పాయింట్‌ని చక్కగా డీల్ చేశారు. ‘తండేల్’ రాజు వేటకి వెళ్లకుండా ఉండలేదు. రాజు లేకుండా సత్య ఉండలేదు. ఈ ఇద్దరి మధ్య ఘర్షణను, ఎడబాటుని ఎమోషనల్‌గా చూపించారు. పాకిస్థాన్ ఎపిసోడ్ సినిమాలో కీలకమే అయినా.. కోర్ ఎమోషన్ అంతా రాజు, సత్యల మధ్యే నడుస్తుంది. సినిమా ప్రారంభం నుంచి ఎండ్ కార్డ్ పడేవరకూ కూడా బుజ్జితల్లీ, రాజుల ప్రేమతో నింపేశారు . హీరోయిన్ శ్రీకాకుళంలో ఉంటే హీరో పాకిస్థాన్‌లో ఉంటాడు.. వాళ్లిద్దరూ అంత దూరంగా ఉన్నా ఎమోషన్‌ని మాత్రం చాలా దగ్గర చేశారు దర్శకుడు. ఆర్టికల్ 370తో కథని మలుపుతిప్పి ఆసక్తికరంగా మార్చేశారు.

ప్రేమంటే పడని వాళ్లకి సత్య, రాజులను చూస్తే.. ఎందుకంత పడిచచ్చిపోతున్నారని అనిపించొచ్చు కానీ.. ప్రేమలో ఉన్నోళ్లకి, ఆ ప్రేమను ఆస్వాదించిన వాళ్లు మాత్రం ఆ పిచ్చి ప్రేమలో మునిగితేలుతారు. ప్రేమంటే వర్ణించేదో.. వ్యక్తీకరించేదో కాదు.. అదో అనుభవం. ఆస్వాదిస్తేనే ఎందుకంత పడిచచ్చిపోతారో అని అర్థం అయ్యేట్టు చూపించారు సత్య, రాజుల పాత్రలతో. మనసుకి ఇష్టమైన వాళ్లు.. మనిషిగా దగ్గరైన వాళ్లు దూరం అవుతుంటే ఆ బాధ ఎలా ఉంటుందో కళ్లకి కట్టారు




**కోబలి కథ:** ఏపీ, తెలంగాణ సరిహద్దులోని రాయలసీమలోని ఓ ఫ్యాక్షన్ ప్రాంతంలో ఈ కథ సాగుతుంది. సాంబయ్య(రేవంతినాథ్) కొడుకులు గోపి(శివ), శ్రీను(రవి ప్రకాష్), రాము(తరుణ్ రోహిత్) ముగ్గురు సోదరులు. రమణ(రాకీ సింగ్) అనే వ్యక్తి సోదరితో గోపి అక్రమసంబంధం పెట్టుకుంటాడు. అయితే, ఓ గొడవలో ఆమె మృతిచెందుతుంది. దీంతో గోపీపై పగ పెంచుకుంటాడు రమణ. గోపీతో పాటు అతడి కుటుంబాన్ని నాశనం చేయాలని రమణ భావిస్తాడు. దీంతో అక్కడ జరిగే రక్తపాతాన్ని చూసి శ్రీను కూడా ఇందులోకి దిగుతాడు. ఆ తర్వాత జరిగే పగ, నమ్మకద్రోహం వంటి అంశాలతో ఈ కథ ముందుకు సాగుతుంది.

ఈ వెబ్ సిరీస్ ప్రారంభంలో మంచి కథను చూడబోతున్నామనే ఫీలింగ్ కలిగిస్తుంది. అయితే, కథ సాగుతున్నకొద్దీ, ఈ వెబ్ సిరీస్ ట్రాక్ తప్పుతుంది. ఇలాంటి కథను గతంలో చాలాసార్లు చూసినట్లుగా అనిపిస్తుంది. దీంతో తర్వాత ఏం జరుగుతుందో ముందే ఊహించగలం. ఇలాంటి కథకు డెప్త్ తీసుకొచ్చే సరైన స్క్రీన్‌ప్లే మనకు ఇందులో మిస్ అయ్యింది.ఈ కథను చూస్తుంటే ఇది అసంపూర్తిగా ఉన్నట్లు.. ఎలాంటి ట్విస్టులు, ఆకట్టుకునే యాక్షన్ లేకుండా కనిపిస్తుంది. వైలెంట్ సీన్స్ ఎక్కువగా ఉండటంతో ప్రేక్షకుల్లో ఆసక్తి తగ్గిపోతుంది.ఇక ఇందులో చాలా బోల్డ్ డైలాగులు ఉండటం ఫ్యామిలీ ఆడియెన్స్‌కు పెద్దగా నచ్చవు. ఇది 18+ వయసు గల వారికోసం తీసినప్పటికీ, ఇందులో వాడిన కొన్ని బోల్డ్ డైలాగులు కొంతమేర హద్దు దాటినట్లుగా కనిపిస్తాయి.ఇందులో కనిపించే పాత్రలు చాలానే ఉన్నా, కొందరిని మాత్రమే ఆడియెన్స్ గుర్తుపెట్టుకుంటారు.




టాలీవుడ్ సహా కోలీవుడ్ లో మంచి ఫేమ్ ఉన్న స్టార్ హీరోయిన్ లలో నటి త్రిష కూడా ఒకరు. మరి త్రిష హీరోయిన్ గా ప్రముఖ మళయాళ టాలెంటెడ్ హీరో టోవినో థామస్ హీరోగా దర్శకులు అనాస్ ఖాన్ అలాగే అఖిల్ పాల్ తెరకెక్కించిన ఇంట్రెస్టింగ్ మళయాళ థ్రిల్లర్ సినిమానే “ఐడెంటిటీ”. మరి మళయాళ వెర్షన్ లో పర్వాలేదనిపించిన ఈ సినిమాని తెలుగులో కూడా థియేటర్లులో రిలీజ్ కి అనౌన్స్ చేశారు కానీ సరైన ప్రమోషన్స్ లేక సినిమాను ఎవరూ పట్టించుకోలేదు.

దీనితో ఆ వెంటనే ఓటీటీ డేట్ కూడా బయటకి వచ్చేసింది. మరి లేటెస్ట్ గా ఈ సినిమా నేటి నుంచి ఓటీటీలో అందుబాటులోకి కూడా వచ్చేసింది. ఈ సినిమాని స్ట్రీమింగ్ యాప్ జీ5 వారు సొంతం చేసుకోగా అందులో ఈ సినిమా ఈరోజు నుంచి మళయాళ వెర్షన్ లోనే కాకుండా తెలుగు డబ్ లో కూడా వచ్చింది. మరి ఈ థ్రిల్లర్ ని చూడాలి అనుకునేవారు జీ5 లో ట్రై చేయవచ్చు.

# సుమతి

అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

## సుమతి ఇప్పుడు ఆన్లైన్లో

**సుమతి** అంతర్జాల కుటుంబ మాసపత్రిక ఇప్పుడు ఆన్లైన్ లో వెలువడుతోంది . మీ మొబైల్ నుండి కాని లేదా మీ కంప్యూటర్ నుండి ఆన్లైన్ లో హాయిగా చదువుకోండి .
www.sumathimasapathrika.com


**సుమతి** మాసపత్రిక అంతర్జాల పత్రిక విడి ప్రతి వెల.


**రూ. 25 /-** రూపాయలు

సంవత్సర చందా కి కేవలం **రూ. 250/-**

ఐదు సంవత్సరాల చందా కేవలం **రూ. 1,200/-**

ఐదు సంవత్సరాలు చందా కట్టిన వారిక రూ.200 విలువచేసే పుస్తకాలను ఉచితంగా పంపబడును




చందా కట్టదలచిన వారు కింది నెంబరుకు గూగుల్ పే లేదా ఫోన్ పే చెయ్యండి
7 8 9 3 1 1 1 9 8 5

చందా కట్టిన వారికి ప్రతి నెల flip బుక్ పాస్ వర్డ్ తో పంపబడును

సుమతి

అంతర్జాల సకుటుంబ మాస పత్రిక

సుమతి" సాహితి సామ్రాట్ " పోటీలు

# సుమతి సాహితి సామ్రాట్ పోటీలు

జనవరి 2024 నుండి డిసెంబర్ 2024 వరకు
ఒక సంవత్సరం పాటు దిగ్విజయంగా ప్రతి నెల కథలు, కవితల పోటి
నిర్వహించబడింది . బహుశా తెలుగు సాహిత్య చరిత్రలో ఇటువంటి పోటీలు
ఒక యజ్ఞం లా నిర్వహించటం ఇదేప్రథమం. అది సుమతి కే చెల్లింది
ఈ పోటిలో పాల్గొన్న రచయతలందరికి హృదయపూర్వక ధన్యవాదాలు
ఈ పోటిలో గెలిచిన విజేతలను ,పాల్గొన్న ప్రతి ఒక్కరిని తగు రీతిగ రాబోయే
ఉగాది(30-03-2025 ) రోజున
సన్మానించ దలిచాము
విజేతల వివరాలు జనవరి 25 సంచికలో

## 2025 సాహితి సామ్రాట్ పోటీలు ఉగాది నుండి ప్రారంభం

